www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 8-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 22

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: అమావాస్య ఉ. 8.51 తదుపరి పాడ్యమి; నక్షత్రం: భరణి మ. 1.33 తదుపరి కృత్తిక; వర్జ్యం: రా. 12.44-2.13; దుర్ముహూర్తం: ఉ. 11.46-12.37; అమృతఘడియలు: ఉ. 9.08-10.36; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 5.49; సూర్యాస్తమయం: 6.33

విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
కోల్‌కతా	11	8	3	0	16	1.453
రాజస్థాన్	11	8	3	0	16	0.476
చెన్నై	11	6	5	0	12	0.700
హైదరాబాద్	11	6	5	0	12	-0.065
ఢిల్లీ	12	6	6	0	12	-0.316
లఖ్‌నవూ	11	6	5	0	12	-0.371
బెంగళూరు	11	4	7	0	8	-0.049
పంజాబ్	11	4	7	0	8	-0.187
ముంబై	12	4	8	0	8	-0.212
గుజరాత్	11	4	7	0	8	-1.320

ఆఖరి రోజు ఏడు స్వర్ణాలు

అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్

అస్తానా (కజకిస్థాన్): ఆసియా అండర్-22 యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత ఆటగాళ్లు 12 స్వర్ణాలతో అదరగొట్టారు. ఆఖరి రోజైన మంగళవారం జరిగిన పోటీల్లో ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన ప్రీతి (54 కిలోలు) సహా ఏడుగురు బాక్సర్లు స్వర్ణాలు సాధించారు. మరో ఐదుగురు బాక్సర్లు రజతాలు దక్కించుకున్నారు. మొత్తంగా 12 స్వర్ణాలు, 14 రజత, 17 కాంస్యాలతో 43 పతకాలు సాధించిన భారత్ రెండో స్థానంతో టోర్నీని ముగించింది. ఆతిథ్య కజకిస్థాన్ 48 మెడల్స్‌తో అగ్రస్థానం సొంతం చేసుకుంది.

వరుణుడు కరుణిస్తాడా!



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) ప్లేఆఫ్స్ రేసుకు అర్హత సాధించాలంటే కచ్చితంగా గెలవాల్సిన మ్యాచ్‌కు ముందు వరుణుడు ప్రతాపంతో ఉప్పల్ స్టేడియం తడిసి ముద్దయింది. మరో నాలుగు రోజులు హైదరాబాద్‌లో వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించడంతో బుధవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ (ఎల్‌ఎస్‌జీ)తో జరగాల్సిన ఎస్‌ఆర్‌హెచ్ మ్యాచ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒకవేళ మ్యాచ్ మొదలైనా పూర్తి స్థాయిలో జరుగుతుందా అనే అనుమానాలున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి లఖ్‌నవూ జట్టు ప్రాక్టీసు కూడా రద్దయింది. మ్యాచ్ జరిగితే మాత్రం ప్లేఆఫ్స్ బెర్త్ కోసం పోటీ పడుతున్న ఎస్‌ఆర్‌హెచ్, లఖ్‌నవూ జట్ల మధ్య ఆసక్తికర పోరు జరగనుంది. ఇరు జట్లకు మరో మూడు మ్యాచ్‌లే మిగిలున్న నేపథ్యంలో ఇరువురికీ ఈ పోరు కీలకం కానుంది.

నేటి మ్యాచ్ రాత్రి 7.30 గం. వేదిక: హైదరాబాద్
హైదరాబాద్ X లఖ్‌నవూ

ఢిల్లీ అదుర్స్

ఫ్రేజర్, పోరెల్ మెరుపు ఇన్నింగ్స్

రాజస్థాన్‌పై విజయం ● పోరాడిన శాంసన్


సంజూ శాంసన్ (46 బంతుల్లో 86)


ఫ్రేజర్ (20 బంతుల్లో 50)
అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 65)

1 20 బంతుల్లోపే ఎక్కువ అర్ధసెంచరీలు (3) చేసిన ఐపీఎల్ బ్యాటర్‌గా ఫ్రేజర్.

స్కోరుబోర్డు

ఢిల్లీ: ఫ్రేజర్ (సి) ఫెరీరా (బి) అశ్విన్ 50, అభిషేక్ పోరెల్ (సి) సందీప్ (బి) అశ్విన్ 65, హోప్ (రనౌట్) 1, అక్షర్ (సి) పరాగ్ (బి) అశ్విన్ 15, పంత్ (సి) బౌల్ట్ (బి) చాహల్ 15, స్టబ్స్ (ఎల్బీ) సందీప్ 41, గుల్బదిన్ (సి) అశ్విన్ (బి) బౌల్ట్ 19, రసిక్ (రనౌట్) 9, కుల్దీప్ (నాటౌట్) 5, **ఎక్స్‌ట్రాలు: 1; మొత్తం: 20 ఓవర్లలో 221/8; వికెట్ల పతనం:** 1-60, 2-68, 3-110, 4-144, 5-150, 6-195, 7-215, 8-221; **బౌలింగ్:** బౌల్ట్ 4-0-48-1, సందీప్ 4-0-42-1, అవేశ్ 2-0-42-0, అశ్విన్ 4-0-24-3, పరాగ్ 2-0-17-0, చాహల్ 4-0-48-1.

రాజస్థాన్: జైస్వాల్ (సి) అక్షర్ (బి) ఖలీల్ 4, బట్లర్ (బి) అక్షర్ 19, సంజూ శాంసన్ (సి) హోప్ (బి) ముకేశ్ 86, పరాగ్ (బి) రసిక్ 27, శుభమ్ దూబే (సి) స్టబ్స్ (బి) ఖలీల్ 25, పావెల్ (బి) ముకేశ్ 13, ఫెరీరా (ఎల్బీ) కుల్దీప్ 1, అశ్విన్ (సి) హోప్ (బి) కుల్దీప్ 2, బౌల్ట్ (నాటౌట్) 2, అవేశ్ (నాటౌట్) 7, **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 20 ఓవర్లలో 201/8; వికెట్ల పతనం:** 1-4, 2-67, 3-103, 4-162, 5-180, 6-181, 7-185, 8-194; **బౌలింగ్:** ఖలీల్ 4-0-47-2, ఇషాంత్ 3-0-34-0, ముకేశ్ 3-0-30-2, అక్షర్ 3-0-25-1, కుల్దీప్ 4-0-25-2, రసిక్ 3-0-36-1.

న్యూఢిల్లీ: అరుణ్‌జైట్లీ మైదానంలో వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ 220కిపైగా స్కోరు నమోదైన వేళ.. ఆతిథ్య ఢిల్లీ క్యాపిటల్స్‌దే పైచేయి అయ్యింది. ఓపెనర్లు అభిషేక్ పోరెల్ (36 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 65), ఫ్రేజర్ (20 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 50) మెరుపు అర్ధసెంచరీలతో ఆకట్టుకోగా.. ఆ తర్వాత బౌలర్లు ప్రతాపం చూపారు. దీంతో మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్‌పై 20 పరుగులతో ఢిల్లీ ఘన విజయం సాధించింది. అటు రాజస్థాన్ కెప్టెన్ సంజూ శాంసన్ (46 బంతుల్లో 8 ఫోర్లు, 6 సిక్సర్లతో 86) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ గెలుపుతో ఢిల్లీ 12 పాయింట్లతో ఐదో స్థానానికి చేరింది. ముందుగా ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 221 పరుగులు చేసింది. చివర్లో స్టబ్స్ (20 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 41) చెలరేగాడు. అశ్విన్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 201 పరుగులు చేసి ఓడింది. శుభమ్ దూబే (12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో 25) పర్వాలేదనిపించాడు. కుల్దీప్, ముకేశ్, ఖలీల్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా కుల్దీప్ నిలిచాడు.

శాంసన్ ఒక్కడే: భారీ ఛేదనలో కెప్టెన్ శాంసన్ ఒంటరి పోరు సాగించాడు. కానీ సరైన సమయంలో అతడి వికెట్ తీసి ఢిల్లీ మ్యాచ్‌ను వశం చేసుకుంది. రెండో బంతికే ఓపెనర్ జైస్వాల్ వికెట్ కోల్పోయినా శాంసన్ దూకుడుగా ఆడాడు. మూడో ఓవర్‌లో 6,4తో బ్యాట్‌కు పనిజెప్పిన అతను.. నాలుగో ఓవర్‌లో 4,4,6.. ఐదో ఓవర్‌లో 6,4,4తో బౌలర్లను ఆడుకున్నాడు. అయితే అక్షర్ ఓవర్‌లో బట్లర్ (19) 4,6 బాదినా అతడికే చిక్కడంతో రెండో వికెట్‌కు 63 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. తర్వాత పరాగ్ (27) ఉన్న కాసేపు వేగం కనబరిచి 11వ ఓవర్‌లో అవుటయ్యాడు. అప్పటికే స్కోరు వంద దాటింది. ఈ దశలో శాంసన్‌కు శుభమ్ జత కలిశాడు. ఓ భారీ సిక్సర్‌తో 26 బంతుల్లోనే శాంసన్ అర్ధసెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత రసిక్ ఓవర్‌లో వరుసగా 6,4,6 బాదడంతో పరుగులు ధారాళంగా వచ్చాయి. అటు శుభమ్ కూడా ఇషాంత్ ఓవర్‌లో 4,6తో ఆకట్టుకున్నాడు. అయితే జట్టు ఛేదన వైపు సజావుగా సాగుతున్న వేళ 16వ ఓవర్‌లో శాంసన్ భారీ షాట్‌కు వెళ్లి వివాదాస్పదరీతిలో క్యాచ్ అవుటయ్యాడు. లాంగాన్‌లో బౌండరీ దగ్గర హోప్ ఆ క్యాచ్‌ను అందుకున్నప్పుడు రీప్లేలో అతడి కాళ్లు లైన్‌ను తాకాయా? లేదా? అనే విషయంలో స్పష్టత లేకపోయింది. ఈ విషయమై శాంసన్ అంపైర్లతో మాట్లాడినా, చేసేదేమీ లేక నిరాశగా వెనుదిరిగాడు. దీంతో నాలుగో వికెట్‌కు 59 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అనంతరం రాజస్థాన్ ఇన్నింగ్స్ ఒక్కసారిగా కుప్పకూలింది. వేగంగా ఆడుతున్న శుభమ్ అవుటవడంతో ఆర్ఆర్ ఒత్తిడిలో పడింది. 18వ ఓవర్‌లో కుల్దీప్.. ఫెరీరా (1), అశ్విన్ (2) వికెట్లు తీశాడు. ఆఖరి ఓవర్‌లో 29 రన్స్ కావాల్సి ఉండగా, రెండో బంతికే పోవెల్ (13) బౌల్డవడంతో రాజస్థాన్‌కు నిరాశ తప్పలేదు.

1 టీ20 ఫార్మాట్‌లో 350 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా చాహల్. ఓవరాల్‌గా అతను ఐదో స్థానంలో ఉండగా, రషీద్ (572) టాప్‌లో ఉన్నాడు.

ఫ్రేజర్, స్టబ్స్ దూకుడు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి ఆరంభంలో ఓపెనర్ ఫ్రేజర్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. తర్వాత అభిషేక్ పోరెల్.. చివర్లో స్టబ్స్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో జట్టు భారీస్కోరు అందుకుంది. తొలి ఏడు బంతులకు 7 రన్స్ చేసిన ఫ్రేజర్.. మూడో ఓవర్ నుంచి శివాలెత్తాడు. ముందుగా బౌల్ట్ ఓవర్‌లో 6,4,4తో 15 రన్స్ అందించిన ఫ్రేజర్.. నాలుగో ఓవర్‌లో మరింత చెలరేగాడు. అవేశ్ వేసిన ఈ ఓవర్‌లో వరుసగా 4,4,4,6,4,6తో 28 రన్స్ రాబట్టిన అతడు... 19 బంతుల్లోనే అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే ఐదో ఓవర్ రెండో బంతికి అశ్విన్ అతడిని అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 26 బంతుల్లో 60 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. వెంటనే హోప్ (1) రనౌటవడంతో పవర్ ప్లేలో ఢిల్లీ 78/2తో నిలిచింది. ఆ తర్వాత మరో ఓపెనర్ అభిషేక్ బ్యాట్ ఝుళిపించడంతో రన్‌రేట్ తగ్గలేదు. అతను 11వ ఓవర్‌లో 6,4తో 28బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. అలాగే అక్షర్(15)తో కలిసి మూడో వికెట్‌కు 42 రన్స్ జోడించాడు. ఈ దశలో అశ్విన్ తన వరుస ఓవర్లలో అక్షర్, అభిషేక్ వికెట్లు తీశాడు. ఇక పంత్ (15)ను 14వ ఓవర్‌లో చాహల్ దెబ్బతీశాడు. దీనికి తోడు 13-17 ఓవర్ల మధ్య 26 రన్సే రావడంతో స్కోరు 200 కష్టమే అనిపించింది. కానీ 18వ ఓవర్‌లో స్టబ్స్ 4,4,4,6 బాదడంతో 21 రన్స్ సమకూరాయి. 19వ ఓవర్‌లో నయీబ్ (19) అవుటవడంతో ఆరో వికెట్‌కు 45 రన్స్ భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత రసిక్ (9) రెండు ఫోర్లతో స్కోరు 200 దాటింది. ఇక ఆఖరి ఓవర్‌లోనూ స్టబ్స్ చెలరేగి రెండు సిక్సర్లతో 18 రన్స్ రాబట్టినా సందీప్‌కు చిక్కాడు.

విమానం దారి మళ్లింపు..

కేకేఆర్ ఆటగాళ్ల తిప్పలు



న్యూఢిల్లీ: ప్రతికూల వాతావరణం కారణంగా కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) ఆటగాళ్లు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కోల్‌కతాలో ల్యాండింగ్‌కు వాతావరణం అనుకూలించకపోవడంతో వారు ప్రయాణిస్తున్న చార్టర్డ్ ఫ్లయిట్‌ను రెండుసార్లు దారి మళ్లించాల్సి వచ్చింది. ఆదివారం లఖ్‌నవూలో జరిగిన మ్యాచ్ తర్వాత కేకేఆర్ జట్టు సోమవారం సాయంత్రం కోల్‌కతా బయల్దేరింది. అయితే, ప్రతికూల వాతావరణం వల్ల విమానాన్ని తొలుత గువాహటికి మళ్లించినట్టు కేకేఆర్ ఫ్రాంచైజీ ఎక్స్‌లో తెలిపింది. ఆ తర్వాత క్లియరెన్స్ రావడంతో రాత్రి 9.43 నిమిషాలకు కోల్‌కతా బయల్దేరిన విమానాన్ని భారీ వర్షం కారణంగా వారణాశికి మళ్లించారు. రాత్రికి అక్కడే బస చేసిన శ్రేయాస్ అయ్యర్ సేన.. కాశీ విశ్వనాథుడిని సందర్శించుకొన్న అనంతరం మంగళవారం క్షేమంగా కోల్‌కతా చేరుకొంది.

టీ20 సిరీస్ బంగ్లాదే

చట్టోగ్రామ్: జింబాబ్వేతో ఐదు టీ20ల సిరీస్‌ను ఇంకా రెండు మ్యాచ్‌లుండగానే ఆతిథ్య బంగ్లాదేశ్ దక్కించుకుంది. మంగళవారం జరిగిన మూడో టీ20లో 9 పరుగులతో బంగ్లా నెగ్గింది. మొదట 20 ఓవర్లలో 165/5 స్కోరు చేసింది. తౌహిద్ హృదయ్ (57), జాకెర్ అలీ (44) సత్తా చాటారు. ఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 156/9 స్కోరుకే పరిమితమైంది. ఫరజ్ (34 నాటౌట్), మరుమని (31) రాణించారు.

పికిల్‌బాల్‌లో పతకాల పంట

న్యూఢిల్లీ: ఆసియా ఓపెన్ పికిల్ బాల్ చాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు పతకాల పంట పండించారు. వియత్నాంలో మంగళవారం జరిగిన ఈ పోటీల్లో మూడు స్వర్ణాలు, రెండు కాంస్యాలు దక్కించుకున్నారు.

నన్నెందుకు బ్లాక్ చేశారో..?


వార్నర్

న్యూఢిల్లీ: సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఐపీఎల్ టైటిల్ అందించిన కెప్టెన్ డేవిడ్ వార్నర్. అయితే, ఆ తర్వాత ఫ్రాంచైజీతో అతడి సంబంధాలు బెడిసికొట్టాయి. ఈ క్రమంలో 2021లో సారథ్య బాధ్యతల నుంచి వార్నర్‌ను తప్పించిన ఫ్రాంచైజీ.. క్రమంగా అతడిని జట్టుకు కూడా దూరం చేసింది. ప్రస్తుతం వార్నర్ ఢిల్లీకి ఆడుతున్నాడు. అయితే, సన్‌రైజర్స్ యాజమాన్యం సోషల్ మీడియాలో తనను బ్లాక్ చేయడం తనను ఎంతో బాధించిందని ఓ యూట్యూబ్ చానెల్‌లో అశ్విన్‌తో జరిగిన చిట్‌చాట్‌లో వార్నర్ వాపోయాడు. అలా ఎందుకు చేశారో తనకు అర్థం కాలేదన్నాడు. కానీ, జట్టు అభిమానులు మాత్రం సోషల్ మీడియా ద్వారా తనతో ఇప్పటికీ మాట్లాడుతూనే ఉండడం సంతోషంగా ఉందని వార్నర్ చెప్పాడు.


10న ఏపీఎల్ ట్రయల్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) వేలంలో పాల్గొనడానికి అవకాశం లభించని క్రికెటర్ల కోసం ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) 'రైజింగ్ స్టార్స్' పేరిట సెలెక్షన్ ట్రయల్స్‌కు శ్రీకారం చుట్టింది. ఈనెల 10వ తేదీన విశాఖపట్నంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో, మంగళగిరిలోని ఏసీఏ మైదానంలో, కడపలోని వైఎస్సార్ స్టేడియంలో ట్రయల్స్ నిర్వహించనున్నామని, ఇందులో గుర్తించిన 12 మంది ప్రతిభావంతులకు ఏపీఎల్‌లో ఆడే అవకాశం కల్పిస్తామని ఏసీఏ తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి 10 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 6.30 వరకు ట్రయల్స్ నిర్వహిస్తారు. ఆసక్తి గల వారు బుధవారం ఉదయం 9 గంటల నుంచి గురువారం సాయంత్రం 6 గంటల వరకు ఈ లింక్ http://15.206.63.242/AC/playerOpenRegistration/form/ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చు.

బిజినెస్

డాక్టర్ రెడ్డీస్ లాభం రూ.1,307 కోట్లు

ఆదుకున్న అమెరికా, ఐరోపా మార్కెట్లు.. ఒక్కో షేరుపై రూ.40 తుది డివిడెండ్



హైదరాబాద్: డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.1307 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.959 కోట్లతో పోలిస్తే లాభం 36 శాతం పెరిగినా డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే మాత్రం 5 శాతం తగ్గింది. అలాగే క్యూ4లో కంపెనీ ఆదాయం కూడా 12 శాతం వృద్ధితో రూ.6,297 కోట్ల నుంచి రూ.7,083 కోట్లకు చేరింది. కాని డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే రెండు శాతం తగ్గింది. ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా లాభం 24 శాతం వృద్ధితో రూ.4,507 కోట్ల నుంచి రూ.5,568 కోట్లకు, ఆదాయం రూ.24,588 కోట్ల నుంచి రూ.27,916 కోట్లకు చేరాయి.

డివిడెండు: 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఒక్కో షేరుపై రూ.40 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని మంగళవారం జరిగిన కంపెనీ డైరెక్టర్ల బోర్డు సిఫారసు చేసింది. 'గత ఆర్థిక సంవత్సరం మేము మంచి పనితీరు కనబరిచాం. మాకు ఇది మర్చిపోలేని చారిత్రక సంవత్సరం ఇది. వచ్చే పదేళ్లలోనూ మేము సరికొత్త ఔషధాల ద్వారా రోగులకు సేవ చేస్తాం' అని కంపెనీ కో చైర్మన్, ఎండీ జీవీ ప్రసాద్ విలేకరులతో చెప్పారు.

ఆదుకున్న ఉత్తర అమెరికా : 2023-24 ఆర్థిక సంవత్సరంలో డాక్టర్ రెడ్డీస్ లాబ్స్ దేశీయ ఆదాయం ఐదు శాతం తగ్గి రూ.4,640 కోట్లకు పడిపోయింది. ఇదే సమయంలో ఉత్తర అమెరికా మార్కెట్ ఆదాయం 29 శాతం పెరిగి రూ.12,990 కోట్లకు చేరి కంపెనీని ఆదుకుంది. యూరోపియన్ దేశాల ఆదాయం కూడా ఐదు శాతం పెరిగింది. కొత్త ఔషధాల విడుదలతో వర్ధమాన దేశాల నుంచి లభించే ఆదాయం తొమ్మిది శాతం పెరగడం కంపెనీకి కలిసొచ్చింది. 'గత ఆర్థిక సంవత్సరం మా ఆదాయం, లాభాల పెరుగుదలకు అమెరికా మార్కెట్ బాగా దోహదం చేసింది. లైసెన్సింగ్, సహకారం వంటి చర్యల ద్వారా భవిష్యత్ వృద్ధికీ చర్యలు తీసుకున్నాం' అని ప్రసాద్ చెప్పారు.

కొత్త ఔషధాలు: గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద కంపెనీ 21 కొత్త ఔషధాలను మార్కెట్‌లో విడుదల చేసింది. క్యూ4లో ఉత్తర అమెరికా మార్కెట్‌లో ఐదు ఔషధాలు విడుదల చేస్తే అందులో నాలుగు ఔషధాలను అమెరికా మార్కెట్‌లో విడుదల చేసింది. క్యూ4లో అమెరికా ఎఫ్‌డీఏ వద్ద తొమ్మిది అబ్రివేటెడ్ న్యూ డ్రగ్ అప్లికేషన్లు (ఆండాస్) ఫైల్ చేసింది. దీంతో గత ఆర్థిక సంవత్సరం మొత్తానికి డాక్టర్ రెడ్డీస్ అమెరికా ఎఫ్‌డీఏ వద్ద 17 ఆండాస్ ఫైల్ చేసినట్లయింది. ఈ ఏడాది మార్చి నాటికి కంపెనీ ఎఫ్‌డీఏ వద్ద ఫైల్ చేసి అనుమతుల కోసం ఎదురు చూస్తున్న జనరిక్ ఔషధాల సంఖ్య 86కి చేరింది. ఇందులో 81 ఆండాస్ కాగా, ఐదు మాత్రం న్యూ డ్రగ్ అప్లికేషన్లు (ఎన్‌డీఏలు).

కొత్త సీఎఫ్ఓగా ఎంవీ నరసింహం

ఎంవీ నరసింహంను కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా నియమించేందుకు డాక్టర్ రెడ్డీస్ బోర్డు ఆమోద ముద్ర వేసింది. సీఎఫ్ఓగా రిటైర్ అవుతున్న పరాగ్ అగర్వాల్ స్థానంలో నరసింహం ఈ ఏడాది ఆగస్టు 1 నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. తెలుగు వారైన నరసింహం ఇప్పటికే డాక్టర్ రెడ్డీస్ డిప్యూటీ సీఎఫ్ఓగా పని చేస్తున్నారు. "క్యూ4లో కంపెనీ ఆదాయ, లాభాల వృద్ధికి వ్యూహాత్మక సహకారాలు కీలకంగా పని చేశాయి. ఈ వృద్ధిరేటు కొనసాగించేందుకు భవిష్యత్‌లోనూ మేము కన్జూమర్ హెల్త్, డిజిటల్ థెరప్యూటిక్స్, సరికొత్త ఔషధాలపై దృష్టి పెడతాం" అని అగర్వాల్ చెప్పారు.

గ్లాండ్ ఫార్మా ఔషధానికి ఎఫ్‌డీఏ ఆమోదం

న్యూఢిల్లీ: అమియోట్రోఫిక్ లాటరల్ స్లెరోసిస్ (కండరాల కదలికలకు సహాయపడే నరాలు క్రమంగా చచ్చుబడిపోవడం) వ్యాధి చికిత్సలో ఉపయోగించే ఎడరవోన్ ఇంజెక్షన్‌కు అమెరికన్ ఎఫ్‌డీఏ అనుమతి లభించినట్టు గ్లాండ్ ఫార్మా ప్రకటించింది. 30ఎంజీ/100 ఎంఎల్, 60ఎంజీ/100 ఎంఎల్ పరిమాణంలో ఈ ఇంజెక్షన్‌ను మార్కెటింగ్ చేయనున్నట్టు పేర్కొంది. వర్తమాన ఆర్థిక సంవత్సరంలోనే ఈ ఔషధాన్ని తమ మార్కెటింగ్ భాగస్వామి ద్వారా ప్రవేశపెట్టనున్నట్టు కంపెనీ తెలిపింది. ఈ ఏడాది జనవరితో ముగిసిన ఏడాది కాలంలో ఈ ఔషధం అమ్మకాలు 1.9 కోట్ల డాలర్ల మేరకున్నాయి.

గ్రీన్‌కో ఎనర్జీస్ ప్రతిపాదనకు సీసీఐ ఆమోదం

సిక్కిం ఊర్జా (గతంలో తీస్తా ఊర్జా లిమిటెడ్) కంపెనీలో అదనపు వాటాల కొనుగోలుకు గ్రీన్‌కో ఎనర్జీకి కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ఆమోదం తెలిపింది. ఉత్తర సిక్కింలో 1200 మెగావాట్ల హైడ్రో విద్యుత్ ప్రాజెక్టు అమలు కోసం ఏర్పడిన ప్రత్యేక సంస్థ సిక్కిం ఊర్జా లిమిటెడ్.

మార్కెట్లో పోర్ష్ పనామెరా కారు




లగ్జరీ కార్ల కంపెనీ పోర్ష్ పనామెరా మూడో తరం కారును మార్కెట్లోకి తెచ్చింది. అత్యాధునిక టెక్నాలజీ, ఆధునిక వసతులతో మరింత డిజిటల్‌గా, మరింత ఆకర్షణీయమైన ఇంటీరియర్లతో ఈ కారును తయారుచేశారు. దీనికి అమర్చిన 2.9 లీటర్ల టర్బో ఇంజన్ 5.1 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగం అందుకుంటుంది. దీని ప్రారంభ ధర రూ.1,69,62,000.

పట్టణాలను మించిన గ్రామీణ వినియోగం

ఐదు త్రైమాసికాల్లో ఇదే తొలిసారి: నీల్సన్‌ఐక్యూ

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికానికి దేశీయ ఎఫ్ఎంసీజీ పరిశ్రమ విక్రయాల పరిమాణంలో 6.5 శాతం వృద్ధి నమోదైందని నీల్సన్‌ఐక్యూ తాజా నివేదిక వెల్లడించింది. విక్రయాల విలువపరంగా వృద్ధి 6.6 శాతంగా ఉంది. అంతేకాదు, గడిచిన ఐదు త్రైమాసికాల్లో తొలిసారిగా గ్రామీణ భారత వినియోగం పట్టణ మార్కెట్‌ను మించిపోయిందని ఆ నివేదికలో తెలిపారు. మార్చి త్రైమాసిక వినియోగ వృద్ధికి ఆహారంతోపాటు ఆహారేతర విభాగాలూ దోహదపడ్డాయని, ఆహారోత్పత్తులతో పోలిస్తే ఆహారేతర విభాగ వినియోగంలో దాదాపు రెండంకెల వృద్ధి నమోదైందని పేర్కొంది. సమీక్షా కాలానికి హోమ్‌కేర్, పర్సనల్ కేర్ విభాగాల పనితీరు ఆహారోత్పత్తుల విభాగాన్ని విుంచిపోయిందని నీల్సన్‌ఐక్యూ కస్టమర్ సక్సెస్ ఇండియా హెడ్ రూసెవెల్ట్ డిసౌజా తెలిపారు. అంతేకాదు, పట్టణ మార్కెట్, ఆధునిక ఉత్పత్తుల వినియోగం మందగించగా.. గ్రామీణ మార్కెట్, సంప్రదాయ ఉత్పత్తుల వినియోగం పెరిగిందన్నారు.

వినియోగ ట్రెండ్‌లో స్పష్టమైన విభజన: యూబీఎస్ భారత వినియోగ ట్రెండ్‌లో స్పష్టమైన విభజన కన్పిస్తున్నదని స్విస్ బ్రోకరేజ్ కంపెనీ యూబీఎస్ అంటోంది. దేశంలో ఆర్థిక అసమానతలు మరింత పెరిగాయనడానికి సంకేతమైన 'కే'(ఆంగ్ల అక్షరం) ఆకార వృద్ధి ముమ్ముందూ కొనసాగనుందని తాజా నివేదికలో అభిప్రాయపడింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,380 ▲	66,350 ▲	88,500 ▲
ముంబై	71,670 ▼	65,650 ▼	81,680 ▼

నేటి నుంచి ఆశాపురి గోల్డ్ రైట్స్ ఇష్యూ

బంగారు ఆభరణాల తయారీదారు, హోల్‌సేల్ వ్యాపార సంస్థ ఆశాపురి గోల్డ్ ఆర్నమెంట్ లిమిటెడ్ రూ.48.75 కోట్ల రైట్స్ ఇష్యూ బుధవారం ప్రారంభమై 27న ముగియనుంది. ఇష్యూలో భాగంగా రూపాయి ముఖ విలువ కలిగిన 8,33,28,666 షేర్లను ఒక్కొక్కటి రూ.5.85 చొప్పున జారీ చేయనుంది. ఈనెల 3న బీఎస్‌ఈలో కంపెనీ షేరు ముగింపు ధరతో పోలిస్తే 57.45 డిస్కౌంట్‌తో ఈ షేర్లను జారీ చేయనుంది.

గ్రీన్‌సెల్ మొబిలిటీకి రూ.307 కోట్ల నిధులు

ఉత్తరప్రదేశ్‌లోని 8 నగరాలకు ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల సరఫరా ప్రాజెక్ట్ కోసం జపాన్‌కు చెందిన సుమిటొమో మిత్సుయి బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్ఎంబీసీ) నుంచి రూ.307 కోట్ల హరిత రుణం సమీకరించినట్లు గ్రీన్‌సెల్ మొబిటీ మంగళవారం వెల్లడించింది. భారత్‌తోపాటు ఆసియా పసిఫిక్‌లో ఈ-మొబిలిటీ విభాగం ప్రాజెక్ట్‌కు ఎస్ఎంబీసీ ఫైనాన్స్ సమకూర్చడం ఇదే తొలిసారి అని గ్రీన్‌సెల్ తన ప్రకటనలో పేర్కొంది.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 8వ తేదీ			
హైదరాబాద్	485	విజయవాడ	465
వరంగల్	487	గోదావరి	465
చిత్తూరు	563	విశాఖపట్నం	475
		డజను గుడ్లు రూ.60	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.		వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్	
హైదరాబాద్	140	గోదావరి	148
వరంగల్	140	విజయవాడ	148
కరీంనగర్	140	గుంటూరు	148
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	148
కర్నూలు	140	చిత్తూరు	147
విశాఖపట్నం	140		

రూ.5 లక్షల కోట్లు ఆవిరి

383 పాయింట్లు నష్టపోయిన సెన్సెక్స్

- 22,300 స్థాయికి జారుకున్న నిఫ్టీ
- స్మాల్, మిడ్‌క్యాప్ షేర్లలో పోటెత్తిన అమ్మకాలు



ముంబై: మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం నష్టాలు చవిచూశాయి. ఒకదశలో 636.28 పాయింట్లు పతనమై 73,259.26 వద్దకు జారుకున్న సెన్సెక్స్.. చివరికి నష్టాన్ని 383.69 పాయింట్లకు పరిమితం చేసుకుని 73,511.85 వద్ద ముగిసింది. నిఫ్టీ 140.20 పాయింట్లు కోల్పోయి 22,302.50 వద్ద స్థిరపడింది. చాలా కంపెనీల షేర్లు అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయన్న ఆందోళనల నేపథ్యంలో దేశీయ, విదేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతున్నారని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోగా.. పవర్‌గ్రిడ్ షేరు 3.80 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. అమ్మకాల హోరులో బీఎస్ఈ మార్కెట్ క్యాపిటలైజేషన్ ఒక్కరోజే రూ.4.96 లక్షల కోట్లు తగ్గి రూ.398.44 లక్షల కోట్లకు పడిపోయింది.

ఇండిజీన్ ఐపీఓకు 7.34 రెట్ల బిడ్లు :హెల్త్‌కేర్ టెక్నాలజీ కంపెనీ ఇండిజీన్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) రెండో రోజు ముగిసేసరికి, ఇష్యూ సైజుకు 7.34 రెట్ల షేర్ల కొనుగోలుకు బిడ్లు లభించాయి. రూ.1,841.75 కోట్ల సమీకరణ లక్ష్యంతో ఐపీఓకు వచ్చిన కంపెనీ.. ఇష్యూ ధరల శ్రేణిని రూ.430-452గా నిర్ణయించింది.

- ప్రీమియర్ రోడ్‌లైన్స్ ఐపీఓ ఈనెల 10న ప్రారంభమై 14న ముగియనుంది. ఇష్యూ ధర శ్రేణిని కంపెనీ రూ.63-67గా నిర్ణయించింది. తద్వారా రూ.40 కోట్ల వరకు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది.
- ప్లాంట్ బేస్డ్ స్పెషాలిటీ ఉత్పత్తుల తయారీ సంస్థ సంస్థార్ ఐపీఓకు సెబీ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా కంపెనీ 4 కోట్ల తాజా ఈక్విటీ షేర్ల జారీతోపాటు ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 80 లక్షల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించాలనుకుంటోంది.

ఎన్ఎస్ఈ ట్రేడింగ్ సమయం పెంపునకు సెబీ నో

ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్ ట్రేడింగ్ సమయాన్ని పొడిగించాలన్న ఎన్ఎస్ఈ ప్రతిపాదనను మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ తిరస్కరించింది. స్టాక్ బ్రోకర్ల నుంచి తగినంత ఫీడ్‌బ్యాక్ లభించని కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ప్రస్తుతం ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్ ట్రేడింగ్ ఉదయం 9.15 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 3.30 గంటలకు ముగుస్తుంది. ఆ తర్వాత మళ్లీ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రేడింగ్‌ను నిర్వహించేందుకు ఎన్ఎస్ఈ సెబీ అనుమతి కోరింది.

18న ప్రత్యేక ట్రేడింగ్: ఎన్ఎస్ఈ

ఈనెల 18వ తేదీన (శనివారం) ఈక్విటీ, ఈక్విటీ డెరివేటివ్ సెగ్మెంట్లలో ప్రత్యేక లైవ్ ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఈ ప్రకటించింది. ఆకస్మిక విపత్తులకు సంసిద్ధతను పరీక్షించేందుకు ఈ ట్రేడింగ్‌ను నిర్వహించనుంది. ఈ ప్రత్యేక ట్రేడింగ్ సెషన్‌ను రెండు సెగ్మెంట్లుగా విభజించనున్నారు. తొలుత సాధారణ ట్రేడింగ్ ఉదయం 9.15 గంటల నుంచి పదింటి వరకు జరగనుంది. ఆ తర్వాత 11.45 గంటల నుంచి 12.40 గంటల వరకు డిజాస్టర్ రికవరీ సైట్ నుంచి ట్రేడింగ్‌ను నిర్వహించనున్నట్లు ఎన్ఎస్ఈ తెలిపింది. ఈ ఏడాదిలో స్టాక్ ఎక్స్ఛేంజీలు ఈ తరహా ట్రేడింగ్ నిర్వహించడం ఇది రెండోసారి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

బుధవారం | 8-5-2024 | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

అకాల వర్షంతో అలజడి

పలు జిల్లాల్లో పిడుగులు.. ఐదుగురు మృత్యువాత

మృతుల్లో తల్లీ కూతుళ్లు.. కొబ్బరిచెట్టు కూలి రైతు దుర్మరణం 3

మునిగిన రాజమండ్రి నగరం.. ఎంపీ భరత్ అనాలోచిత చర్యలే కారణమని స్థానికుల ఆవేదన.. తూర్పులో నీటిపాలైన ధాన్యం




కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో హోరు గాలితో కురుస్తున్న భారీ వర్షం

అనేక పరిణామాలు! అన్నీ ప్రజల స్థిరాస్తులకు సంబంధించినవే! చూడటానికి వేర్వేరుగా జరిగినట్లుగా కనిపిస్తాయి. గుదిగుచ్చి చూస్తే మాత్రం 'ఎక్కడో తేడా కొడుతోంది బాస్! మన భూములకు ఎసరు పెడుతున్నట్లుంది' అనే కచ్చితంగా అనిపిస్తుంది! అసలు... జగన్ అడుగులు ఎటువైపు? ఏ ఉద్దేశంతో ఈ నిర్ణయాలు తీసుకుంటున్నారు?

నిరంకుశ పాలకుడిగా పేరొందిన నిజాం నవాబు సైతం తన సంస్థానంలో రైతులకిచ్చిన భూమి పత్రాలు, డాక్యుమెంట్లలో ఎక్కడా తన పేరు, తండ్రి పేరు వేసుకోలేదని రావిరాలకు చెందిన తెలంగాణ పోరాటయోధుడు వెంకటనరసింహారెడ్డి చెబుతున్నారు.

తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత చేపట్టిన భూసంస్కరణల్లో భాగంగా అక్కడి ప్రభుత్వం 'ధరణి'ని అమలు చేసింది. డాక్యుమెంట్లలో అక్కడి పాలకులు తమ ఫొటోలు వేసుకోలేదు. కానీ, ఏపీలో మాత్రం రైతుల పాసు పుస్తకాలు, హక్కు పత్రాలపై ఏకంగా సీఎం జగన్ తన వంశవృక్షాన్నే దించేశారు.

హైలెస్సో.. హైలెస్సా!



జవహర్ రెడ్డి

బిల్లులు ఎవరికిద్దాం.. డబ్బులెవరికిద్దాం!

కృష్ణా నదిలో వీఐపీ బోటులో విహార చర్చలు

సీఎస్, ఆర్థిక శాఖ అధికారుల రహస్య భేటీ 9



ఎస్ఎస్ రావత్



సత్యనారాయణ

భూములతో బంతాట

భూములు, స్థిరాస్తులను ఏం చేయాలనుకుంటున్నారు?

జగన్ సర్కారు నిర్ణయాలపై అనేక సందేహాలు

రైతుల భూమి పత్రాలపై జగన్ పేరు ఎందుకు?

'టైటిలింగ్' యాక్ట్‌తో లిటిగెంట్లకు ఊతమివ్వడమేగా!

ఒరిజినల్ పత్రాలు కాదని, జిరాక్స్‌లు ఇవ్వడమేంటి?

రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షులు అక్కర్లేదా?

'ఒక్కసారి'కే అనేక తలతిక్క, వివాదాస్పద నిర్ణయాలు

మరోసారి చాన్స్ ఇస్తే 'ఈ బిడ్డ' ఏం చేస్తాడో!



ఏందిది జగనా?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

2019లో అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' ఆమోదించడం దగ్గర నుంచి... తాజాగా ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షి సంతకాలు అవసరంలేదని ప్రతిపాదించడం దాకా! భూములు, ప్రజల స్థిరాస్తులకు సంబంధించి జగన్ సర్కారు తీసుకున్న చర్యలపై అనేక అనుమానాలు తలెత్తుతున్నాయి. 'ఇంకెవడైనా వచ్చి నాది అంటే, మీ భూమి మీది కాదు!' అనేలా టైటిలింగ్ యాక్ట్ రూపొందించారు. ప్రభుత్వం నియమించే అధికారి దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సిన పరిస్థితి కల్పించారు. 'బాస్... ఇది నా భూమే! ఇవిగో ఒరిజినల్ పత్రాలు' అని చూపిద్దామనుకుంటే, రిజిస్ట్రేషన్ తర్వాత ఒరిజినల్ పత్రాలు ప్రభుత్వం దగ్గరే ఉంచుకొని, జిరాక్స్‌లు ఇచ్చే పద్ధతి రుద్దుతున్నారు. 'ఫలానా వాళ్లు సాక్షి సంతకం చేశారు! వాళ్లనే అడుగుదాం పదండి' అని గట్టిగా నిలదీద్దామనుకుంటే, ఇప్పుడు రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షులు కూడా అక్కర్లేదని, వాళ్లనూ లేపేస్తున్నారు. అన్నింటికీ మించి పట్టాదారు పాస్ పుస్తకాలపై 'జగనన్న' చిత్రాలు! ఎందుకిదంతా? భూములను ఏం చేద్దామనుకుని ఇలాంటి నిర్ణయాలు

మిగతా 2వ పేజీలో...

బేలగా.. గోలగా!

సడలుతున్న నమ్మకంతో సీఎం అబద్ధాలు



మంగళవారం గాజువాక సభలో ప్రసంగిస్తున్న జగన్

సానుభూతి కోసం రకరకాల ప్రయత్నాలు

ప్రచార సభల్లో వింత వ్యాఖ్యలతో వీరంగం

నన్ను ఓడించేందుకు సిద్ధమయ్యారు

ఢిల్లీ పెద్దలతో కలిసి చంద్రబాబు కుట్ర

నన్ను దెబ్బతీయడానికే టీడీపీ మేనిఫెస్టో

ఊహించని విధంగా ముందుగానే షెడ్యూల్ రావడంతో ఇబ్బంది

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నా వల్లే ఆగింది

ప్రచార సభల్లో జగన్ ఉవాచ

రాజమహేంద్రవరం/శ్రీకాకుళం/విశాఖపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ తేదీ సమీపిస్తున్న కొద్దీ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి బేలతనం ప్రదర్శిస్తూ... 'సానుభూతి' కోసం ప్రయత్నిస్తున్నారు. 'నా వెంట్రుక కూడా పీకలేరు. 175కు 175 గెలుస్తాం' అనే దశ నుంచి... 'నన్ను ఓడించేందుకు

మిగతా 2వ పేజీలో...

ఎందుకీ గగ్గోలు?

ఈసీ నిర్ణయాలపై జగన్ ఆక్రోశం

2019 ఎన్నికల ముందు అధికారులపై వైసీపీ ఫిర్యాదుల పరంపర 2

పథకాలకు నిధులివ్వొద్దని పిటిషన్లు

అప్పట్లో సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్ బదిలీ

నాడు ఈసీ నిర్ణయాన్ని స్వాగతించిన జగన్

ఇప్పుడు డీజీపీ, ఐపీఎస్‌లను బదిలీ చేస్తే అన్యాయమంటూ ముఖ్యమంత్రి గోల

6 నెలల ముందే అస్మదీయులకు పోస్టింగ్‌లు

వారి సాయంతో ఎన్నికల్లో గెలవాలని ప్లాన్

వ్యూహం బెడిసికొడుతుండటంతో నిర్వేదం

తిరుపతిలో మంగళవారం రాత్రి జరిగిన సభకు హాజరైన జనం.. కత్తి, గద పట్టిన పవన్, చంద్రబాబు





జగన్ ల్యాండ్ చట్టంతో సెంటు భూమైనా అమ్ముకోలేం..

నేనొచ్చాక కొత్త పాస్‌బుక్‌లు

జగన్ ఫొటోతో ఉన్న వాటిని చించేయండి: చంద్రబాబు

ఓటమి భయంతో జగన్‌లో తీవ్ర నిస్పృహ.. డ్రామాలతో ఎవరిని మోసం చేస్తారు?

ఆయన మేనిఫెస్టో ఎత్తిపోయింది.. వైసీపీకి డిపాజిట్లు కూడా రావు

టీటీడీ సహా అన్ని ఆలయాల ట్రస్టు బోర్డుల్లో బ్రాహ్మణులకు సభ్యత్వం 9

450 మంది కార్యకర్తలను జైల్లో పెట్టారు.. గుండె రగులుతోంది.. వదిలిపెట్టను

పెద్దిరెడ్డి కొవ్వు కరిగిస్తా: టీడీపీ అధినేత.. తిరుపతిలో పవన్‌తో కలిసి భారీ రోడ్‌షో

పుంగనూరులోనూ భారీ బహిరంగ సభ.. ఆకురౌడీలను తొక్కిపడేస్తామని హెచ్చరిక

ఆకురౌడీలకు భయపడతామా?

రూ.200 కోట్ల కమీషన్ల కోసం సత్రాలను కూల్చి కొత్తవి కడుతున్నారు

భూమన, అభినయ్‌పై జనసేనాని ధ్వజం

టీడీఆర్ బాండ్ల పేరుతో 2 వేల కోట్లు నొక్కేశారు

తిరుమల హుండీ కానుకలనూ దోచేశారు

ఎర్రచందనం స్మగ్లింగ్‌లో చెవిరెడ్డి కోట్లు గడించారు: పవన్

ఇంత నిర్లక్ష్యమా?

నలుగురు కలెక్టర్లు, ఐదుగురు ఎస్పీలకు ఈసీ హెచ్చరిక

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి.. శాంతిభద్రతల బాధ్యత ఎస్పీలదే.. కలెక్టర్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి

తేడా వస్తే చర్యలు తప్పవని స్పష్టీకరణ

5 జిల్లాల్లో శాంతిభద్రతలపై దృష్టిపెట్టని ఎస్పీలు

వైసీపీకి అనుకూలంగా సీమలో ఇద్దరు కలెక్టర్లు!

ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో మరో ఇద్దరు

నిఘా పెట్టిన కమిషన్.. త్వరలో కొందరిపై వేటు?



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అధికార పార్టీతో అంటకాగుతున్న ఉన్నతాధికారులపైన, సహచరులపైన కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) కొరడా ఝుళిపిస్తున్నా.. ఇంకా కొందరు కలెక్టర్లు, ఎస్పీలు లెక్కచేయడం లేదు. వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు తేలడంతో ఈసీ గట్టి హెచ్చరిక చేసింది. 'ఎన్నికల నిర్వహణలో తేడా రాకూడదు. పోలింగ్ ప్రశాంతంగా జరగాలి. జిల్లాల్లో ఎక్కడ శాంతిభద్రతల

మిగతా 12వ పేజీలో...

పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డిపై వేటు 12

సదుం ఎస్ఐ సైతం బదిలీ.. రామచంద్ర యాదవ్‌పై దాడి పర్యవసానం



అంత అత్యవసరం ఏంటి?

నిధులు మురిగిపోతాయన్న ప్రభుత్వ వాదన సహేతుకం కాదు 12

ఎన్నికలయ్యే వరకు పథకాలు వద్దన్నాం

కాదంటే, అత్యవసర కారణమేంటో చెప్పాలి

పరిశీలించి తగిన నిర్ణయాన్ని వెల్లడిస్తాం

హైకోర్టుకు నివేదించిన కేంద్ర ఎన్నికల సంఘం

వివరాలను తమ ముందుంచాలన్న హైకోర్టు

పథకాలు ఆపాలని చెప్పలేదు

కొన్ని రోజుల తర్వాత ఇవ్వమన్నాం

ప్రభుత్వం నుంచి 50 ప్రతిపాదనలు 12

ఆసరా, చేయూతపై వివరాలు కోరాం: మీనా





అబ్ కీ బార్?

రాజకీయ లబ్ధి కోసం మోదీ విద్వేషాలు: సోనియా

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ రాజకీయ లబ్ధి కోసం విద్వేషాలను రెచ్చగొడుతున్నారని సోనియాగాంధీ ఆరోపించారు. ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవడమే ప్రధాని మోదీ, బీజేపీ లక్ష్యమని విమర్శించారు. మంగళవారం ఆమె ఓ వీడియో విడుదల చేశారు. మోదీ, బీజేపీ విధానాల వల్ల దేశవ్యాప్తంగా దళితులు, గిరిజనులు, వెనుకబడినవర్గాలు, మైనారిటీలు తీవ్ర వివక్షను ఎదుర్కొంటున్నారని సోనియా ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని వర్గాలకు అండగా నిలిచేలా తమ పార్టీ మేనిఫెస్టో రూపొందించామని వివరించారు. అసత్యాలు, విద్వేషాన్ని తిరస్కరించాలని, దేశాభివృద్ధి కోసం కాంగ్రెస్‌కు ఓటు వేయాలని ప్రజలకు సోనియా పిలుపునిచ్చారు.

రెచ్చిపోయిన వైసీపీ

» రౌడీలా రెచ్చిపోయిన ఎమ్మెల్యే కొడుకు ఓబుల్‌రెడ్డి

» బనగానపల్లెలో టీడీపీ అభ్యర్థి భార్యపై దాడికి యత్నం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): ఎన్నికల ప్రచారంలో టీడీపీకి వస్తున్న ఆదరణ చూడలేక వైసీపీ నాయకులు అక్కసుతో రగిలిపోతున్నారు. మంగళవారం నంద్యాల జిల్లా బనగానపల్లెలో దాడులకు తెగబడ్డారు. టీడీపీ అభ్యర్థి బీసీ జనార్ద న్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ, టీడీపీ నాయకులపై వైసీపీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబుల్‌రెడ్డి దాడికి యత్నించారు. తొలుత స్థానిక కూరగాయల మార్కెట్‌లో అనుచరులతో కలసి టీడీపీ అభ్యర్థి ఇందిరమ్మ ప్రచారం చేస్తుండగా, ఇక్కడే వైసీపీ వర్గీయులు తమ ప్రచార రథాన్ని నిలిపి అధిక సౌండ్ వచ్చేలా వైసీపీ ప్రచార పాటలను పెట్టారు. అయితే, ఆ రథాన్ని పక్కకు జరిపేలా చూడాలంటూ టీడీపీ నేతలు స్థానిక పోలీసులను కోరగా, ఈ విషయం తెలుసుకున్న ఓబుల్‌రెడ్డి దాదాపు 50 మందిని వెంటేసుకుని వచ్చి ఇందిరమ్మపై దాడికి యత్నించారు. అప్రమత్తమైన టీడీపీ వర్గీయులు ఇందిరమ్మకు రాళ్లు తగలకుండా ఉండేందుకు చుట్టూ రక్షణగా చేరి అక్కడి నుంచి ఆమెను తరలించారు. ఈ దాడిలో ఇద్దరు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. అలాగే, పల్నాడు జిల్లా గురజాల మండలం దైద గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలైన తండ్రి కొడుకులు కాలెంకాయల వెంకయ్య, శ్రీను సోమవారం రాత్రి గ్రామంలో కూటమి తరఫున జరిగిన ప్రచారంలో పాల్గొని తిరిగి వస్తుండగా వైసీపీ రౌడీ మూకలు.. కవ్వింపు చర్యలకు దిగారు. వెంకయ్య వారిని మందలించగా.. వైసీపీ మూకలు ఇనుప రాడ్లతో వెంకయ్యపై దాడి చేసి రోడ్డుపై ఈడ్చుకెళ్లారు. వెంకయ్య కుమారుడు శ్రీను అడ్డుకోబోగా అతడి తలపై కూడా ఇనుపరాడ్లతో బలంగా మోదారు. వీరి కేకలు విన్న శ్రీనుకు సోదరి వరసయ్యే పగడాల వెంకట్రావమ్మ అక్కడకు చేరుకోగా ఆమెపై కూడా ఇనుపరాడ్డుపై దాడి చేయగా తలకు తీవ్ర గాయమైంది. ముగ్గురినీ గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఇక, అనంతపురం జిల్లా రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లి మండలం రాంపురంలో టీడీపీ కూటమి అభ్యర్థి పరిటాల సునీత రోడ్ షోకు భారీగా జనం తరలిరావడంతో జీర్ణించుకోలేని వైసీపీ వర్గీయులు మిద్దెలపైకి ఎక్కి రాళ్లు రువ్వారు. కొందరు యువకులు మిద్దెలపైకి ఎక్కి మీసాలు దువ్వుతూ.. తొడలు కొడుతూ దమ్ముంటే రావాలని సవాలు విసిరారు. అడ్డుకోబోయిన పోలీసులపైనా దుర్భాషలాడుతూ దాడికి యత్నించారు. ఇక, కర్నూలు జిల్లా ఆలూరు మండలంలోని అంగస్కల్ గ్రామంలో మంగళవారం ఉదయం టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు కర్రలతో ముక్కుముడిగా దాడులకు పాల్పడ్డారు. తాము గ్రామంలో వైసీపీ ఎన్నికల ప్రచారం చేశామని ఇక టీడీపీ నాయకులు ఎవరూ ప్రచారం చేయకూడదంటూ వైసీపీ నాయకులు హుంకుం జారీ చేశారు. 'ఎందుకు చేయకూడదంటూ' ఒకే కుటుంబానికి టీడీపీ కార్యకర్తలు పుండుకూర రామాంజనేయులు, రమేష్, బీమలింగ, దేవేంద్ర, తదితరులు నిలదీయగా వారిపై వైసీపీ నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. మరోవైపు, పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి మండలం పెనుమర్రులో వైసీపీ ప్రచార కార్యక్రమాన్ని వీడియో తీస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సీతారామరాజు, వీడియో గ్రాఫర్ తాళ్ల శ్రీనివాసరావులపై ఓ వైసీపీ కార్యకర్త దాడి చేశాడు.

పల్నాడులో టీడీపీ నేత కారును తగులబెట్టేశారు

ఈపూరు, మే 7: టీడీపీ నేత కారును గుర్తు తెలియని దుండగులు తగులబెట్టారు. ఈ ఘటన పల్నాడు జిల్లా ఈపూరు మండలం ముప్పాళ్ల గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నేత మోదుగుల నరసింహారావు మంగళవారం తెల్లవారు జామున తన ఇంటి ముందు పార్క్ చేసిన కారును దుండగులు తగులు బెట్టారు. టీడీపీ తరఫున విస్తృతంగా ప్రచారం చేస్తుండడంతో ఇది గిట్టని వారే తన కారుకు నిప్పు పెట్టారని నరసింహారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓట్ జిహాదా.. రామరాజ్యమా?

ఏది కావాలో మీరే నిర్ణయించుకోండి

» దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడానికి 'ఇండియా' నేతల పోటీ

» ఆర్టికల్ 370ని మళ్లీ తేకూడదని, రామమందిరానికి బాబ్రీ తాళం పడకూడదని లోక్‌సభలో 400కు పైగా సీట్లు అడిగాను: మోదీ



అహ్మదాబాద్‌లో ఓటు వేయడానికి వెళ్తూ చిన్నారిని ఎత్తుకున్న ప్రధాని మోదీ

ధార్ (మధ్యప్రదేశ్), మే 7: కాంగ్రెస్ పార్టీ 'ఓట్ జిహాద్'ను ప్రోత్సహిస్తూ, బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేయాలని ముస్లింలను కోరుతోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. మధ్యప్రదేశ్‌లోని ధార్, ఖర్గోన్‌లలో మంగళవారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలలో మోదీ ప్రసంగించారు. "భారతదేశం ఈ రోజు ఒక కీలక మలుపు ముంగిట నిలిచింది. దేశంలో ఓట్ జిహాద్ కొనసాగాలా లేక, రామ రాజ్యం కొనసాగాలా అనేది మీరే నిర్ణయించుకోవాలి" అని ప్రజలను ఉద్దేశించి ఆయన వ్యాఖ్యానించారు. పాక్ ఉగ్రవాదులు భారత్‌కు వ్యతిరేకంగా జిహాద్ పేరుతో బెదిరిస్తుంటే, ఇక్కడ కాంగ్రెస్ మాత్రం మోదీకి వ్యతిరేకంగా ఓట్ జిహాద్‌ను ప్రకటించిందని ఆయన ఆరోపించారు. దేశ వ్యతిరేక ప్రకటనలు చేయడానికి ప్రస్తుతం విపక్ష ఇండియా కూటమి నేతల మధ్య పోటీ నడుస్తోందని, వారు మన విశ్వాసాలను, దేశ ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు.

400 సీట్లు ఎందుకు వాడామంటే...

కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని కాంగ్రెస్ తిరిగి తీసుకురాకుండా ఉండేందుకు, అయోధ్యలో రామమందిరానికి బాబ్రీ తాళం పడకుండా ఉండేందుకు ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే 400 సీట్లు గెలుచుకోవాలని తాను కోరుకుంటున్నట్లు మోదీ తెలిపారు. కాంగ్రెస్ తన ఓటు బ్యాంకుకు లబ్ధి చేకూర్చడానికి గాను వారు ఓబీసీ కోటాను దోచుకోకుండా ఉండటానికి 400 స్థానాలు కావాలని అడిగినట్లు తెలిపారు. దేశంలో ఖాళీగా ఉన్న భూములు, దీవులను కాంగ్రెస్ పార్టీ ఇతర దేశాలకు అప్పగించకుండా, తన ఓటు బ్యాంకులోని కులాలను రాత్రికి రాత్రే ఓబీసీలుగా ప్రకటించకుండా ఉండటానికే 400 సీట్లు అడుగుతున్నానని తెలిపారు. "బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు పార్లమెంట్‌లో ఇప్పటికే 400కుపైగా సీట్లు ఉన్నాయని దేశ ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఆర్టికల్ 370ని రద్దు చేయడానికి మేం ఈ నంబరును ఉపయోగించాం" అని మోదీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ కోటాను పదేళ్ల కాంగ్రెస్, ఇండియా కూటమి ప్రతి కుట్రను అడ్డుకొనేందుకు తాను 400 సీట్లు అడుగుతున్నానని మోదీ స్పష్టం చేశారు.

వాళ్ల నోటికి తాళం

దళితులు, ఓబీసీల రిజర్వేషన్లను లాక్కొని ముస్లింలకు ఇవ్వాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని ప్రధాని ఆరోపించారు. ఈ అంశంపై ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్ యాదవ్ ఇటీవల చేసిన ప్రకటన ఇండియా కూటమి ఉద్దేశాలను ధ్రువీకరించిందని చెప్పారు. "ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఇస్తున్న రిజర్వేషన్లను ఎప్పటికీ లాక్కోబోమని, ప్రస్తుతం ఉన్న ఓబీసీ కోటా నుంచి దోపిడీకి పాల్పడి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించబోమని లిఖితపూర్వకంగా ఇవ్వాలని కోరాను. కానీ వారు స్పందించకుడా, తమ నోటికి తాళం వేసుకొని మౌనంగా కూర్చున్నారు" అని మోదీ ఎద్దేవా చేశారు.

అంబేడ్కర్‌కు వెన్నుపోటు పొడిచారు

అంబేడ్కర్‌ను కాంగ్రెస్ చిన్నచూపు చూస్తోందని, రాజ్యాంగం రూపకల్పనలో ఆయన పాత్ర చాలా తక్కువని, రాజ్యాంగ నిర్మాణంలో పండిట్ నెహ్రూ అత్యంత ముఖ్యమైన పాత్ర పోషించారని ప్రచారం చేయడం ప్రారంభించిందని మోదీ ఆరోపించారు. అంబేడ్కర్‌ను, రాజ్యాంగాన్ని కాంగ్రెస్ వెన్నుపోటు పొడించిదన్నారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పరివారం తీవ్రంగా ద్వేషిస్తోందన్నది వాస్తవమని మోదీ పేర్కొన్నారు. ఇలాంటి వారిని రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంచడమే మత రిజర్వేషన్లను వ్యతిరేకించిన అంబేడ్కర్‌కు అతిపెద్ద నివాళిగా అభివర్ణించారు.

ముస్లింలకు నేను వ్యతిరేకం కాదు

» టైమ్స్‌నౌ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మే 7: తాను ఇస్లాంకు, ముస్లింలకు వ్యతిరేకం కాదని ప్రధాని మోదీ చెప్పారు. కాంగ్రెస్ పార్టీ హిందువుల ఆస్తులను ముస్లింలకు పంచుతుందంటూ తాను చేసిన వ్యాఖ్యను సమర్థించుకుంటూ.. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ఆ విషయం ఉందన్నారు (తమ ఎన్నికల ప్రణాళికలో ఇటువంటి అంశం లేనేలేదని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది). అయితే, ముస్లింలు తెలివైన వారని, కాంగ్రెస్ అబద్ధాలను వారు నమ్మటం లేదని, ఇదే ఇప్పుడు కాంగ్రెస్‌కు సమస్యగా మారిందన్నారు. టైమ్స్‌నౌ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ముస్లిం సమాజం ఆలోచించాలి. దేశం ప్రగతి పథంలో ఉంది. మీ వద్ద ఏమైనా పొరపాట్లు, పరిమితులు ఉన్నాయని భావిస్తే దానికి కారణాలేవిటో గుర్తించాలి' అని మోదీ పేర్కొన్నారు. ముస్లింలు తమ భవిష్యత్తు గురించి, తమ పిల్లల గురించి ఆలోచించుకోవాలని సూచించారు.

మూడో దశలో 61.45% పోలింగ్

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ మూడో దశ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలోని 93 పార్లమెంటు స్థానాలలో మూడో దశ పోలింగ్ జరిగింది. రాత్రి 8 గంటల వరకు 61.45శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించింది. ఇప్పటి వరకు జరిగిన మూడు దశల ఎన్నికలతో 20 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో 283 స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి.

గుజరాత్‌లో ముస్లింలకు రిజర్వేషన్

» మోదీ సీఎంగా ఉన్నప్పుడే అమలు

» 2022లో ప్రధాని స్వయంగా వెల్లడి

న్యూఢిల్లీ, మే 7: కాంగ్రెస్‌గానీ, ఇండియా కూటమిగానీ అధికారంలోకి వస్తే హిందువుల ఆస్తులను మహిళల మెడలో మంగళసూత్రాలతో సహా లాక్కొని ముస్లింలకు పంచుతారని, బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తగ్గించి వాటిని ముస్లింలకు ఇస్తారని ప్రధాని మోదీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ముస్లింలకు ఎంత మాత్రం రిజర్వేషన్లు ఇవ్వటానికి వీల్లేదని, తాను బతికుండగా ఆ పనికి అవకాశం ఇవ్వబోనని తేల్చి చెబుతున్నారు. అయితే, మోదీ గుజరాత్ సీఎంగా ఉండగా ఆ రాష్ట్రంలోని ముస్లింలకు బీసీ కోటాలో రిజర్వేషన్ కల్పించారు. దీని గురించి ఆయనే స్వయంగా వెల్లడించారు. ఈ మేరకు న్యూస్ వెబ్‌సైట్ 'వైర్' ఒక కథనాన్ని ప్రచురించింది. దీని ప్రకారం.. 2022 ఫిబ్రవరి 9వ తేదీన ఏఎన్ఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మోదీ మాట్లాడుతూ.. గుజరాత్‌లోని ముస్లింలలో 70 వర్గాలు బీసీ జాబితాలో ఉన్నాయని, తాను సీఎంగా ఉన్నప్పుడు వారందరూ బీసీ రిజర్వేషన్ ప్రయోజనాలను పొందారని పేర్కొన్నారు. అటువంటప్పుడు, కాంగ్రెస్‌ను, ఇండియా కూటమిని ఎలా వేలెత్తి చూపుతారన్న ప్రశ్న ముందుకొస్తోంది. అంతేకాదు, బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిలో ఉన్న పార్టీలు సైతం ముస్లింల రిజర్వేషన్ల పట్ల సానుకూలంగా ఉన్నాయి. కర్ణాటకలో ముస్లింలకు బీసీ రిజర్వేషన్లను తొలిసారిగా హెచ్‌డీ దేవెగౌడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కల్పించామని జేడీఎస్ చెప్పుకుంటోంది. ఆ పార్టీ ఎన్డీఏ ప్రధాన పార్టీలో ఒకటి. ఇక కూటమిలో ఇటీవలే చేరిన మరో ప్రధాన పార్టీ తెలుగుదేశం కూడా.. ఏపీలో ముస్లింలకు బీసీ కోటా కింద 4% రిజర్వేషన్‌ను కొనసాగిస్తామని ప్రకటించింది. కాగా, ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడాన్ని తాను స్వాగతిస్తానని ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. అయితే, రిజర్వేషన్లు మత ప్రాతిపదికన ఉండకూడదన్నారు. సామాజిక వెనుకబాటు ఆధారంగా ఇవ్వాలన్నారు.

జగన్ పోతేనే జనం బాగుంటారు

ముద్రగడ కుమార్తె క్రాంతి వ్యాఖ్య

పిఠాపురం, మే 7: జనం బాగుండాలంటే జగన్ పోవాలని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం కుమార్తె క్రాంతి అన్నారు. 'జగన్ పాలనలో ఎంతో మంది రౌడీలు ప్రజలను భయపెట్టి దోచుకుంటున్నారు. నా విషయంలో మా నాన్న అన్న మాటలు నన్ను బాధ పెట్టాయి. ఇంత రాజకీయ అనుభవం ఉన్న మీరు జగన్ చేతిలో తోలుబొమ్మలా మారడం బాధాకరం. ఒక బ్లేడ్ బ్యాచ్, గంజాయి బ్యాచ్ నడిపే ఒక జోకర్ చేతిలో మా అన్నదమ్ములు ఆడుతుంటే బాధ వేస్తోంది' అని ఆమె అన్నారు. వైసీపీ ఓడిపోవడం ఖాయం. ఆ విషయం జూన్ 4న తెలుస్తుంది.

బేలగా.. గోలగా!

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధమయ్యారు' అని వాపోయే పరిస్థితికి వచ్చారు! 'ఇష్టానుసారం అధికారులను మార్చేస్తున్నారు. ఎన్నికలు సక్రమంగా జరుగుతాయని నమ్మకం లేకుండా పోతోంది' అని సోమవారం బందరులో బేలపలుకులు పలికిన జగన్... మంగళవారం 'నన్ను ఓడించేందుకు అందరూ సిద్ధమయ్యారు' అని తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలో వాపోయారు. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజానగరం, శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం, ఉమ్మడి విశాఖ జిల్లాలోని పాతగాజువాక సభల్లో జగన్ పాల్గొన్నారు. 'ఢిల్లీ పీఠం కదలాలి...అందుకు శ్రీకాకుళం నుంచే అడుగులు పడాలి' అన్న జగన్... తనపై, తన ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన ప్రధాని మోదీపై మాత్రం పన్నెత్తి మాట అనకపోవడం గమనార్హం. మొత్తంగా అబద్ధాలు, అర్ధసత్యాలతో... విపక్షం, ఎన్నికల కమిషన్‌పై విమర్శలతో... సానుభూతి పొందేందుకు జగన్ తంటాలు పడ్డారు. జగన్ అన్నదీ, అసలు వాస్తవం ఇదీ...

జగన్ చెప్పింది: ఊహించినదాని కంటే ముందే ఎన్నికల షెడ్యూల్ రావడంతో ఇబ్బంది ఏర్పడిందని, ప్రాసెస్‌లో ఉన్న పథకాలు ఆగిపోయాయంటూ జగన్ వాపోయారు.

వాస్తవం: నిజానికి... 2019తో పోల్చితే ఈసారి ఎన్నికల షెడ్యూలు వారానికిపైగా ఆలస్యంగా విడుదలైంది. అలాగే... ఆన్‌గోయియింగ్ పథకాలకు ఎన్నికల కోడ్ రావడానికి ముందే జగన్ బటన్ నొక్కారు. కానీ, డబ్బులు జమ చేయకుండా ఆపారు. పోలింగ్‌కు ముందు డబ్బులేసి ఓట్లు కొల్లగొట్టాలన్నదే ఆయన వ్యూహం. కానీ... ఆయన పాచిక పారలేదు. దీంతో ఈసీపై తన అక్కసును వెళ్లగక్కారు. పైగా... ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిన తనను ఎన్నికల ముందు ఆఖరి నెలలో కట్టడి చేయడానికి ఢిల్లీ పెద్దలతో కలిసి చంద్రబాబు కుట్ర చేస్తున్నారన్నారు. ఆఖరి నెలలో తనను దెబ్బతీయడానికి ముగ్గురూ (చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి) కలసి డ్రామాలకు తెరతీశారని వాపోయారు.

జగన్ చెప్పింది: 'నన్ను ఓడించేందుకు సిద్ధమయ్యారు!' అని జగన్ వ్యాఖ్యానించడం మరో విచిత్రం!

వాస్తవం: మరి... జగన్ ఏం చేస్తున్నారు? టీడీపీ-జనసేన-బీజేపీని గెలిపించేందుకు ఆయన 'సిద్ధం' సభలు పెడుతున్నారా? ఎన్నికల్లో ప్రత్యర్థిని ఓడించకుండా, గెలిపిస్తారా?

జగన్ చెప్పింది: చంద్రబాబు సూపర్ సిక్స్ మేనిఫెస్టోతో తనను దెబ్బ తీయాలని కుట్ర చేస్తున్నారంటూ జగన్ బేల మాటలు పలికారు.

వాస్తవం: అంటే... తమ మేనిఫెస్టోకంటే కూటమి మేనిఫెస్టో బాగున్నట్లు ఒప్పుకోవడమే కదా!

జగన్ చెప్పింది: "ఐదు ఏళ్లపాటు పాలన చేసేందుకు ప్రజలు నన్ను ఎన్నుకుంటారు. కానీ, 60 నెలలు కాకముందే నా ప్రభుత్వాన్ని ఇబ్బందులు పెడుతున్నారు" అని జగన్ చెప్పారు.

వాస్తవం: ఐదేళ్లు... 60 నెలలు... ఇదేం లెక్కో ఎవరికీ అర్థం కాదు. తాను పూర్తిగా ఐదేళ్లు పాలించిన తర్వాతే, ఎన్నికల షెడ్యూలు రావాలన్నది ఆయన అంతరార్థం కావొచ్చు! అంటే... ఎన్నికల షెడ్యూలు కూడా జగనే ప్రకటిస్తారా?

జగన్ చెప్పింది: 'ఇంటి వద్దే ఇస్తున్న పింఛన్ అడ్డుకున్నారు. ఢిల్లీలో ఉన్న పెద్దలకు అర్థంకావా ఈ కుట్రలు? చివరి రెండు నెలలు నేను బటన్‌లు నొక్కుతూ ఉన్నా డబ్బులు అందకుండా చేస్తున్న విషయాన్ని అర్థం చేసుకోవాలి!

వాస్తవం: వైసీపీ కార్యకర్తల్లా మారిన వలంటీర్లను ఎన్నికల కమిషన్ పక్కకు పెట్టింది. అంతేతప్ప, ఇంటివద్దే పింఛను ఇవ్వొద్దని ఆదేశించలేదు. అవ్వాతాతలకు ఇంటింటికీ వెళ్లి పింఛను పంపిణీ చేసే అవకాశమున్నా జగన్ కుట్ర చేయడం నిజం. 'బటన్ నొక్కుడు' నిధులు కావాలనే ఆలస్యం చేశారని లబ్ధిదారులకు ఎప్పుడో అర్థమైంది.

ట్రాఫిక్ కష్టాలు.. పోలీసుల ఓవరాక్షన్

తూర్పుగోదావరి జిల్లా కోరుకొండలో జగన్ సభ 10.30 గంటలకు మొదలవుతుందని చెప్పి, వందల బస్సుల్లో జనాన్ని ఉదయాన్నే తరలించారు. ఆయన రావడం ఆలస్యం కావడంతో పిల్లలు, వృద్ధులు, మహిళలు ఎండలో మాడిపోయారు. సభకు వచ్చిన జనాన్ని సుమారు 2 కిలోమీటర్లకు ముందే దింపేశారు. తెల్లవారు జాము నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేశారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో మున్సిపల్ ఆఫీస్ జంక్షన్ వద్ద జగన్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. జనసమీకరణను ఏకంగా మధ్యాహ్నం ఒంటిగంట చేసేసి.. జనంతో రోడ్లను కిక్కిరిసేలా చేశారు. దీంతో వాహనాల రాకపోకలు కొన్నిగంటలు నిలిచిపోయాయి. జనానికి తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. సీఎం ప్రచారకార్యక్రమం గంటన్నర సమయం ఆలస్యంగా ఆరంభమైంది. తాను బటన్ నొక్కానని.. చంద్రబాబు బటన్ నొక్కలేదని.. పరనిందలు వేస్తూ ప్రసంగం ముగించారు.

ప్రమాదవశాత్తూ యువకుని మృతి

జగన్ సభ ముగింపు సమయంలో గాలి, దుమ్ముతో పెద్ద వాన పడింది సభకు వచ్చిన ఇద్దరు యువకులు తల దాచుకోవడానికి కోరుకొండ బస్టాండ్‌కు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం శ్లాబ్ కిందకు వెళ్లారు. గాలి, వాన పెద్దగా రావడంతో శ్లాబ్ కూలిపోయింది. ఆ ఇద్దరిలో ఒకరు అక్కడికక్కడే చనిపోయారు. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుడిని సీతానగరం మండలం సింగ వరం గ్రామాని చెందిన మోర్త శ్యామ్‌కుమార్(22)గా గుర్తించారు. గాయపడిన యువకుడు ముంగనూరి పృథ్వీరాజ్‌కు చికిత్స అందిస్తున్నారు. వీరిద్దరూ డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు.

ఉక్కు ప్రైవేటీకరణ ఈయనవల్లే ఆగిందట!

రైల్వేకు భూములిచ్చేశారట..

గాజువాకలో వైసీపీ అభ్యర్థి ఓటమి ఖాయమని గుర్తించిన జగన్... స్టీల్ ప్లాంట్ ప్రస్తావన తెచ్చి, ప్రజలను బెదిరించే ప్రయత్నం చేశారు. తాను ఆమోదముద్ర వేయనందువల్లే స్టీల్‌ప్లాంటు ప్రైవేటీకరణపై కేంద్రం వెనుకడుగు వేసిందని గొప్పలు చెప్పుకొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ పూర్తిగా ఆగిపోవాలంటే, గాజువాకలో ఎన్డీయే కూటమి అభ్యర్థిని ఓడించి.. వైసీపీ అభ్యర్థి గుడివాడ అమర్నాథ్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. 'ఉక్కు' కార్మికులు చేస్తున్న ఆందోళనకు ఇన్నేళ్లలో జగన్ ఒక్కసారీ మద్దతు పలికిందిలేదు. ఎన్నికల ముందు వ్యూహాత్మకం కార్మిక సంఘాల నేతలకు అపాయింట్‌మెంట్ ఇచ్చారు. 'స్టీల్‌ప్లాంటు నష్టాల్లో ఉందా?' అంటూ వారి ముందు అమాయకత్వం ప్రదర్శించారు. తన పరిధిలో ఉన్న, పరిష్కరించే డిమాండ్లనూ తోసిపుచ్చారు. విజయనగరం జిల్లా గర్భాంలో మాంగనీస్ గనులను, పక్కనే సారిపల్లిలో ఇసుక గనుల లీజు కాలం ముగిసిపోయినా రాష్ట్ర ప్రభుత్వం వాటిని రెన్యువల్ చేయడం లేదని, వాటిని త్వరగా రెన్యువల్ చేయాలని కోరగా... 'వాటితో మీకు లాభంలేదు. మరిచిపోండి' అని బదులిచ్చారు. బొగ్గు కొరత వల్ల తాము ప్రతి నెలా రూ.80 కోట్ల నుంచి రూ.90 కోట్ల విద్యుత్ వినియోగిస్తున్నామని, అందుకు ఏ నెలకు ఆ నెల చెల్లించాలని ఈపీడీసీఎల్ నోటీసులు ఇస్తూ ఒత్తిడి పెడుతోందని, వాటిని వాయిదాలో చెల్లించడానికి అనుమతించాలని కోరగా... 'డిస్కమ్‌లకు లక్ష కోట్ల రూపాయల అప్పులు ఉన్నాయి. మీరు కాకపోతే బిల్లులు సకాలంలో ఇంకెవరు కడతారు?' అంటూ ఎదురు ప్రశ్నించారు.

రైల్వే జోన్‌పై...

రైల్వేజోన్‌కు భూములు ఇచ్చినా వాటిని కావాలని తీసుకోకుండా లిటిగేషన్ పెడుతున్నారని నిందలేశారు. అయితే, రైల్వేకు ఇచ్చామని జగన్ చెబుతున్న భూమి ముడసర్లోవ క్యాచ్‌మెంట్ ఏరియాలో ఉంది. సమీప కొండలపై కురిసిన వర్షపు నీరు భూముల్లోకి వచ్చి చేరుతుంది. వాటిని 'నీటి వనరులప్రాంతం'గా ప్రభుత్వం గుర్తించింది. ప్రభుత్వం ఇచ్చే 52.22 ఎకరాల్లో 20 ఎకరాలు నిర్మాణాలకు ఉపయోగపడకపోతే వాటిని ఏం చేసుకుంటామని రైల్వే అధికారులు ప్రశ్నిస్తున్నారు. లేఖ రాస్తే..భూములు ఇచ్చినట్టు కాదని, టైటిల్ డీడ్‌ని రైల్వే పేరిట మారిస్తే...అప్పుడు ఇచ్చినట్టు అవుతుందని అంటున్నారు.

నేడు ప్రచారానికి జగన్ బ్రేక్!

పోల్ మేనేజ్‌మెంట్‌పై నేతలకు దిశానిర్దేశం?

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ బుధవారం ఎన్నికల ప్రచారానికి విరామం ఇచ్చారు. ఆయన రోజంతా విశ్రాంతి తీసుకుంటారని వైసీపీ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే, రాష్ట్ర ఎన్నికల ట్రెండ్ ఏమిటో స్పష్టం కావడంతో, ఆఖరి దశ రాజకీయ వ్యూహాల కోసమే జగన్ తన ప్రచారానికి ఒకరోజు విరామం ప్రకటించారని సమాచారం. ప్రభుత్వోద్యోగులు వైసీపీకి వ్యతిరేకంగా పోస్టల్ బ్యాలెట్‌లో ఓట్లు వేశారంటూ విస్తృత ప్రచారం జరుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఈ ప్రచారం జోరందుకోవడంతో.. జగన్ డీలా పడ్డారని రాజకీయ పక్షాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ముఖ్యనేతలతో జగన్ బుధవారం పోల్ మేనేజ్‌మెంట్‌పై సమీక్షించనున్నారని సమాచారం.



ఎందుకీ గగ్గోలు?

ఈసీ నిర్ణయాలపై జగన్ ఆక్రోశం.. 2019 ఎన్నికల ముందు అధికారులపై వైసీపీ ఫిర్యాదుల పరంపర

పథకాలకు నిధులు ఇవ్వొద్దని పిటిషన్లు.. అప్పట్లో సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్ బదిలీ

నాడు ఈసీ నిర్ణయాన్ని స్వాగతించిన జగన్.. ఇప్పుడు అన్యామని గగ్గోలు

6 నెలలకు ముందే అస్మదీయులకు పోస్టింగ్‌లు.. వారి సాయంతో ఎన్నికల్లో గెలవాలని ప్లాన్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

క్రికెట్‌లో కెప్టెన్ ఫీల్డింగ్ సెట్ చేసినట్లు... ఎన్నికలకు ఆరునెలల ముందే ఎక్కడెక్కడ ఏ అధికారి ఉండాలి, ఎవరైతే మన మాట వింటారు, మన అడ్డగోలు అక్రమాలకు సహకరిస్తారు అని ఆచితూచి పోస్టింగ్‌లు ఇచ్చేశారు! ఆయా అధికారులు జగన్ సేవలో తరిస్తూ వచ్చారు. ఎన్నికల కమిషన్ రంగంలోకి దిగి ఆ యా అధికారులపై బదిలీ వే టు వేయడంతో ఆయన వ్యూ హం ఫలించడంలేదు. దీంతో 'వామ్మో... వాయ్యో... ఇది అన్యాయం' అని జగన్ వాపోతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చేదాకా చాలా జిల్లాల్లో ఐపీసీ బదులు వైసీపీ అమలైంది. ఎన్నికల సమయంలోనూ ఆయన 'రాజ్యాంగమే' అమలు కావాలట!

అది మరిచారా?

గత ఎన్నికల సమయంలో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు అధికారులను ఈసీ బదిలీ చేసినపుడు ప్రశంసించిన జగన్.. అదే ఎన్నికల సంఘం ఇప్పుడు అధికారులను బదిలీ చేస్తే విమర్శిస్తున్నారు. అన్యాయం జరిగిపోతోందని గగ్గోలు పెడుతున్నారు. ఏకపక్షంగా వ్యవహరించే అధికారులను బదిలీ చేయాల్సిందేనని నాడు వాదించిన జగన్.. ఇప్పుడు అధికారులను ఇష్టానుసారం బదిలీ చేస్తున్నారని వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచార సభల్లో ఈసీ నిర్ణయాలను తప్పుపడుతూ మాట్లాడుతున్నారు. ఎన్నికల సమయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులను ఈసీ బదిలీ చేయడం కొత్తేమీ కాదు. అయితే జగన్ వైఖరే వింతగా ఉంది. ఎన్నికల షెడ్యూల్ రాకముందే జగన్ క్షేత్రస్థాయిలో తనకు అనుకూలమైన రెవెన్యూ, పోలీసు అధికారులను నియమించుకున్నారు. అలాగే కీలక పోస్టులను అస్మదీయ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులకు కట్టబెట్టారు. వారి సాయంతో ఎన్నికల్లో గెలవాలని ప్లాన్ వేశారు. అయితే ఏకపక్షంగా వ్యవహరిస్తున్న అధికారులపై ప్రతిపక్షాలు ఫిర్యాదు చేయడంతో ఈసీ చర్యలు తీసుకుంటోంది. సీనియర్ ఐపీఎస్‌లు సహా పలువురిపై బదిలీ వేటు వేసింది. జగన్‌కు ఇది మింగుడు పడటం లేదు. నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ కోసం ఈసీ తీసుకున్న నిర్ణయాలపై జగన్ చేస్తున్న దాడి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఇప్పుడూ మీ రాజ్యాంగమే అమలు కావాలా? దేశంలోని అన్ని రాష్ట్రాలకు వర్తించే భారత రాజ్యాంగం ఏపీలో అమలు కావడానికి వీల్లేదా? ఈసీ నిర్ణయాలను కూడా తిట్టి పోస్తారా' అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

2019లో ఏం జరిగిందంటే...

గత అసెంబ్లీ ఎన్నికల ముందు చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కీలక అధికారులను ఈసీ బదిలీ చేసింది. అప్పట్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా అనిల్ చంద్ర పునేత ఉన్నారు. ఆయన ఒక పక్షానికి అనుకూలంగా ఉండే అధికారి కా దు. కానీ అధికార వర్గాలను భయపెట్టడానికి వైసీపీ నేతలు ఆయనపై ఈసీకి పదేపదే ఫిర్యాదులు చేశారు. ఈసీ ఆయనను బదిలీ చేసి ఎల్వీ సుబ్రమణ్యాన్ని ప్రధాన కార్యదర్శిగా నియమించింది. అలాగే నిఘా విభాగం అధిపతి ఏబీ వెంకటేశ్వరరావును కూడా బదిలీ చే సింది. రైతు రుణమాఫీ పథకానికి సంబంధించి నాలుగు, ఐదు విడతల మొత్తాన్ని రైతుల ఖాతాలకు విడుదల చేయడానికి అప్పటి టీడీపీ ప్రభుత్వం సన్నద్ధమైతే దానిని కూడా ఈసీ అడ్డుకుంది. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం రూ.ఎనిమిదిన్నర వేల కోట్ల నిధులను సమీకరించి ఆర్థిక శాఖ పరిధిలో ఉంచింది. నిధుల విడుదలకు ఆదేశాలు కూడా జారీ చేసింది. ఎన్నికల కోడ్ రావడానికి ముందు ఈ పద్దు కింద రూ.ఐదు వం దల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయి. ఇది పాత పథకం. అంతకుముందు 3 విడతల మొత్తం రైతుల ఖాతాల్లో పడ్డాయి. అయినా ఎన్నికల ముందు ఈ నిధులు రైతులకు పంపడానికి వీల్లేదని ఈసీ ఆపేసింది. అప్పట్లో వైసీపీ నేతలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు సమాచారం. అప్పుడు ఈసీ తీసుకొన్న నిర్ణయాలను ప్రతిపక్ష నేతగా జగన్ సహా వైసీపీ నేతలు ప్రశంసించారు.

నాడు వెంటాడి.. వేధించి..

2019 ఎన్నికల ముందు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వైసీపీ నేతలు అప్పటి అధికారులపై వరుస ఫిర్యాదులు చేశారు. ఢిల్లీలో మకాం వేసి మరీ రోజూ పితూరీలు చెప్పడమే పనిగా పెట్టుకున్నారు. పథకాలకు నిధులు విడుదల చేయకుండా అడ్డుకోవాలని ఫిర్యాదులు చేశారు. దీంతో... అప్పటి సీఎస్, ఇంటెలిజెన్స్ చీఫ్‌లను ఎన్నికల సంఘం బదిలీ చేసింది. ఈ నిర్ణయాన్ని అప్పట్లో జగన్ స్వాగతించారు. ఈసీని ప్రశంసించారు.

ఇప్పుడెందుకు విమర్శలు?

అధికార వైసీపీకి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొన్న డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ సహా పలువురు అధికారులపై ఈసీ బదిలీ వేటు వేసింది. వారి నిర్వాకాలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు, నిర్ధారణ తర్వాతే చర్యలు తీసుకుంది. అయినా సరే... 'అధికారులను ఇష్టారాజ్యంగా బదిలీ చేస్తున్నారు' అని ఇప్పుడు జగన్ వాపోతున్నారు. ఎన్నికలు సవ్యంగా జరుగుతాయా అన్న అనుమానం కలుగుతోందని గగ్గోలు పెడుతున్నారు.

ఇప్పుడూ ఈసీ అవే చర్యలు

ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో అధికార పార్టీ సేవలో తరిస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొంటు న్న పలువురు అధికారులపై ఇటీవల ఈసీ చర్యలు తీసుకుంది. ఐదుగురు ఎస్పీలు, విజయవాడ పోలీస్ కమిషనర్‌తో పాటు అనంతపు రం డీఐజీ అమ్మిరెడ్డి, నిఘా విభాగం అధిపతి పీఎస్ఆర్ ఆంజనేయులు, సిట్ బాధ్యతలు చూసిన విజిలెన్స్ డీజీ కొల్లి రఘురామిరెడ్డి, డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి తదితరులపై వేటు వేసింది. అలాగే కొన్ని పథకాల కు సరిగ్గా పోలింగ్ ముందు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వ అధికారులు తీసుకొన్న నిర్ణయాన్ని కూడా ఈసీ నిలుపుదల చేసింది. పోలింగ్‌కు కొద్ది రోజులే వ్యవధి ఉన్నందున అప్పటి వరకూ నిధుల విడుదల వాయిదా వేయాలని సూచించింది. ఈ నిర్ణయాలనే జగన్ తప్పుబట్టారు. అధికారులను ఇష్టానుసారం బది లీ చేస్తున్నారని, ఎన్నికలు సవ్యంగా జరుగుతాయా అన్న అనుమానం కలుగుతోందని ప్రచారంలో వ్యాఖ్యానించారు. పేదల కోసం నిధులు విడుదల చేస్తుంటే దానినీ అడ్డుకొన్నారని, చివర కు తనను ఉండనిస్తారో లేదోనన్న పరిస్థితి కల్పిస్తున్నారన్నారు. ఎన్నికల కమిషన్ పేరు ఎత్తకపోయినా ఈసీ తీసుకొన్న నిర్ణయాలను ఉద్దేశించే ఆయన ఈ వ్యాఖ్యలు చేశారన్నది సుస్పష్టం. తనను లేకుండా చేసే కుట్రలో ఎన్నికల కమిష న్ కూడా భాగస్వామిగా మారిందనే రీతిలో ఆరోపణలు చేసి, ఈసీపై బురద చల్లుతున్నారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

జగన్ ద్వంద్వ వైఖరి

'తనకు అనుకూలంగా ఉంటే న్యాయం.. వ్యతిరేకంగా ఉంటే అన్యాయం అన్నట్లుగా జగన్ వైఖరి ఉంది. ఎన్నికల వేళ అధికార పార్టీ అధికారాన్ని వాడుకుంటే ప్రతిపక్షం నష్టపోతుంది. ఆ పరిస్థితి రాకుండా చూడటానికి ఈసీ నిర్ణయం తీసుకుంటుంది. కానీ ఈసీ కూడా తా ను చెప్పినట్లే వినాలని జగన్ కోరుకొంటున్నారు' అని రిటైర్డ్ అధికారి ఒకరు విమర్శించారు.


www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతో
ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ

ABN ఆంధ్రజ్యోతి

BIG DEBATE




ఈ రోజు రాత్రి 7 గంటలకు..

బిగ్ డిబేట్ వీడియోల కోసం క్లిక్ చేయండి **Click here**

ఆంధ్రజ్యోతి

కూపన్ నింపండి లక్షలు గెలవండి



ఎవరు గెలిచినా మీదే గెలుపు
రాష్ట్ర స్థాయి కూపన్ నెం.1

పాఠకుని పూర్తి పేరు : ......
డోరు నెంబరు : ...... వీధి పేరు : ......
గ్రామం/పట్టణం : ...... మండలం : ......
జిల్లా : ...... పోస్టల్ పిన్‌కోడ్ : ...... ఫోన్ నెం. ......

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

మొత్తం సీట్లు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.

పూర్తి వివరాల కోసం ఈ QR కోడ్‌ను స్కాన్ చేయండి

ఎన్నికలు - 2024



లోక్‌సభ ఎన్నికలు

లోక్‌సభ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి **Click here**

ఎన్నికలు - 2024



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు

అసెంబ్లీ ఎన్నికల కవరేజ్ కోసం క్లిక్ చేయండి **Click here**



నిండా మునిగిన రైతన్న

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అకాల వర్షం రైతులను ముప్పుతిప్పలు పెట్టింది. ప్రస్తుతం కోతలు జరుగుతుండడంతో ఒబ్బిడి చేసుకున్న ధాన్యాన్ని రక్షించుకునే పనిలో రైతులు ఇబ్బందులు పడ్డారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వర్షం తీవ్ర నష్టాన్ని తెచ్చిపెట్టింది. మండపేట, రావులపాలెం, అంబాజీపేట, కె.గంగవరం మండలాల్లో పలుచోట్ల ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయింది. ధాన్యం పూర్తిగా నీటిపాలవడంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. కొత్తపేటలో ఈదురుగాలులకు కొబ్బరిచెట్లు పడిపోవడంతో ఇళ్లు ధ్వంసమయ్యాయి. కాకినాడ జిల్లా సామర్లకోటలో తేమ శాతం తగ్గేందుకు ఆరబెట్టుకున్న ధాన్యం అకాల వర్షంతో తడిసిపోయింది. టార్పాలిన్లతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు.

అకాల వర్షంతో అలజడి

పలు జిల్లాల్లో పిడుగులు.. నలుగురు మృత్యువాత

- మృతుల్లో తల్లీ కూతుళ్లు
- కొబ్బరిచెట్టు కూలి రైతు దుర్మరణం
- మునిగిన రాజమండ్రి నగరం
- ఎంపీ భరత్ అనాలోచిత చర్యలే కారణమని స్థానికుల ఆవేదన
- తూర్పులో నీటిపాలైన ధాన్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో అకాల వర్షాలు అలజడి రేపాయి. మంగళవారం ఉదయం భారీగా ఉష్ణోగ్రతలు నమోదైనా సాయంత్రానికి వాతావరణం పూర్తిగా మారిపోంది. బలమైన ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిశాయి. ఏలూరుజిల్లాలో.. ఏలూరుతోపాటు జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో అరటి తోటలకు భారీగా నష్టం వాటిల్లింది. చెట్లు నేలవాలాయి. విద్యుత్ స్తంభాలు కూలి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏలూరు జిల్లా లింగపాలెం మండలంలోని యడవల్లి గ్రామంలో పిడుగుపాటుకు గురై పరసా రామారావు(45) అనే వ్యవసాయ కూలీ మృతి చెందారు. జంగారెడ్డిగూడెం మండలం జొన్నవారిగూడెం కాలనీకి చెందిన కరిపోలు నాగేశ్వరరావు(55) అనే మేకల కాపరి తాడువాయి వద్ద పిడుగు పడడంతో మృతి చెందారు. పశ్చిమగోదావరి జిల్లా అంతలా జల్లులు పడటంతో రైతులు పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఆరబెట్టిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు నానా తిప్పలుపడ్డారు. వర్షాలకు పశ్చిమగోదావరి జిల్లా శృంగవృక్షం గ్రామానికి చెందిన రైతు నిమ్మన శ్రీనివాస్(45) పొలంలో ఆరెబట్టిన ధాన్యం తడిసిపోకుండా కాపాడేందుకు వెళ్తుండగా, మార్గమధ్యంలో కొబ్బరిచెట్టు కూలి తలపై పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఊటుకూరు గ్రామ పరిధిలోని పొలాల్లో మంగళవారం సాయంత్రం పిడుగు పడి గ్రామానికి చెందిన బొందల నాగేంద్రం(52), యంద్రవల్లి నాగరాణి(25) అనే తల్లీ కూతుళ్లు మృతి చెందారు. తమ సొంత మొక్కజొన్న తోటలో పనులు ముగించుకొని, కొద్ది సేపట్లో ఇల్లు చేరుకుంటారనగా ఈ దుర్ఘటన జరిగింది.

మ్యాంగో షవర్స్

ఉమ్మడి కృష్ణా జిల్లాలోని నందిగామ, తిరువూరు, మచిలీపట్నం, గుడివాడ, పామర్రులలో భారీ వర్షం కురిసింది. థండర్‌స్టార్మ్ యాక్టివిటీలో భాగంగానే వాతావరణం ఈవిధంగా చల్లబడిందని వాతావరణ శాఖ నిపుణులు చెబుతున్నారు. ఈ వర్షాలను మ్యాంగో షవర్స్ అని వ్యవహరిస్తారని తెలిపారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులపాటు ఉంటుందని, తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతాయని పేర్కొన్నారు.

ఎంపీ అనాలోచిత చర్యలతో..

రాజమహేంద్రవరంలో కురిసిన భారీ వర్షానికి ఒక కారు కొట్టుకుపోయింది. స్థానిక కృష్ణానగర్‌లో ఒక ఇంటి ముందు పార్క్‌చేసిన కారు నీటిలో తేలి కొంతదూరం కొట్టుకు వెళ్లింది. ఇలా వర్షానికి నగరమంతా జలమయం కావడం వందలాది బైక్‌లు నీటమునగడం, కారు కొట్టుకుపోవడం ఇదే తొలిసారి. ఇటీవల రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సాధారణ నిధులను వినియోగించి వైసీపీ ఎంపీ భరత్‌రామ్ అనాలోచితంగా నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు హైట్‌చేసి ఫుట్‌పాత్‌లు పెంచారు. దీంతో రోడ్డుపై నీరు డ్రైనేజీలలోకి వెళ్లేందుకు మార్గం లేకుండా పోయింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి నగరమంతా ముంపుబారిన పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లు కూలి విద్యుత్ వైర్లు తెగి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది సుమారు 4 గంటలపాటు జనజీవనం స్తంభించింది.


రాజమహేంద్రవరంలోని కృష్ణానగర్‌లో వర్షపునీటిలో కొట్టుకుపోతున్న కారు

అటు ఎండ.. ఇటు వాన

- చల్లబడిన వాతావరణం..

అమరావతి, విశాఖపట్నం, మే 7(ఆంధ్రజ్యోతి): ఉదయం తీవ్రమైన ఎండ. సాయంత్రం 4 గంటలకల్లా వాతావరణంలో అనూహ్య మార్పుతో వర్షాలు కురిశాయి. విదర్భ నుంచి తమిళనాడు వరకు విస్తరించిన ద్రోణి ప్రభావంతో మంగళవారం రాష్ట్రంలో అనేక చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు, పిడుగులతో కూడిన వర్షాలు పడ్డాయి. మధ్యకోస్తాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాతావరణం చల్లబడింది. సాయంత్రం 6 గంటల వరకు తూర్పుగోదావరి జిల్లా వేమగిరిలో 124.5, కోనసీమ జిల్లా మండపేటలో 120.5, రాజమండ్రిలో 92, ఏలూరు జిల్లా నూజివీడులో 73.5, కృష్ణా జిల్లా మచిలీపట్నం, కోనసీమ జిల్లా ఆలమూరులో 73 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదైంది. మరోవైపు కర్నూలు జిల్లా లద్దగిరిలో 43.4, ప్రకాశం జిల్లా యండపల్లిలో 43.2, కడప జిల్లా మద్దూరు, తిరుపతి జిల్లా మంగనెల్లూరులో 42.9, నెల్లూరు జిల్లా మనుబోలు, నంద్యాల జిల్లా మహానందిలో 42.8 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ద్రోణి కారణంగా మరో రెండు రోజులు రాష్ట్రంలో అక్కడక్కడా వర్షాలు పడతాయని, పిడుగులు పడే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. బుధవారం శ్రీకాకుళం, అల్లూరి, పల్నాడు, బాపట్ల, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్
(మహారత్న కంపెనీ)
పెట్రోలియం హౌస్, 17, జంషెడ్‌జీ టాటా రోడ్, ముంబై- 400020

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ మెసర్స్ హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్, నమోదిత కార్యాలయం పెట్రోలియం హౌస్, 7, జంషెడ్‌జీ టాటా రోడ్, ముంబై-400 020 మరియు దీని యొక్క ఒక ప్రాజెక్ట్ కార్యాలయం ఏలూరు జిల్లా, దీని యొక్క తగు విధంగా నియోగించబడినట్టి అటార్నీ ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతుంది, దీని యొక్క సూచనల క్రింద నేను దిగువ బహిరంగ ప్రకటన జారీ చేస్తున్నాను.

నా క్లయింట్ ఆంధ్రప్రదేశ్, ఏలూరు జిల్లా, ఎస్ఆర్‌వో భీమడోలు, దెందులూరు మండలం, ముప్పవరం గ్రామంలోని దిగువ తెలిపిన షెడ్యూలులో తెలిపిన భూమిని 1. శ్రీమతి పాపోలు పద్మావతి భర్త మాణిక్యాల రావు 2. శ్రీ కూరెళ్ల భాస్కర రావు తండ్రి వెంకట శేషగిరి రావు, 3. శ్రీమతి గౌతు జయలక్ష్మీ దేవి భర్త అన్నాజీ రావు, 4. శ్రీమతి కూరెళ్ల సీతారత్నం భర్త భాస్కర రావు నుండి కొనుగోలు చేయాలని ప్రతిపాదిస్తున్నారు.

I. శ్రీమతి పాపోలు పద్మావతి - భూమి యజమానులు - పట్టాదారులు యొక్క ఆస్తులు
మొత్తం **ఎ.9.70** సెంట్ల విస్తీర్ణం కలిగిన ఖాళీ వ్యవసాయ భూమి, 1. సర్వే నం. 7-5 విస్తీర్ణం ఎ.3-45 సెంట్లు, 2. సర్వే నం. 7-4 విస్తీర్ణం ఎ.1.96 సెంట్లు, 3. సర్వే నం. 13-3డి విస్తీర్ణం ఎ.4.29 సెంట్లు వాటి సంబంధిత సరిహద్దులతో ఆస్తి యావత్తు.

II. శ్రీ కూరెళ్ల భాస్కర రావు - భూమి యజమానులు - పట్టాదారులకు చెందిన ఆస్తులు
ఎ.10.55 సెంట్ల మొత్తం విస్తీర్ణం కలిగిన ఖాళీ వ్యవసాయ భూమి ఆస్తి. 1. సర్వే నంబర్ 7-3 విస్తీర్ణం ఎ2.86 సెంట్లు, 2. సర్వే నంబర్ 7-2 విస్తీర్ణం ఎ.1.52 సెంట్లు, 3. సర్వే నం. 13-3డి, విస్తీర్ణం ఎ.3.02 సెంట్లు. 4. సర్వే నం. 13-2 ఎ.3.15 సెంట్లు విస్తీర్ణం వాటి సరిహద్దులతో ఆస్తి యావత్తు.

III. శ్రీమతి గౌతు జయలక్ష్మీ - భూమి యజమానులు - పట్టాదారులకు చెందిన ఆస్తులు
ఎ.6.92 సెంట్ల విస్తీర్ణం కలిగిన మొత్తం ఖాళీ వ్యవసాయ భూమి. 1. సర్వే నం. 11/1 విస్తీర్ణం ఎ.3.12 సెంట్లు, 2. సర్వే నం.9 విస్తీర్ణం ఎ.3.59 సెంట్లు, 3. సర్వే నం.11-2/1 విస్తీర్ణం ఎ.0.21 సెంట్లు వాటి సంబంధిత సరిహద్దులతో ఆస్తి యావత్తు.

IV. శ్రీమతి కూరెళ్ల సీతా రత్నం - భూమి యజమానులు - పట్టాదారుల ఆస్తులు
ఎ.3.08 సెంట్ల విస్తీర్ణం కలిగిన మొత్తం ఖాళీ వ్యవసాయ భూమి. 1. సర్వే నం. 7-1 విస్తీర్ణం ఎ.3.08 సెంట్లు వాటి సంబంధిత సరిహద్దులతో ఆస్తి యావత్తు.

భూమి యజమానుల సమ్మతి మరియు అగ్రిమెంట్‌తో పైన తెలిపిన భూములు కొనుగోలు చేయబడుతున్నాయి.

అందువలన, పైన తెలిపిన షెడ్యూలులోని భూములపై ఎవరేని వ్యక్తులకు ఏదేని హక్కు లేదా క్లెయిమ్ లేదా టైటిల్, అమ్మకం ఒప్పందాలు, స్వాధీనం లేదా ప్రయోజనం వగైరా కలిగినచో సదరు వాదములు లేదా ఏదేని ఇతర కారణాలు తెలియజేస్తూ ఈ ప్రకటన ప్రచురణ తేదీ నుండి 30 రోజుల్లోగా అతని/ఆమె ఆక్షేపణలకు దాఖలు చేయవలసిందిగా ఇందుమూలంగా సాధారణ ప్రజలను కోరడమైనది మరియు నిర్దిష్ట కాలంలోగా దిగువ సంతకందారుకు స్వయంగా ఎటువంటి ఆక్షేపణలు అందని పక్షంలో, నా క్లయింట్-కార్పొరేషన్ దీనికి సంబంధించి ఎటువంటి అభ్యంతరాలు లేనట్లుగా భావిస్తుంది మరియు నిర్దిష్ట కాలం తదుపరి కార్పొరేషన్ భూమి యజమానులతో సదరు భూముల రిజిస్ట్రేషన్‌కు ముందుకు సాగుతారు మరియు ప్లాంట్ నిర్మాణానికి చర్యలు మొదలు పెడతారు.

శ్రీ కానాల రామకృష్ణ, అడ్వకేట్
శివ ఎస్టేట్, బి-బ్లాక్, ఫ్లాట్ నం.బి4,
మొదటి అంతస్తు, లునాని బిల్డింగ్స్ వెనుక వైపు, పాత గట్టు రోడ్, శాతవాహన నగర్,
ఏలూరు-534003, ఏలూరు జిల్లా, మొబైల్ నం. 8919463189
ఇమెయిల్ ఐడి: rkkanala9999@gmail.com

/hpcl | /hpcl | /hpcl
www.hindustanpetroleum.com

పురాణాల్లో కంటే పెద్ద రాక్షసుడు జగన్

- అతని పాలన అంతానికే త్రిమూర్తుల కూటమి: రఘురామ

ఆకివీడు, మే 7: పురాణ రాక్షసులకంటే పెద్ద రాక్షసుడైన జగన్ పాలనను అంతమొందించడానికే త్రిమూర్తులైన ప్రధాని మోదీ, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ కూటమిగా ఏర్పడ్డారని నరసాపురం ఎంపీ, ఉండి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో మంగళవారం జయహో బీసీ సమావేశంలో ఆయన మాట్లాడారు. 'తాత-ముత్తాతలు ఇచ్చిన ఆస్తులపై జగన్ ఫొటో వేసుకోవడంతోపాటు వాటిని స్వాధీనం చేసుకొని అమ్ముకోవడానికే భూహక్కు చట్టం తీసుకొచ్చాడు. మద్యంపై వేల కోట్లు అప్పుగా తెచ్చి దోచుకున్నాడు. జగన్‌కంటే పెత్తందారు మరొకరు ఉండరు. బాబాయిని చంపిన వ్యక్తికి మద్దతు పలుకుతున్నందునే చెల్లెళ్లు షర్మిల, సునీతలు జగన్‌కు ఓటు వేయద్దని చెబుతున్నారు. జగన్ అరాచకాలు చూడలేక తల్లి విజయమ్మ అమెరికా వెళ్లిపోయింది. బీసీలకు రక్షణకు చంద్రబాబు చట్టం తెస్తున్నారు. కూటమి 150 స్థానాల్లో గెలుస్తుంది. జూన్ 4న వైసీపీ కాలగర్భంలో కలిసిపోతుంది' అని రఘురామ అన్నారు. పలువురు వైసీపీ నాయకులు ఈ సందర్భంగా టీడీపీలో చేరారు.

భావితరాల భవిష్యత్తు కోసం లోకేశ్‌ను గెలిపించండి

- మంగళగిరిలో లోకేశ్ కుటుంబ సభ్యుల ప్రచారం


మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించిన నారా లోకేశ్ కుటుంబ సభ్యులు

మంగళగిరి సిటి, మే 7: భావితరాల భవిష్యత్తు బాగుండాలంటే ప్రజలంతా నారా లోకేశ్‌కు అండగా నిలిచి భారీ మెజార్టీతో గెలిపించాలని లోకేశ్ కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళగిరిలో మంగళవారం వారు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. తొలుత శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అతర్వాత ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గారపాటి లోకేశ్వరీ, నందమూరి మాధవి మణి, గారపాటి శ్రీనివాస్, కంఠమనేని శ్రీనివాస్ ప్రసాద్, శారదా దుర్గాప్రసాద్, కవిత ప్రసాద్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో జస్టిస్ శేషసాయి


తిరుమల ఆలయం ముందు జస్టిస్ సురేంద్ర, జస్టిస్ శేషసాయి

తిరుమల, మే 7 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శేషసాయి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేంద్ర మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి, ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

కత్తితో నరికి.. సుత్తితో కొట్టి..!

- భార్యను దారుణంగా చంపిన భర్త

నెల్లూరు(క్రైం), మే 7: జీవితాంతం తోడుండాల్సిన భర్తే.. భార్యను దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన మంగళవారం ఉదయం నెల్లూరు నగరంలోని భగత్‌సింగ్ కాలనీలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు, కోవూరు షుగర్ ఫ్యాక్టరీ ప్రాంతానికి చెందిన పి.అమల(37)కు గతంలోనే వివాహం జరిగింది. ఆమెకు ఓ కుమారుడు ఉన్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో విడాకులు తీసుకొని, కుమారుడితో కలిసి ఉంటోంది. ఈ క్రమంలో బాలాజీనగర్‌కు చెందిన కె.మునిరత్నంతో ఆమెకు ఐదేళ్ల క్రితం పెద్దలు రెండో వివాహం చేశారు. వీరికి ఓ కుమారుడు జన్మించాడు. దంపతుల మధ్య గొడవలు ప్రారంభమవడంతో విడిపోయారు. అమల మొదటి కుమారుడితో కలిసి భగత్‌సింగ్ కాలనీలో నివాసం ఉంటోంది. మునిరత్నం మరో కుమారుడితో బాలాజీనగర్‌లోని తల్లిదండ్రుల వద్ద ఉంటున్నాడు. ఈ క్రమంలో అమల భర్తపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. తన రెండో కుమారుడినీ అప్పగించాలని భర్తను కోరగా.. కేసు రాజీ చేసుకుంటే ఇస్తానని మునిరత్నం చెప్పేవాడు. ఈ క్రమంలో అప్పుడప్పుడు భార్య వద్దకు వచ్చి కేసు రాజీ చేసుకోవాలని కోరేవాడు. అంతేకాక మరొకరితో వివాహేతర సంబంధం ఉందని, కేసు రాజీ పడకుంటే చంపేస్తానని పలుమార్లు బెదిరించాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి అమలను చంపేందుకు యత్నించాడు. దీంతో ఆమె కుమారుడిని తీసుకుని పారిపోయి ఉదయానికి ఇంటికి వెళ్లింది. అప్పటికే ఇంట్లో ఉన్న మునిరత్నం ఆమెపై ఒక్కసారిగా కత్తితో దాడి చేసి, సుత్తితో బలంగా తలపై మోదాడు. అమల కేకలు విని స్థానికులు వెళ్లి చూసేసరికి మునిరత్నం కత్తి, సుత్తి చేతిలో పట్టుకొని.. దాన్ని నేనే చంపేశాను అంటూ బయటకు వచ్చాడు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ ఎం.బాబి ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కేజ్రీవాల్ కొత్తకేసు

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీపార్టీ అధినాయకుడు అరవింద్ కేజ్రీవాల్ నిర్బంధపర్వం కొత్తమలుపులు తిరుగుతోందే తప్ప, ముగింపునకు రావడం లేదు. ఎన్నికల ప్రచారం కోసం తాత్కాలిక బెయిల్ ఇచ్చే విషయం పరిశీలిస్తామని ఒక సానుకూల సంకేతం ఇచ్చిన సుప్రీంకోర్టు, మంగళవారం నాడు, ఏ నిర్ణయం ప్రకటించకుండానే విచారణను వాయిదా వేసింది. వచ్చే గురువారమో లేక వచ్చేవారమో తిరిగి విచారిస్తామని చెప్పింది. ఈ లోగా, అరవింద్ కేజ్రీవాల్ మీద మరో అభియోగంపై విచారించడానికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)కు ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ అనుమతించారు. శిక్ష అనుభవిస్తున్న సిక్కు మిలిటెంటును విడుదల చేయించడానికి ఖలిస్తాన్ అనుకూల బృందాల నుంచి హవాలా మార్గంలో ఆప్ పార్టీ నాయకుడు నిధులు తీసుకున్నారన్నది అభియోగం.

మద్యం కుంభకోణాన్నే బూటకంగా చెబుతూ, తనది రాజకీయ నిర్బంధమేనని వాదిస్తున్న కేజ్రీవాల్, నిర్బంధంలో ఉంటూ కూడా ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇదొక విచిత్రమైన, ప్రత్యేకమైన సన్నివేశం. మును పెన్నడూ ఏ ముఖ్యమంత్రీ జైలు నుంచి పరిపాలన సాగించలేదు. ఇది 'ఆప్' పార్టీకి అప్రదిష్ఠాత్మకమో, రాజకీయ కక్ష సాధిస్తున్నారన్న ఆరోపణ దృష్ట్యా కేంద్ర అధికారపార్టీకి అవమానకరమో బోధపడడం లేదు. మద్యం కుంభ కోణంలో అరెస్టయిన తక్కిన నిందితుల కంటె, కేజ్రీవాలే కేంద్ర పెద్దలకు ముఖ్యమని, రాజకీయ స్పర్థతో మొదలుకుని వ్యక్తిగత వైరం దాకా అన్నీ ఈ కేసులో ఇమిడి ఉన్నాయని పరిశీలకులు చెబుతారు.

అరవింద్ కేజ్రీవాల్, అన్నా హజారే మొదలైనవారు పది, పన్నెండు సంవత్సరాల కిందట నిర్వహించిన అవినీతి వ్యతిరేక ఉద్యమం కేంద్రంలో ప్రభుత్వం మారడానికి, 'ఆప్' పార్టీ అవతరణకూ కూడా ఉమ్మడి నేపథ్యం. కాంగ్రెస్ ప్రతిష్ఠను తీవ్రంగా మలినపరచిన ఆ నాటి ఉద్యమం, కేజ్రీవాల్‌కు మచ్చలేని నూతన తరం నాయకుడిగా గుర్తింపు ఇచ్చింది. ఆయన ఆచరణ రాజకీయరూపం తీసుకుని, దేశరాజధానిలో గట్టి బలాన్ని సమకూర్చుకుంది. దేశమంతా జైత్రయాత్ర చేస్తున్న బీజేపీకి ఢిల్లీలో మాత్రం ఆదరణ దక్కడం లేదు. పోనీ, ఢిల్లీకి పరిమితమై ఉంటేనైనా ఊరుకునేవారేమో కానీ, 'ఆప్' పంజాబ్‌కు, గోవాకు, గుజరాత్‌కు కూడా విస్తరిస్తూ వచ్చింది. కాంగ్రెస్ వంటి భ్రష్ట ప్రత్యామ్నాయం మీద సాధ్యపడుతున్న అవలీల ఆధిక్యం, వేగంగా ఎదుగుతున్న 'ఆప్' మీద సాధ్యపడదని, అది గట్టి జాతీయ ప్రత్యామ్నాయం కాగలదని బీజేపీలో బెరుకు మొదలైనట్టుంది. ఇవన్నీ ఒక ఎత్తు అయితే, జాతీయస్థాయిలో ఏర్పడిన ప్రతిపక్ష కూటమి 'ఇండియా'లో 'ఆప్' భాగస్వామి కావడం మరో ఎత్తు. అవినీతి రాహిత్యానికి పర్యాయపదంగా జనంలో 'ఆప్'కు ఉండిన ప్రసిద్ధిని దెబ్బ తీయడమే లక్ష్యంగా మద్యం కుంభకోణం దర్యాప్తు సాగిందని, గుజరాత్, గోవా, ఢిల్లీ, పంజాబ్‌లలో ప్రచారం నుంచి దూరం చేయడానికే అరెస్టు జరిగిందని 'ఆప్' ప్రతినిధులు చేసే ఆరోపణలు ఆలోచించదగ్గవే. కుంభకోణంలో అవినీతి ఎంత ఉన్నదో కానీ, ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ ప్రయోజనాల పాత్ర చిన్నదేమీ కాదు. ఎక్కడ సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేస్తుందో అన్న భయమే, ఇప్పుడు మరో కొత్త కేసును వెలికితీయడానికి కారణమని వాదిస్తున్నవారున్నారు. కొత్త కేసులో కనిపిస్తున్న కేంద్రం పట్టింపు చూసి, సుప్రీంకోర్టే మంగళవారం బెయిల్ ఇవ్వడానికి జంకిందేమోనని అనుమానిస్తున్నవారూ ఉన్నారు. పరిణామాల మధ్య సంబంధాలను ఎవరికి తోచినరీతిలో వారు వ్యాఖ్యానించకుండా ఆపలేము.

1990ల మొదట్లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్న మణీందర్ సింగ్ బిట్టా లక్ష్యంగా చేసుకుని, ఢిల్లీలో ఒక బాంబు పేలుడు జరిగింది. బిట్టా తప్పించుకున్నారు కానీ, పేలుడులో 9 మంది మరణించారు. లూధియానాలో ఒక ఇంజనీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ దేవిందర్‌పాల్ భుల్లార్‌ను ఆ పేలుడులో దోషిగా 2001లో టాడా కోర్టు నిర్ధారించింది. మొదట మరణశిక్ష పడినా, తరువాత అది యావజ్జీవ శిక్షగా మారింది. పాతికేళ్లకు పైగా నిర్బంధంలో ఉన్న భుల్లార్‌ను విడుదల చేయాలని అకాలీదళ్ చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. దేశవిదేశాల్లోని ఖలిస్థాన్ వాదులు, సిక్కు హక్కుల సంఘాలవారు కూడా భుల్లార్ విడుదల కోరుతున్నారు. 'సిక్స్ ఫర్ జస్టిస్' అనే ప్రవాస సిక్కు సంస్థ కూడా ఆ సంఘాలలో ఒకటి. దానిని భారత్ నిషేధించింది కూడా. భారత్ భద్రతాసంస్థలు హత్యచేయడానికి ప్రయత్నించాయని ఈ మధ్య అమెరికా ప్రభుత్వం చెబుతున్న గురుపత్వంత్ సింగ్ పన్నూన్ దానికి నాయకుడు. భుల్లార్ విడుదల కోసం తాను కేజ్రీవాల్‌కు డబ్బు ఇచ్చానని ఆ పన్నూన్ ఒక వీడియోలో చెప్పాడని, దాని ఆధారంగా ఇప్పుడు విచారణ చేయాలని ఎన్ఐఏ కోరుతోంది. నిజానికి, ఈ కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్ కలసి భుల్లార్ విడుదలకు ఆటంకాలు కల్పిస్తున్నారని అకాలీదళ్ ఈ మధ్యన కూడా ఆరోపించింది. నిషిద్ధ సంస్థగా ప్రకటించిన ఎస్ఎఫ్‌జె ప్రతినిధి చేసిన ఆరోపణకు విలువ ఎట్లా ఇస్తారని, అది తప్ప మరో ఆధారమెక్కడుందని ఆప్ వాదిస్తోంది.

మంగళవారం నాటి గుజరాత్ పోలింగ్‌కు ముందటి ప్రచారంలో కేజ్రీవాల్ పాల్గొనలేకపోయారు. గురువారమో, ఆ తరువాతో బయటకు వచ్చి ఢిల్లీ ప్రచారానికి అందుకోగలుగుతారా అన్నది పెద్ద ప్రశ్న.

ప్రభుత్వం బలపడకూడదు, ప్రైవేటు బలహీనపడకూడదు అనే సిద్ధాంతం ఇంకా ఎంత కాలం? కార్పొరేట్ యజమానులకు రాయితీలు కల్పించిన సొమ్ముతో నిరుద్యోగ నిర్మూలనకు పటిష్ఠ వ్యూహ రచన చేయలేరా? అతి సంపన్నులపై సంపద పన్ను విధించాలని నిపుణుల నుంచి వస్తున్న విజ్ఞతాయుతమైన సూచన పాలకులకు వినిపించదా?

నిరుద్యోగం ఓ నిప్పుల కొలిమి...!

ఇండియాలో ఉద్యోగం తెల్ల రాళ్ల రాశిలోని బియ్యపు గింజ వంటిది. నీడ పట్టు పనులు బహుతక్కువ. మామూలుగానే నిరుద్యోగం భారీ ఎత్తున తాండవిస్తుంటుంది. అందుచేత జనసామాన్యం ఉద్యోగాల కోసం కలగనరు. కాయకష్టం చేసి కడుపు నింపుకునేవారే ఎక్కువ. దేశ కార్మిక శక్తిలో 90 శాతం మంది అసంఘటిత రంగంలోనే ఉన్నారు. ఆధునిక సాంకేతికత ప్రజల నిత్య జీవితాల్లో ఉనికిని పెంచుకున్న కొద్దీ సంప్రదాయ వృత్తులు నాశనమైపోవడం తెలిసిందే. వ్యవసాయం గిట్టుబాటుకాక దాని అనుబంధ వృత్తులు కూడా చతికిలబడి పల్లెల నుంచి పట్టణాలకు నగరాలకు వలసలు ముమ్మరించి చాలా కాలమయింది.

పదేళ్ల పాలనలో పాతిక కోట్లమంది పేదరికం నుంచి బయటపడ్డారని, తమను మళ్ళీ గెలిపిస్తే వచ్చే ఐదేళ్ల నాటికి దేశాన్ని ప్రపంచంలో మూడవ అతి పెద్ద ఆర్థిక శక్తిగా చేస్తామని బీజేపీ ఘనంగా చెప్పుకొంటున్నది. ప్రధాని మోదీ అంచనా వేస్తున్నట్టు 2029 నాటికి ప్రపంచంలో మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా అవతరించినప్పటికీ పేద దేశంగానే కొనసాగుతుందని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఈ మధ్యనే తెలియజేశారు. తలసరి ఆదాయంలో మనం ప్రపంచంలో 139వ స్థానంలో ఉన్నామని, అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే సమాఖ్య వ్యవస్థ వర్ధిల్లి, రాష్ట్రాలు బలంగా ఉండాలని, చట్టబద్ధ పాలన నెలకొనాలని, స్వతంత్ర వ్యవస్థలుండాలని సుబ్బారావు గుర్తుచేస్తున్నారు.

లోక్‌నీతి సిఎస్‌డిఎస్ ప్రస్తుత (2024) లోక్‌సభ ఎన్నికల కోసం జరిపిన విస్తృత సర్వేలో 62శాతం మంది ఉద్యోగాలు దొరకడం లేదని వాపోయారు. సర్వే చేసినవారిలో ఎక్కువగా ముస్లింలు (67శాతం) ఉద్యోగావకాశం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు. వారి మాదిరిగానే హిందువులలోని ఎస్సీలు, బీసీలు (63 శాతం) ఎస్టీలు (57శాతం) నిరుద్యోగంలో మగ్గుతున్నారని సర్వే వివరించింది. అగ్రవర్ణాల్లో 57 శాతం మంది ఉద్యోగాలు దొరకడం కష్టంగా ఉన్నట్టు చెప్పారు. అదే సమయంలో వారిలోని 12 శాతం మంది సులభంగానే దొరుకుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మహిళలకు ఉద్యోగం మరింత కష్టంగా ఉంటోంది. ఏటా కోటి ఏభై లక్షల మంది ఉద్యోగార్థులు అదనంగా వచ్చి చేరుతున్న దేశంలో నిరుద్యోగాన్ని అంతమొందించడం ఆషామాషీ చర్యలతో సాధ్యమయ్యేది కాదు. పేద, మధ్యతరగతి యువతకు నాణ్యమైన విద్య నేర్పించి ఆధునిక ఉపాధి వ్యాపకాలకు అవసరమయిన ప్రత్యేక నిపుణతలు చేకూర్చవలసి ఉంది. అందుకే విద్య, వైద్య, ఆరోగ్య రంగాల్లో ప్రభుత్వ వ్యయం బాగా పెరగాలని ఆర్థికవేత్తలు పదేపదే చెబుతున్నారు. ప్రైవేటు స్పర్థతో పులకించిపోతున్న పాలకులకు ఇది రుచించడం లేదు.

నిరుద్యోగం పెరుగుదల రేటు 45 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా 2017–18లో 6.1శాతానికి ఎగబాకింది. కోవిడ్ ముమ్మరించిన 2020 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 20.8 శాతానికి చేరుకొని విలయ నాట్యమాడింది. ఆ కాలంలో పట్టణాల నుంచి పల్లెలకు ఎదురు వలసలు విజృంభించాయి. ఆ విపత్కాలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం విశేషంగా తోడ్పడింది. ఎంతగా అంటే



2019లో ఈ పథకం ద్వారా 260 కోట్ల వ్యక్తి దినాల ఉపాధి పని కల్పించగా 2021లో అది 390 కోట్ల వ్యక్తి దినాలకు పెరిగింది. భూమిలేని నిరుపేద గ్రామీణ వ్యవసాయ కార్మికులకు పని హక్కును కల్పించడానికి యూపీఏ ప్రభుత్వం ఆవిష్కరించిన ఈ పథకాన్ని బలహీనపరచేందుకు కేంద్రంలోని అధికారపక్షం శతవిధాలా ప్రయత్నించింది. ఈ పథకానికి ఆధార్ అనుసంధానమనే గుదిబండను వేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించినా ఫలితం లేకపోయింది. దీనికి బడ్జెట్లో కేటాయింపుల కోత వంటి చర్యలకూ ప్రభుత్వం పాల్పడింది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన పెద్ద నోట్ల రద్దు పథకం, వస్తు సేవల పన్ను (జీఎస్టీ) నిరుద్యోగాన్ని, నిర్వ్యాపారాన్ని పెంచాయి. కింది స్థాయి కార్మికుల పనులను హరించివేశాయి. అనాలోచితంగా ప్రకటించిన ఆకస్మిక లాక్‌డౌన్ అసంఘటిత రంగ కార్మిక లోకాన్ని కష్టాల కొలిమిలో తోసివేసింది. నిరుద్యోగాన్ని తగ్గించడానికి శాస్త్రీయమైన దారులు అనుసరించని మోదీ ప్రభుత్వం దానిని అంచనా వేయడానికి అంతవరకు గల పద్ధతులను కూడా రద్దు చేసింది. ప్రభుత్వం చేపట్టే వార్షిక ఉద్యోగ నిరుద్యోగ సర్వేకి 2017లో స్వస్తి చెప్పింది. కార్మిక విభాగం (లేబర్ బ్యూరో) మూడు మాసాలకు ఒకసారి నిర్వహించే వ్యాపార సంస్థల సర్వేని కూడా మాన్పించింది. ఆచరణలో నిరుద్యోగం లోతులు తెలుసుకోడానికి ఏర్పాటు చేసిన శాస్త్రీయ పద్ధతులకు నిలువ నీడ లేకుండా చేస్తూ నిరుద్యోగానికి సంబంధించి పూర్తి వివరాలు అందుబాటులో లేవని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ నిస్సహాయత ప్రకటించడం విడ్డూరంగా లేదూ?

ఉద్యోగాలు ఎప్పటికీ దొరక్కపోవడంతో విసిగిపోయిన కోట్లాది నిరుద్యోగులు దుర్భరమైన ఆర్థిక బాధలను తట్టుకోడానికి స్వయం ఉపాధులను ఆశ్రయిస్తున్నారని స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా–2023 నివేదిక నిగ్గుదేల్చింది. కార్మికులకు విశేషంగా పనులు కల్పించగల తయారీ రంగాన్ని బలోపేతం చేయడానికి మోదీ ప్రభుత్వం 'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మ నిర్భర్ భారత్' పథకాలను ప్రారంభించింది. ఇవి వచ్చిన తర్వాత 2016–2021 మధ్య తయారీ రంగంలో ఉద్యోగాలు సగానికి పడిపోయాయి. కోవిడ్‌కి ముందే దేశ తయారీ రంగం కునకడం మొదలు పెట్టింది. ఉద్యోగం ముఖం చాటు చేసినప్పుడు మెజారిటీ కార్మికులు నిర్మాణ రంగాన్ని ఆశ్రయిస్తారు. కోట్లాదిమంది దీనిపైనే ఆధారపడి బతుకుతున్నారు. దేశంలో ఆర్థిక వ్యత్యాసాలు బ్రిటిష్ పాలనలో కంటే గత పదేళ్ళలోనే ఎక్కువని ప్రపంచ అసమానతల లాబ్ తరఫున ఇటీవల అధ్యయనం జరిపిన నలుగురు ప్రఖ్యాత ఆర్థికవేత్తలు నిర్ధారించారు. చదువుకుంటే ఉద్యోగం వస్తుందనేది ఇండియాలో రుజువు కావడం లేదని, ఉన్నత చదువులు చదివే కొద్దీ కొలువు దూరమవుతున్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ తాజా నివేదిక స్పష్టం చేసింది. దేశంలోని నిరుద్యోగుల్లో 83 శాతం మంది యువతేనని వీరిలో 65 శాతం మంది చదువుకున్నవారేనని ఈ నివేదిక వెల్లడించింది. నిరుద్యోగుల్లో విద్యావంతులు 2000లో 18 శాతం కాగా 2022లో 35 శాతానికి పెరిగారు.

కేంద్ర ప్రభుత్వంలో ఉన్నాయని భావిస్తున్న 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయడానికి ప్రధానికి చేతులు ఎందుకు రావడం లేదు? కంటి తుడుపుగా 60, 70 వేల నియామక పత్రాలు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వం బలపడకూడదు, ప్రైవేటు బలహీనపడకూడదు అనే సిద్ధాంతంతో ఎంతకాలం ఇలా ఈ దేశాన్ని పీడిస్తారు? కార్పొరేట్ యజమానులకు ప్రభుత్వం రూ.16 లక్షల కోట్ల మేరకు రాయితీలు కల్పించినట్టు ప్రతిపక్షం లెక్క చెబుతున్నది. ఆ సొమ్ముతో నిరుద్యోగ నిర్మూలనకు, గరిష్ఠ స్థాయిలో యువశక్తి సద్వినియోగానికి పటిష్ఠ వ్యూహ రచన చేయలేరా? 2014–15కు 2022–23కు మధ్య దేశంలోని పైస్థాయిలో ఒక్క శాతం మంది ఆదాయ వాటా ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనంత అత్యధికమని తేలింది. ఈ నేపథ్యంలో అతి సంపన్నులపై సంపద పన్ను విధించాలని నిపుణుల నుంచి వస్తున్న విజ్ఞతాయుతమైన సూచన పాలకులకు వినిపించదా?

■ జి. శ్రీరామమూర్తి
సీనియర్ జర్నలిస్ట్

చంద్రబాబు ముద్ర అద్వితీయం!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'మీకు కొద్ది సేపటిలో ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజపేయి నుంచి ఫోన్ వస్తుంది. ఆయన ప్రతిపాదనను మీరు అంగీకరించండి. వద్దు అనకండి.' అని 2002 జూన్‌లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అబ్దుల్ కలామ్‌కు ఫోన్ చేశారు. చంద్రబాబు చెప్పినట్లుగానే వాజపేయి నుంచి ఫోన్ రానే వచ్చింది. ఎన్డీఏ మిత్రపక్షాల సమావేశంలో కలామ్‌ను రాష్ట్రపతిగా నియమించాలన్న ప్రతిపాదనకు ఏకగ్రీవంగా ఆమోదం లభించినట్లు వాజపేయి ఆయనకు చెప్పారు. అన్ని పార్టీలు తన పేరును అంగీకరిస్తే బాధ్యతలు స్వీకరించడానికి తనకు అభ్యంతరం లేదని కలామ్ ఆయనకు తెలిపారు. వాజపేయి, కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీతో కూడా మాట్లాడి అందుకు అంగీకరించేలా చేశారు. ఈ విషయాన్ని అబ్దుల్ కలామ్ స్వయంగా 'టర్నింగ్ పాయింట్స్– : ఎ జర్నీ త్రూ ఛాలెంజెస్' పేరిట తాను రాసిన పుస్తకంలో గుర్తుచేసుకున్నారు. కలామ్‌ను రాష్ట్రపతిగా ప్రకటిస్తూ ఎన్డీఏ ఏర్పాటు చేసిన సంయుక్త విలేఖరుల సమావేశంలో ఎన్డీఏ కన్వీనర్ జార్జి ఫెర్నాండెజ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ప్రమోద్ మహాజన్, చంద్రబాబునాయుడు, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి మాయావతి ఉన్నారు. ఆ విలేఖరుల సమావేశం నాకింకా గుర్తుంది.

దేశ రాజకీయాల్లో చంద్రబాబు నిర్వహించిన పాత్ర గురించి అవహేళనగా మాట్లాడేవారికి ఈ ఒక్క ఉదాహరణను జవాబుగా పరిగణించవచ్చు. అదే విధంగా యునైటెడ్ ఫ్రంట్ హయాంలో దేవెగౌడ, ఐకే గుజ్రాల్‌లను ప్రధాన మంత్రులుగా నియమించడంలోను, అప్పటి విధాన నిర్ణయాల్లోనూ చంద్రబాబు కీలక పాత్ర పోషించడాన్ని నేను ప్రత్యక్షంగా చూశాను. ఏపీ భవన్‌లోనే చంద్రబాబు ఛాంబర్‌లో ఆ రోజుల్లో సమావేశాలు జరిగేవి. ఐకె గుజ్రాల్ పేరును సీనియర్ జర్నలిస్టు కుల్దీప్ నయ్యర్ సూచించడంతో ఆయన పేరుపై కూడా చర్చలు జరిగాయి. తన పేరు కూడా ప్రతిపాదనల్లో రావడంతో గుజ్రాల్ చర్చల నుంచి వైదొలిగారు. చంద్రబాబు ఏపీ భవన్ స్వర్ణముఖి విభాగంలో ఒక సూట్ తెరిపించి అందులో పడుకోవల్సిందిగా గుజ్రాల్‌ను పంపారు. తెల్లవారు జామున 3 గంటలకు యుఎఫ్ నేతలు గుజ్రాల్‌ను లేపి 'మిమ్మల్నే ప్రధానమంత్రిగా ఎంచుకున్నాం' అని చెప్పారు. ఆ తర్వాత చంద్రబాబుతో ఆయన మంత్రివర్గ ఏర్పాటు, ఇతర విషయాల గురించి చర్చించి ఆరింటికి ఇంటికి వెళ్లారు. 'ఏమి ఇంత ఆలస్యంగా వచ్చారు?' అని గుజ్రాల్ భార్య ఆయనను నిలదీసింది. 'అలా నిలదీస్తావేం. నీవు ఈ దేశ ప్రధానమంత్రితో మాట్లాడుతున్నావు తెలుసా?' అని గుజ్రాల్ చమత్కరించారు అని ప్రముఖ జర్నలిస్టు వీర్ సంఘ్వీ తన పుస్తకం 'మాండేట్– విల్ ఆఫ్ ది పీపుల్' అన్న పుస్తకంలో వివరించారు. గుజ్రాల్ ప్రభుత్వం పడిపోయిన తర్వాత వాజపేయి ప్రభుత్వం ఏర్పడడానికి కూడా చంద్రబాబు ఇచ్చిన కీలక మద్దతే కారణమని వీర్ సంఘ్వీ ఇదే పుస్తకంలో తెలిపారు.

యునైటెడ్ ఫ్రంట్ హయాంలో కనీస ఉమ్మడి కార్యక్రమంపై చంద్రబాబు సమక్షంలో గంటల తరబడి చర్చలు జరిగేవి. జైపాల్ రెడ్డి, సూర్జిత్, బర్దన్, ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలతో ఆయన తరుచూ చర్చలు జరిపేవారు పెట్రోలు, డీజిల్ ధరలను ఒక్క రూపాయి పెంచాలన్నా యునైటెడ్ ఫ్రంట్ అగ్రనేతలు సుదీర్ఘ సమావేశాలు నిర్వహించేవారు. వాజపేయి కూడా అనేక సందర్భాల్లో చంద్రబాబు సలహా లేకుండా నిర్ణయాలు తీసుకునేవారు కాదు. రాష్ట్రానికి అవసరమైన నిధులు, పథకాలు రాబట్టేందుకు చంద్రబాబు తరుచూ ఢిల్లీ వచ్చేవారు. అయోధ్య అంశంపై కూడా వాజపేయి చంద్రబాబును 2003 ఫిబ్రవరి 16న పిలిచి చర్చలు జరిపారు. 'మీరు సుప్రీంకోర్టు తీర్పుకే వదిలివేయడం మంచిద'ని చంద్రబాబు వాజపేయికి సలహా ఇచ్చారు. చివరకు అయోధ్య అంశం సుప్రీంకోర్టు వల్లే పరిష్కృతమయింది.

చంద్రబాబు రెండు కారణాల వల్ల జాతీయ రాజకీయాల్లో బలమైన ముద్ర వేశారు. మొదటిది సంకీర్ణ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించడం కాగా రెండవది ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేసి, టెక్నాలజీని పరిపాలనలో సమర్థంగా ఉపయోగించడం. దీనివల్ల లభించే ఫలితాలను ఆయన చెప్పుకుంటే అతిశయోక్తులు మాట్లాడుతున్నారని విమర్శించేవారున్నారు కాని గురుచరణ్ సింగ్, చిదంబరం, శ్యామ్ పిట్రోడా, నందన్ నీలేకని, మార్క్ టుల్లీ లాంటి ఆర్థికవేత్తలు, సాంకేతిక నిపుణులు, జర్నలిస్టులు, యుకె, అమెరికా యూనివర్సిటీల్లో పలువురు పరిశోధకులు తాము రాసిన పుస్తకాల్లో చంద్రబాబును ప్రశంసించారు. కార్నెగీ మెలాన్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగం డీన్ అయిన దబ్బాల రాజగోపాల్‌రాజ్ రెడ్డి ద్వారా హైదరాబాద్‌లో ఇంటర్నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్‌ఫర్మేషన్‌ను నెలకొల్పేందుకు చంద్రబాబు ప్రభుత్వం అప్పుడు అన్ని విధాలా సహాయసహకారాలు అందించింది. అబ్దుల్ కలామ్ మిత్రుడైన ప్రొ. రాజీవ్ సంఘాల్‌కు ఈ సంస్థ బాధ్యతలు అప్పగించారు. అదేవిధంగా 'హైదరాబాద్: ద ఫ్యూచర్ నాలెడ్జి హబ్ ఆఫ్ ద వరల్డ్' అన్న పేరుతో పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేసి ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ బోర్డు సభ్యులను ఆకట్టుకున్నారు. అమెరికా అధ్యక్షుడు క్లింటన్ కూడా 'మై లైఫ్' అన్న తన పుస్తకంలో చంద్రబాబు తనను హైటెక్ సిటీకి ఆహ్వానించి అబ్బురపరిచిన విషయాన్ని రికార్డు చేశారు. బిల్‌గేట్స్‌ను కూడా ఆయన మెప్పించారు. చంద్రబాబు ఎంత వేగంగా నిర్ణయాలు తీసుకుంటారో ఒకప్పటి దక్కన్ ఎయిర్‌వేస్ అధినేత గోపీనాథ్ 'సింప్లీ ఫ్లై' అన్న పుస్తకంలో రాశారు. చంద్రబాబు హయాంలో ప్రోత్సాహం పొందిన పది, పదిహేను మంది పారిశ్రామికవేత్తలు ఇప్పుడు దేశ వ్యాప్తంగానే కాదు, అంతర్జాతీయ స్థాయిలోనూ విస్తరించారు.

చంద్రబాబు ఆర్థిక విధానాలను, శాంతి భద్రతలను కాపాడేందుకు తీసుకున్న చర్యలను అనేక మంది విమర్శిస్తారు కాని ఆర్థిక సంస్కరణలు అమలైన తర్వాత ఈ చర్యలు పరస్పరం దోహదం కల్పించేవిగా మారాయి. చంద్రబాబు ఆర్థిక విధానాలను వ్యతిరేకించిన వామపక్షాలు కూడా సంస్కరణలను అడ్డుకోవడం కష్టమని గ్రహించి తెలుగుదేశంతో రాజకీయంగా చేతులు కలిపాయి.

చంద్రబాబు మాదిరి ఏడు పదుల వయస్సు దాటిన, ముఖ్యమంత్రి పదవులు నిర్వహించిన అనేకమంది సీనియర్లు పలువురు ఇంకా క్రియాశీలకంగా ఉన్నారు కాని వారిలో చంద్రబాబు లాగా జాతీయ, ప్రాంతీయ రాజకీయాల్లో తన ప్రత్యేకతను నిలబెట్టుకున్నవారు తక్కువే. చంద్రబాబుతో



> 'మీరు మళ్లీ జాతీయ రాజకీయాల్లో ఏమైనా పాత్ర పోషించే అవకాశాలున్నాయా' అని చంద్రబాబును ప్రశ్నిస్తే ఆయన నవ్వి, 'ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత జాతీయ రాజకీయాల గురించి పట్టించుకునే సమయం ఎక్కడుంటుంది? జగన్ పాలన నుంచి ఏపీని విముక్తి చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా పునర్నిర్మించి అభివృద్ధి చేయడంపైనే ఇక నా పూర్తి దృష్టి కేంద్రీకరిస్తాను' అని జవాబు చెప్పారు.

పాటు శరద్ పవార్, కమల్‌నాథ్, దిగ్విజయ్‌సింగ్, నవీన్ పట్నాయక్, నరేంద్రమోదీ, కె.చంద్రశేఖర్‌రావు తదితరుల పాత్ర ఈ ఎన్నికల తర్వాత ఎంతమేరకు ఉంటుందో మరో నాలుగు వారాల్లో తేలనుంది.

వీరిలో శరద్ పవార్ వయస్సు ఎనిమిది పదులు దాటినప్పటికీ ఆయనకూ, చంద్రబాబునాయుడుకూ సమీప పోలికలున్నాయి. ఇద్దరికీ 1978వ సంవత్సరం వారి రాజకీయ భవిష్యత్‌కు సంబంధించి అతి కీలకమైన కాలం. 1978లో శరద్ పవార్ తన రాజకీయ గురువు వసంత్ దాదా పాటిల్‌పై తిరుగుబాటుచేసి ఒక కూటమి నేర్పాటు చేసి, అతి పిన్న వయస్సులో ముఖ్యమంత్రి పదవి చేపట్టిన శరద్ పవార్‌కూ, ఇదే 1978లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన చంద్రబాబునాయుడుకూ గాడ్ ఫాదర్స్ లేరు. రాజకీయాల్లో వారు తమ భవిష్యత్‌ను తాము నిర్మించుకున్నారు.

చంద్రబాబు కంటే నవీన్ పట్నాయక్ నాలుగేళ్లు పెద్ద అయినప్పటికీ 1997లో తండ్రి బిజూ పట్నాయక్ చనిపోయేంత వరకూ ఆయనకు రాజకీయాలతోను, ఒడిషా రాష్ట్రంతోనూ సంబంధాలు లేవు. ఈ రకంగా ఆయన చంద్రబాబుతో పోలిస్తే రాజకీయాల్లో దాదాపు రెండు దశాబ్దాల జూనియర్. దిగ్విజయ్ సింగ్ వారసత్వ రాజకీయాల్లోంచి వచ్చారు. మధ్యప్రదేశ్‌లో ఒక వ్యాపార కుటుంబానికి చెందిన కమల్‌నాథ్ సంజయ్ గాంధీ డూన్ స్కూల్‌లో తన క్లాస్‌మేట్ కావడంతో 1970లోనే యూత్ కాంగ్రెస్ రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర వహించారు. కేసీఆర్ ఎంపీగా ఉన్నా, కేంద్రమంత్రిగా ఉన్నా, యూపీఏలో భాగస్వామిగా ఉన్నా ఒక్క తెలంగాణ తప్ప మరేదీ పట్టనట్లు వ్యవహరించారు. ఇక చంద్రబాబు కంటే నాలుగేళ్లు చిన్న అయిన నరేంద్రమోదీ 1971లో ఆర్ఎస్ఎస్‌లో చేరినప్పటికీ 1985 నుంచే భారతీయ జనతా పార్టీలో చేరి ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశించారు. 1970లో యువజన కాంగ్రెస్‌లో చంద్రబాబు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నప్పుడు భారతీయ జనతా పార్టీయే ఆవిర్భవించలేదు. చంద్రబాబు ఎమ్మెల్యే అయ్యేనాటికి మోదీ ఆర్ఎస్ఎస్‌లో విభాగ్ ప్రచారక్ మాత్రమే. 1995లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఆ తర్వాత ఆరేళ్లకు గాని 2001లో మోదీని ముఖ్యమంత్రి పదవి వరించలేదు. ముఖ్యమంత్రి పదవి విషయంలో పోలిస్తే శరద్ పవార్ తర్వాత చంద్రబాబే సీనియర్. ఏడుపదులు దాటిన నేతల్లో నవీన్ పట్నాయక్, చంద్రబాబు నాయుడు మాత్రమే ఇప్పుడు ముఖ్యమంత్రి పదవి రేసులో ఉన్నారు. వీరందరిలో ఒక ప్రాంతీయ పార్టీని నాలుగు దశాబ్దాలనుంచి బలోపేతం చేస్తూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోను, ఇప్పుడు విభజిత ఏపీలోనూ ఆ పార్టీని ఒక బలమైన శక్తిగా నిలిపిన ఘనత చంద్రబాబుకే దక్కుతుంది. అంతేకాదు, అనేకమంది నేతలతో పోలిస్తే అత్యంత ప్రజాస్వామికవాదిగా చంద్రబాబు పేరు తెచ్చుకున్నారు. చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి ఢిల్లీ వచ్చి ప్రధాన మంత్రులను కలిసిన తర్వాత విలేఖరులతో మాట్లాడకుండా ఏనాడూ తిరిగి వెళ్లలేదు. జగన్ మాదిరి ఒక పాత ప్రెస్ రిలీజ్‌ను వాట్సాప్‌లో పంపించే వికృత సంస్కృతిని వారు పాటించేవారు కాదు. చంద్రబాబు ఢిల్లీ వస్తే ఇప్పటికీ జాతీయ జర్నలిస్టులు ఆయనతో గంటలతరబడి చర్చిస్తారు. చంద్రబాబు మోదీని కలిసేందుకు వచ్చాడని తెలిసినప్పటికీ ఆయనను కలుసుకునేందుకు నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూక్ అబ్దుల్లా వంటి నేతలు రావడాన్ని నేను గమనించాను.

'మీరు మళ్లీ జాతీయ రాజకీయాల్లో ఏమైనా పాత్ర పోషించే అవకాశాలున్నాయా' అని నేను ఇటీవల ప్రశ్నిస్తే ఆయన నవ్వి, 'ఈ ఎన్నికల్లో గెలిచిన తర్వాత జాతీయ రాజకీయాల గురించి పట్టించుకునే సమయం ఎక్కడుంటుంది? జగన్ పాలన నుంచి ఏపీని విముక్తి చేసి కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఆంధ్రప్రదేశ్‌ను అద్భుతంగా పునర్నిర్మించి అభివృద్ధి చేయడంపైనే ఇక నా పూర్తి దృష్టి కేంద్రీకరిస్తాను' అని జవాబు చెప్పారు.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

రాజ్యాంగబద్ధ పాలనకై పోరాడిన పార్టీపైనా దుష్ప్రచారం!?


ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలో భారత్ ఉజ్జ్వలశక్తిగా దూసుకెళుతున్న ప్రస్తుత తరుణంలో లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్నాయి. దేశంలో ఏ రంగాన్ని చూసినా వృద్ధి రేటు నమోదు చేసుకుంటున్న పరిస్థితుల్లో ఇప్పుడు అధికారంలో ఉన్న బీజేపీయే మళ్లీ అధికారం చేపడితే అడ్రస్ గల్లంతవుతుందనే భయంతో కాంగ్రెస్ సహా ఇండీ కూటమిలోని పలు పార్టీలు కుట్రపన్ని కుహనా నినాదాన్ని ఎత్తుకున్నాయి. అదేమిటంటే మళ్లీ అధికారంలోకి వస్తే నేటి రాజ్యాంగాన్ని, ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లను బీజేపీ రద్దు చేస్తుందనే దుష్ప్రచారం. చరిత్ర పుటల్లోకి వెళితే ఇదెంత అవాస్తవమో స్పష్టమవుతుంది.

ముందుగా రాజ్యాంగం రద్దు అనే అంశానికి వద్దాం. అసలు ఇది సాధ్యమేనా? గత బీజేపీ ప్రభుత్వాలు గాని, సంఘ్ పరివార్ గాని ఏనాడైనా కనీసం ఈ దిశగా వ్యాఖ్యలైనా చేశాయా? అన్నిటికంటే హాస్యాస్పదమైన విషయం ఏమిటంటే దేశంలో 1975–77 మధ్య కాలంలో ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగ విలువలను పూర్తిగా తుంగలో తొక్కి, పత్రికా స్వేచ్ఛను హరించి, విపక్ష నేతల్ని ఎడాపెడా అరెస్టులు చేయించి జైళ్లను నింపేసిన ఘనత నాటి ప్రధాని ఇందిరాగాంధీ సర్కారుదేనని యావత్ ప్రపంచానికి తెలుసు. నాడు ఎమర్జెన్సీని తొలగించి, ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు రాజ్యాంగబద్ధ పాలన కోసం 80 వేలకు పైగా ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు జైళ్లకు వెళ్లారు. ఇప్పుడు ఇందిర వారసులైన కాంగ్రెస్ అగ్రనేతలు, వీరితో భాగస్వామ్యంలో ఉన్న ఇండీ కూటమి నేతలు రాజ్యాంగం రద్దు గురించి మాట్లాడటం అంటే దయ్యాలు వేదాల్ని వల్లించడమే.

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో పరిపాలనకు ఆత్మ రాజ్యాంగమే. రాష్ట్రపతులు, ప్రధానులు, ముఖ్యమంత్రులు, మంత్రి మండళ్లు, గవర్నర్లు, న్యాయమూర్తులు, ఎన్నికల ప్రక్రియ, సైనిక దళాలు సహా చట్టబద్ధమైన పలు సంస్థల ఏర్పాటు అంతటికీ రాజ్యాంగమే ఆధారం. ఈ రాజ్యాంగమే ఊపిరిగా బీజేపీ ప్రభుత్వాల ఏర్పాటు, నేతల ఎన్నిక జరిగింది. ఈ రాజ్యాంగం ప్రాతిపదికనే గతంలో అటల్ బిహారీ వాజ్‌పేయి సర్కారు, గత రెండు విడతలుగా నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడి రాజ్యాంగబద్ధంగా సర్కారును నడుపుతూ ప్రజాదరణ పొందాయి. ఇంత అవకాశాన్నిచ్చిన రాజ్యాంగాన్ని బీజేపీ రద్దు చెయ్యాలనుకుంటోందనే ప్రచారం ఎంతవరకూ నిజమో ఈ గాలిమాటలకి ఊపిరి పోసిన ఇండీ నేతలే చెప్పాలి. దేశంలో రాష్ట్రపతుల్ని, న్యాయమూర్తులను, ప్రభుత్వాలను అభిశంసించాలంటేనే ఎన్నో కోణాలను దృష్టిలో పెట్టుకుని పలు సంక్లిష్టమైన ప్రక్రియలను రాజ్యాంగం నిర్దేశించడంతో పాటు ప్రభుత్వాలు తప్పుదోవ పట్టకుండా గవర్నర్లు, రాష్ట్రపతులను రాజ్యాంగ రక్షకులుగా మన ప్రజాస్వామ్యం ఉంచింది. ఇంత పటిష్టమైన రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వాలు, అధికారంలో ఉన్న బీజేపీ నేతలు ఎప్పుడూ గౌరవిస్తూనే ఉండగా 'రాజ్యాంగం రద్దు' అనే మాట బీజేపీకి అన్వయించడం పూర్తి దురుద్దేశపూరితం తప్ప మరొకటి కాదు.

ఒకవైపు రాజ్యాంగం రద్దు అంటూనే, రాజ్యాంగాన్ని బీజేపీ మార్చేయబోతోందనే అనే మరో మాటను కూడా విపక్షాలు ప్రయోగిస్తున్నాయి. అసలు రాజ్యాంగాన్ని 100 సార్లకు పైగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే! ఎంతమాత్రమూ మార్పులకు వీల్లేని రాజ్యాంగ పీఠికను ఎమర్జెన్సీలో మార్చింది కాంగ్రెస్ సర్కారు కాదా? కాంగ్రెస్ పాలనలో జరిగిన రాజ్యాంగ మార్పులను ఏమంటారు? ఇది రాజ్యాంగాన్ని మార్చడం కాదా? రాజ్యాంగంలో సవరణలు, చట్టాల రూపకల్పన, మార్పుచేర్పులకు సంబంధించి రాజ్యాంగమే నిర్దిష్ట విధి విధానాలతో అవకాశమిచ్చినప్పుడు రాజ్యాంగంలో మార్పులు చెయ్యడం మహా నేరమన్నట్లు విపక్షాలు ప్రచారం చెయ్యడం సబబేనా? అదే వారి మాట అయితే రాజ్యాంగ మార్పుల విషయంలో మొదటి దోషిగా కాంగ్రెస్‌నే నిలబెట్టాలి.

> ఒకవైపు రాజ్యాంగం రద్దు అంటూనే, రాజ్యాంగాన్ని బీజేపీ మార్చేయబోతోందనే అనే మరో మాటను కూడా విపక్షాలు ప్రయోగిస్తున్నాయి. అసలు రాజ్యాంగాన్ని 100 సార్లకు పైగా మార్చిన ఘనత కాంగ్రెస్‌దే! ఎంతమాత్రమూ మార్పులకు వీల్లేని రాజ్యాంగ పీఠికను ఎమర్జెన్సీలో మార్చింది కాంగ్రెస్ సర్కారు కాదా?



ఇక ఎస్సీ–ఎస్టీ రిజర్వేషన్ల రద్దు అంశానికి వస్తే– బీజేపీపైన, ఆర్ఎస్ఎస్ పైనా ఒక అబద్ధాన్ని పదే పదే ప్రచారం చేసి అదే నిజమని అనిపించేందుకు విపక్షాలు చేస్తున్న విశ్వప్రయత్నం ఇది. కోల్పోతున్న తమ ప్రాభవాన్ని నిలబెట్టుకోవడానికి ప్రతిపక్షాలు చేస్తున్న ఈ దింపుడుకళ్ళెం ప్రయత్నం వారికి నిరాశనే మిగల్చుతుందనేది ఇప్పటికే రుజువైన సత్యం. రిజర్వేషన్లకి సంబంధించి 'కొన్ని శతాబ్దాలుగా ఎస్సీలపై చూపిన అస్పృశ్యత నిర్మూలనకు ఉద్దేశించిన ఈ రిజర్వేషన్లు అస్పృశ్యత, అసమానతలు ఉన్నంతవరకు కొనసాగాలి. మేము అభివృద్ధి చెందాం, మాకు ఇక రిజర్వేషన్లు అవసరం లేదని ఎస్సీ, ఎస్టీలు ప్రకటించేంత వరకు ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కొనసాగాలి' అన్నది ఆర్ఎస్ఎస్ నిశ్చితాభిప్రాయం. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ సహా పలువురు ముఖ్య నేతలు ఈ విషయాన్ని పలుమార్లు స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించి 2015 నుంచి 2024 ఏప్రిల్ వరకూ వివిధ సందర్భాల్లో రిజర్వేషన్లకు మద్దతుగా ఆర్ఎస్ఎస్ పెద్దలు చేసిన వ్యాఖ్యల వీడియోలు కూడా బయటకొచ్చాయి. రిజర్వేషన్ల విషయంలో బీజేపీ, సంఘ్ పరివార్ చిత్తశుద్ధికి ఇంకేం రుజువు కావాలి? కానీ, రిజర్వేషన్లపై అంతకుముందెప్పుడో ఆర్ఎస్ఎస్ నేతల నుంచి భిన్నమైన వ్యాఖ్యలు వినిపించాయని రాహుల్‌గాంధీ కుమిలిపోతున్నారు. ఆయనకు వినిపించిన ఆ వ్యాఖ్యలు ప్రజలకు వినిపించలేదంటే ఎవరిది లోపమో ఆయనే చెప్పాలి.

ఎస్సీ ఎస్టీల విషయంలో ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎప్పుడూ ఉన్నతమైన దృష్టితోనే వ్యవహరించాయి అని చెప్పడానికి ఆర్ఎస్ఎస్ శాఖలను సందర్శించి, బడుగువర్గాలకు అక్కడ దక్కిన ఆదరణ చూసి ప్రశంసలు కురిపించిన మహాత్మా గాంధీజీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ల వ్యాఖ్యలే చాలు. మే 12, 1939న పూణే నగరంలో ఆర్ఎస్ఎస్ కార్యకర్తల శిబిరానికి డాక్టర్ అంబేడ్కర్ విచ్చేసిన ఉదంతం, అక్కడ ఆచరణలో ఉన్న కులనిర్మూలన తీరును అంబేడ్కర్ మెచ్చిన వైనాన్ని ఆయన అనుయాయి బాలా సాహెబ్ సాలుంకే (1957–62 లోక్‌సభ సభ్యులు) తన ఆత్మకథలో తెలిపారు, 1957 ఏప్రిల్ 1, 1957న పూణేలో జరిగిన ఉగాది వేడుకల్లో బహిరంగంగానూ చెప్పారు. ఇక గాంధీజీ 28 సెప్టెంబర్ 1947లో వార్ధాలో ఆర్ఎస్ఎస్ శాఖకు విచ్చేసి తాను కోరుకున్న కులరహిత సమాజం ఆర్ఎస్ఎస్ శాఖల్లో కనిపించిందని ఆనందం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బీజేపీలపై కువిమర్శలే ఊపిరిగా బతుకీడుస్తున్న విపక్ష నేతలకు కళ్లెదుట ఈ సాక్ష్యాలు కనిపిస్తున్నా గుడ్డితనాన్ని నటిస్తూ అందరూ తమలాగే ఉండాలని కోరుకుంటున్నారు.


డాక్టర్ అంబేడ్కర్ జీవించి ఉండగా వారి సిద్ధాంతాలను కమ్యూనిస్టులు వెక్కిరిస్తూనే ఉన్నారు. ఆయన ప్రత్యక్ష ఎన్నికల్లో గెలవకుండా నాటి కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంది. బీజేపీని విమర్శించేందుకు పదేపదే డాక్టర్ అంబేడ్కర్‌ని అడ్డుపెట్టుకునే వామపక్ష మేధావులు గుర్తించాల్సిన సత్యం మరొకటుంది. డాక్టర్ అంబేడ్కర్ పలు సందర్భాల్లో కమ్యూనిస్టుల తీరును తుర్పారబట్టారు. తెలుగు రాష్ట్రాలలో నక్సల్ ఉద్యమానికి మూలపురుషుడైన నల్ల సూరీడు సత్యమూర్తి ఏమన్నారు? నక్సల్ ఉద్యమంలో కూడా క్రింది స్థాయిలో పోరాటం చేస్తున్నవారు, చనిపోతున్నవారు ఎస్సీ ఎస్టీ వర్గాల వారేనని, పై నాయకత్వం మాత్రం అగ్రవర్ణాల వారిదని చెప్పలేదా? నిమ్న, పేద వర్గాల ప్రజల కోసం పనిచేస్తున్నామని చెప్పుకునే కమ్యూనిస్టు పార్టీల పొలిట్ బ్యూరోలో ఎంతమంది ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉన్నారని ఆనాడే ప్రశ్నించారు. అంబేడ్కర్ భావజాలానికి వ్యతిరేకంగా, భారతదేశం ఒకటి కాదని, ఆర్యులు బయట వారనీ.. వీరు ఈ దేశంలోని మూలవాసులపై దాడులు చేశారని అసత్య ప్రచారం ఇప్పటికీ చేస్తున్నది కమ్యూనిస్టులు కాదా? జవాబు లివ్వలేని ఎన్నో ప్రశ్నలను దాచుకున్న కమ్యూనిస్టులు, కాంగ్రెస్ నేతలా బీజేపీనీ, ఆర్ఎస్ఎస్‌నీ విమర్శించేది?

• ప్రొఫెసర్ గోపాల్ రెడ్డి
ఉస్మానియా యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్

రేపు ఆదోనిలో ప్రజాదర్బారు

ఆదోని 1952 నుంచి జనరల్ అసెంబ్లీ నియోజకవర్గంగా కొనసాగుతోంది. అంతర్జాతీయ అభివృద్ధి విభాగం ద్వారా ఈ నగరాభివృద్ధికి 2000 సంవత్సరం నుంచి రూ.36 కోట్ల నిధులు పదేళ్ల పాటు ఖర్చు చేశారు. అయినా అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, డిగ్రీ–పీజీ విద్యాసంస్థలు ఏర్పాటు కాలేదు. వ్యాపార పంటలు, ఆయిల్, పత్తి, జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లులు, వస్త్ర పరిశ్రమలతో రెండవ ముంబాయిగా ప్రసిద్ధి గాంచిన ఆదోని వేలాది మందికి ఉపాధినిచ్చేది. వ్యవసాయానికి నీళ్లందక పంటలు దెబ్బతినడం, మిల్లులు మూతపడడంతో ప్రజలకు వలసలు తప్పలేదు. వేదవతి ఆర్డీఎస్ కుడి కాల్వ ద్వారా తుంగభద్ర నీళ్లు బీడు భూములకు మళ్లించాలి, మూతబడ్డ మిల్లులు తెరిపించాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇంకా అనేక సమస్యలపై అర్థవంతమైన చర్చ జరిపి పరిష్కారం అన్వేషించాలి. అందుకు శాసనసభ ఎన్నికలే సరైన వేదిక. మే 9వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆదోని శాసనసభకు పోటీ చేస్తున్న అభ్యర్థులందరితో ఆదోని రైల్వేస్టేషన్ రోడ్డులోని రెడ్డి భవన్‌లో ముఖాముఖి జరగనుంది. ఇందులో ఆది నారాయణ, సుజ్ఞానమ్మ, యు.జి శ్రీనివాసులు, షేక్ షావలి, రవివర్మ, సోము, గంగన్న, తిరుమలేష్, బసవ రాజు తదితరులు పాల్గొంటారు.

– ఆదోని ప్రజా దర్బార్ వేదిక
ఆంధ్రప్రదేశ్







రామవరప్పాడు ఫ్లైఓవర్ వద్ద కుప్పకూలిన ఎన్నికల చెక్‌పోస్టు

రెండు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం

ఒక్కసారిగా గాలివాన

- నగరంలో చిన్నపాటి జల్లులు, ఈదురుగాలులు
- మచిలీపట్నం సహా ప్రధాన పట్టణాల్లో భారీగా..
- మామిడి పంటకు తీవ్ర నష్టం
- 9, 10, 11 తేదీల్లో కూడా.. : వాతావరణ శాఖ

విజయవాడ/మచిలీపట్నం, మే 7 (ఆంధ్రజ్యోతి) : వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. మంగళవారం ఉదయం నుంచి మబ్బులతో కూడిన వాతావరణం కనిపించగా, మధ్యాహ్నం నుంచి మాత్రం కొద్దిసేపు ఎండ, సాయంత్రం 4 గంటల తర్వాత ఈదురుగాలులు, వర్షం కురిశాయి. ఉరుములు, మెరుపులతో పాటు సుడిగుండాలూ కనిపించాయి. విజయవాడలో చిన్నపాటి జల్లులే కురవగా, నందిగామ, తిరువూరులో భారీ వర్షం పడింది. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మచిలీపట్నం, గుడివాడ, పామర్రు, పెడన ప్రాంతాల్లో రెండు సెంటీమీటర్ల కన్నా అధికంగా వర్షం కురిసింది. అవనిగడ్డ, చల్లపల్లి ప్రాంతాల్లో ఈదురుగాలులకు తోడు మోస్తరు వర్షం కురిసింది. మచిలీపట్నంలో భారీగా కురవటంతో రహదారులపై నీరు నిలిచిపోయింది. ఈదురుగాలుల ప్రభావంతో అవనిగడ్డ, మోపిదేవి మండలాల్లోని మామిడి చెట్లకు కాయలు రాలిపోయి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. కాగా, థండర్ స్ట్రాం యాక్టివిటీలో భాగంగానే వాతావరణం ఇలా చల్లబడిందని నిపుణులు తెలిపారు. ఈ వర్షాలను మ్యాంగోషవర్స్‌గా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ పరిస్థితి మరో రెండు, మూడు రోజులు ఉంటుందని, ఆ తర్వాత మళ్లీ ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతాయని అంటున్నారు.

11వ తేదీ వరకూ వర్షాలు

ఈనెల 11వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి ఉరుములు, మెరుపులతో కూడిన ఒక మోస్తరు, భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ మంగళవారం తెలిపింది. కోస్తాతీరం వెంబడి బుధవారం భారీవర్షాలు కురుస్తాయని, ఈ నెల 9, 10, 11 తేదీల్లో ఒక మోస్తరుగా కురుస్తాయని, గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని హెచ్చరించింది.



నగరాన్ని చుట్టుముట్టిన మేఘాలు (ఇన్‌సెట్‌లో) బందరు కోనేరు సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు



నున్న పోలీసు స్టేషన్‌లో వెలంపల్లి హడావిడి

కుట్రలు.. కుయుక్తులు..

ప్రశ్నించిన ప్రతిపక్షాలపై దాడులు.. దౌర్జన్యాలు

సెంట్రల్‌లో వైసీపీ అభ్యర్థి వెలంపల్లి అనుచరుల అరాచకాలు



డబ్బు పంపిణీ చేస్తున్న వలంటీరును అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

ఎన్నికలు దగ్గరపడేకొద్దీ వైసీపీ నాయకులు అన్ని రకాల అడ్డదారుల్లోకి ప్రవేశిస్తున్నారు. ఓటర్లను ఎలాగైనా ప్రలోభ పెట్టేందుకు కుక్కర్లు, హాట్‌బాక్సుల కూపన్లతో పాటు బహిరంగంగానే డబ్బు పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇందుకు రాజీనామా చేసిన వలంటీర్లను పావులుగా ఉపయోగిస్తున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో మంగళవారం డబ్బు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావుకు చెందిన మాజీ వలంటీరును టీడీపీ నేతలు అడ్డుకోవడం, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడం, తప్పును కప్పిపుచ్చేందుకు వైసీపీ నేతలు రివర్స్ కేసులు పెట్టించడం, ఎక్కడికక్కడ దాడులు.. దౌర్జన్యాలతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి.

మాజీ వలంటీర్లతో ఇంటింటికీ డబ్బు పంపిణీ

- కుక్కర్లు, హాట్‌బాక్సుల కూపన్లు కూడా..
- టీడీపీలో చేరాడని ఓ కార్యకర్త, అతని భార్యపై దాడి
- బొండా ఉమా ఓ గూండా.. అంటూ మైకుల్లో ప్రచారం
- దళిత కులానికి చెందిన మహిళపై అసభ్య ప్రవర్తన
- పోలీసులకు ఫిర్యాదు చేసిన టీడీపీ నాయకులు
- వెంటనే రంగంలోకి దిగిన వెలంపల్లి, ఎమ్మెల్సీ రుహుల్లా
- పోలీసులపై ఒత్తిడి తెచ్చి టీడీపీ నేతలపై ఎదురు కేసులు

(విజయవాడ- ఆంధ్రజ్యోతి/పాయకాపురం) : మొదటి నుంచి వలంటీర్లతో రాజకీయం చేస్తున్న వైసీపీ నాయకులు తాజాగా ఆ ముసుగు తీసేశారు. ఎన్నికల కోడ్ రాకముందే విజయవాడ సెంట్రల్‌లో వలంటీర్లకు తాయిలాలు పంచి మచ్చిక చేసుకున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు తాజాగా తన రాజకీయ ప్రయోజనాల కోసం వారిని వాడుకుంటున్నారు. కొంతమంది వలంటీర్లతో రాజీనామా చేయించిన వైసీపీ నేతలు ఇప్పుడు వారిని డబ్బు పంపిణీకి వినియోగిస్తున్నారు. మంగళవారం స్థానిక ఎల్‌బీఎస్ నగర్‌లో మాజీ వలంటీర్ గురుస్వామి వెలంపల్లి తరఫున ఇంటింటికీ తిరిగి ప్రచారం చేయడమే కాకుండా ఓటర్లకు డబ్బు పంపిణీ చేశారు. దీన్ని గమనించిన టీడీపీ నేత బొల్లెద్దుల రవిచంద్ర, మరికొందరు ఆ ప్రాంతానికి చేరుకుని అడ్డుకున్నారు. మాజీ వలంటీరుకు మద్దతుగా వచ్చిన వైసీపీ నేతలు.. టీడీపీ వారితో వాగ్వివాదానికి దిగారు. చేసేదేమీ లేక టీడీపీ నేతలు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

దాడులు.. దౌర్జన్యాలు

● టీడీపీ అభ్యర్థి బొండా ఉమా తనయుడు రవితేజ స్థానిక బర్మాకాలనీలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో వైసీపీ మహిళా కార్యకర్తలు ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అంటిస్తూ వెళ్తున్నారు. రవితేజ వారిని అడ్డుకుని ప్రశ్నించారు. దీంతో వైసీపీ మహిళా కార్యకర్తలు టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. చేతిలో డబ్బు, స్టిక్కర్ల సంచులతో ఉన్న వైసీపీ మహిళా కార్యకర్తలు అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయమై టీడీపీ నేత ఎస్‌కే మస్తాన్ నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

● ప్రకాశ్‌నగర్‌కు చెందిన కాయల వసంత్ గత కొంతకాలంగా వైసీపీలో ఉన్నారు. ఇటీవల టీడీపీలో చేరాడు. ఆయన మంగళవారం ఎల్‌బీఎస్ నగర్ చర్చి ప్రాంతంలో ఎన్నికల ప్రచారంలో ఉండగా, అటుగా వచ్చిన వైసీపీ నేతలు వీరబాబు, బోరా బుజ్జి, రామిరెడ్డి అడ్డుకుని వసంత్‌పై దౌర్జన్యం చేశారు. విషయం తెలుసుకున్న వసంత్ భార్య లక్ష్మి అక్కడకు చేరుకుంది. దీంతో భార్యాభర్తలిద్దరిపై వైసీపీ నేతలు దాడికి దిగారు. టీడీపీ నేతలు పైడి శ్రీను తదితరులు వారిని అడ్డుకున్నారు. ఈ ఘటనపై లక్ష్మి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

● బొండా రవితేజతో కలిసి మంగళవారం ప్రచారంలో పాల్గొన్న టీడీపీ మహిళా కార్యకర్త చొప్పర వరలక్ష్మిని వైసీపీ నేతలు అడ్డుకున్నారు. జ్యోతి, కరుణశ్రీ, చిన్నారి, మాతా మహేశ్, ఎస్‌కే మస్తాన్ ఆమెపై బెదిరింపులకు దిగారు. తమ ప్రాంతంలో టీడీపీ తరఫున ప్రచారం చేయడానికి వీల్లేదని భయపెట్టడమే కాకుండా, దళిత కులానికి చెందిన ఆమెను కులం పేరుతో అసభ్యంగా దూషించారు. ఈ వివాదంపై వరలక్ష్మి.. నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

మొదటి నుంచీ ఇంతే..

● సెంట్రల్‌లో వెలంపల్లి మార్క్ రాజకీయం

వివరాలు లోపలి పేజీలో...

కౌంటర్ కేసులతో వెలంపల్లి స్కెచ్

● డబ్బు పంపిణీ చేస్తూ అడ్డంగా దొరికిపోయిన వైసీపీ నాయకులు కౌంటర్ కేసులతో టీడీపీ శ్రేణులను రివర్స్‌లో ఇరికించే ప్రయత్నం చేశారు. పోలీసులపై ఒత్తిడి తెచ్చి కేసులు నమోదు చేయించారు. టీడీపీ నాయకులు కేసులు పెట్టారన్న అక్కసుతో మంగళవారం వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా రంగంలోకి దిగారు. నేరుగా నున్న రూరల్ పోలీసుస్టేషన్‌కు చేరుకున్నారు. సుమారు గంటపాటు అక్కడే తిష్ట వేశారు. వైసీపీ కార్యకర్తలతో కౌంటర్ ఫిర్యాదులు చేయించారు.

● బొండా రవితేజపై ఎస్సీ కులానికి చెందిన యువతితో ఫిర్యాదు చేయించారు. తాను ప్రచారానికి వెళ్తే రవితేజ తనను అడ్డుకుని కులం పేరుతో దూషించారని చెప్పి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు.

● టీడీపీ నేత బొల్లెద్దుల రవిచంద్ర తనపై దాడిచేసి కొట్టారంటూ వైసీపీ తరఫున డబ్బు పంపిణీ చేస్తున్న మాజీ వలంటీర్ గురుస్వామితో నున్న రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేశారు.

నేడు నగరంలో

మోదీ రోడ్ షో



కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం

- విమానాశ్రయం నుంచి ఇందిరాగాంధీ స్టేడియానికి..
- స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు రోడ్ షో
- పాల్గొననున్న చంద్రబాబు, పవన్, పురందేశ్వరి
- మధ్యాహ్నం నుంచి బందరురోడ్డులో రాకపోకలు బంద్
- 5 వేల మందితో పటిష్ట బందోబస్తు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ బుధవారం నగరంలో పర్యటించనున్నారు. కూటమి అభ్యర్థుల తరపున ఆయన ప్రచారం చేయనున్నారు. బుధవారం సాయంత్రం 6.25 గంటలకు గన్నవరం విమానాశ్రయం వద్ద బయల్దేరి రోడ్డుమార్గాన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటారు. రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ఓపెన్ టాప్ జీపుపై రోడ్ షో నిర్వహిస్తారు.

పటిష్ట బందోబస్తు

ప్రధాని పర్యటన నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయం నుంచి బెంజిసర్కిల్ వరకు పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం 5 వేల మందిని బందోబస్తుకు ఉపయోగిస్తున్నారు. ఐదుగురు ఐపీఎస్ అధికారులు పర్యవేక్షిస్తారు. ఎంజీ రోడ్డులో డివైడర్ పక్కన ఇనుప బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి 7 గంటలకు ప్రారంభమయ్యే ఈ రోడ్డు షో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు 1.3 కిలోమీటర్ల మేర జరుగుతుంది. బందరు రోడ్డుకు రెండో వైపున (బెంజిసర్కిల్ నుంచి పోలీస్ కంట్రోల్ రూమ్‌వైపు) కార్యకర్తలు, జనం నిలబడేలా ఏర్పాట్లు చేశారు. షో జరిగే ప్రదేశంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి ఎంజీ రోడ్డులో రాకపోకలను నిలుపుదల చేస్తారు.

1.50 లక్షల మందితో జేజేలు

ప్రధాని మోదీ రోడ్ షో విజయవంతం చేయడానికి 1.50 లక్షల మందిని తరలించాలని బీజేపీ నేతలు నిర్ణయించారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి కార్యకర్తలను తరలించాలని భావిస్తున్నారు. మొత్తం రెండు వరుసల్లో బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ రెంటికీ మధ్యలో పోలీసుల బందోబస్తు ఉంటుంది. వాహనంపై మోదీతో పాటు చంద్రబాబు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఉంటారు. వాస్తవానికి ఈ రోడ్డు షో పశ్చిమ నియోజకవర్గంలో జరగాల్సి ఉంది. కూటమి తరఫున బీజేపీ అభ్యర్థిగా సుజనా చౌదరి అక్కడ పోటీలో ఉన్నారు. అయితే, ఈ నియోజకవర్గంలో ప్రధాన మార్గం కంటే వీధులు ఎక్కువగా ఉన్నాయి. దీంతో ప్రధాని భద్రతను పర్యవేక్షించే ఎస్పీజీ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేసినట్టు తెలిసింది. దీంతో బందరు రోడ్డును ఎంపిక చేశారు. కాగా, బీజేపీ నేతలు పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం రాత్రి సన్నాహక సమావేశం నిర్వహించి చర్చించారు.

శుద్ధ అబద్ధాలు



మచిలీపట్నం ప్రచార సభలో సీఎం మాయమాటలు

అబద్ధం చెబితే అతికినట్టు ఉండాలి.. మాయమాటలు చెబితే వినేవారు నమ్మేలా ఉండాలి.. ఈ సూక్తుల్ని సరిగ్గా వంటబట్టించుకున్నారో లేదో సీఎం జగన్ సోమవారం మచిలీపట్నంలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో బహిరంగంగా అందరి చెవిలో పూలు పెట్టారు. మచిలీపట్నాన్ని అభివృద్ధి చేసేశానని గొప్పలు చెప్పుకొన్న ఆయన అసలు విషయాన్ని దాచేసి అడ్డగోలుగా అబద్ధాలు ఆడేశారు. బందరు పోర్టుతో పాటు ఫిషింగ్ హార్బర్, మెడికల్ కళాశాల నిర్మాణాల గురించి ఆయన చెప్పిన మాటలు వాస్తవానికి దూరంగా ఉండగా, ఎన్నికల సమయంలో ఏమార్చే పలుకులెందుకని అక్కడ ఉన్నవారు గుసగుసలాడుకున్నారు. - మచిలీపట్నం, ఆంధ్రజ్యోతి



ఫిషింగ్ హార్బర్ వద్ద పునాదుల దశలో ఉన్న నిర్మాణాలు

- ఏడాదిగా ముందుకు సాగని బందరు పోర్టు పనులు
- మెడికల్ కాలేజీ నిర్మించేశామని గొప్పలు
- పూర్తయింది మాత్రం ఫస్టియర్ తరగతుల భవనాలే..
- ఫిషింగ్ హార్బర్ పనులు ఆగిపోయి ఆరు నెలలు
- జనం సాక్షిగా పూర్తిచేసేశామని అబద్ధాలాడేసిన జగన్



మెడికల్ కళాశాల భవనాల పరిస్థితి ఇదీ..



తొలిదశలో ఉన్న బందరు పోర్టు సౌత్‌బ్రేక్ వాటర్ పనులు

సీఎం మాట : మచిలీపట్నం పోర్టును రూ.5,100 కోట్లతో నిర్మిస్తున్నాం..

వాస్తవం : గత ఏడాది మే 22వ తేదీన సీఎం జగన్ పోర్టు పనులు ప్రారంభించారు. పనులైతే ప్రారంభమయ్యాయి కానీ, ఏడాదిగా ఆ పనులు నత్తనడకనే సాగుతున్నాయి. ఇప్పటికి 20 శాతం పనులు కూడా జరగలేదు. సముద్రంలో నిర్మించే సౌత్‌బ్రేక్ వాటర్ పనులు 2,070 మీటర్లు చేయాల్సి ఉండగా, తొలివిడత పనులే చేశారు. ఈ బ్రేక్ వాటర్ నిర్మాణాన్ని చెన్నైకు చెందిన ట్రిపుల్ ఐటీ నిపుణులు పరిశీలించారు. సముద్రంలో ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తట్టుకునేలా ఎలా నిర్మించారో వారు నివేదిక ఇవ్వాలి. ఇంతవరకు ఆ పనులే ప్రారంభం కాలేదు. ఈ నివేదిక వచ్చాకే మరో విడతలో పటిష్టంగా సౌత్‌బ్రేక్ వాటర్ నిర్మించాల్సి ఉంటుంది. పోర్టు వద్ద నాలుగు బెర్తులకు సంబంధించి 1,200 పిల్లర్లు పోయాలి. ఏడాదిగా 280 పిల్లర్లే పోశారు. పోర్టు పనులు ఎప్పటికి పూర్తి చేస్తారనే అంశంపై స్పష్టత లేదు.

సీఎం మాట : మచిలీపట్నంలో రూ.550 కోట్లతో మెడికల్ కళాశాల నిర్మించాం..

వాస్తవం : గత ఏడాది సెప్టెంబరు నుంచి మెడికల్ కళాశాలలో మొదటి సంవత్సరం తరగతుల నిర్వహణకు మాత్రమే భవనాలు పూర్తిచేశారు. రెండో సంవత్సరం తరగతుల నిర్వహణకు ఇంకా భవనాలు సమకూర్చాలి. వైద్యసేవలను అందుబాటులోకి తెచ్చేందుకు ఇన్‌పేషెంట్, అవుట్ పేషెంట్ వార్డులకు సంబంధించిన భవనాలు పునాదుల దశలోనే ఉన్నాయి. మెడికల్ కళాశాలలో వైద్యసేవలు ఎప్పటి నుంచి అందుబాటులోకి తెస్తారు. ఇంకా నిర్మించాల్సిన భవనాలను ఎప్పటికి పూర్తిచేస్తారనే అంశంపై సీఎం స్పష్టత ఇవ్వలేదు. మెడికల్ కళాశాలకు వెళ్లేందుకు రైల్వేట్రాక్‌పై ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూ.25 కోట్లను మంజూరు చేస్తున్నట్లు పోర్టు పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన సమయంలో సీఎం ప్రకటించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి రూపాయి కూడా విడుదల కాలేదు.

సీఎం మాట : రూ.350 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మించాం..

వాస్తవం : గిలకలదిండిలో ఫిషింగ్ హార్బర్ పనులు నిలిచిపోయి దాదాపు ఆరు నెలలైంది. ఇక్కడ పదిమంది కూడా పనిచేయట్లేదు. అయినా ఈ పనులు పూర్తయినట్లు చెప్పడం గమనార్హం. ఆక్షన్ హాల్, మత్స్యకారుల వలలు భద్రపరుచుకునే గదులు, ఐస్‌ప్లాంట్ వంటి భవనాల నిర్మాణ పనులు పునాదుల దశను దాటలేదు. గత ఏడాది డిసెంబరు నాటికి ఈ పనులు పూర్తిచేయాల్సి ఉంది. మరో ఏడాదికి కూడా ఈ పనులు పూర్తయ్యే పరిస్థితి లేదు.

నేడు జంక్షన్‌కు జనసేనాని



హనుమాన్ జంక్షన్, మే 7 : జనసేనాని పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం హనుమాన్ జంక్షన్‌లో పర్యటించనున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక విజయవాడ రోడ్డులోని మూలకొట్టు సెంటరులో బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ ఏర్పాట్లను మంగళవారం జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, టీడీపీ, జనసేన బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, వడ్డి శివనాగేశ్వరరావు తదితర నాయకులు పర్యవేక్షించారు.

ఐదేళ్లకు వెలుగులు

ఎయిర్‌పోర్టు టూ వారధి వీఐపీ కారిడార్‌కు మోక్షం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా వెలగని వీఐపీ కారిడార్‌లోని దీపాలకు ఇప్పటికి మోక్షం కలిగింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ వస్తున్నారని ఎన్‌హెచ్-16పై వీఐపీ కారిడార్‌లో లైట్లకు మరమ్మతులు చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్‌హెచ్-16లో ఎయిర్‌పోర్టు నుంచి కనకదుర్గమ్మ వారధి వరకు వీఐపీ కారిడార్‌గా ప్రకటించారు. వీఐపీల రాకపోకలు ఎక్కువగా ఉండటం వల్ల దీనిని సుందరంగా తీర్చిదిద్దారు. మొదట సీఆర్‌డీఏ, ఆ తర్వాత విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కు దీని నిర్వహణ అప్పగించారు. ఒక్కసారి మాత్రం సీఎం రాత్రిపూట ప్రయాణిస్తున్నారని తెలిసి దీపాలకు మరమ్మతులు చేశారు. అయితే, మరుసటిరోజు తెల్లవారుజాము నుంచే ఆ దీపాలు మళ్లీ వెలగలేదు. తాజాగా ప్రధాని పర్యటన సందర్భంగా ఎన్‌హెచ్ అధికారులే మరమ్మతులు చేయించారు.


టీడీపీ నేతలకు అండగా నున్న పోలీస్‌స్టేషన్ వద్ద బొండా రవితేజ

మొదటి నుంచీ ఇంతే..

» సెంట్రల్‌లో 'వెలంపల్లి మార్క్' రాజకీయం

(విజయవాడ-ఆంధ్రజ్యోతి/పాయకాపురం) : గెలుపు కోసం వెలంపల్లి శ్రీనివాసరావు అన్ని రకాల అక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికే పెద్ద ఎత్తున కుక్కర్లను, హాట్ బాక్సులను సిద్ధం చేశారు. వాటిని పంపిణీ చేసేందుకు వెలంపల్లి సరికొత్త ఆలోచనకు తెరతీశారు. ఓటర్లకు ముందుగా కుక్కర్, హాట్‌బాక్సుల ఫొటోతో ఉన్న కూపన్లను పంపిణీ చేశారు. వాటిని వన్‌టౌన్‌లోని ఫలానా దుకాణంలో చూపించి వస్తువు తెచ్చుకోవాలని చెప్పారు. దీనిపై ఎన్నికల అధికారులకు ఫిర్యాదు అందడంతో గతనెల 28న కూపన్లు ప్రింట్ చేస్తున్న ప్రెస్‌పై దాడి చేశారు. సుమారు 5వేల పైచిలుకు కూపన్లను స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరు ప్రింటింగ్ ప్రెస్‌ల్లో ఇలాంటి కూపన్లను సుమారు లక్ష పైచిలుకు ప్రింట్ చేయించినట్లు సమాచారం.

● ఆంధ్ర రాష్ట్ర ప్రజాసమితి పార్టీ పేరుతో గొల్లపల్లి శ్రీఫణిరాజ్ అనే వ్యక్తి సెంట్రల్‌లో పోటీ చేస్తున్నారు. ఇక్కడ జనసేన పోటీలో లేకపోవడంతో గాజు గ్లాసును శ్రీఫణిరాజ్‌కు కేటాయించారు. కానీ, శ్రీఫణిరాజ్ గాజు గ్లాసు గుర్తుతో ప్రచారం చేసుకోవడంతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఫొటోను కూడా తన ప్రచార వాహనంపై వేసుకున్నారు. దీని వెనుక వైసీపీ నాయకుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు ఉన్నాయి. ఓటర్లను తికమక పెట్టి ఓట్లను చీల్చేందుకే ఈ కుట్ర పన్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవు.

● 58, 59 డివిజన్లలో మంగళవారం తిరిగిన వైసీపీ ఆటోల్లో.. 'టీడీపీ అభ్యర్థి బొండా ఉమా ఓ గూండా' అంటూ ప్రచారం చేశారు. దీనిపై టీడీపీ నాయకులు అభ్యంతరం తెలిపారు. స్థానిక ఆంధ్రప్రభ కాలనీ, సాయిబాబా ఆలయం వద్ద ప్రచారం నిర్వహిస్తున్న ఆటోలను టీడీపీ మహిళా నాయకురాలు దాసరి ఉదయశ్రీ అడ్డుకున్నారు. ఎంకే బేగ్ స్కూల్ ప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆటోను రవితేజ అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక వైసీపీ నేతలు పదులసంఖ్యలో ఎంకే బేగ్ స్కూల్ వద్దకు చేరుకుని బొండా సిద్ధార్థ కారును అడ్డగించి వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపేశారు. దీనిపై టీడీపీ నేతలు సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, ఈ ఘటనపై టీడీపీ, వైసీపీ నేతల పరస్పర ఫిర్యాదుల మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇరువర్గాల ఫిర్యాదులు స్వీకరించిన పోలీసులు విచారణ చేపట్టారు.

ఓటమి భయంతోనే..

- బొండా రవితేజ

ఓడిపోతున్నామన్న భయంతో వైసీపీ నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారు. అడ్డుకున్న టీడీపీ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. ఎన్ని అక్రమాలకు పాల్పడినా దొంగ కేసులు పెట్టినా మేము వెనక్కి తగ్గేది లేదు.

కూటమికి మద్దతిచ్చాడని కక్ష సాధింపు!


బీజేపీ నాయకుడు తోటకు వెళ్లే రహదారిని ఎక్స్‌కవేటర్‌తో తవ్వేస్తున్న దృశ్యం

విస్సన్నపేట, మే 7 : కూటమికి మద్దతుగా ప్రచారంలో పాల్గొంటున్నారని పుట్రేల గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు చండిగ వేణు తన మామిడి తోటకు వెళ్లే డొంక రహదారిని ఫారెస్టు అధికారులు మంగళవారం పొక్లెయిన్‌తో తవ్వేశారు. విషయం తెలుసుకున్న కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కొలికపూడి శ్రీనివాసరావు రైతుకు మద్దతుగా నిలిచి అధికారులతో మాట్లాడటంతో తవ్విన మట్టిని తిరిగి సరిచేశారు. కొందరు అధికారులు ఇంకా అధికార పార్టీకి కొమ్ము కాస్తున్నారని, ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ అధికార పార్టీకి కొమ్ము కాయడం సరికాదని తీరు మార్చుకోవాలని కొలికపూడి ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులపై రాజకీయ కక్ష సాధింపు సరికాదన్నారు.

ఎట్టకేలకు తొలగించారు..

» రెండేళ్ల తర్వాత వల్లూరు రాజా సెంటర్‌కు మోక్షం



మచిలీపట్నం టౌన్, మే 7 : ఎట్టకేలకు వల్లూరురాజా సెంటర్‌లో బారీకేడ్లను మంగళవారం తొలగించారు. రెండేళ్ళ తరువాత బారీకేడ్లు తొలగించడంతో మచిలీపట్నం నగర ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వైసీపీ యాత్రలో స్తేనే బారీకేడ్లు తొలగిస్తారా అన్న వార్తకు పోలీసులు స్పందించారు. వల్లూరు రాజా సెంటర్‌లో బారీకేడ్లు తొలగించాలని వ్యాపారులు పలు పర్యాయాలు నగర పాలక సంస్థ అధికారులు, పాలకులను కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ బారీకేడ్లను జనసైనికులతో తొలగించి ట్రాక్టర్లపై తీసుకువెళ్ళి మునిసిపల్ క్యాటిల్ డిపో వద్ద పడవేసిన సంగతి తెలిసిందే. జిల్లా కలెక్టర్‌కు టీడీపీ, జనసేన నాయకులు బారీకేడ్లు తొలగించాలని పలు పర్యాయాలు వినతిపత్రాలు సమర్పించారు. ఆసుపత్రులు, విద్యాసంస్థలకు వెళ్ళే ఈ సెంటర్‌లో బారీకేడ్లు తొలగించడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని పలు పర్యాయాలు ఉద్యమించారు. వినతిపత్రాలు సమర్పించారు. వైసీపీ బస్సు యాత్రకు వచ్చినప్పుడు, సీఎం జగన్‌మోహనరెడ్డి వచ్చినప్పుడు మాత్రమే బారీకేడ్లు తొలగిస్తున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన కథనానికి ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. ఎట్టకేలకు బారీకేడ్లు తొలగించారు.

పోటీకి నిరాకరించాననే..
నాపై అక్కసు!

» జగన్ రోత పత్రికలో రోజూ తప్పుడు కథనాలు

» ఎలాగైనా ఓడించాలని నూరు కోట్లతో సజ్జల పైరవీలు

» మైలవరం కూటమి అభ్యర్థి వసంత సంచలన వ్యాఖ్యలు


కనిమెర్లలో వసంత కృష్ణప్రసాద్ ఎన్నికల ప్రచారం

మైలవరంరూరల్, మే 7 : మైలవరం సీటు ఇస్తా.. ఖర్చు భరిస్తా.. వైసీపీ తరఫున పోటీ చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి చెప్పినా వినకుండా టీడీపీ తరఫున పోటీలో నిలిచాననే అక్కసుతోనే జగన్ రోత పత్రికలో రోజూ తనపై తప్పుడు కథనాలు వండి వార్చుతున్నారని మైలవరం కూటమి అభ్యర్థి వసంత కృష్ణప్రసాద్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తోలుకోడు, వెదురుబీడెం, కనిమెర్ల, పోరాటనగర్లలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలకగా.. దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ, తాను అక్రమాలు, అవినీతికి పాల్పడితే ఏ విచారణకైనా సిద్ధమని సవాల్ విసిరారు. దేవినేని ఉమాకు, తనకు గత కొంతకాలంగా రాజకీయ వైరం ఉన్న మాట అందరికీ తెలిసిందేనన్నారు. పార్టీ అధిష్ఠానం, అధినేత చంద్రబాబు నిర్ణయం మేరకు నడుచుకుంటామన్నారు. జగన్ సొంత పత్రికలో తనపై తప్పుడు కథనాలతో పాటు ఆయన సొంత చెల్లి షర్మిల చేస్తున్న ఆరోపణలపైనా రాయాలని, అప్పుడే ప్రజలు విశ్వసిస్తారన్నారు. మా అన్న మోసగాడు, దొంగ, హత్యలు చేయిస్తాడు, అబద్ధాలు చెబుతాడు అంటూ గొంతెత్తి అరుస్తుంటే జగన్ సొంత పత్రికలో ఎందుకు రాయడం లేదని ప్రశ్నించారు. మైలవరంలోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో పెత్తందారుల సమావేశం ఏర్పాటు చేసి.. టీడీపీ తరఫున పోటీ చేస్తున్న తనను ఓడించేందుకు ముఖ్యమంత్రి జగన్ సారథ్యంలో కడప, కర్నూలు నుంచి లుంగీ బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ వాళ్లను దించారని విమర్శించారు. పెత్తందారులతో సమావేశం ఎందుకు ఏర్పాటు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. స్థానిక వైసీపీ నాయకులకు డబ్బు, మద్యం ఇస్తే కాజేస్తారని తమ వాళ్లతో స్వయంగా డబ్బు, మందు పంపిణీ చేయడం కోసం రూ.100కోట్లతో సజ్జల మైలవరం వచ్చారని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తనను ఓడించడమే లక్ష్యంగా సజ్జల అండ్‌కో టీమ్ రంగంలోకి దిగిందన్నారు. సర్పాలను కీలుబొమ్మ చేసి భారీ కుట్రకు తెరతీస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వైసీపీ నుంచి డబ్బులు తీసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా కేశినేని చిన్నిలను గెలిపిస్తేనే మైలవరం నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి అక్కల గాంధీ, తాతా పోతురాజు, ఇనుగంటి శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

మైలవరంలో 'సజ్జల' మంత్రాంగం!

» సుమారు 300 మందితో రహస్య సమావేశం

» పోలీసుల రాచమర్యాదలు

» మీడియాకు నో ఎంట్రీ

» 11న జగన్ సభ గురించి అని కలరింగ్



మైలవరం : సకలశాఖా మంత్రి.. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి పట్ల పోలీసులు స్వామి భక్తిని చాటుకున్నారు. మైలవరంలో మంగళవారం సుమారు 300 మందితో రహస్య సమావేశం విషయాన్ని గోప్యంగా ఉంచినా అది గుప్పుమంది. వసంత కృష్ణ ప్రసాద్‌ను ఎలాగైనా ఓడించాలని పార్టీ ముఖ్య నాయకులకు, సామాన్యుడని చెప్పుకుంటున్న అభ్యర్థి సర్నాల తిరుపతిరావుపై పెత్తనం చేసేందుకు పెట్టిన ముగ్గురు సమన్వయకర్తలకు సజ్జల దిశా నిర్దేశం చేసినట్టు తెలిసింది. అయితే ఈనెల 11న జగన్మోహన్ రెడ్డి మైలవరం సభను విజయవంతం చేయాలనే సమావేశం పెట్టినట్టు వైసీపీ కలరింగ్ ఇచ్చుకుంది. అయితే అంతర్గతంగా ఎన్ని కుట్రలు చేసైనా వసంతను ఓడించాలనే ఆద్యంతం సమావేశం సాగినట్టు సమాచారం. ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తమకు అనుకూలంగా పడలేదని, పరిస్థితి చేయిదాటి పోయిందనే ఉద్దేశంతోనే సజ్జల మైలవరం ఎంట్రీ ఇచ్చినట్టు గుసగుసలు వినిపిస్తు

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా 47% హోమ్ ఓటింగ్

» నేడు కూడా ఓటింగ్‌కు అవకాశం


హోమ్ ఓటింగ్‌ను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : వయోవృద్ధులు, దివ్యాంగుల అభ్యర్థనల మేరకు మంగళవారం ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన 'హోమ్ ఓటింగ్' ప్రశాంతంగా సాగింది. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1052 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 85 ఏళ్ల వయస్సు దాటిన వయోవృద్ధులు 640 మంది, 40 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు 412 మంది ఉన్నారు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసే నాటికి 47.05 శాతం మేర పోలింగ్ నమోదైంది. మొత్తం 495 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 85 సంవత్సరాలు పైబడిన వారిలో 340 మంది, దివ్యాంగులు 155 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. విజయవాడ తూర్పు నియోజకవర్గం పరిధిలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి దిల్లీరావు పీఅండ్‌టీ కాలనీలో జరిగిన హోమ్ ఓటింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. హోమ్ ఓటింగ్ సందర్భంగా ప్రిసైడింగ్ ఆఫీసర్, మైక్రో అబ్జర్వర్, ఆయా పార్టీల ఏజంట్లు, సాయుధ పోలీసులు దరఖాస్తు చేసుకున్న వారింటికి వెళ్లారు. బ్యాలెట్ ఓట్ల ప్రక్రియలో ఎలాంటి విధానాన్ని అవలంబిస్తారో అలాంటి ప్రక్రియనే పూర్తిచేసి వృద్ధులు, దివ్యాంగుల ఓటరు ఐడీలను పరిశీలించి వారికి బ్యాలెట్లు ఇచ్చి సిరా మార్కు వేశారు. ఆ తర్వాత రహస్య ఓటింగ్ వేసేలా ఏర్పాట్లు చేశారు. కవర్లకు సీల్ వేయించిన తర్వాత వాటిని పోస్టల్ బ్యాలెట్ బాక్సులలో వేయించారు. జిల్లా వ్యాప్తంగా విజయవాడ తూర్పు నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 88 మంది, దివ్యాంగ ఓటర్లు 20 మంది మొత్తంగా 108 మంది హోమ్ ఓటింగ్‌లో పాల్గొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 46 మంది, దివ్యాంగ ఓటర్లు 30మంది.. జగ్గయ్యపేట నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 34, దివ్యాంగ ఓటర్లు 11 మంది.. తిరువూరు నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 42, దివ్యాంగ ఓటర్లు 24 మంది.. నందిగామ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 37, దివ్యాంగ ఓటర్లు 28 మంది.. విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 56 మంది, దివ్యాంగ ఓటర్లు 29 మంది.. మైలవరం నియోజకవర్గంలో వయోవృద్ధ ఓటర్లు 37 మంది, దివ్యాంగ ఓటర్లు 50 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం పోలింగ్ సిబ్బంది 495 మంది ఇళ్లకు మాత్రమే వెళ్లగలిగారు. ఇంకా 557 మంది హోమ్ ఓటింగ్‌ను ఉపయోగించుకోవాల్సి ఉంది. బుధవారం కూడా హోమ్ ఓటింగ్‌ను కొనసాగించాలని నిర్ణయించారు.

గుడివాడను అభివృద్ధి పథాన నడిపిస్తా

» కూటమి అభ్యర్థి వెనిగండ్ల రాము



గుడివాడ రూరల్, మే 7 : గుడివాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని కూటమి టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము అన్నారు. మంగళవారం లింగవరం, వలివర్తిపాడు, మోటూరు తదితర గ్రామాల్లో వెనిగండ్ల రాము, జనసేన పార్టీ ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ ఆధ్వర్యంలో యువకులు ద్విచక్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేని కొడాలి నానికి ఇంకా ఐదేళ్లు సమయం కావాలనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో ఉంటూ నెలకొకసారి వచ్చిపోయే నాని స్థానికుడు ఎలా అవుతాడని, నాని కుమార్తెలు ఎక్కడ ఉన్నారో తెలియజేయాలన్నారు. స్థానికుడు అని చెప్పే నాని టీవీల్లో చూడటమే కానీ, ఇంటికి వస్తే కనిపించడని ఎద్దేవా చేశారు. గత ఐదేళ్లుగా ప్రతీ గ్రామంలో ఎన్నిసార్లు వచ్చాడు, ఆ గ్రామంలో ఎన్ని సమస్యలు పరిష్కారించారో చెప్పటానికి సిద్ధంగా ఉన్నారా? అని సవాల్ విసిరారు. ప్రజలకు అందుబాటులో ఉండని నాని తెలుగుదేశం నాయకులను విమర్శించటమే పరిపాటి అని పేర్కొన్నారు. స్థానిక సమస్యలు గాలికొదిలేసి ఎన్నో వేరే విషయాలు మాట్లాడటం నానికే చెల్లిందన్నారు. గుడివాడలో వర్షం వస్తే రోడ్లు, డ్రైనేజీలు కలసిపోయి చెరువుల్లా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. గత 20 సంవత్సరాలుగా ఉన్న ఎమ్మెల్యే కనీసం డ్రైనేజీ, మౌళిక వసతులు కల్పించలేని నాని ఇంకా గుడివాడ ప్రజలకు కావాలా? అన్నారు. మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళీ, మాజీ జడ్పీటీసీ కాటూరి జాన్ శ్యామ్యూల్, గొర్రె రంగా, చీకటి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు నేడు చివరిరోజు

ఇంకా ఓటేయని 2 వేల మందికి పైగా ఉద్యోగులు

» కామన్ ఫెసిలిటేషన్ సెంటర్లు మూత

» ఏ నియోజకవర్గాల వారు అక్కడే ఓటేయాలని అధికారుల నిర్దేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా మంగళవారం 750 మంది ఉద్యోగులు ఓటేశారు. 2 వేల మందికి పైగా ఉద్యోగులు తమ ఓటు వేయాల్సి ఉంది. బుధవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేయడానికి చివరి రోజు కావటంతో ఆందోళన నెలకొంది. ఇప్పటికే వీవీఐపీల దగ్గర పనిచేసే పోలీసులకు ఎలక్షన్ కమిషన్ 9వ తేదీన ఓటేసే అవకాశం ఇచ్చింది. దీంతో సాధారణ ఉద్యోగులకు కూడా మరో రోజు గడువు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం మంగళవారం ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కామన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను తీసేశారు. ఫెసిలిటేషన్ సెంటర్లను అసెంబ్లీ నియోజకవర్గాలకే పరిమితం చేశారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశాల మేరకు ఉద్యోగులకు ఎక్కడ ఓటు ఉంటే ఆ నియోజకవర్గంలోనే ఓటేయాలని నిర్దేశించారు. ఐజీఎంసీలో కామన్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను తొలగించటంతో ఓటేయ డానికి వచ్చిన ఉద్యోగులు తుమ్మలపల్లిలో ఉన్న కేంద్రానికి వచ్చారు. తుమ్మలపల్లి కేంద్రాన్ని తొలగించినా అత్యవసర సేవల ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ కోసం పునరుద్ధరించారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రావటంతో వారంతా ఓటేయడానికి వీలవ్వదని, సొంత నియోజకవర్గాల్లో ఓటేయాలని పోలింగ్ అధికారులు సూచించారు. అత్యవసర సేవల కిందకు వచ్చే జర్నలిస్టులు, అగ్నిమాపక సిబ్బంది, పోస్టల్, టెలికం, దూరదర్శన్, ఆకాశవాణి ఉద్యోగులు 568 మంది మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటేశారు.

పోలీసులకు పోలింగ్ అధికారులకు మధ్య వాగ్వివాదం


విజయవాడలో ఓట్లు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్న పోలీసులు

తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన కామన్ ఫెసిలిటేషన్ సెంటర్‌కు వచ్చిన పోలీసులకు ఇక్కడ జాబితాలో పేర్లు లేవు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఇక్కడ ఓటు లేకపోతే సొంత నియోజకవర్గాల్లో ఓటేసుకోవచ్చని అధికారులు సూచించారు. తమ సొంత నియోజకవర్గాలకు వెళ్లామని, అక్కడ కూడా లిస్టులో తమ పేర్లు లేవని పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఓటు ఇక్కడే వేస్తామని గట్టిగా బదులివ్వడంతో పోలీసులు, పోలింగ్ అధికారుల మధ్య కొంత సేపు వాగ్వివాదం జరిగింది. తమ దగ్గర ఉన్న లిస్టుల్లో పేర్లు లేకపోతే తామేమీ చేయలేమని పోలింగ్ అధికారులు చెప్పారు.

పేర్లు లేవని గన్నవరం ఉద్యోగుల ఆందోళన

ఎన్టీఆర్ జిల్లా పరిధిలో విధులు నిర్వహించే కృష్ణాజిల్లా గన్నవరం నియోజకవర్గానికి చెందిన ఉద్యోగులు ఓటేయడానికి గన్నవరం నియోజ కవర్గానికి వెళ్లారు. అక్కడ ఓటర్ల జాబితాలో వారి పేర్లు లేవు. దీంతో వారు ఆందోళన వ్యక్తంచేశారు. రిటర్నింగ్ అధికారితో వాగ్వివాదానికి దిగారు. ఎన్టీఆర్ జిల్లాలో పని చేసే గన్నవరం ప్రాంత ఉద్యోగుల వివరాలను కృష్ణాజిల్లా ఎన్నికల యంత్రాం గానికి, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం పంపింది. అయినా అక్కడి అధికారులు వారి పేర్లను గన్నవరం ఓటర్ల జాబితాలోకి ఎక్కించ లేదు. దీంతో ఈ సమస్య వచ్చింది. దీనిపై రిటర్నింగ్ అధికారి ఉద్యోగుల పేర్లను నమోదు చేసుకుని ఉన్నతాధికారులతో మాట్లాడి ఓటేసేలా చూస్తామని చెప్పారు. దీంతో వివాదం సమసింది.

ఇప్పటివరకు ప్రశాంతంగా నిర్వహించిన పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్ మంగళవారం గందరగోళంగా మారింది. ఫెసిలిటేషన్ కేంద్రాలకు పంపిన జాబితాల్లో పేర్లు లేకపోవటంతో ఉద్యోగులు, పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.


గన్నవరంలో ఓట్లు లేవని ఆందోళన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు


ఖాళీ స్థలంలో నిల్వ చేసిన మద్యం బాటిళ్లు

1,190 మద్యం బాటిళ్లు స్వాధీనం

వత్సవాయి, మే 7 : పోలంపల్లి గ్రామంలో గోవాకు చెందిన నాన్ పెయిడ్ మద్యం 1,190 క్వార్టర్ బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారిణి లక్ష్మీ భార్గవి మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని దారెల్లి రవీంద్రబాబుకు చెందిన ఖాళీ స్థలంలో డంప్ చేసిన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఎక్సైజ్ సీఐ మణికంఠారెడ్డికి అప్పగించినట్టు ఆమె తెలిపారు. స్థల యజమాని అందుబాటులో లేనందున విచారణ చేస్తున్నట్టు తెలిపారు. పోలంపల్లిలో వైసీపీకి చెందిన కొందరు వ్యక్తులు మద్యం డంప్ చేశారని అధికారులకు సమాచారం ఇచ్చినట్టు టీడీపీ నేతలు తెలిపారు. అధికారులు మాత్రం కేసును పక్కదారి పట్టించేలా చేస్తున్నారని ఉన్నతాధికారులు, స్పందించి స్థల యజమానిపై కేసు నమోదు చేయించాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు.

ధనంబోడులో 35 బాక్సులు..



జగ్గయ్యపేట : పట్టణంలో ధనంబోడులో అక్రమంగా నిల్వ ఉంచిన 35 బాక్సుల తెలంగాణా మద్యం స్వాధీనం చేసుకుని గోపీ కృష్ణ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్టు సెబ్ సీఐ మణికంఠారెడ్డి తెలిపారు. అలాగే మంగళవారం దాడులు చేసి రెండు బైక్‌లపై 400 మద్యం సీసాలను రవాణా చేస్తున్న నలుగురు వత్సవాయి మండలం చిట్యేలకు చెందిన వ్యక్తులను గుర్తించినట్టు సీఐ వివరించారు. లంకెల రాజశేఖరరెడ్డి దొరికాడని, మిగిలిన ముగ్గురు బూదాటి శ్రీనివాసరెడ్డి, ప్రదీప్‌రెడ్డి, వీరారెడ్డిలు పరారయ్యారని చెప్పారు.



గంపలగూడెంలో 70 బాటిళ్లు..

తిరువూరు : స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో సర్కిల్ పరిధిలోని గంపలగూడెం మండలంలో అధికారులు మంగళవారం నాటుసారా, బెల్టు షాపులపై దాడులు నిర్వహించారు. ఎస్ఈబీ సీఐ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గంలపగూడెం మండలం, కనుమూరు గ్రామంలో బొల్లికొండ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని, అతడి నుంచి 70 తెలంగాణ మద్యం సీసాలు, ద్విచక్రవాహనం, షేక్‌బాజీని అదుపులోకి తీసుకొని అతడి నుంచి 70 మద్యం బాటిళ్లు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు తెలిపారు.


మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

కూటమి, వైసీపీల్లో అధికారమెవరిదైనా
బీజేపీకొచ్చిన నష్టమేమీ లేదు

» చంద్రబాబు, జగన్..మోదీ చేతిలో కీలుబొమ్మలు

» ప్రజాస్వామ్య పరిరక్షణకు ఇండియా కూటమిని గెలిపించండి: సీపీఐ నేత కె.నారాయణ

భవానీపురం, మే 7: "రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి, వైసీపీల్లో ఎవరు అధికారంలోకి వచ్చినా బీజేపీకి వచ్చిన నష్టం ఏమీ లేదని, చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డి ఇద్దరిపై కేసులున్న కారణంగా మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారతారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. ఇండియా కూటమి బలపర్చిన సీపీఐ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి జి.కోటేశ్వరరావు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నిర్వహించిన స్కూటల్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అధికారం కోసం బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని, మహారాష్ట్రలో ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చి తనకు అనుకూలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందని నారాయణ అన్నారు. లౌకిక ప్రజాస్వామ్య పరి రక్షణకు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ప్రభుత్వాల్ని బీజేపీ కూల్చేస్తుందని ఆయన హెచ్చరించారు. ముస్లింలకు రిజర్వేషన్లు రద్దు చేస్తాననడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. తనను ఎమ్మెల్యేగా, వల్లూరి భార్గవ్‌ను ఎంపీగా గెలిపించాలని పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి కోటేశ్వరరావు ప్రజలను కోరారు. భవానీపురం దర్గా వద్ద ప్రారంభమైన ర్యాలీ స్వాతి థియేటర్‌రోడ్డు, ఊర్మిళానగర్, ఆర్టీసీ వర్క్‌షాపు, కుమ్మరిపాలెం, చెరువు సెంటర్, సితార సెంటర్, ఎర్రకట్ట బ్రిడ్జి, చిట్టినగర్, పంజా సెంటర్, పెజ్జోనిపేట వరకు సాగింది. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఎం నాయకులు బోయి సత్తిబాబు, సీపీఐ విజయవాడ నగర సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు కేవీ భాస్కరరావు, తాడి పైడయ్య, మూలి సాంబశివరావు పాల్గొన్నారు.

ఆటో, ట్రాలీ ఢీ.. మహిళ మృతి

జగ్గయ్యపేట, మే 7 : పట్టణంలో బలుసుపాడురోడ్డులో ఆటోను ట్రాలీ ఢీకొన్న ఘటనలో బూదవాడకు చెందిన గుగ్గోతు విజయ (35) దుర్మరణం చెందింది. మంగళవారం మధ్యాహ్నం ఆటో జగ్గయ్య పేట నుంచి బూదవాడకు బయల్దేరిన కొద్ది సేపటికే రోడ్డులో చిన్నేరు దాటిన తర్వాత ఎదురుగా వస్తున్న ట్రాలీ ఢీకొట్టింది. దీంతో పట్టణంలో పనిమీద వచ్చిన విజయ అక్కడికక్కడే మృతి చెందింది. మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విజయవాడ

● తూర్పు ● సెంట్రల్ ● పశ్చిమ



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	153, 162, 173
చికెన్ విత్ స్కిన్	294
చికెన్ స్కిన్‌లెస్	304

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.65

కేశినేని చిన్ని, సుజనాల విజయాన్ని కోరుతూ

54వ డివిజన్‌లో బేగ్, గన్నె ప్రచారం

వన్‌టౌన్, మే 7: పశ్చిమ నియోజకవర్గంలోని 54వ డివిజన్‌లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్, రాష్ట్ర కార్యదర్శి గన్నె వెంకట నారాయణ ప్రసాద్‌లు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరిలను భారీ మెజారిటీతో గెలిపించాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. నియోజకవర్గం మైనార్టీ అధ్యక్షుడు పతావుల్లా, సయ్యద్ ఇమ్రాన్, అధికార ప్రతినిధి సత్తార్, మోబీన్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తే విద్యుత్ చార్జీలు పెరగవు

కేశినేని జానకీ లక్ష్మి



ఎన్నికల ప్రచారంలో కేశినేని జానకీ లక్ష్మి

సత్యనారాయణపురం, మే 7: టీడీపీ అధికారంలోకి రాగానే ధరలు నియంత్రించే చర్యలు చేపట్టి సామాన్యులపైన భారం తగ్గించడంతో పాటు విద్యుత్ చార్జిలు పెంచకుండా చంద్రబాబు చర్యలు తీసుకుంటారని విజయవాడ టీడీపీ ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) సతీమణి కేశినేని జానకీ లక్ష్మి అన్నారు. 32వ డివిజన్ లోటస్‌ల్యాండ్‌మార్క్ సెక్టార్ 1, 2 ,3లో మంగళవారం బొండా ఉమామహేశ్వరరావు సతీమణి బొండా సుజాతతో కలిసి ఆమె ఎన్నికల ప్రచార ర్యాలీ నిర్వహించారు. కేశినేని జానకీ లక్ష్మి మాట్లాడుతూ సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులైన ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని), సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావును సైకిల్‌గుర్తుపైన ఓటు వేసి గెలిపించాలన్నారు. జగన్మోహనరెడ్డిని ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రవాణిజ్య విభాగం అధ్యక్షుడు దూండీ రాకేష్, కార్పొరేటర్ చెన్నగిరి రామ్మోహనరావు, నాగేష్, మురళీ, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకే సమస్యాత్మకంగా మారిన వెలంపల్లి, బొండా

సీపీఎం సెంట్రల్ అభ్యర్థి సీహెచ్ బాబూరావు



సత్యనారాయణపురంలో ప్రచారం నిర్వహిస్తున్న బాబూరావు

సత్యనారాయణపురం, మే 7: ప్రజలకే సమస్యాత్మకంగా మారిన నేతలు వెలంపల్లి శ్రీనివాసరావు, బొండా ఉమామహేశ్వరరావు అని సీపీఎం సెంట్రల్ నియోజకవర్గ అభ్యర్థి సీహెచ్ బాబూరావు ఆరోపించారు. 33వ డివిజన్ సత్యనారాయణపురంలో మంగళవారం కాంగ్రెస్ నేతలు నరహరిశెట్టి నరసింహారావు, వి.గుర్నాధంతో కలిసి బాబూరావు ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గాన్ని ఎన్నికల కమిషన్ సమస్యాత్మక నియోజకవర్గంగా ప్రకటించిందన్నారు. మోడల్ నియోజకవర్గంగా మారుస్తానని ప్రకటించిన వైసీపీ, టీడీపీ నేతలు సమస్యాత్మక ప్రాంతంగా మార్చడం సిగ్గుచేటన్నారు. నగరంలో ప్రశాంత వాతావరణం కోసం బాబూరావును గెలిపించాలన్నారు. సీపీఎం నాయకులు సాంబశివరావు, రాము, వేముల శ్రీనివాస్, సుప్రజ, మురళి, చారి, సాగర్ పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం



ప్రచారంలో భార్గవ్, నాంచారయ్య

విజయవాడ, మే 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్ పార్టీతో నే సాధ్యమని విజయవాడ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి వల్లూరి భార్గవ్, తూర్పు నియోజకవర్గ అభ్యర్థి పొనుగుపాటి నాంచారయ్య అన్నారు. లబ్బీపేటలో వారు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించి వైసీపీ, కూటమి పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు.

జనసేనలో చేరికలు

లబ్బీపేట, మే 7: డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ (15వ)డివిజన్ నుంచి 25మంది వైసీపీ కార్యకర్తలు గుండు వెంకట దుర్గారామ్ ఆధ్వర్యంలో జనసేన పార్టీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు అమ్మిశెట్టి వాసు సమక్షంలో లబ్బీపేట లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ వైసీపీ నేత ఆళ్ల చల్లారావు, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గలు డివిజన్‌లో పని చేస్తున్న నాయకులు, కార్యకర్తలకు విలువ ఇవ్వడం లేదని, ఆ కారణంగానే యువత జనసేన పార్టీ పట్ల ఆకర్షితులవుతున్నారని, కూటమి దెబ్బకు ఫ్యాన్ రెక్కలు ఊడిపడనున్నాయని జోస్యం చెప్పారు. వెంకట దుర్గారామ్ మాట్లాడుతూ గతంలో తాను జనసేనలో పని చేశానని కొంత మంది వ్యక్తుల కారణంగా వైసీపీలో చేరాల్సి వచ్చిందని తప్పు తెలుసుకుని మళ్లీ సొంత గూటికి రావడం ఆనందంగా ఉందన్నారు. కృష్ణ ప్రసాద్, నాగమల్లేశ్వరరావు, శ్రీకాంత్, శేషు బాబి, తేజ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రజక అభ్యుదయ సంఘం నేతల ప్రచారం

పాయకాపురం, మే 7 : అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం ప్రాంతాల్లో రజక అభ్యుదయ సంఘం నేతలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ రజక అభ్యుదయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరిపల్లి మధుసూదనరావు, ప్రధాన కార్యదర్శి దడిగ సుబ్రహ్మణ్యంలు రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, టీడీపీ సెంట్రల్ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావులను గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను స్థానికులకు పంపిణీ చేశారు. జి. నాగేశ్వరరావు, నూతక్కి నాగరాజు, పెట్లూరి రవి, చర్ల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

సుజనా, శివనాథ్‌ల విజయాన్ని కోరుతూ విస్తృత ప్రచారం



పోలేరమ్మగుడి ప్రాంతంలో మోరబోయిన రాంబాబు ప్రచారం

భవానీపురం, మే 7 : రాష్ట్రంలో జగన్ అరాచక పాలనకు చరమగీతం పాడాలంటే కూటమి నుంచి ఎంపీగా కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేగా యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరిలను అఖండ మెజార్టీతో గెలిపించి తీరాలని 43వ డివిజన్ సీనియర్ నాయకులు మోరబోయిన రాంబాబు పిలుపునిచ్చారు. బొమ్మసాని సుబ్బారావు ఆధ్వర్యంలో భవానీపురంలోని సీతానగర్ రెడ్డి ప్లాట్స్, ఊర్మిళానగర్ పోలేరమ్మ గుడి ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఆయన మంగళవారం ప్రచారం చేశారు. మాగం ఆత్మారామ్, మోడీ వెంకట్రాజు, తెల్లగడ్డల దుర్గారావు, కాకర్ల కోటి, రాయల శ్రీను, నారుబోయిన పెద్దరాజు, వేల్పుల నవీన్‌లు పాల్గొన్నారు.

● భవానీపురం ఊర్మిళానగర్ మెయిన్ రోడ్డులో కీలకమైన ఏకలవ్యనగర్‌లో 43వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు కొనికి కొండయ్య, ఆధ్వర్యంలో ఎమ్మెల్యేగా సుజనా చౌదరీని, ఎంపీగా కేశినేని శివనాథ్ (చిన్ని)లను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంచుతూ ఓటర్ల స్లిప్పులను అందజేసి పోలింగ్ కేంద్రాల వివరాలను తెలుపుతూ ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. మల్లెబోయిన కొండ, క్లస్టర్ ఇన్‌చార్జి అలుగాండ్ల సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, నర్సింహలు పాల్గొన్నారు.

ఆ చట్టం..జగన్ మెడకు ఉరితాడే

మూడో డివిజన్లో ఎన్నికల ప్రచారంలో తూర్పు ఎమ్మెల్యే గద్దె



మూడో డివిజన్లో స్థానికులతో మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్, 16వ డివిజన్‌లో అనురాధ ప్రచారం

గుణదల, మే 7: ఏపీలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమల్లోకి వస్తే పేదల భూములకు రక్షణ ఉండదని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మూడవ డివిజన్లోని విజయనగర్ కాలనీలో గద్దె రామ్మోహన్ మంగళవారం ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం ద్వారా పేదల ఆస్తులకు రక్షణ లేకుండా పోతుందని మేధావులు చెబుతున్నారన్నారు. ఇది అధికారులతో కాకుండా న్యాయ వ్యవస్థతో సంబంధమైన అంశమని చెప్పారు. ఈ చట్టం వస్తే పేద, మధ్యతరగతి ప్రజలు కష్టపడి సంపాదించుకున్న భూములకు ఏమాత్రం రక్షణ ఉండదని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అనే తాడు జగన్ మెడకు చుట్టుకుని ఉరి వేయడం ఖాయమని జోస్యం చెప్పారు. పోతంశెట్టి నాగేశ్వరరావు, తాడి బాబూరావు, గుత్తికొండ కృష్ణమోహన్, గుత్తికొండ మోహనరావు, బండి కోమలి, పేరేపి ఈశ్వర్ పాల్గొన్నారు.

దందాలు చేసే సంస్కృతి నాది కాదు

తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం మాచవరం యారం వారి వీధిలో పర్యటించి ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. 2వ డివిజన్లోని మసీదురోడ్, యారంవారి వీధి, కార్మికనగర్, పడవలరేవు సెంటర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన స్థానికులు చెప్పిన సమస్యలను సానుకూలంగా విన్నారు. కూటమి అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. రౌడీయిజం చేయడం, కమిషన్లకు కక్కుర్తిపడటం, తన సంస్కృతి కాదని ఆ తరహా నాయకులు ఉన్న వైసీపీని మరోమారు నెత్తిన పెట్టుకోవడానికి ఓటర్లు సాహసం చేయడానికి సిద్ధంగా లేరన్నారు. తగాదాలకు పోకుండా ప్రజల పక్షాన ఉంటున్న తనను మరోమారు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఎలిశల శ్రీనివాస్, వెల్లంకి సుధాకర్, పి.రత్నశ్రీ పాల్గొన్నారు.

మంచిపాలన కోసం

సైకిల్ గుర్తుపై ఓటెయ్యండి: అనురాధ

పటమట: పటమటలోని 11వ డివిజన్‌లో కుర్రా వారి వీధిలో కూటమి అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)ల విజయాన్ని కాంక్షిస్తూ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ప్రతీ ఒక్కరిని కలిసి కూటమి ప్రభుత్వం వచ్చాక అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె అనురాధ మాట్లాడుతూ మంచి పాలనను తెచ్చుకొనేందుకు ప్రజలంతా రెండు ఓట్లను సైకిల్ గుర్తుపై వేసి గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్(చిన్ని)లను గెలిపించాలని కోరారు. కోనేరు రాజేష్, పాశం సుజాత, ఎన్.ఉషారాణి పాల్గొన్నారు.

రామలింగేశ్వరనగర్: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ మంగళవారం 16వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి అభ్యర్థుల ప్రచార కార్యక్రమాలకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి స్వాగతాలు, హారతులు పడుతున్నారని అన్నారు. ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలంటే సైకిల్ గుర్తు పై ఓట్లు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాలన్నారు. తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్‌లకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.

ఓటుతో వైసీపీని కూల్చేద్దాం

- గద్దె రాజేష్, క్రాంతి

పటమట: జగన్ మోహన్‌రెడ్డి తన పాలనకు ప్రజావేదిక కూల్చివేతతో మొదలుపెట్టాడని, వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ ప్రభుత్వాన్ని కూల్చి వేద్దామని గద్దె రామ్మోహన్ తనయులు గద్దె రాజేష్, క్రాంతిలు అన్నారు. 11వ డివిజన్ పటమట హైస్కూల్ రోడ్డులో మంగళవారం గద్దె రాజేష్, క్రాంతిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన, బీజేపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. కూటమి బలపర్చిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు గద్దె రామ్మోహన్, కేశినేని శివనాథ్‌లను గెలిపించాలని అభ్యర్థించారు. కోనేరు రాజేష్, పాశం సుజాత, తులిమల్లి రాజా,పామర్తి కిషోర్ పాల్గొన్నారు.

వన్‌టౌన్: ఆరో డివిజన్ బండెల దొడ్డి ప్రాంతంలో మంగళవారం యువనాయకులు గద్దె రాజేష్, గద్దె క్రాంతి, గద్దె హేమాన్ష్ ప్రచారం చేశారు ఇంటింటికి తిరిగి ఓట్లు అభ్యర్థించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, జరగనున్న పోలింగ్‌లో ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని) ను, తూర్పు అభ్యర్థి గద్దె రామ్మోహన్‌ను గెలిపించాలని కోరారు. పడాల గంగాధర్, అమిర్నేని కరుణ, పల్లి దుర్గాప్రసాద్, మోహన్ రావు, సూరిబాబు, అప్పారావు, సీరా ప్రసాద్, అక్షిత, కల్యాణి పాల్గొన్నారు.

ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ కార్యక్రమాలు



కృష్ణలంక, మే 7 : సాధారణ ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ఓటింగ్ శాతం పెంచేందుకు మంగళవారం గొల్లపూడిలోని జిల్లా ట్రైనింగ్ సెంటర్‌లో డ్వాక్రా మహిళలకు స్వీప్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గంలోని యువతకు, స్వయం సహాయక గ్రూపుల ఓటర్లకు ఎథికల్ ఓటింగ్ ప్రాముఖ్యత, ఓటింగ్ శాతం పెంచేందుకు తగు చర్యలను ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ నరేంద్రసింగ్ బాలి వివరించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది వజ్రాయుధమని అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ప్రతి యువతీ, యువకుడు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనే విధంగా చైతన్యపరచాలని వారిచే ప్రతిజ్ఞ చేయించారు. కళాజాత స్కిట్, ఫ్లాష్‌మాబ్ ద్వారా పిచ్చయ్య డబ్బు రమేష్ వారి పాటలతో ఓటర్లకు అవగాహన పరిచారు. జిల్లా స్వీప్ నోడల్ అధికారి యు.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పోలింగ్ తేదీన తప్పనిసరిగా ఓటు వేయాలని కోరారు. విజయవాడ రూరల్ ఎంపీడీవో, 300 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఆసుపత్రిలో ఆస్తమా డే



మాట్లాడుతున్న శౌరిబాల

రైల్వేస్టేషన్, మే 7: ప్రపంచ ఆస్తమా దినం సందర్భంగా విజయవాడ రైల్వే ఆసుపత్రిలో మంగళవారం ఆస్తమా వ్యాధిపై వైద్య నిపుణులు రోగులు, రోగి సహాయకులకు అవగాహన కల్పించారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం. శౌరిబాల ఆస్తమా వ్యాధి, నివారణ, చికిత్స తదితరాలు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుమ్ము, ధూళి, పెంపుడు జంతువులు, ఇన్‌ఫెక్షన్‌లు, వాయు కాలుష్యం, పొగ, చల్లటి గాలి తదితరాలు ఆస్తమాకు కారణమవుతాయని, జాగ్రత్తలు తీసుకోవాలని రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ ఏడాది ఆస్తమా డే సందర్భంగా ఇచ్చిన నినాదాన్ని వివరించారు. మణిపాల్ ఆసుపత్రి కన్సల్టెంట్ పల్మనాలజిస్ట్ జి.లోకేష్ మాట్లాడుతూ ఆస్తమా అన్ని వ్యాధుల వారిని ప్రభావితం చేస్తుందని వివరించారు. ఈ సందర్భంగా ఆస్తమా వైద్య పరీక్షలకు వినియోగించే యంత్రాలను ప్రదర్శించారు. ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జయదీప్ వందన సమర్పణ చేశారు.

అభివృద్ధికి పాటుపడే నాయకులను ఎన్నుకోవాలి

కూటమి పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి



అపార్ట్‌మెంట్ వాసులతో సుజనా చౌదరి

చిట్టినగర్, మే 7: ప్రజలు ఆలోచించి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడే నాయకులను ఎన్నుకోవాలని, తనను గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని హంగులతో అభివృద్ధి చేస్తానని బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పాలఫ్యాక్టరీ సమీపంలోని సాయి అమరావతి, విజ్డేష్, అస్త్ర అపార్ట్‌మెంట్‌లలో ప్రచారం నిర్వహించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకొని అభివృద్ధి చేసే నాయకులను ఎన్నుకోవడం ద్వారా నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని, తనకు ఒక అవకాశం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తానని ప్రజలను కోరారు. అపార్ట్‌మెంట్ పెద్దలు వాండ్రాసి సూర్యప్రకాష్, ఉమాశంకర్, తాండ్ర విజయసారధి, కావూరి లలిత, ఈటే వంశీ, చల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు అండగా కూటమి

వన్‌టౌన్: క్రైస్తవులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి అన్నారు. మంగళవారం కానూరులోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో సూపర్ సిక్స్ పథకాలలో క్రైస్తవులకు ఉద్దేశించిన పథకాల వివరాలు గల పోస్టర్‌ను టీడీపీ నాయకులు ఈటె స్వామిదాసు తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన క్రిష్టియన్‌ల సంక్షేమానికి తమవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. మోహనరావు, శ్యామ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

విద్యాధరపురం: భవానీపురం బీజేపీ కార్యాలయంలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, వైసీపీ సీనియర్ నాయకుడు దాడి అప్పారావు నాయకత్వంలో వైసీపీకి చెందిన మైనార్టీలు, మహిళలు పెద్ద సంఖ్యలో బీజేపీలోకి చేరారు. ఈ సందర్భంగా కూటమి బలపరచిన పశ్చిమ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి వారందరికీ కండువాలు కప్పి సాదరంగా బీజేపీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో కార్యకర్తలు బీజేపీలో చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. దాడి అప్పారావు మాట్లాడుతూ సుజనా చౌదరి గెలుపు కోసం పాటుపడతామని స్పష్టం చేశారు. సీనియర్ న్యాయవాది గోగిశెట్టి వెంకటేశ్వరరావు, ఎంఎస్ బేగ్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కన్న రజని, కనిశెట్టి లక్ష్మణరావు, పైలా సోమినాయుడు, కామా దేవరాజ్, గన్నవరపు శ్రీనివాసరావు పాల్గొని తమ సందేశాలను అందించారు.

● పశ్చిమ కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుజనా చౌదరిది గెలుపు ఖాయమని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. మంగళవారం బీజేపీ కార్యాలయానికి వచ్చిన ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచార రంగంలో సుజనా చౌదరి ముందున్నారని విజయపథంలో దూసుకువెళుతున్నారని పేర్కొన్నారు. సుజనా చౌదరి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.



55వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో హరికృష్ణ

కూటమి అభ్యర్థులను గెలిపించండి

పాతరాజరాజేశ్వరి పేట, మే 7: రానున్న ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అభ్యర్థులను గెలిపించాలని టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు ధనేకుల వెంకట హరికృష్ణ కోరారు. 55వ డివిజన్ కంసాలిపేటలో టీడీపీ నేతలు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన టీడీపీ విజయవాడ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్ని, పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరిలను గెలిపించాలని కోరారు.

● స్థానిక 35వ డివిజన్ కూటమి అభ్యర్థులు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు ఆర్. మాధవ పూర్ణానందంపేట, రైల్వే గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఎన్నికల్లో కమలం, సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. శశి, చిట్టిబాబు, దినేష్; హరి తదితరులు పాల్గొన్నారు.

40వ డివిజన్‌లో...

విద్యాధరపురం: 40వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు పొనుగుపాటి చినవెంకట సుబ్బయ్య మంగళవారం 40వ డివిజన్‌లోని 13 బూత్ ఇన్‌చార్జులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆకుల రాజేశ్వరరావు వీధి, డాల్ఫిన్ బార్ రోడ్డు, బాలభాస్కర్ నగర్, రంగూన్ సాహెబ్ వీధి, మైనంపాటి వారి వీధి, తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం 40వ డివిజన్ కార్యాలయం వద్దకు వచ్చిన స్థానికులకు సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలను అందించారు. గుడూరు కొండయ్య, రమణయ్య పాల్గొన్నారు.

ఈదురుగాలులకు ఇంటిపై పడ్డ చెట్టు

●తప్పిన ప్రాణనష్టం ●యువకుడికి స్వల్ప గాయాలు ●విరిగిన రేకులు



ఇంటిపైన పడిన చెట్టు, (ఇన్‌సెట్లో) పూర్తిగా దెబ్బతిన్న రేకులు

పటమట, మే 7 : నగరంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు 10వ డివిజన్‌లోని హైస్కూల్‌రోడ్డు ఆర్‌ఆర్ గార్డెన్ కేకేఆర్ స్కూల్ ప్రాంతంలో పెద్ద చెట్టు కూలి ఇంటి మీద పడటంతో ఇంటి ముందు భాగం పూర్తిగా ధ్వంసం అయ్యింది. కానూరు ప్రాంతానికి చెందిన పద్మజ తన ఇంటిని నాలుగు కుటుంబాలకు అద్దెకు ఇచ్చింది. ప్రమాదం జరిగిన సమయంలో నాలుగు కుటుంబాల వారు బయట కూర్చోవడంతో ప్రాణనష్టం తప్పింది. చెట్టు పెద్ద శబ్దం చేసుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలడంతో నాలుగు కుటుంబాలకు సంబంధించి ముందర రేకు వేసిన హాలు భాగాలు పూర్తిగా విరిగిపోయి, సామగ్రి దెబ్బతింది. ప్రమాద సమయంలో యువకుడికి రేకు తగిలి స్వల్ప గాయాలు అయ్యాయి.

క్రిష్టియన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ జవహర్ ప్రచారం

చిట్టినగర్, మే 7: యునైటెడ్ క్రిష్టియన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్టేట్ ప్రెసిడెంట్ అప్పికట్ల జవహర్ మంగళవారం 46, 47 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ పశ్చిమ అభ్యర్థి సుజనా చౌదరి. టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని చిన్నిలను గెలిపించాలని ప్రచారం చేశారు. టీడీపీ, జనసేన. బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

29వ డివిజన్‌లో కెంబూరి కృష్ణ ..

మధురానగర్, మే 7: బీజేపీ, జనసేన బలపరచిన టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్‌కు, అసెంబ్లీ అభ్యర్థి బొండా ఉమామహేశ్వరరావుకు సైకిల్ గుర్తు మీద ఓటేసి గెలిపించాలని కోరుతూ జనసేన 29వ డివిజన్ అధ్యక్షుడు కెంబూరి కృష్ణ మంగళవారం ప్రచారం నిర్వహించారు. బాపూజీ రోడ్డు, గద్దె బాబురావు రోడ్డు, పెదపూడి వారి వీధిలో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కెంబూరి భవానీ, ఆత్కూరి కిరణ్, మేగా రమణ తదితరులు పాల్గొన్నారు.





- టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా
- ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తా
- బందరు పోర్టుకు అనుబంధ పరిశ్రమలతో ఉపాధి కల్పిస్తా
- వైసీపీ పాలన అంతా అవినీతిమయం

కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి కృషి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బీజేపీ, జనసేన బలపరిచిన పెడన అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్

> 'కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎంతో ప్రఖ్యాతి గాంచిన కలంకారీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తా. అందుకు అవసరమైన భూమి కల్పిస్తా. టెక్స్‌టైల్ పార్కు నిర్మిస్తా' అని బీజేపీ, జనసేన బలపరిచిన పెడన టీడీపీ అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. కృష్ణాజిల్లాకు శివారు ప్రాంతంలో ఉన్న పెడన నియోజకవర్గం ఒక వ్యవసాయాధారిత ప్రాంతమనీ, ఈ నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు. నియోజకవర్గంలో రైతుల సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరిస్తానని చెప్పారు. గతంలో ఇక్కడ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన జోగి రమేష్ సంపాదనే ధ్యేయంగా పనిచేశారనీ, ప్రజాసమస్యలను పట్టించుకోలేదనీ ఆయన అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత నియోజకవర్గ ప్రజల మనసెరిగి పనిచేస్తానని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు.
> - పెడన, ఆంధ్రజ్యోతి

ప్రచారంలో స్పందన ఎలా ఉంది?

ఏ గ్రామంలోకి వెళ్లినా ఓటర్లు, ప్రజలు ఎదురేగి స్వాగతం పలుకుతున్నారు. తమకు సాగునీరు, తాగునీరు అందించాలని కోరుతున్నారు. సాగునీరు సకాలంలో అందకపోవటంతో ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని తోడుకుని పంటలను కాపాడుకున్నామని, ఐదేళ్లుగా పడిన ఇబ్బందుల కారణంగా ఆర్థికంగా నష్టపోయామని చెబుతున్నారు. ఈ సమస్యలన్నీ నమోదు చేసుకుంటున్నాం. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నా.

మీ ప్రత్యర్థిని ఎదుర్కోవడానికి మీ వద్ద ఉన్న వ్యూహాలేంటి?

పెడన నియోజకవర్గంలో విచిత్రమైన పరిస్థితి ఈ సారి ఎన్నికల్లో నెలకొంది. ఇప్పటివరకూ పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న జోగి రమేష్ అవినీతి అక్రమాలు పెరిగిపోవటంతో వైసీపీ అధిష్ఠానం ఆయన్ను ఈ నియోజకవర్గం నుంచీ తప్పించింది. ప్రస్తుతం జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక భర్త ఉప్పాల రాము వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. తన భార్య పదవిని అడ్డుపెట్టుకుని జిల్లావ్యాప్తంగా నియోజకవర్గంలో అక్రమాలకు పాల్పడ్డారనే అపవాదును మూటకట్టుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాక రాము జిల్లా పరిషత్ నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని నియోజకవర్గ ప్రజలను ఏమార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధాన సమస్య ఏమిటంటే ఈ ఐదేళ్లలో నియోజకవర్గంలో అభివృద్ధి ఏమీ లేదు. ఆయన్ను ఓడించడానికి ఇవి చాలు.

నియోజకవర్గ ప్రజలకు మీరిచ్చే హామీలేంటి?

పెడన పురపాలక సంఘంలో చేనేత కార్మికులు అధికంగా ఉన్నారు. టెక్స్‌టైల్ పార్కు నిర్మాణం చేస్తామని వైసీపీ నేతలు హామీ ఇచ్చినా నిర్మాణం చేయలేదు. టెక్స్‌టైల్ పార్కును ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తా. నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు తాగునీటి సమస్యను పరిష్కరిస్తా. ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగునీటిని అందిస్తా. చినపాండ్రాకలోని వంద పడకల ఆసుపత్రిని అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలను అందుబాటులోకి తీసుకువస్తా. మత్స్యకారులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలన్నింటినీ ఇప్పిస్తా. అధునాతన బోట్లను అందచేసి వారి ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పాడు అందిస్తా. బందరు పోర్టుకు అనుబంధంగా పరిశ్రమలను స్థానికంగానే ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తా. నిరుద్యోగ యువతకు ఇక్కడే ఉపాధి అవకాశాలు కల్పిస్తా. పెడనలో కలంకారీ పరిశ్రమ అవసరాల కోసం పదెకరాల భూమిని తీసుకుని వారికి వస్త్రాలు శుభ్రం చేసుకునేందుకు అవకాశం కల్పిస్తా.

నేతల మధ్య సమన్వయం ఎలా ఉంది ?

టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడిన సమయంలో జనసేన నుంచీ కొన్ని ఇబ్బందులు ఎదురయ్యాయి. మచిలీపట్నం పార్లమెంటు జనసేన అభ్యర్థి వల్లభనేని బాలసౌరి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, జనసేన నాయకులతో మాట్లాడి పరిస్థితిని అనుకూలంగా మలిచారు. కూటమి అభ్యర్థిని పెడన నియోజకవర్గంలో గెలిపించేలా అందరం దృఢంగా పనిచేస్తున్నాం. ఇప్పుడు పరిస్థితులన్నీ సర్దుమణిగాయి. సమైక్యంగా పనిచేస్తూ పార్టీ గెలుపుకోసం కృషిచేస్తున్నాం. ప్రజలకు టీడీపీ కూటమి అధికారంలోకి ఎందుకు రావాలో వివరిస్తూ పెడన నియోజకవర్గంలో చేసే అభివృద్ధి పనులను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నాం. ఈ సారి పెడనలో టీడీపీ జెండాను ఎగరవేసేందుకు అవిశ్రాంతంగా ముందడుగు వేస్తున్నాం.

- నియోజకవర్గం టీడీపీ తరపున మొదటి విజేతగా నిలుస్తా
- సాగునీటి కాల్వల అభివృద్ధి, పేదలకు ఇళ్ల నిర్మాణం, పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం
- ఇవే నా ప్రథమ లక్ష్యాలు
- వైసీపీ ఐదేళ్ల పాలనంతా అరాచకాలు, అక్రమాలు
- బీజేపీ, జనసేన బలపరిచిన పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా

'మా నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకూ టీడీపీ గెలవలేదు. ఈసారి ఎన్నికల్లో ఈ గడ్డపై పచ్చ జెండా ఎగరేసి చరిత్ర సృష్టిస్తా' అని ఎన్డీయే బలపర్చిన పామర్రు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్ రాజా స్పష్టం చేశారు. నియోజకవర్గం నుంచి గెలిచిన తొలి టీడీపీ ఎమ్మెల్యేగా రికార్డుల్లో తన పేరు నమోదు కావాలన్న ఆశతో అడుగులు వేస్తున్నానని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్ల నిర్మాణం.. వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన పామర్రులో సాగునీటి కాల్వల అభివృద్ధి.. పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం తన ప్రధాన ధ్యేయమని తెలిపిన కుమార్ రాజాతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ విశేషాలు.. - పామర్రు, ఆంధ్రజ్యోతి



పామర్రులో చరిత్ర సృష్టిస్తా

ప్రచారంలో ప్రజాస్పందన ఎలా ఉంది?

నియోజకవర్గ ప్రజలు ఐదేళ్ల వైసీపీ పాలనతో.. స్థానిక ఎమ్మెల్యే అరాచకాలతో విసిగిపోయారు. ప్రచారానికి వెళ్లిన సమయంలో వారి నుంచి టీడీపీ పట్ల అభిమానం.. నాకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపించాలన్న దృక్పథం కనిపిస్తున్నాయి. 2009లో పామర్రు నియోజకవర్గం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు జరిగిన మూడు ఎన్నికల్లో టీడీపీ గెలవలేదు. తొలిసారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచి ఈ స్థానాన్ని మా అధినేత చంద్రబాబుకు కానుకగా ఇస్తా.

నియోజవర్గ ప్రజలకు మీరిచ్చే ప్రధాన హామీలు?

వ్యవసాయ ఆధారిత నియోజకవర్గమైన పామర్రులోని అన్ని గ్రామాల్లోని రైతులకు అవసరమైన సాగు నీటి కాల్వలను అభివృద్ధి చేస్తా. పామర్రు పట్టణంతోపాటు ఇతర గ్రామాల్లో అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారికి ఇళ్లు నిర్మించి ఇస్తా. నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అభివృద్ధి పరచి రోగులకు మంచి వైద్యసేవలు అందేలా చూస్తా. తోట్లవల్లూరు మండల ప్రజల చిరకాలవాంఛగా ఉన్న పాముల్లంక బ్రిడ్జి నిర్మాణం చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం నా ప్రధాన ధ్యేయం. యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన నిమిత్తం ఐటీ హబ్ ఏర్పాటుతోపాటు, ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేసేలా కృషి చేస్తా. రెండు జాతీయ రహదారుల మధ్య జంక్షన్‌గా ఉన్న పామర్రులో పరిశ్రమల స్థాపనకు ఎంతో అవకాశం ఉంది. ఆ దిశగా కృషి చేస్తాను.

ఐదేళ్ల వైసీపీ పాలనపై జనాభిప్రాయం ఎలా ఉంది?

గడిచిన ఐదేళ్ల పాలనలో వైసీపీ పాలకులు చేసింది శూన్యం. ఇదే అభిప్రాయంలో జనం ఉన్నారు. ఆస్తులు తాకట్టుపెట్టడం అప్పులు చేయడం తప్ప వైసీపీ సర్కార్ చేసింది ఏమీ లేదని ప్రజలే చెబుతున్నారు. సంక్షేమ పథకాలతో తమకు తిరుగులేదని చెప్పుకునే వైసీపీ నాయకులు ఆ పథకాల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరించడంలో విఫలమయ్యారు. వైసీపీ ప్రభుత్వం సంపద సృష్టించింది లేదు. అభివృద్ధి చేసింది లేదు. ఇవన్నీ ప్రజల్లో వైసీపీ పట్ల తీవ్ర వ్యతిరేకత తీసుకొచ్చాయి.

కూటమి నాయకులు.. మీపార్టీ నాయకుల నడుమ సమన్వయం ఎలా ఉంది?

పొత్తు ధర్మంలో భాగంగా జనసేన, బీజేపీ నేతలతో స్నేహపూరితమైన బంధం ఏర్పడింది. మూడు పార్టీల నాయకుల, శ్రేణుల కృషితో అందరివాడిగా ప్రజల్లోకి వెళుతున్నా. ప్రతి ఒక్కరినీ సమన్వయం చేసుకుంటూ సాగుతున్నా.

మీ ప్రత్యర్థిని ఎలా ఎదుర్కొంటారు?

2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం కల్పించిన ప్రజలను మోసంచేసిన ఘనుడు, నియోజకవర్గ అభివృద్ధి నిరోధకుడు పామర్రు ఎమ్మెల్యే అనిల్ నా ఒక్కడికే ప్రత్యర్థి కాదు. నియోజకవర్గ ప్రజలందరికీ ప్రత్యర్థే. ఎక్కడ చూసినా కైలే.. ఎం చేయలే..! అన్న మాటే అందరి నోటా వినిపిస్తోంది. అలాంటి ప్రత్యర్థిపై నా గెలుపు నల్లేరుపై నడకే అని భావిస్తున్నాను.

తోట్లవల్లూరు మండలంలో ముగ్గురు ఎమ్మెల్యేలు!



మైనేని లక్ష్మణస్వామి



చాగర్లమూడి రామకోటయ్య


తోట్లవల్లూరు మండలం ముగ్గురు ఎమ్మెల్యేలను అందించిన ఘనతను పొందింది. మూడు గ్రామాలకు చెందిన ముగ్గురు ప్రముఖులు ఎమ్మెల్యేలుగా గెలుపొందిన విషయం ఈ తరానికి పెద్దగా తెలియదు.

పెనమకూరుకు చెందిన మైనేని లక్ష్మణస్వామి భారత కమ్యునిస్టు పార్టీ తరపున కంకిపాడు ఎమ్మెల్యేగా రెండుసార్లు గెలుపొందారు. 1952లో కంకిపాడు ఎమ్మెల్యేగా పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి రత్నాంబపై గెలుపొంది 1955 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. ఆ తరువాత 1964లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సీఎస్ రావుపై విజయం సాధించారు.

రొయ్యూరు గ్రామంలో సాధారణ రైతు కుటుంబానికి చెందిన చాగర్లమూడి రామకోటయ్య 1955 నుంచి 1962 వరకు కంకిపాడు ఎమ్మెల్యేగా పనిచేశారు. రామకోటయ్య మొదటిగా రొయ్యూరు ప్రసిడెంటుగా పనిచేసి గ్రామాభివృద్ధికి బాటలు వేశారు. సర్పంచ్‌గా ఉంటూ రాష్ట్ర రాజకీయాలపై అవగాహన పెంచుకుని ఎమ్మెల్యేగా పోటీచేసే అవకాశాన్ని దక్కించుకున్నారు. రామకోటయ్య 1955లో కంకిపాడు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున పోటీచేసి భారత కమ్యునిస్టు పార్టీ అభ్యర్థి అభ్యర్థి మైనేని లక్ష్మణస్వామిపై 83 ఓట్ల మెజార్టీతో గెలుపొంది సంచలనం సృష్టించారు. ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో రొయ్యూరుకు కరెంటు లైన్‌లు వేయించి గ్రామానికి వెలుగులు నింపారు.

ఐలూరుకు చెందిన కడియాల వెంకటేశ్వరరావు 1967లో ఉయ్యూరు ఎమ్మెల్యేగా భారత కమ్యునిస్టు పార్టీ మద్దతుతో ఇండిపెండెంట్‌గా కాంగ్రెస్ అభ్యర్థి ఉక్కు కాకానిగా పేరొందిన కాకాని వెంకట రత్నంపై గెలుపొంది చరిత్ర సృష్టించారు. వెంకటేశ్వరరావు చెరకు రైతుల సమస్యలను పరిష్కరించటంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. రైతుల కోసం పుల్లేటి కాలువకు నీరు అందించే విధంగా కృషి చేశారు. 1950, 60 దశకంలోనే తోట్లవల్లూరు మండలం రాజకీయ ఉద్దండులను అందించి ఘనత సాధించింది.

- తోట్లవల్లూరు, ఆంధ్రజ్యోతి



ఇంట్లోనే ఓటు!

సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల కమిషన్ తొలిసారిగా 95 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు వారి ఇంటి వద్దే ఓటు వేసే సదుపాయం కల్పించింది. అందులో భాగంగా మంగళవారం ఎన్నికల అధికారులు విజయవాడలో ఒక వృద్ధురాలి ఇంటి వద్దే పోలింగ్ బాక్సు ఏర్పాటు చేసి ఆమెతో ఓటు వేయించారు.

మూలనపడ్డ ఎత్తిపోతల

బీడు భూములుగా మారిన మాగాణి పొలాలు

- వైసీపీ పాలనలో పథకాల నిర్వహణ శూన్యం
- మోటార్లు, పంపుల మరమ్మతులు లేని దుస్థితి
- ఆయకట్టుకు చుక్కనీరు అందని దైన్యం
- పనిచేయని వేదాద్రి - కంచెల పథకం
- రైతుల పరిస్థితి అగమ్యగోచరం

జిల్లాలో ఇంతకుముందు పుష్కలంగా సాగునీరు అందించి, మాగాణి భూముల్లో సిరులు కురిపించిన ఎత్తిపోతల పథకాల పరిస్థితి వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా తయారైంది. ఒకవైపు రాజకీయ వైషమ్యాల వల్ల పలు పథకాలు పూర్తిగా చతికిలపడ్డాయి. మరోవైపు ఐదేళ్లలో సరైన నిర్వహణ లేక మరికొన్ని పథకాలు చుక్కనీరు అందించలేని దుస్థితికి చేరాయి. ఎంతో విలువైన మాగాణి భూములు బీడు భూములుగా మారినప్పటికీ పాలకులు పట్టించుకోలేదని రైతులు విమర్శిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత చెందిన వేదాద్రి - కంచెల ఎత్తిపోతల పథకం కూడా పాలకుల నిర్లక్ష్యం వల్ల మూలనపడిందని రైతులు ఆరోపిస్తున్నారు.



నిరుపయోగంగా మారిన మున్నలూరు సాగునీటి ఎత్తిపోతల పథకం

కంచికచర్ల : నందిగామ నియోజకవర్గంలో కృష్ణానది, మునేరు, వైరా ఏరులపై ఉన్న 63 ఎత్తిపోతల పథకాల పరిధిలో 74 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. జగ్గయ్యపేట నియోజకవర్గంలో 31 పథకాలు ఉండగా, 11 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 2019కు ముందు ఈ పథకాలు సామర్థ్యం మేరకు పనిచేశాయి. ఎలాంటి కొరత లేకుండా ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందించాయి. మాగాణి భూములు రైతులకు సిరులు కురిపించాయి. అలాంటిది వైసీపీ పాలనలో ఎత్తిపోతల పథకాలు నిలువునా దెబ్బతిన్నాయి. వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకుండా పక్షపాత ధోరణితో వ్యవహరించటం వల్ల సరైన మెయింటెనెన్స్ (నిర్వహణ) లేక పథకాల మోటార్లు, పంపులు మరమ్మతులకు గురయ్యాయి. కొన్ని మోటార్లు పనికిరావని అంటున్నారు. కాల్వలు నామరూపాలు లేకుండా ధ్వంసమయ్యాయి. పిచ్చిచెట్లు, కంపచెట్లు పెరిగాయి. గ్రామాల్లో నెలకొన్న రాజకీయ వైషమ్యాలు ఈ పథకాలను చుట్టిముట్టాయి. వైషమ్యాలతో కొన్ని పథకాలను పూర్తిగా మూలనపడేశారు. పలు గ్రామాల్లో రైతు కమిటీలకు ఈ పథకాలు ఆదాయ వనరుగా మారాయి. ఎకరానికి వెయ్యి నుంచి రూ.1500 వంతున వసూలు చేసిన నగదు దుర్వినియోగమైంది. జవాబుదారీతనం లేకపోవటం వల్ల వైసీపీ నాయకులు జేబులు నింపుకున్నారు. ఇంతకుముందు గుడిమెట్ల -1, 2 పథకాల రైతు కమిటీలు సుమారుగా రూ.60 లక్షలు బ్యాంకులో డిపాజిట్ చేయగా, నేడు పైసా కూడా నిల్వ లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. పథకాలు అస్తవ్యస్తం కావటంతో ఆయకట్టులో గతేడాది సగం విస్తీర్ణంలో కూడా వరినాట్లు పడలేదు. ప్రస్తుతం పథకాలు పనిచేయాలంటే ఒక్కొక్క పథకానికి రూ.15 లక్షల నుంచి రూ.25 లక్షలు కావాలని అధికారులు చెపుతున్నారు. దీనికితోడు కృష్ణానది నీటి ప్రవాహం గుంటూరు జిల్లావైపు వెళుతుండటంతో పథకాల మోటార్లకు నీరు కూడా సజావుగా అందటం లేదు. రాజధాని తాగునీటి కోసం తలపెట్టిన వైకుంఠపురం - దాములూరు రిజర్వాయరును వైసీపీ ప్రభుత్వం పక్కన పడేసింది. ఈ రిజర్వాయరును నిర్మించినట్లయితే ఏడాది పొడవునా నదిలో నీటికి కొరత ఉండేది కాదు.

మూలనపడిన వేదాద్రి - కంచెల పథకం

వైసీపీ పాలకులకు ముందుచూపు లేకపోవటం వల్ల వేదాద్రి - కంచెల ఎత్తిపోతల పథకం పూర్తిగా మూలనపడింది. ఎంతో ప్రాధాన్యత కలిగిన ఈ పథకం కొన్నేళ్ల నుంచి పాలకుల నిరాదరణకు గురైంది. యంత్రాలు, మోటార్లు, పైపులైన్ల నిర్వహణను గాలికి వదిలేశారు. నందిగామ, చందర్లపాడు మండలాల్లో సుమారుగా 17 వేల ఎకరాలకుపైగా ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు రూ.30 కోట్లతో దేవినేని సోదరుల కృషి వల్ల ఏర్పాటైన ఈ పథకం మరమ్మతులకు గురైంది. ఈ పథకం బాగున్నట్లయితే ఆయకట్టుకు ఢోకా లేకుండా సాగునీరు అందేది. పంటలు పుష్కలంగా పండేవి. రైతులకు సాగునీటి బాధలు తప్పేవి. పంటలు నిలువునా దెబ్బతింటున్నప్పటికీ వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఈ పథకం పనిచేసేందుకు తక్షణమే రూ.8 కోట్లు కావాలని అధికారులు చెపుతున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు జగన్మోహనరావు, ఉదయభాను చుట్టూ రైతులు ప్రదక్షిణాలు చేసినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది.



ఎండమావిగా సాగర్ జలాలు

జగ్గయ్యపేట నియోజకవర్గం, నందిగామ, చందర్లపాడు మండలాలు నాగార్జున సాగర్ ఎడమకాల్వ రెండో జోన్ పరిధిలో, కంచికచర్ల, వీరులపాడు మండలాలు మూడో జోన్ పరిధిలో ఉన్నాయి. రెండో జోన్‌లో వరి పంటకు, మూడో జోన్‌లో ఆరుతడి పంటలకు సాగర్ జలాలు అందాల్సి ఉంది. కొద్ది సంవత్సరాల నుంచి సాగర్ జలాలు రావటం లేదు. పూర్తిగా దిగువలో ఉన్న ఈ నియోజకవర్గాలకు ఎగువ నుంచి నీళ్లు రావటం లేదు.



నీరులేక ఖాళీగా దర్శనమిస్తున్న కాలువ



జాబ్ కేపిటల్‌గా ఏపీ

▸ ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రణాళిక

▸ ఉత్తరాంధ్రను బొత్స కుటుంబం దోచుకుంటోంది: లోకేశ్

విజయనగరం, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఏటా జాబ్ క్యాలండర్ విడుదల చేస్తామని, ఏపీని జాబ్ క్యాపిటల్‌గా తయారు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. విజయనగరంలోని అయోధ్య మైదానంలో మంగళవారం సాయంత్రం జరిగిన యువగర్జనలో విద్యార్థులతో లోకేశ్ ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు భర్తీ చేసేందుకు తమ వద్ద ప్రణాళిక ఉందని చెప్పారు. అందరికీ ఉద్యోగాలు కల్పించేందుకు పెద్ద ఎత్తున పరిశ్రమలను ప్రోత్సహిస్తామన్నారు. విశాఖ జిల్లాను ఐటీ హబ్‌గా తయారుచేసి స్థానికంగానే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. ఐటీ మంత్రిగా పేరున్న కంపెనీలను తాను రాష్ట్రానికి తీసుకువస్తే.. వాటిని జగన్ తరిమేశారని ధ్వజమెత్తారు. 20వేల ఉద్యోగాలను కల్పించే అమరరాజా కంపెనీని తరిమేస్తే పక్క రాష్ట్రంలో పరిశ్రమ ఏర్పాటు చేసుకుందన్నారు. భూ కుంభకోణాలు, ఇసుక మాఫియా, డ్రగ్స్‌కు అడ్డాగా ఆంధ్రా మారిందని ప్రధాని మోదీ విమర్శలను గుర్తు చేశారు. రాష్ట్ర ప్రజల ఆత్మ గౌరవాన్ని జగన్ ఢిల్లీలో తాకట్టు పెట్టారన్నారు. భూములు.. ఇసుక మాఫియాకు పాల్పడుతున్నారంటూ మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబంపై లోకేశ్ ధ్వజమెత్తారు. బొత్స అప్పలనరసయ్య, బడ్డుకొండ అప్పలనాయుడు, చిన్న శ్రీను, ఎంపీ బెల్లాన చేస్తున్న అవినీతిని ఎండగట్టారు. జగన్ తీసుకువస్తున్న ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ అత్యంత ప్రమాదకరమైనదని చెబుతున్న తమపై కేసులు పెట్టారన్నారు. జగన్ పెట్టే చిల్లర కేసులకు భయపడేది లేదని చెప్పారు. కుటమి అధికారంలోకి వచ్చిన వెంటనే స్టడీ సర్కిళ్లను తెరుస్తామని, నిరుద్యోగ యువతకు శిక్షణ ఇస్తామని లోకేశ్ చెప్పారు. మెగా డీఎస్సీ నిర్వహిస్తామని, కానిస్టేబుల్ ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పారు. 'హలో ఆంధ్రా.. బైబై వైసీపీ' అంటూ లోకేశ్ ప్రసంగాన్ని ముగించారు. అనంతరం విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు చెప్పారు.

ఓటేయొద్దని వాళ్లే చెబుతున్నారు!

'జగన్ హత్యా రాజకీయాలకు భయపడి తల్లి విజయమ్మ అమెరికా వెళ్లిపోయారు. హత్యా రాజకీయాలకు పాల్పడుతున్న జగన్‌కు ఓటు వేయవద్దని సోదరి సునీత బహిరంగంగా చెబుతున్నారు. జగన్‌కు ఓటు వేస్తే తన భర్తగతే రాష్ట్రానికి పడుతుందని సౌభాగ్యమ్మ చెప్పారు. ఊసరవెల్లి జగన్‌కు ఓటు వేయవద్దని సొంత సోదరి వైఎస్ షర్మిల అంటున్నారు. అంబటి రాంబాబు నీచుడని, అతడికి ఓటు వేయవద్దని సొంత అల్లుడే ప్రచారం చేస్తున్నారు. తనకే న్యాయం చేయలేని.. మంత్రి ముత్యాలనాయుడు ప్రజలకు ఏం చేస్తాడని సొంత కుమారుడే కోరుతున్నారు. తన తండ్రి ముద్రగడ పద్మనాభంను జగన్ స్వార్థానికి వాడుకుంటున్నారని ఆయన కుమార్తె అంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో దువ్వాడ శ్రీనివాస్‌ను ఓడించాలని అతడి భార్య ప్రచారం చేస్తున్నారు. సొంత కుటుంబంలో, పార్టీలో నమ్మకం లేని జగన్‌ను రాష్ట్రం ఎలా నమ్ముతుంది? ఇటువంటి వ్యక్తిని మనం నమ్మాలా?' అని లోకేశ్ ప్రశ్నించారు

దళిత, గిరిజన, బీసీలపై దాడులు ఆపండి

▸ కొత్త డీజీపీ హరీష్ కుమార్ గుప్తాకు ఎన్నికల నిఘా వేదిక వినతి



డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు వినతిపత్రం అందజేస్తున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

అమరావతి, గుంటూరు కార్పొరేషన్, మే 7(ఆంధ్రజ్యోతి): దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలపై దాడులను అరికట్టడంతో పాటు రాష్ట్రంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఎన్నికల నిఘా వేదిక కొత్త డీజీపీని కోరింది. సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్ కుమార్, సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మంగళవారం కొత్త డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను కలిసి ఈమేరకు వినతి పత్రం ఇచ్చారు. ఇటీవల మచిలీపట్నం, పెనమలూరులో జరిగిన దాడులను డీజీపీ దృష్టికి తీసుకుని వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై డీజీపీ సానుకూలంగా స్పందిస్తూ ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి తోడ్పడతామని హామీ ఇచ్చారు.

మూడుచోట్ల తప్పుకొన్న గాజుగ్లాసు అభ్యర్థులు

▸ ఎన్డీయే కూటమికి నవతరం పార్టీ మద్దతు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): స్వతంత్ర అభ్యర్థుల కోటాలో మూడు చోట్ల గాజు గ్లాసును ఎన్నికల గుర్తుగా పొందిన ముగ్గురు అభ్యర్థులూ పోటీ నుంచి తప్పుకొన్నారు. వీరితో కలిపి మొత్తం నాలుగు లోక్‌సభ స్థానాలు, ఆరు పార్లమెంటు స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ నుంచి తప్పుకొని ఎన్డీయే కూటమికి మద్దతు తెలుపుతున్నారని నవతరం పార్టీ అధ్యక్షుడు రావు సుబ్రమణ్యం తెలిపారు. జనసేన పార్టీ పోటీ చేయని చోట్ల స్వతంత్ర అభ్యర్థులకు గాజు గ్లాసు గుర్తు లభించిన విషయం తెలిసిందే. అందులో మూడు స్థానాల్లో నవతరం పార్టీ అభ్యర్థులకు ఈ గుర్తు లభించింది. బాపట్ల లోక్‌సభ స్థానంలో నలమల తిరుపతిరావు, రాప్తాడు అసెంబ్లీ స్థానంలో బోయిన నరేశ్, ధర్మవరం అసెంబ్లీ స్థానంలో షేక్ ఆయూబ్‌లకు గాజు గ్లాసు గుర్తు వచ్చింది. మండపేట, గాజువాకల్లో ఈ పార్టీ అభ్యర్థులకు బకెట్ గుర్తు లభించింది. వీరితో పాటు గుంటూరు, విజయవాడ, విశాఖ పార్లమెంటు స్థానాల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా విరమించుకున్నారని రావు సుబ్రమణ్యం చెప్పారు. టీడీపీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్యతో కలసి మంగళవారం ఆయన ఇక్కడ టీడీపీ కేంద్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏ షరతులూ లేకుండా ఎన్డీయే కూటమికి మద్దతు తెలుపుతున్నామన్నారు.

డబ్బులు పంచుతూ పట్టుబడిన మాజీ వలంటీరు

▸ అడ్డుకున్న బొండా ఉమ తనయుడు.. ఆయనపై అట్రాసిటీ కేసు

విజయవాడ(పాయకాపురం), మే 7: విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ నేతలు రెచ్చిపోతున్నారు. ఈ నియోజకవర్గంలోని స్థానిక బర్మాకాలనీ ప్రాంతంలో నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి బొండా ఉమ తనయుడు బొండా రవితేజ టీడీపీ నేతలతో కలసి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అదే సమయంలో వైసీపీ మహిళా కార్యకర్తలు ఇళ్లకు స్టిక్కర్లు అంటిస్తూ ప్రచారం చేస్తుండటాన్ని గమనించారు. వారిని అడ్డుకుని ప్రశ్నించడంతో వైసీపీ మహిళా కార్యకర్తలు టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో చేతిలో ఉన్న సంచులతో సహా వైసీపీ మహిళా కార్యకర్తలు అక్కడి నుంచి ఉడాయించారు. జరిగిన విషయంపై టీడీపీ నేత ఎస్‌కే మస్తాన్ నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సెంట్రల్ నియోజకవర్గంలోనే ఎల్‌బీఎస్‌నగర్ ప్రాంతంలో మాజీ వలంటీర్ గురుస్వామి ఇంటింటికి తిరిగి ప్రచారం చేయడమే కాకుండా ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు డబ్బులు పంపిణీ చేస్తున్నట్టు టీడీపీ నేతలు గుర్తించారు. టీడీపీ నేత బొల్లెద్దుల రవిచంద్ర మరికొందరు ఆ ప్రాంతానికి చేరుకుని గురుస్వామిని అడ్డుకున్నారు. అదే సమయంలో మాజీ వలంటీరుకు మద్దతుగా వచ్చిన వైసీపీ నేతలు టీడీపీ నేతలతో వాగ్వాదానికి దిగారు. దీనిపై టీడీపీ నేతలు నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, టీడీపీ నేతల వరుస ఫిర్యాదులతో వైసీపీ అభ్యర్థి వెల్లంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా నున్న రూరల్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. స్టేషన్‌లో గంటకుపైగా తిష్టవేసిన వెలంపల్లి, రుహుల్లా పోలీసులపై ఒత్తిళ్లు తీసుకొచ్చి టీడీపీ నేతలపైనే కౌంటర్ కేసులు పెట్టించారు.



వైసీపీ ప్రచారంలో వలంటీర్‌ను అడ్డుకున్న టీడీపీ నాయకులు

నేనొచ్చాక కొత్త పాస్‌బుక్‌లు ఇస్తా

▸ జగన్ ల్యాండ్ చట్టంతో.. సెంటు భూమైనా అమ్ముకోలేం!

▸ ఆయన ఫొటోతో ఉన్న పాస్‌పుస్తకాలను చించేయండి: చంద్రబాబు

తిరుపతి/పుంగనూరు, మే 7(ఆంధ్రజ్యోతి): 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టులో భాగంగా మీ ఆస్తిని ఈ సీఎం తాకట్టు పెట్టి జిరాక్స్‌లు ఇస్తాడంట! ఆ పేపర్లు ఎందుకూ పనికిరావు. మీ భూమి మీరు అమ్ముకోవాలన్నా, కొనుక్కోవాలన్నా జగన్ జలగ అనుమతి కావాలంట. సెంటు భూమి కూడా మీరు అమ్ముకోలేరు' అని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలను హెచ్చరించారు. పట్టాదార్ పాస్‌పుస్తకాల మీద జగన్ ఫొటో వేసుకున్నాడని.. ఆ భూమి ఆయన తాత ఇవ్వలేదు కదా అని ప్రశ్నించారు. ఆ పుస్తకాలను చించేసి చెత్త బుట్టలో పడేయాలని.. తాను అధికారంలోకి వచ్చాక రాష్ట్ర ప్రభుత్వ రాజముద్రతో కొత్త పుస్తకాలు ఇస్తానని ప్రకటించారు. జగన్ ఫొటో ఉన్న పాసుపుస్తకాన్ని సభావేదికపైనే చించేశారు. మంగళవారం రాత్రి తిరుపతిలో జనసేనాని పవన్ కల్యాణ్‌తో కలిసి భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. అంతకుముందు మాజీ సీఎం, రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి కిరణ్‌కుమార్‌రెడ్డి, పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితో కలిసి పుంగనూరులో జరిగిన భారీ బహిరంగ సభలో ప్రసంగించారు. జగన్ కొత్త చట్టం తెచ్చి జనం ఆస్తులపై కన్నేశాడని ఆరోపించారు. పొరపాటున వైసీపీకి ఓటేస్తే మీ ఆస్తులు మీవి కావని చెప్పారు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మేనిఫెస్టో కళకళలాడుతుంటే వైసీపీ మేనిఫెస్టో ఎత్తిపోయిందన్నారు. 'ఖజానాలో ఉండాల్సిన డబ్బు జగన్ వద్ద, మంత్రి పెద్దిరెడ్డి వద్ద ఉంది. జూన్ 4న వసూలు చేయిస్తా' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..

ఆ క్షోభ పెద్దిరెడ్డికే పెడతా..

ఈ ఐదేళ్లలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అవినీతితో రూ.30 వేల కోట్లు సంపాదించారు. నా నియోజకవర్గం కుప్పంలో కూడా గ్రానైట్లను కొట్టేశారు. గతేడాది అంగళ్లు నుంచి పూతలపట్టు వెళ్తుండగా పుంగనూరులో నాపై దాడి చేయించి తిరిగి నాపైనే కేసులు పెట్టించారు. 800 మంది టీడీపీ శ్రేణులపై కేసులు పెట్టించి, 450 మందిని జైల్లో పెట్టారు. పెద్దిరెడ్డికి గుణపాఠం చెబుతాం.. టీడీపీ కార్యకర్తలు అనుభవించిన క్షోభ ఆయనకూ పెడతా. పెద్దిరెడ్డికి పట్టిన కొవ్వు కరిగిస్తా. ఆయన కుమారుడు, ఎంపీ మిథున్‌రెడ్డి ఢిల్లీలో సీఏఏ, ఎన్‌ఆర్‌సీలని సమర్థించి, ఇక్కడ మాత్రం మా పొత్తును విమర్శిస్తున్నారు. పవన్ కల్యాణ్‌ను ఓడించేందుకు మిథున్‌రెడ్డి పిఠాపురం వెళ్తాడట! ఇక్కడ చూసుకోలేక అక్కడికెళ్లి ఏం చేస్తాడు?



పుంగనూరు సభలో..

బ్రాహ్మణ కార్పొరేషన్ బలోపేతం..

తిరుపతి, తిరుమలల్లో పవిత్రతను జగన్ ప్రభుత్వం, వైసీపీ నాయకులు దెబ్బతీశారు. దేవాలయాల ఆస్తులను కూడా కబ్జా చేశారు. 50 వేలకు మించి వార్షికాదాయం కలిగిన ఆలయాల అర్చకులకు వేతనాలు అందజేస్తాం. పురోహితులకు, వంటబ్రాహ్మణులకూ సాయమందిస్తాం. బ్రాహ్మణ కార్పొరేషన్‌ను బలోపేతం చేస్తాం. బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీని పటిష్ఠం చేస్తాం. టీటీడీ సహా అన్ని ఆలయాల ట్రస్టు బోర్డుల్లో బ్రాహ్మణులకు సభ్యత్వమిస్తామని వెంకన్న సాక్షిగా చెబుతున్నా.

బీసీలకు లక్షన్నర కోట్లు..

మేం వచ్చాక రూ.1.50లక్షల కోట్లు ఖర్చు చేసి బీసీలను ఆదుకుంటాం. 50 ఏళ్లకే బీసీలకు, పేదలందరికీ పెన్షన్లు ఇస్తాం. పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతాం.

ఆకురౌడీలకు భయపడతామా?

▸ భూమన, అభినయ్‌పై పవన్ ధ్వజం

ప్రతి పనికీ కమీషన్లు పంచుకునే తండ్రీకొడుకులకు తిరుపతి ప్రజలు భయపడాలా అని తిరుపతి ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఆయన కుమారుడు, తిరుపతి అభ్యర్థి అభినయ్‌రెడ్డిపై పవన్ కల్యాణ్ విరుచుకుపడ్డారు. తిరుపతి రోడ్‌షోలో ఆయన మాట్లాడుతూ.. ఏడుకొండలవాడిని పైన పెట్టుకుని ఆకు రౌడీలకు భయపడడం ఏమిటని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆకు రౌడీలను ఉక్కు పాదంతో తొక్కి పడేస్తామన్నారు. 'ఇల్లు కట్టాలంటే కరుణాకరరెడ్డికి 30 శాతం, ఆయన కొడుకు అభినయ్‌కి 10శాతం కమీషన్ ఇవ్వాలట కదా! రూ.200 కోట్ల కమీషన్ల కోసం తిరుపతిలో గోవిందరాజస్వామి సత్రాలను కూలదోసి కొత్తవి కడుతున్నారు. టీడీఆర్ బాండ్ల పేరుతో రూ.2 వేల కోట్లు నొక్కేశారు. తిరుమల హుండీలో వేసిన కానుకలనూ దోపిడీ చేశారు. ప్రతి పనికీ పది నుంచి 15 శాతం కమీషన్లు తీసుకుంటున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు శ్రీవారి ఖజానాకు ఆదాయం వస్తుంటే వైసీపీ నాయకులు కొండపై తిష్టవేసి ఖాళీ చేస్తున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఎర్రచందనం స్మగ్లింగ్‌లో కోట్లు గడించారు' అని దుయ్యబట్టారు.

రోడ్‌షో, పుంగనూరు సభలకు పోటెత్తిన జనం

తిరుపతి రోడ్‌షోకు, పుంగనూరు బహిరంగ సభకు జనం పోటెత్తారు. తిరుపతిలో పవన్‌ను చూసేందుకు ఆయన అభిమానులు ఓవైపు, టీడీపీ అధినేత కోసం ఆ పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావడంతో రోడ్‌షో జరిగిన ప్రధాన రహదారులు, కూడళ్లు జనంతో కిక్కిరిసిపోయాయి. రేణిగుంటలోని ఎయిర్‌పోర్టు నుంచి కరకంబాడి మార్గంలో వచ్చిన అధినేతలిద్దరికీ జనం బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా ప్రజలు ప్రత్యేకించి మహిళలు, యువత గంటల కొద్దీ నిరీక్షించి స్వాగతం పలికారు. తిరుపతి లీలా మహల్ నుంచి రోడ్‌షో ప్రారంభమైంది. అయితే ఆ కూడలి చేరుకునే సరికి శ్రీనివాస ఫ్లై ఓవర్‌పై విద్యుద్దీపాలు ఆర్పేశారు. దీంతో అంధకారం నెలకొంది. కూటమి పార్టీల కార్యకర్తలు మొబైల్ ఫోన్లలో టార్చిలైట్లు వెలిగించి పట్టుకోవడంతో ఎటు చూసినా వెలుగుతున్న మొబైల్ ఫోన్లే కనిపించాయి. జడ్ ప్లస్ కేటగిరీ భద్రత కలిగిన చంద్రబాబు పర్యటనలో ప్రధాన కూడలిలో లైట్లు ఆర్పివేయడం ఆందోళన కలిగించింది. మొత్తం పర్యటనలో పోలీసు బందోబస్తు చాలా బలహీనంగా కనిపించింది. కాగా.. పుంగనూరు నుంచి తిరుపతికి చేరుకునే క్రమంలో బాగా ఆలస్యం జరగడం, ఎన్నికల నిబంధనల కారణంగా రాత్రి 10 గంటల్లోపే సభ ముగించాల్సి ఉండడంతో చంద్రబాబు తిరుపతిలో 14 నిమిషాలే ప్రసంగించారు. పవన్ కూడా కొద్దిసేపే మాట్లాడారు.

పెద్దిరెడ్డి ఎయిడ్స్ కంటే ప్రమాదకరం: కిరణ్ కుమార్ రెడ్డి

'క్షణం సంతోషం కోసం జీవితాన్ని పాడు చేసుకోవద్దని ఎయిడ్స్ ప్రకటన వచ్చేది. ఇప్పుడు వైసీపీ వాళ్లు ఇచ్చే డబ్బుల కోసం జీవితాన్ని నాశనం చేసుకోవద్దు' అని మాజీ సీఎం, రాజంపేట లోక్‌సభ బీజేపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. పెద్దిరెడ్డి ఎయిడ్స్ కంటే ప్రమాదకరమన్నారు. ఆయన అక్రమాలు, అవినీతి గురించి తాము మాట్లాడితే దానికి స్పందించకుండా ఏదేదో మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. 'డీసీసీ పదవి కోసం నా కాళ్లు పట్టుకున్నాడు. దానికి కూడా సమాధానం లేదు. జగన్‌రెడ్డిని నేను అరెస్టు చేయించానని చెప్పాడు. షర్మిలే చెప్పింది సోనియాకు సంబంధం లేదని! సత్యసాయిబాబా ట్రస్టు నుంచి బంగారమంతా తీసుకెళ్లానన్నాడు. నేను ప్రమాణం చేస్తానని చెప్పాను. దానికీ పెద్దిరెడ్డి స్పందించలేదు' అని విమర్శించారు.

టీడీపీకి ముఫ్తీల జాతీయ సంస్థ మద్దతు

▸ చంద్రబాబును కలిసి అధికారికంగా లేఖ అందజేసిన ముస్లిం మతపెద్దలు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో ముస్లిం వర్గాల మద్దతు కూడగట్టడంలో టీడీపీ పెద్ద ముందడుగు వేసింది. ముస్లిం మత పెద్దల జాతీయ సంస్థ అయిన 'తన్జీమ్-ఈ-ముఫ్తియాన్' సంస్థ ఆ పార్టీకి మద్దతు ప్రకటించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సంస్థ వైసీపీకి మద్దతిచ్చింది. అది రాసిన లేఖనే ముస్లిం వర్గాలకు జారీ అయిన ఫత్వాగా వైసీపీ నేతలు ప్రచారం చేశారు. ఈసారి ఈ సంస్థ నాయకత్వం మంగళవారం హైదరాబాద్ వచ్చి టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి మద్దతు లేఖను అందజేసింది. చంద్రబాబును కలిసిన వారిలో తన్జీమ్-ఈ-ముఫ్తియాన్ ప్రధాన కార్యదర్శి షేక్ ఉల్ హదీస్ అల్లమా ముఫ్తీ జియా ఉల్లా ఖాన్ ఖాసిమి, కోశాధికారి అల్లమా ముఫ్తీ ముఫ్రాన్, ఆంధ్ర రాష్ట్ర అధ్యక్షుడు ముఫ్తీ ఇస్మాయిల్ ఉన్నారు. తమ లేఖలో టీడీపీ-జనసేన మేనిఫెస్టోను ప్రశంసించారు. 'మీ మేనిఫెస్టోలో ముస్లిం మైనారిటీల అభివృద్ధికి ప్రతిపాదించిన అంశాలపై సంతోషం వ్యక్తం చేస్తున్నాం. క్వాలిఫైడ్ ఇమామ్‌లను ఖాజీలుగా నియమించి వారికి గౌరవ వేతనం ఇవ్వాలన్న ప్రతిపాదనను హర్షిస్తున్నాం. అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా నియమితులు కావడంలో కీలక పాత్ర వహించారు. రాష్ట్రంలో ఉర్దూ యూనివర్సిటీని నెలకొల్పారు. అమరావతి రాజధానిలో ఇస్లామిక్ కల్చర్ సెంటర్‌కు భూమి కేటాయించాలని మా విజ్ఞప్తి. మీ కృషికి మద్దతుగా ఈ ఎన్నికల్లో మీ పార్టీకి మద్దతు ప్రకటిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఆతర్వాత ఈ సంస్థ నేతలు మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నామని తెలిపారు. జగన్ పాలనలో ముస్లిం వర్గాలపై జరిగిన దాడులు తమకు తీవ్ర మనస్తాపం కలిగించాయన్నారు.

నేడు రాష్ట్రంలో ప్రధాని పర్యటన

రాయచోటి, విజయవాడ, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ బుధవారం రాష్ట్రంలో రెండు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. అన్నమయ్య జిల్లా కలికిరిలో నిర్వహించే 'ప్రజాగళం' బహిరంగ సభలో ప్రధాని పాల్గొంటారు. అక్కడ నుంచి విజయవాడలో జరిగే రోడ్‌షోకు వస్తారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి తరపున మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రాజంపేట ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్నారు. ఆయన గెలుపు కోసం నిర్వహించే సభలో ప్రధానితోపాటు మాజీ సీఎం చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, నారా లోకేశ్ తదితరులు పాల్గొంటున్నారు. మోదీ బుధవారం విజయవాడలో రోడ్ షో నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి 7 నుంచి 8 గంటల మధ్య స్టేడియం నుంచి బెంజిసర్కిల్ వరకు ఓపెన్ టాప్ జీపులో రోడ్ షో నిర్వహిస్తారు. మోదీతో పాటు జీపులో చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి ఉంటారు.

హైలెస్సో.. హైలెస్సా!

▸ బిల్లులు ఎవరికిద్దాం.. డబ్బులెవరికిద్దాం!

▸ కృష్ణా నదిలో వీఐపీ బోటులో విహార చర్చలు

▸ సీఎస్, ఆర్థిక శాఖ అధికారుల రహస్య భేటీ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కార్పొరేట్ కంపెనీ ప్రతినిధులు రిసార్ట్‌లో రిలాక్స్‌డ్‌గా మీటింగ్‌లు పెట్టుకుంటారు! నలుగురు మిత్రులు సాయంత్రం సరదాగా షికార్లు తిరుగుతుంటారు! ఇదేం కొత్తా కాదు... తప్పూ కాదు! కానీ... రాష్ట్రంలోని ముగ్గురు ఉన్నతాధికారులు బోటు షికారుకు వెళ్లారు. వెలగపూడిలో సచివాలయంతోపాటు గుంటూరు, విజయవాడలో అనేక ప్రభుత్వ కార్యాలయాలున్నప్పటికీ... గుట్టుగా బోటులో మీటింగ్ పెట్టుకున్నారు. అది కూడా... రూ.3వేల కోట్లు ఎవరికి, ఎలా పంపిణీ చేయాలనే అంశంపై! పోలింగ్‌కి సరిగ్గా వారం రోజుల ముందు రాష్ట్ర ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు ఎస్ఎస్‌రావత్, కేవీవీ సత్యనారాయణతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అత్యంత రహస్యంగా ఈ సమావేశం జరిపారు. మంగళవారం చీకటి పడ్డాక... భవానీ ఐల్యాండ్స్ వద్ద.. కృష్ణా నదిలో ఒక వీఐపీ బోటులో విహరిస్తూ చర్చించుకున్నారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీఐలో సెక్యూరిటీలు విక్రయించి రూ.3,000 కోట్లు అప్పు తెచ్చింది. అయితే... ప్రభుత్వం ఇప్పటికే ఆర్బీఐ నుంచి రూ.1500 కోట్లు ఓడీ తీసుకుంది. మరో 1500 కోట్లు వేజ్ అండ్ మీన్స్ కింద తెచ్చుకుంది. వెరసి... ఈ రూ.3 వేల కోట్లలో రూపాయి కూడా రాష్ట్రానికి అందదు. కానీ... వెంటనే ఓడీ, వేజ్ అండ్ మీన్స్ కింద రూ.3వేల కోట్ల దాకా తెచ్చుకోవడానికి రంగం సిద్ధం చేశారు. వీటిని ఎలా వాడాలి? ఎవరికి చెల్లింపులు జరపాలి? వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లు ఎవరు? అన్న అంశాలు ఈ మీటింగ్‌లో చర్చకొచ్చినట్టు తెలిసింది. వివిధ పథకాలకు కోడ్ రాక ముందు బటన్ నొక్కి... సరిగ్గా పోలింగ్‌కు ముందు నిధులు జమచేయాలన్న సర్కారు పాచిక ఈసీ ముందు పారలేదు. పోలింగ్ తర్వాతే నిధులు జమచేయాలని స్పష్టం చేసింది. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేయడానికి అనుమతి కోరుతూ సీఎస్ రాసిన లేఖను ఈసీ తిరస్కరించిన సంగతి తెలిసిందే. అలాగే... చేయూత, ఆసరా, ఈబీసీ నేస్తం పథకాల డబ్బుల విడుదల కోసం సీఎస్ అనుమతి కోరగా, మరిన్ని వివరాలు కావాలంటూ ఆ ఫైళ్లను తిప్పిపంపారు. ఎన్నికల ముందు లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బు వేసి రాజకీయ లబ్ధి పొందాలని భావించిన వైసీపీకి ఈసీ షాకిచ్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి రంగంలోకి దిగారు. దీనికి ప్రత్యామ్నాయాలేమైనా ఉన్నాయా అనేది బోటు మీటింగ్‌లో చర్చ జరిగినట్లు తెలిసింది.

చెల్లింపుల పరంపర...

ప్రస్తుతం రోజుకు రూ.150 నుంచి రూ.200 కోట్ల చెల్లింపులు ఖజానానుంచి జరుగుతున్నాయి. మూడ్రోజులక్రితం కేంద్రం నుంచి ఉపాధి హామీ పథకం డబ్బు 1500 కోట్లు ఖజానాకు చేరింది. ఈ డబ్బు వచ్చినా కూడా జగన్ సర్కార్ ఇంకా రూ.1500 కోట్ల ఓడీలో ఉండడం దారుణం. అంటే, ఉపాధి హామీ పథకం డబ్బులను కూడా జగన్ సర్కార్ మళ్లించేసినట్టే.

37 రోజుల్లో రూ.13 వేల కోట్ల అప్పు


ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి కేంద్రం రూ.47,000కోట్ల అప్పులకు అనుమతిచ్చింది. ఆర్నెళ్ల వ్యవధిలో ఈఅప్పు వాడాలి. కానీ, జగన్ సర్కార్ కేవలం 37రోజుల్లోనే రూ.13,000 కోట్ల అప్పు తెచ్చేసింది. ప్రతి మంగళవారం అప్పు తెస్తూనే ఉంటుంది. ఆర్నెళ్లు వాడుకోవాల్సిన అప్పును 3 నెలలకే వాడేసే ప్రమాదం ఉంది.

పవన్‌ను గెలిపించండి

▸ పిఠాపురం ప్రజలకు చిరంజీవి విన్నపం

▸ తమ్ముడి గెలుపు కోసం వీడియో సందేశం

▸ పవన్‌కు ఒకేరోజు ఐదుగురు హీరోల మద్దతు



అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి రోజురోజుకూ ఊహించని మద్దతు దక్కుతోంది. ఎన్నికలకు సమయం దగ్గర పడుతున్న తరుణాన.. కూటమికి ముఖ్యంగా పవన్ కల్యాణ్‌కు ఆయన పెద్దన్నయ్య, సినీ హీరో చిరంజీవి సహా ఒకే రోజు ఐదుగురు హీరోలు మద్దతు ప్రకటించారు. పిఠాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న పవన్‌ను గెలిపించాలని కోరుతూ.. మెగాస్టార్ చిరంజీవి ఒక వీడియో విడుదల చేయగా.. ఆయన కుమారుడు రామ్ చరణ్, హీరోలు నాని, రాజ్ తరుణ్, తేజ సజ్జా కూడా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం జనసైనికుల్లో జోష్ నింపింది.

ఇలాంటి నేత కదా కావాల్సింది..

నమ్మిన సిద్ధాంతం కోసం తన జీవితాన్ని రాజకీయాలకు అంకితం చేసిన శక్తిశాలి పవన్ కల్యాణ్ అని, ఈ ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని చిరంజీవి పిఠాపురం ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నికల్లో తన తమ్ముడు పవన్ కల్యాణ్ విజయాన్ని కోరుతూ మంగళవారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. "పవన్ కల్యాణ్.. అమ్మ కడుపున ఆఖరివాడిగా పుట్టినప్పటికీ... అందరికీ మంచి చేయాలి, మేలు జరగాలనే విషయంలో ముందుంటాడు. తన గురించి కంటే జనం గురించి ఎక్కువగా ఆలోచించే మనస్తత్వం నా తమ్ముడు కల్యాణ్ బాబుది. ఎవరైనా అధికారంలోకి వచ్చాక ప్రజలకి ఏదైనా చేయాలనుకుంటారు. కానీ, కల్యాణ్ తన సొంత సంపాదనని కౌలు రైతులకు కన్నీళ్లు తుడిచేందుకు ఖర్చు పెట్టడం.. సరిహద్దు దగ్గర ప్రాణాలొడ్డి పోరాడే జవానులో కోసం అందించడం, మత్స్యకారులతో పాటు ఎంతో మందికి సాయం చేయడం.. చూస్తుంటే ఇలాంటి నాయకుడు కదా జనాలకి కావాల్సింది అనిపిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే సినిమాల్లోకి తను బలవంతంగానే వచ్చాడు. రాజకీయాల్లోకి మాత్రం ఇష్టంతోనే వచ్చాడు." అంటూ చిరంజీవి వ్యాఖ్యానించారు. చిరంజీవి ఈ వీడియో పెట్టిన వెంటనే ఆయన కుమారుడు రామ్‌చరణ్ దాన్ని ఎక్స్‌లో పోస్ట్ చేసి.. రాజకీయాల గురించి మాట్లాడడం అలవాటు లేని హీరో నాని కూడా పవన్ కల్యాణ్‌కు మద్దతుగా ఓ వీడియో విడుదల చేశారు. మీరు రాజకీయ కురుక్షేత్రంలో పెద్ద యుద్ధాన్నే ఎదుర్కొనబోతున్నారు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. యువ కథానాయకుడు రాజ్ తరుణ్ కూడా పవన్‌కు మద్దతు పలికారు. 'హను-మాన్' హీరో తేజ సజ్జా కూడా పవన్‌కు మద్దతు పలికారు. పవన్ కోసం మెగా హీరోలు వైష్ణవ్ తేజ్, సాయి దుర్గ తేజ్, వరుణ్ తేజ్ కూడా పిఠాపురంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎండల్ని కూడా లెక్క చేయకుండా వీధి వీధి తిరుగుతూ పవన్ గెలుపు కోసం కృషి చేస్తున్నారు.



కమలాపురంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

అవినాశ్‌ను కలవాలంటే జైలుకెళ్లాలి

▸ చిన్నపిల్లోడు, అమాయకుడు కాదు.. వివేకా హత్య కేసులో నిందితుడు

▸ కమలాపురం ప్రచారంలో షర్మిల నిప్పులు

కడప, మే 7(ఆంధ్రజ్యోతి): "కడప ఎంపీగా నన్ను గెలిపిస్తే ఇదే జిల్లాలో మీరు నన్ను నా ఇంటికి వచ్చి కలవచ్చు. అదే అవినాశ్‌రెడ్డిని మళ్లీ గెలిపిస్తే.. అయనను జైలులో వెళ్లి కలవాల్సి ఉంటుంది" అని పీసీసీ చీఫ్, కడప పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వైఎస్ షర్మిల అన్నారు. మంగళవారం ఆమె కమలాపురం నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ "వివేకా హత్య జరిగిన తర్వాత అక్కడ సాక్ష్యాలు తుడిచేస్తున్నప్పుడు అవినాశ్‌రెడ్డి పక్కనే ఉన్నాడంట. నిలబడి చూస్తున్నాడంట. ఒక ఎంపీ అయి ఉండి హత్య జరిగిన స్థలంలో సాక్ష్యాలు తుడిచేస్తుంటే పోలీసులకు చెప్పాల్సిన బాధ్యత ఆయనకు లేదా? మా మేనమామ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అవినాశ్‌కు ఒక సర్టిఫికెట్ ఇస్తారు.. చూస్తున్నట్లు. సీఎం జగన్ మరో సర్టిఫికెట్ ఇస్తారు.. చిన్న పిల్లోడు అని.. ఈయన చిన్న పిల్లోడు కాదు... అమాయకుడు కాదు.. వివేకా హత్య కేసులో కాల్ రికార్డ్స్, గూగుల్ మ్యాప్స్ అన్నీ అవినాశ్ వైపు చూపిస్తున్నాయి. హత్య కోసం రూ.40 కోట్ల సుపారీ మాట్లాడుకున్నారు. రూ.5కోట్లు అడ్వాన్సు ఇచ్చారు. అన్ని ఆధారాలు ఉన్నా హంతకులకు శిక్ష పడలేదు. అరెస్టు చేయాలని చూస్తే ఏకంగా సీఎం అడ్డుపడ్డారు. వైసీపీ మూకలను పెట్టి అరెస్టు కాకుండా చూశారు." అన్నారు.

మూడు పేరుతో అమరావతి విధ్వంసం

▸ రాష్ట్ర అభివృద్ధిపై మా సందేహాలను తీర్చండి.. జగన్‌కు షర్మిల లేఖ

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): న్యాయ నవ సందేహాలు పేరుతో సీఎం వైఎస్ జగన్‌కు వరుసగా లేఖాస్త్రాలు సంధిస్తున్న పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల... సోమవారం రాష్ట్ర అభివృద్ధిపై సూటిగా ప్రశ్నించారు. ఆ లేఖలో... "1) స్మార్ట్ సిటీ, హెరిటేజ్ సిటీగా కేంద్రం గుర్తించిన రాజధాని అమరావతిని మూడు రాజధానుల వాదనతో ఎందుకు విధ్వంసం చేశారు? పోనీ విశాఖలో అయినా ఎందుకు మౌలిక సదుపాయాలు కల్పించలేదు? కర్నూలులో ఏం నిర్మాణాలు చేశారు?, 2) రాష్ట్ర విభజన సమయానికి రెవెన్యూ రాబడులు తెలంగాణకు రూ.51,000 కోట్లు, ఏపీకి రూ.65,000 కోట్లు ఉంటే.. అనంతరం తెలంగాణ రాబడులు రూ.1.69 లక్షల కోట్లకు పెరిగితే, ఏపీ రాబడులు రూ.1.58 లక్షల కోట్లకు పరిమితమయ్యాయి. ఈ తేడాను మీరు కాదనగలరా? 3) రాష్ట్రంలో ఐదేళ్లలో మౌలిక సదుపాయాల కల్పన ఎందుకు చేపట్టలేదు? 4) ఐటీ రంగాన్ని పూర్తిగా ఎందుకు నిర్లక్ష్యం చేశారు? ఐటీ ఎగుమతుల్లో తెలంగాణ రూ.1.81 లక్షల కోట్లు సాధిస్తే.. ఏపీ కేవలం రూ.962 కోట్లేనా? 5) విశాఖ రైల్వేజోన్ ప్రకటన జరిగినా అమలు కాలేదు. అంటే మీరు భూములు కేటాయించలేదు. దీనికి నైతిక బాధ్యత మీది కాదా? 6) పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని కేవలం కక్షతో, నిర్లక్ష్యంతో వదిలేసిన మాట వాస్తవం కాదా?, 7) కనిగిరి, ఏర్పేడులో నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫాక్చరింగ్ జోన్ (నిమ్జ్)కు అనుమతులు వస్తే 25,000 ఎకరాల భూ కేటాయింపులు జరపని మాట వాస్తవం కాదా? 8) విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్‌ను ఎందుకు నిర్లక్ష్యం చేశారు? 9) వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేకంగా మీరు ఏం చేశారు? కేంద్రం ఇచ్చే ప్రత్యేక ప్యాకేజీని ఎందుకు సాధించలేకపోయారు?" అంటూ ప్రశ్నించారు. ప్రజలను తొలిచేస్తున్న ఈ న్యాయ నవ సందేహాలకు జగన్ సమాధానాలు చెప్పాలని షర్మిల డిమాండ్ చేశారు.

జన చేతనం



ప్రజా అజెండా

అభివృద్ధి.. సంక్షేమం.. సమ న్యాయం..

కౌంట్ డౌన్ 5 రోజులు

ఆంధ్రజ్యోతి

బుధవారం ◇ 8-5-2024

జీరో నుంచి ఆరంభం




చంద్రబాబు సీఎం అయ్యాక జీరో నుంచి ప్రారంభమైన పోలవరం పనులు

ఆంధ్రుల జీవనాడి పోలవరం ప్రాజెక్టును సీఎం జగన్మోహన్‌రెడ్డి విజయవంతంగా గోదావరిలో ముంచేశారు. చంద్రబాబు హయాంలో ఉవ్వెత్తున సాగిన పనులను రివర్స్ టెండరింగ్‌తో బొంద పెట్టేశారు. కేంద్రం వద్దన్నా కాంట్రాక్టు సంస్థను మార్చి ఐదేళ్లుగా ఒక్క పని కూడా పూర్తి కాకుండా అటకెక్కించేశారు. నిర్వాసితులకు అదనపు సాయం అందిస్తానని ఇచ్చిన హామీని గాలికొదిలేశారు. వారిని ముంపు పాల్జేశారు. టీడీపీ హయాంలో పూర్తయిన పునరావాస కాలనీలకు మౌలిక వసతులూ కల్పించలేదు. **2017-18నాటి అంచనా వ్యయం రూ.55,548.87 కోట్లకు** కేంద్ర జలశక్తి శాఖ అధ్వర్యంలోని సాంకేతిక సలహా సంఘం (టీఏసీ) ఆమోదించడంలో నాటి సీఎం చంద్రబాబు కీలక పాత్ర పోషించారు. కానీ అవినీతి కోసమే అంచనాలు పెంచారని ఆరోపణలు గుప్పించిన జగన్.. తీరా గద్దెనెక్కాక అవే అంచనాలను ఆమోదించాలని కేంద్రాన్ని కోరడం గమనార్హం. దీనిపై కేంద్ర ఆర్థిక శాఖ నియమించిన సవరణ కమిటీ.. **అంచనా వ్యయాన్ని రూ.47,725.61 కోట్లకు** కుదించింది. కానీ కేంద్ర కేబినెట్ ఇంతవరకు దీనిని ఆమోదించలేదు. తరచూ ఢిల్లీ వెళ్లి సొంత కేసుల గురించి మాట్లాడుకునే జగన్.. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వద్ద ఈ అంచనాల ఫైలు ఊసే ఎత్తడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కేంద్రం వద్దన్నా కాంట్రాక్టు సంస్థ మార్పు
- ఈ ఐదేళ్లలో 3 శాతమైనా పూర్తికాని పనులు
- డిజైన్లకు కూడా జల సంఘం ఆమోదం లేదు
- అటకెక్కిన భూసేకరణ.. పునరావాసం
- బాబు హయాంలో శరవేగంగా నిర్మాణాలు
- హెడ్‌వర్క్స్ 72 శాతం పూర్తి
- **రూ.55,548 కోట్ల అంచనాలకు టీఏసీ ఆమోదముద్ర**
- **జగన్ వచ్చాక రూ.47,725 కోట్లకు కుదింపు**
- **కేంద్ర కేబినెట్ క్లియరెన్స్ తేవడంలోనూ జగన్ విఫలం**

మహా యజ్ఞం..





చంద్రబాబు హయాంలో రాత్రి, పగలు తేడా లేకుండా యుద్ధ ప్రాతిపదికన సాగిన పోలవరం పనులు.. ఆయన దిగిపోయేనాటికి డ్యాం హెడ్ వర్క్స్‌లో 72% పూర్తయ్యాయి

పోలవరానికి శాపం!

మొత్తానికే ముంచేశారు.. జగన్ మార్కు 'రివర్స్' విధ్వంసం

'పోలవరం ప్రాజెక్టును మా నాన్న వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారు. దానిని పూర్తి చేసేది ఆయన కుమారుడు జగన్మోహన్‌రెడ్డి. భగవంతుడు ఎప్పుడో స్క్రిప్టు రాశాడు' అని ఐదేళ్లుగా అసెంబ్లీ సమావేశాల్లో సీఎం జగన్ సగర్వంగా ఊదరగొట్టారు. ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు సరికదా.. అంతా ధ్వంసం చేశారు. హెడ్‌వర్క్స్‌లో కీలకమైన కట్టడం డయాఫ్రం వాల్ గోదావరి వరద ఉధృతికి దెబ్బతింది. ఎగువ కాఫర్ డ్యాం సీపేజీకి గురైంది. గైడ్‌బండ్ కుంగిపోయింది. డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేయాలా.. కొత్తది కట్టాలా అన్నదానిపై ఇంతవరకు కేంద్ర రాష్ట్రాలు తేల్చలేదు. ఇది పూర్తయితేనే ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మించడం సాధ్యమవుతుంది. దానికి ఎగువ, దిగువన కాఫర్ డ్యాంలను నిర్మించాలి. ఇవి పూర్తయితేనే స్పిల్ చానల్ ద్వారా స్పిల్‌వే నుంచి గోదావరి జలాలు కిందికి ప్రవహిస్తాయి. ఈ పనులన్నీ ప్రొటోకాల్ ప్రకారం జరగాలి. కొత్తగా డిజైన్లు రూపొందించి దెబ్బతిన్న కట్టడాలను నిర్మించాలి. ఒకదాని వెంట ఒకటిగా నిర్ణీత కాల వ్యవధిలో ప్రధాన కట్టడాలను పూర్తి చేయాలంటే.. సదరు డిజైన్లను కేంద్ర జల సంఘం పరిశీలించి.. ఆమోదించి.. పనులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి.. నిర్మాణాలు మొదలు పెట్టాలంటే ఇప్పట్లో సాధ్యం కాదని జల సంఘమే స్పష్టం చేస్తోంది. అయినా జగన్‌లో చలనం లేదు.

లీడర్.. నాడు నేడు



ప్రాజెక్టు ప్రాంతమంతా కలియతిరుగుతూ నాటి సీఎం చంద్రబాబు



ఒడ్డున నిలబడి పోలవరం పనులను పరిశీలిస్తున్న ప్రస్తుత సీఎం జగన్


ఆదా చేశామని పెంచేశారు..

జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించేనాటికి మిగిలి ఉన్న పోలవరం హెడ్‌వర్క్స్ పనుల అంచనా విలువ రూ.1,771 కోట్లు మాత్రమే. నాటి నిర్మాణ సంస్థ నవయుగ ఇంజనీరింగ్.. సవాల్‌గా తీసుకుని పనులు చేపట్టింది. కాంక్రీటు పనులను పరుగులు తీయించింది. 24 గంటల్లో 32 వేల క్యూబిక్ మీటర్ల సిమెంటు కాంక్రీటును వేసి గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించింది. 2019 జనవరి 6న ఉదయం 8 గంటలకు మొదలుపెట్టిన ఈ కాంక్రీటు పని మర్నాటి ఉదయం 8 గంటలకు పూర్తయింది. ఇదే వేగంతో పనులు జరిగి ఉంటే 2020 జూన్‌కల్లా ప్రాజెక్టు పూర్తయిపోయేది. కానీ నవయుగ సంస్థ యాజమాన్యంతో వ్యక్తిగత విభేదాల కారణంగా జగన్ దాని కాంట్రాక్టు రద్దు చేశారు. రివర్స్ టెండర్‌కు వెళ్లారు. రూ.1,771 కోట్లకు పిలిచిన రివర్స్ టెండర్‌ను మేఘా సంస్థకు రూ.1,548 కోట్లకు ఖరారు చేశారు. రూ.223 కోట్లు ఆదా చేశామంటూ జగన్ సర్కారు ఊదరగొట్టేసింది. కానీ జరిగింది వేరు. 1,548 కోట్ల అంచనాలను గుట్టుచప్పుడు కాకుండా రూ.2,300 కోట్లకు జగన్ పెంచేశారు. అన్నిటికంటే దారుణంగా.. గోదావరిలో దొరికే ఇసుకను ప్రాజెక్టు వద్దకు తరలించేందుకు రూ.3,500 కోట్లకు నామినేషన్ పద్ధతిపై పొరుగు రాష్ట్రంలోని తన అనుంగు సంస్థకు కట్టబెట్టారు. చంద్రబాబు హయాంలో ఉచితంగా ఇసుకను ఇవ్వడం ఇక్కడ ప్రస్తావనార్హం. అంచనాలు పెంచినా.. మేఘా సకాలంలో నిర్మాణ పనులు చేపట్టలేదు. ఫలితంగా.. వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. దాని మరమ్మతుపై తర్జన భర్జనపడుతున్న సమయంలో ఎగువ కాఫర్ డ్యాం సీపేజీకి గురైంది. దిగువ కాఫర్ డ్యాంకూ ఇదే పరిస్థితి తలెత్తింది. అనూహ్యంగా గైడ్‌బండ్ కుంగిపోయింది. ఇప్పుడు వీటి మరమ్మతు పనులకు రూ.21,000 కోట్ల వ్యయమవుతుందని అంచనా.

పదే పదే వాయిదాలు..

పోలవరం పూర్తిపై జగన్ అసెంబ్లీలో అలవోకగా మాటమార్చుతూ అబద్ధాలాడుతూ వచ్చారు. 2019 నుంచి 2023 వరకు ఇదిగో అదిగో అంటూ వాయిదాలపై వాయిదాలు వేశారు. నిరుడు వరదలు వచ్చి నిర్వాసితులను కలవడానికి వెళ్లినప్పుడు.. ప్రాజెక్టును అనుకున్నంత వేగంగా పూర్తి చేయలేకపోయామని, 2025 ఖరీఫ్ కల్లా పూర్తి చేస్తామని జగన్ స్వయంగా చెప్పారు.

సాకారమయ్యే వేళ సర్వ నాశనం..



జగన్ సీఎం అయ్యాక పనులు పడకన పడటమే కాదు.. కట్టినవీ దెబ్బతినడం ఆరంభమైంది. డయాఫ్రం వాల్ దెబ్బతినగా.. కుంగిపోయిన గైడ్ బండ్‌ను చిత్రంలో చూడొచ్చు

మిగిలిన ప్రాజెక్టులూ పడకేశాయి

పోలవరమే కాదు.. జగన్ గద్దెనెక్కాక చాలా సాగునీటి ప్రాజెక్టులదీ అదే పరిస్థితి. చంద్రబాబు హయాంలో 70 శాతానికి మించి పూర్తయిన ఇతర పథకాలనూ ఆయన పూర్తిచేయలేదు. జలయజ్ఞంలోని 54 ప్రాజెక్టుల్లో పోలవరం సహా తొమ్మిదింటిని నవరత్నాలుగా ఎంపిక చేసి.. త్వరగా పూర్తిచేయాలనుకున్నారు. పోలవరం ముందే పడకేసింది. మిగిలిన వెలిగొండ, అవుకు టన్నెల్-2, వంశధార-నాగావళి అనుసంధానం, వంశధార స్టేజ్-2 ఫేజ్2, గొట్టు లచ్చన్న తోటపల్లి, గజపతినగరం బ్రాంచికెనాల్, తారకరామతీర్థసాగర్, మహేంద్ర తనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులను పూర్తి చేయడంలోనూ జగన్ సర్కారు పూర్తి నిర్లక్ష్యం వహించింది. సమీక్షలు తప్ప దేనికీ రూపాయి విడుదల చేయలేదు. ఆర్భాటంగా ప్రకటించిన రాయలసీమ ఎత్తిపోతల ఎత్తిపోయింది.. వైఎస్ఆర్ పల్నాడు దుర్భిక్ష నివారణ పథకం కనుమరుగైపోయింది.. కొల్లేరు ఉప్పునీటి శుద్ధి అటకెక్కిందని నిపుణులు మండిపడుతున్నారు.

నిర్వాసితులకు అడుగడుగునా దగా..


పోలవరం నిర్వాసితులను జగన్ మొదటి నుంచీ మోసగిస్తూ వచ్చారు. తాను అధికారంలోకి వస్తే.. వారికి 2014 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తానని.. పట్టిసీమ ప్రాంతంలో ఇచ్చినట్లుగానే ఎకరాకు రూ.19 లక్షల చొప్పున చెల్లిస్తానని.. 2006లో వైఎస్ హయాంలో సేకరించిన భూములకూ రూ.5 లక్షలు అదనంగా ఇస్తానని వాగ్దానాలు చేశారు. కానీ నెరవేర్చలేదు. పైగా నిరుడు నిర్వాసితులతో మాట్లాడే సమయంలో.. కేంద్రం డబ్బులిస్తేనే ఈ చెల్లింపులు చేస్తానని నిస్సిగ్గుగా చేతులెత్తేశారు.

- పోలవరం ప్రాజెక్టును 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మిస్తే 8 మండలాలపై ప్రభావం ఉంటుంది. 222 రెవెన్యూ గ్రామాలు నీట మునుగుతాయి. ఇందులో 373 ఆవాసాలు ఉన్నాయి. ఇప్పటిదాకా 38 ఆవాసాలకు పునరావాసం కల్పించారు. ఇంకా 355 ఆవాసాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.
- మొత్తంగా 1,06,005 కుటుంబాలకు సహాయ పునరావాసం కల్పించాలి. ఇప్పటి వరకూ కేవలం 12,060 కుటుంబాలనే తరలించారు. అలాగే రూ.12,096.24 కోట్లతో 1,57,766.13 ఎకరాలను సేకరించాలి. ఇందులో 1,13,119.07 ఎకరాలు సేకరించారు. ఇంకా 54,646.06 ఎకరాలు సేకరించాలి.
- సహాయ పునరావాస ప్యాకేజీలో భాగంగా రూ.8,113.10 కోట్లు నగదుగా చెల్లించాల్సి ఉండగా.. కేవలం రూ.831 కోట్లే ఇచ్చారు. ఇంకా 7,271.06 కోట్లు చెల్లించాలి.
- ఆర్ అండ్ ఆర్ కింద రూ.13,262 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటే.. ఇప్పటి దాకా రూ.1,120 కోట్లే వ్యయం చేశారు. జగన్ ఇచ్చిన హామీల అమలుకు అదనంగా రూ.2,500 కోట్లు వ్యయమవుతాయని అంచనా. ఈ డబ్బునూ ఇప్పటి దాకా నిర్వాసితులకు చెల్లించలేదు.
- మొత్తంగా సహాయ పునరావాస ప్యాకేజీల కోసం రూ.35,971.01 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటే.. కేవలం 7,409.58 కోట్లు ఖర్చుపెట్టారు. ఇంకా రూ.28,561 కోట్లు చెల్లించకుండా వదిలేశారు.

మినీ రిజర్వాయరు స్థాయికి..

ఖర్చు తడిసిమోపెడవుతుండడం.. కేంద్రం అంచనాలను ఇంకా ఆమోదించకపోవడంతో రెండు దఫాలుగా పోలవరాన్ని నిర్మించాలని జగన్ తలపోశారు. తొలి దశలో 41.15 మీటర్ల కాంటూరుకే పరిమితం చేస్తూ 115 టీఎంసీల మేర నీటిని నిల్వ చేస్తామని ప్రతిపాదించారు. తద్వారా పోలవరాన్ని మరో మినీ రిజర్వాయరు స్థాయికి దిగజార్చారు. ఈ 41.15 మీటర్ల కాంటూరులోనూ సహాయ పునరావాస కార్యక్రమాల కోసం రూ.8,462.33 కోట్లు వ్యయం చేయాల్సి ఉంటే.. రూ.5,510.60 కోట్లే ఖర్చు చేశారు. ఇందులో సింహభాగం గత ప్రభుత్వ హయాంలోనే చెల్లించారు. జగన్ సర్కారు ఇంతవరకు మిగతా రూ.2,951.73 కోట్లను చెల్లించలేదు. 'గత ప్రభుత్వంపైనా.. కాంట్రాక్టు సంస్థపైనా కక్షతో వ్యవహరించకుండా.. నిర్మాణ పనులను యథాతథంగా కొనసాగించి ఉంటే.. 2020 నవంబరు నాటికే ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవి. అటు ఇచ్ఛాపురం వరకు, ఇటు కృష్ణా డెల్టా వరకు గోదావరి జలాలు గలగలా పారేవి. అప్పుడు కృష్ణా జలాలను రాయలసీమకు మళ్లించడానికి ఆస్కారం ఉండేది. కరువుసీమ సస్యశ్యామలం కావడానికి దోహదపడేది. కానీ జగన్ కక్షపూరిత చర్యలతో పోలవరం నాశనమైంది' అని సాగునీటి రంగ నిపుణులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- అమరావతి, ఆంధ్రజ్యోతి



దేవీపట్నం నిర్వాసితుల కాలనీలో అసంపూర్తిగా ఉన్న ఇళ్లు

పోలవరం పునరావాసానికి మోదీ గ్యారెంటీ!

చంద్రబాబు సారథ్యంలో సాకారంకానున్న కల

నిర్వాసిత కుటుంబాల్లో చిగురిస్తున్న ఆశ

పోలవరం జాతీయ ప్రాజెక్టులో ఇంతకాలం నిర్లక్ష్యానికి గురైన పునరావాసానికి సోమవారం మోదీ గ్యారెంటీ లభించింది. మే 13 తర్వాత వచ్చేది ఎన్డీయే పాలనేనని, రాష్ట్రంలో తన రెండు పర్యటనల్లో స్పష్టం చేసిన మోదీ.. పోలవరం అంశాన్ని కీలకంగా ప్రస్తావించారు. గడిచిన అయిదేళ్లలో వైసీపీ సర్కార్ పోలవరంలో సాధించిన ప్రగతి ఏదీ లేదని తేల్చి చెప్పేసిన మోదీ.. పోలవరం బాధ్యత తమదేనని కూడా స్పష్టం చేశారు. గత ఐదేళ్లుగా పూర్వపు ఉభయగోదావరి జిల్లాల్లోని 8 మండలాల్లో 371 ఆవాసాలలోని 1,88,012 మంది జనాభా (1,06,006 నిర్వాసిత కుటుంబాలు) విషయంలో సాధించిన పునరావాస పురోగతి సుమారుగా ఐదు శాతాన్ని కూడా మించలేదు. నిర్వాసితులకు పునరావాసాన్ని పూర్తి స్థాయిలో కల్పించిన ప్రగతిని చూస్తే మొత్తంగా 12 వేలకు మించి నిర్వాసిత కుటుంబాలను తరలించలేకపోయారు. ఇంకా 94 వేలకు పైగా నిర్వాసిత కుటుంబాలను తరలించాల్సి ఉంది. అంటే వారెవరికీ పునరావాసాన్ని పూర్తిచేయనట్టే. ఇక జగన్ ఇచ్చిన ప్రత్యేక హామీతో కూడా పునరావాస ప్రగతి 22.50 శాతం మించలేదు. మరోపక్క పోలవరాన్ని ఎప్పుడు పూర్తి చేస్తామో కూడా కనీసం మేనిఫెస్టోలో కూడా చెప్పుకోలేని దుస్థితిలో వైసీపీ ఉండిపోయింది. పోలవరం పునరావాసం కోసం అచ్చంగా రూ.17,972 కోట్లు అవసరం కాగా, వైసీపీ ప్రభుత్వం తనకు లాభం లేని పునరావాసాన్ని గాలికి వదిలేసింది. గతంలో చంద్రబాబు హయాంలో ప్రతి సోమవారం పోలవారంగా నిర్వహించి నిర్మాణంపైనే కాకుండా పునరావాసాన్ని కూడా స్వయంగా సమీక్షించేవారు. చంద్రబాబు ప్రభుత్వం అనంతరం ఈ ప్రాజెక్టులో ప్రగతి కనీసం 10 శాతం కూడా లేదని అధికారిక లెక్కలే చెబుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రధాని మోదీ తన పర్యటనలో ఇచ్చిన గ్యారంటీతో పోలవరంపైనా, దాని పునరావాసంపైనా చంద్రబాబు సారథ్యంలో తిరిగి ప్రగతి సాధిస్తారన్న ఆశలు మళ్లీ చిగురించాయి. దీంతో నిర్వాసిత కుటుంబాలలో కూడా సర్వత్రా ఉత్తేజం కలుగుతోంది

-రంపచోడవరం

గుసగుసలు

విరాళాలూ.. విదేశీయానాలు!



వ్యాపార, వాణిజ్యాల్లో తీరికలేకుండా గడిపే కొందరు బడాబాబులు ఉన్నట్టుండి విదేశీ విహార యాత్రలకు చెక్కేస్తున్నారు. వారి కుటుంబ సభ్యులూ పరమానంద భరితులవుతున్నారు. ఉన్నట్టుండి ఈ టూరు ఎందుకని ఆరా తీస్తే... విరాళాల బెడద తప్పించుకునేందుకే అని ఆ వ్యాపారులు అసలు రహస్యం చెప్పేస్తున్నారు. ఎన్నికల వేళ తాము అందుబాటులో ఉంటే విరాళాల కోసం పార్టీల నేతల నుంచి ఒత్తిడి పెరుగుతుందని, ఈ నాలుగు రోజులు లేకపోతే గొడవ ఉండదని వారు ఈ ఎత్తుగడ వేశారు. 'కలిసి అడిగితే ఇవ్వక తప్పదు. ఒకరికి ఇస్తే ప్రత్యర్థులకు కూడా ఇవ్వాల్సి ఉంటుంది. అసలు లేకపోతే ఏ ఇబ్బందీ ఉండదు' అని ఒక వ్యాపారి చెప్పారు. అదే సమయంలో... రాజకీయ నేతలతో సంబంధాలు పూర్తిగా తెగిపోకుండా తమ సహాయకులతో వారికి చిన్న మొత్తాలు విరాళంగా పంపిస్తున్నారు. తమ బాస్ లేరని, ఆయన ఉంటే ఇంకా ఎక్కువ ఇచ్చేవారని సహాయకులు చెబుతున్నారు. **- అమరావతి, ఆంధ్రజ్యోతి**

ఎలక్షన్ స్పెషల్

బస్సులు పెడ్తున్నం.. బయల్దేరండి!

- ఏపీలో ఓట్లున్న హైదరాబాద్‌వాసులకు అభ్యర్థుల ఫోన్‌కాల్స్
- నియోజకవర్గానికి కనీసం 20 బస్సులు
- కచ్చిత ఓట్ల కోసం ఖర్చుకు వెనుకాడని అభ్యర్థులు.. వ్యయం రూ. 200 కోట్లు?

'బస్సులు పెడ్తున్నం.. బేగి బయల్దేరండి' అంటూ ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లున్న హైదరాబాద్‌వాసులకు ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల నుంచి ఫోన్‌కాల్స్ వెల్లువెత్తుతున్నాయి. ఈ సార్వత్రిక ఎన్నికలను అటు అధికార పార్టీ, ఇటు ప్రతిపక్ష పార్టీల కూటమి ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో ఏపీలో ఓట్లుండి ఇతర రాష్ట్రాల్లో ఉంటున్న ఏ ఒక్కరినీ అభ్యర్థులు వదిలిపెట్టడం లేదు. ప్రతి ఓటరుకు అభ్యర్థుల తరఫున స్థానిక నేతలు ఫోన్‌చేసి రవాణా సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల కంటే హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఏపీ ఓటర్లు ఉండడంతో వారిని రప్పించడంపైనే అభ్యర్థులంతా ఎక్కువగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాల వారీగా ఓటరు లిస్టుల్లో పేర్లున్న వారిని ఏకం చేసి వారిని రప్పించేందుకు బస్సులను ఏర్పాటు చేస్తున్నారు. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు వెళ్లే ఓటర్లకు ఒక్కో బస్సుకు ఆర్టీసీ రూ.80 వేల చొప్పున వసూలు చేస్తుండగా, ప్రైవేటు బస్సులకు రూ.1.20 లక్షలు ఇవ్వాలని ఆపరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. ఆ ఓట్లన్నీ పక్కాగా పడేవే కనుక ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఎంతైనా ఖర్చుచేసేందుకు వెనుకాడడం లేదని సమాచారం. గత ఎన్నికలప్పటికంటే.. ఇప్పుడు చాలామందికి సొంతవాహనాలు ఉన్నాయి. సొంత వాహనాల్లేని వారికి బస్సులు ఏర్పాటు చేస్తున్నారు.

ఆర్టీసీ అధికారులను సంప్రదించిన పార్టీలు

ఆంధ్రప్రదేశ్‌లో ఓట్లున్న హైదరాబాద్‌వాసులను ఆయా నియోజకవర్గాలకు తరలించడానికి అభ్యర్థులు సుమారు రూ.200కోట్లకుపైగా ఖర్చుపెట్టేందుకు సన్నద్ధమైనట్లు అంచనా. ఈ నెల 11 నుంచి 13 (శని, ఆది, సోమవారం) వరకు సెలవులు రావడంతో పిల్లాపాపలతో కుటుంబ సమేతంగా నియోజకవర్గాలకు చేరుకునేందుకు ఓటర్లు రెడీ అయినట్లు సమాచారం. హైదరాబాద్ నుంచి దాదాపు ప్రతి నియోజకవర్గానికి కనీసం 20 బస్సులు కావాల్సి వస్తోందని అనుకుంటున్నారు. ఉమ్మడి కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల వాసులు హైదరాబాద్‌లో తక్కువగా ఉంటారు. ఆ మూడు ఉమ్మడి జిల్లాలను మినహాయిస్తే, మిగిలిన 10 ఉమ్మడి జిల్లాలకు బస్సులు ఏర్పాటు చేసేందుకు ఒక్కో పార్టీకి 100 కోట్ల చొప్పున రెండు ప్రధాన పార్టీలకు రూ.200 కోట్లకుపైనే ఖర్చవుతుందని చెబుతున్నారు.



ఇప్పటికే సికింద్రాబాద్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, రాజేంద్రనగర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, మేడ్చల్ ప్రాంతాల్లోని ఓటర్ల కోసం బస్సులు కావాలని ఏపీలోని ప్రధాన పార్టీల నేతలు టీఎస్‌ఆర్టీసీ అధికారులను సంప్రదించారు. అయితే, తమ వద్ద హైదరాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు, రాజమండ్రి, ఒంగోలు, నెల్లూరు, శ్రీకాకుళం.. తదితర దూరప్రాంతాలకు నడపగలిగే 500 బస్సులు మాత్రమే ఉంటాయని గ్రేటర్ ఆర్టీసీ ఉన్నతాధికారులు చెబుతున్నారు. దీంతో మరిన్ని బస్సులను బుక్ చేసేందుకు ప్రైవేటు ఆపరేటర్లను ఆశ్రయిస్తున్నారు. సంక్రాంతి, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే మాదిరిగానే, ఈ దఫా ఓట్ల పండుగకు సొంతూరికి వెళ్లేందుకు ఏపీ ఓటర్లు సన్నద్ధమవుతున్నారు.

-హైదరాబాద్ సిటీ, ఆంధ్రజ్యోతి



అరిగపూడి పూర్ణ రమేశ్

ఓటేసిన ఎన్టీఆర్ క్లాస్‌మేట్

99 ఏళ్ల వయసులో ఇంటి వద్దే ఓటు వేసిన పూర్ణ

మంచి పరిపాలన రావాలని ఆకాంక్ష


టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత ఎన్టీఆర్ స్నేహితురాలు(క్లాస్‌మేట్) అరిగపూడి పూర్ణ రమేశ్ ఇంటి వద్దే ఓటు హక్కు వినియోగించుకున్నారు. 99 ఏళ్ల వయసున్న ఆమె విజయవాడలోని మున్సిపల్ కాలనీలో నివసిస్తున్నారు. మంచానికే పరిమితమైన ఆమె ఇంటికి మంగళవారం ఎన్నికల సిబ్బంది వెళ్లి, ఓటు వేయించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో మంచి పరిపాలన రావాలని, ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్‌తో కలిసి ఆమె విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో చదువుకున్నారు.

- విజయవాడ కృష్ణలంక

"బాత్రూంల ఫొటోలు తీశారా? అటెండెన్స్ ఇంకా అప్‌లోడ్ చేయలేదా? అదిగో, రాగి జావకు టైం అయిపోయినట్లుంది. గుడ్లు సరిగా లెక్కపెట్టి ఇచ్చారా? చిక్కీలకు జగన్ ఉన్న స్టిక్కర్లు తీసి రెడీ చేశారా? మర చేపోయాను.. బడికి రాని పిల్లల పేరెంట్స్‌కు ఫోన్ చేసి వాళ్లు ఎందుకు రాలేదో కనుక్కుని నోట్ చేశారా?" - ఇదీ జగన్ ఏలుబడిలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చేస్తున్న పని. ఫలితంగా గురువులకు పాఠశాలలు భారంగా మారాయి.

యాప్‌ల భారం.. బోధన దూరం!

ప్రభుత్వ ఉపాధ్యాయులపై పని భారం.. కుంటుపడిన విద్యా బోధన



జగన్ ఏలుబడిలో పాఠశాలల పనితీరు పూర్తిగా మారిపోయింది. ఒకప్పుడు పాఠశాల అంటే.. చదువులు చెప్పడంలో గురువులు బిజీగా ఉండేవారు. కానీ, ఇప్పుడు వారు చెప్పేది తక్కువ.. పాఠశాలలో పనులు చేసేది ఎక్కువగా మారింది. దీంతో హెడ్మాస్టర్ నుంచి టీచర్ల వరకు అష్టావధానం కాదు.. దశ, ద్వాదశావధానం కూడా చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో బోధనకు సమయం వెచ్చించలేని పరిస్థితి వచ్చింది. టెంత్‌లో అత్యధిక పర్సంటేజీ చూపించడానికి పరీక్షల్లో లిబరల్‌గా వదలడం డీఈవోలకు అనివార్యంగా మారింది.

హాజరు నుంచి కొలతల వరకు!

ఒకప్పుడు గురువుల పాదాలకు విద్యార్థులు నమస్కారం పెట్టి, దీవెనెలు కోరేవారు. ఇప్పుడు గురువులే విద్యార్థుల పాదాలు పట్టి యూనిఫాం కొలతలు తీస్తున్నారు. వైసీపీ సర్కారు వారిపట్ల చూపిస్తున్న వివక్షాపూరిత ధోరణి విద్యార్థులను పాఠాలకు దూరం చేస్తోంది. వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులు పడినన్ని కష్టాలు మరెవరూ పడలేదు. యాప్‌లమీద యాప్‌లు, డేటా అప్ లోడ్‌లు, అందుకోసం వారు పడుతున్న పాట్లు వర్ణనాతీతం. దీనిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలన్న తేడా ఏమీ లేదు. ఎస్జీటీలు (సెకండరీ గ్రేడ్ టీచర్లు), ఎస్ఏ(స్కూల్ అసిస్టెంట్)లన్న తేడా అసలే లేదు. "మమ్మల్ని జగన్ శత్రువుగా చూస్తున్నారే" అని వాపోని టీచర్లు లేరు.

యాప్‌ల యమగోల

మీరు ఎప్పుడైనా సరే ఏ ప్రభుత్వ పాఠశాలకైనా వెళ్లండి. క్లాస్ రూంలో టీచర్లు మొబైల్ చేతిలో పట్టుకునే కనిపిస్తారు. చదువు చెప్పాల్సిన గురువులు ఇలా మొబైళ్లతో గడపడమేంటనే సందేహం వస్తుంది. దీనికి కారణం జగన్ సర్కారు. యాప్‌లతో వారిని చావబాదడమే. ఐఎంఎంఎస్, జగనన్న గోరుముద్ద, స్కూల్ అటెండెన్స్ యాప్, జగనన్న విద్యా కానుక, ఏపీ స్టేట్ పోర్టల్ ఆన్‌లైన్, దీక్ష, ఇవి చాలదన్నట్లుగా బైజూస్ వంటివి టీచర్లకు గుదిబండగా మారాయి.

బాత్రూంల నుంచే మొదలు

బాత్రూంల ఫొటోల నుంచి విద్యార్థులకు ఇచ్చే కోడిగుడ్ల వరకు అన్ని విషయాలనూ యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సిందే. ఇలా అనేకం ఉన్నాయి. బయోమెట్రిక్ ఫేషియల్: టీచర్లు స్కూల్‌కు వెళ్లగానే ఈ యాప్‌లో ఫేషియల్ అటెండెన్స్ నమోదు చేయాలి. యాప్ పనిచేసే సరికి కనీసం పది నిముషాలైనా పడుతుంది. ఒక్కొక్కసారి సిగ్నల్ అందకపోతే.. అరగంటైనా ఆలస్యమవుతుంది. ఇది పడితే తప్ప.. ఉపాధ్యాయుడు స్కూలుకు వచ్చినట్టు కాదు. దీనికోసమే ఉపాధ్యాయులు పెద్ద యుద్ధం చేస్తున్నారు.

ఐఎంఎంఎస్: ఉదయం స్కూల్‌కు వెళ్లగానే బాత్రూంల ఫొటోలు తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. మళ్లీ అవి పరిశుభ్రంగా లేకపోతే దానికి పైనుంచి మందలింపులు కామన్. పాఠశాలలకు పనివాళ్లంటూ ఎవరూ ప్రత్యేకంగా ఉండరు. ఉపాధ్యాయులే వాళ్లను ఏర్పాటు చేసుకోవాలి. హెడ్మాస్టర్ జేబులోంచి కూలి డబ్బులు ఇవ్వాలి. ఆపైన ప్రభుత్వం ఎప్పుడు, ఎంత నిధులు మంజూరు చేస్తే అప్పుడు తీసుకుని సరిపెట్టుకోవాలి. ఒకవేళ పనివొత్తిడిలోనో, మరో కారణంచేతో బాత్రూంల ఫొటోలు ఉదయం 10.30 గంటల లోగా అప్‌లోడ్ చేయకపోతే సంబంధిత స్కూల్ పేరు యాప్‌లో వచ్చేస్తుంది. దానికి సంజాయిషీలు ఇచ్చుకోవడం తప్పదు.

స్కూల్ అటెండెన్స్ యాప్: తరగతి గదికి వెళ్లగానే ముందుగా మ్యాన్యువల్‌గా రిజిస్టర్‌లో పిల్లల అటెండెన్స్ తీసుకోవాలి. మళ్లీ ఆ అటెండెన్స్‌ను యాప్‌లో అప్లోడ్ చేసుకోవాలి. ఆబ్సెంట్ అయిన విద్యార్థుల తల్లిదండ్రులకు అప్పటికప్పుడే ఫోన్ చేసి కారణం తెలుసుకుని ఆ కారణం కూడా అందులో పొందుపరచాలి. మధ్యాహ్నం భోజనంలో గుడ్లు తినేవారెంతమంది.. చిక్కీలు ఎంతమందికి ఇవ్వాలి.. వంటి వివరాలు కూడా అప్పటికప్పుడు తీసుకుని యాప్‌లో అప్లోడ్ చేయాలి. దీనికి మరో 20 నిముషాల సమయం గడిచిపోతుంది.

జగనన్న గోరుముద్ద: పిల్లలు భోజనాలు చేసే ప్లేట్లు, రాగి జావ తాగే గ్లాసులు, వంట వండడానికి లేదా వడ్డించడానికి వాడే పాత్రల జాబితా ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అక్కడితో పని ముగిసిపోదు. మధ్యాహ్న భోజనం కోసం వండిన లేదా ఏదైనా ఏజన్సీ నుంచి అందిన ఆహార పదార్థాలు ప్రతివొక్కదానినీ ఫొటోలు తీయాలి. అన్నం, సాంబారు, గుడ్లు.. అన్నింటి ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలి. దీనికి మరో 20-30 నిముషాలు వెచ్చించక తప్పదు. పేరుకు నాలుగు యాప్‌లే కానీ, వాటిలో పొందుపరచాల్సిన అంశాల జాబితా చాంతాడంత ఉంటుంది. ఇదంతా ముగిసేసరికి ఉదయం బోధనా సమయంలో సుమారు 1.30-2 గంటల సమయం కరిగిపోతుంది. ఇక, విద్యా సంవత్సరంలో టీచర్లు అనేక అంశాలు అప్‌లోడ్ చేయాల్సిన, లేదా స్వయంగా శిక్షణ తీసుకోవాల్సిన యాప్‌లు బోలెడు ఉన్నాయి.

ఏపీ స్టేట్ పోర్టల్ మార్క్స్ ఆన్‌లైన్: ఈ యాప్‌లో పరీక్ష మార్కులు అప్‌లోడ్ చేయాలి. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1, ఎఫ్ఏ-3, ఎఫ్ఏ-4, ఎస్ఏ-2 పేర్లతో ఏడాదిలో ఆరుసార్లు అన్ని తరగతులకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష పేపర్లు దిద్ది ఒట్టి మార్కులు మాత్రమే వేస్తే సరిపోదు. ఏవేవో మార్కులు కలపాలి. మళ్లీ తీసివేయాలి. ఆ కలిపి, తీసివేసిన మార్కుల యావరేజ్ లెక్కలు కట్టాలి. అలా లెక్కలు కట్టగా వచ్చిన చివరి ఫలితాలను మాత్రమే యాప్‌లో అప్లోడ్ చేయాలి. చాలాసార్లు ఈ యాప్ సక్రమంగా పనిచేయదు. అందుకని అర్ధరాత్రుళ్లు కూర్చుని మధ్యమధ్యలో వచ్చే అంతరాయాలు అధిగమించి తెల్లవారుజాము దాకా అలా అప్‌లోడ్ చేస్తూనే ఉండాలి.

జేవీకే: జగనన్న విద్యా కానుక(జేవీకే) యాప్‌లో యూనిఫామ్, స్కూల్ బ్యాగ్‌లు, షూస్, నోట్‌బుక్స్, అచ్చు పుస్తకాలు.. ఇలా పాఠశాలకు వచ్చిన అన్నింటి లెక్కలు కట్టి, విద్యార్థుల వారీగా యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ 'కానుకలు ఏడాదిలో మూడు నాలుగు సార్లు విడతల వారీగా స్కూలుకు వస్తూనే ఉంటాయి. అలా వచ్చినప్పుడల్లా క్లాస్ టీచర్లకు పని తప్పదు. మరోవైపు వీటిని డంప్ చేసిన గోడౌన్లకు వెళ్లి స్వయంగా టీచర్లే వాటిని మోసుకు రావాలి. మళ్లీ విద్యార్థుల యూనిఫామ్, షూస్ కోసం వారి కొలతలు టీచర్లే తీసుకోవాలి.

కుంటుపడిన బోధన

సర్కారు పాఠశాలల్లో యాప్‌ల భారం పెరిగిపోవడంతో బోధన కుంటుపడింది. తమ తరగతుల పనితోపాటు మొత్తం పాఠశాల రికార్డుల అప్‌లోడ్ బాధ్యత కూడా హెచ్ఎంతోపాటు టీచర్లే తీసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి అదనపు బాధ్యతల మధ్య, యాప్‌ల చిక్కుల మధ్య పాఠశాలల్లో విద్యాబోధన కుంటుపడుతోంది. మళ్లీ ఇన్‌స్పెక్షన్లు, తనిఖీలు అంటూ ఉన్నతాధికారులు చేసే హడావుడి కామన్. పనిష్మెంట్లు, తాఖీదులు ఇస్తున్నారు. బోధనకు సమయమే చిక్కనప్పుడు.. సక్రమంగా ఎలా పని చేస్తామన్నది టీచర్ల ప్రశ్న. ఏతా వాతా వైసీపీ ఏలుబడిలో గురువుల పోస్టులు బరువుగా మారాయి. - కుప్పం



నెల్లూరు పార్లమెంట్‌లో వైసీపీకి పెట్టని కోటల్లా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలు బద్దలయ్యాయి. దీంతో టీడీపీ విజయావకాశాలు రోజు రోజుకు మెరుగుపడుతుండగా.. వైసీపీ పరిస్థితి నానాటికీ తీసికట్టుగా మారింది. నియోజకవర్గానికి పరిచయం అక్కర్లేని నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కూటమి పక్షాన రంగంలోకి దిగగా.. నియోజకవర్గంతో సంబంధం లేని నాయకుడు విజయసాయిరెడ్డి చెమటోడుస్తున్నారు. దీంతో ఫలితం ఏకపక్షం అయిపోయినా ఆశ్చర్యం లేదని పరిశీలకులు చెబుతున్నారు.

నెల్లూరులో వైసీపీ ఎదురీత





పట్టుబిగించిన తెలుగుదేశం

వేమిరెడ్డి రాకతో పార్టీలో జోష్

వైసీపీ నేతల్లో కొరవడిన ఐక్యత

నెల్లూరు పార్లమెంటు స్థానం ప్రతి ఎన్నికలోనూ హాట్‌హాట్‌గా ఉంటుంది. ఈసారి మాత్రం టీడీపీ కూటమికి ఏకపక్షంగా విజయం దక్కే అవకాశం కనిపిస్తోంది. దీనికి కారణం.. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కూటమి తరఫున బరిలో నిలవడమే. వైసీపీ నుంచి బరిలో ఉన్న విజయసాయిరెడ్డి స్థానికుడే అయినా.. కీలక నేతలు ఆయనకు దూరంగా ఉన్నారు. దీనికితోడు ప్రజల నుంచి ఆశించిన స్పందనలేదు. అదే సమయంలో అభ్యర్థి పరంగా, అసెంబ్లీ నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థుల కూర్పు ఎన్నడూ లేనంత బలంగా కనిపిస్తోంది. రెండు నెలల క్రితం వరకు టీడీపీకి పార్లమెంట్ అభ్యర్థి ఎంపిక ఇబ్బందిగా మారింది. ఈ క్రమంలో వైసీపీ నుంచి వచ్చిన వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి(వీపీఆర్) టీడీపీలో చేరారు. వెంటనే చంద్రబాబు ఆయనకు టికెట్ ఇచ్చారు. వీపీఆర్ తనతోపాటు వైసీపీ క్యాడర్‌ను తీసుకురావడంతో అధికార పార్టీ డీలాపడిపోయింది. నెల్లూరు పార్లమెంట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి వీపీఆర్ అసెంబ్లీ అభ్యర్థులకు బలమైతే, ఎమ్మెల్యే అభ్యర్థులు వీపీఆర్‌కు బలంగా మారారు. ఈ నేపథ్యంలోనే నెల్లూరు జిల్లాలో టీడీపీ కూటమి కొత్త చరిత్ర సృష్టిస్తుందనే ధీమా వ్యక్తమవుతోంది. టీడీపీ, వైసీపీ అభ్యర్థుల్లో కొన్ని సారూప్యతలు కనిపిస్తుండగా, కొన్ని వైరుధ్యాలు కనిపిస్తున్నాయి. టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, వైసీపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి ఇద్దరూ జిల్లాకు చెందిన వారే. ఇద్దరూ వైసీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన వారే. ఇద్దరూ ఆ పార్టీ నుంచి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైన వారే. ఇద్దరూ వైసీపీ అధినేత జగన్‌కి అత్యంత సన్నిహితంగా మెలిగినవారే.

సేవాతత్వం వీపీఆర్‌కు ప్లస్

వీపీఆర్ దాతగా, ఆధ్యాత్మికవేత్తగా ప్రజల్లో గుర్తింపు పొందారు. జిల్లాలో 110కి పైగా మినరల్ వాటర్ ప్లాంట్లు స్థాపించారు. నిరుపేద పిల్లల కోసం కార్పొరేట్ స్థాయిలో హైస్కూల్ స్థాపించి ఎనిమిదేళ్లుగా నడుపుతున్నారు. పాఠశాల పక్కనే ఆసుపత్రి స్థాపించి ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నారు. ఆలయాల పునరుద్ధరణకు భారీ విరాళాలు అందజేశారు. ఎన్నో అనాథ శరణాలయాలకు సాయం అందిస్తున్నారు.

విజయసాయికి నెగిటివ్ షేడ్

విజయసాయి రెడ్డి.. ప్రస్తుత ప్రభుత్వంలో నంబర్-2గా గుర్తింపు పొందినా జిల్లాకు ఒక్క పని కూడా చేయలేదు. చివరికి దత్తత తీసుకున్న సొంతూరును కూడా అభివృద్ధి చేయలేకపోయారనే విమర్శలున్నాయి. జగన్ అక్రమాస్తుల కేసులో ఏ-2గా జైలు జీవితం గడిపారు. కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. విశాఖలో ప్రతిపక్ష పార్టీ నేతల ఆస్తుల ధ్వంసం నుంచి ఆక్రమణల వరకు లెక్కలేనన్ని ఆరోపణలను ఎదుర్కొన్నారు. వీటిని టీడీపీ ప్రచారం చేస్తుండడంతో ప్రజల్లో వ్యతిరేకత పెరిగిపోయింది. రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు ఒక్కరే విజయసాయి కోసం పనిచేస్తున్నారు. కీలకమైన నెల్లూరు సిటీలో వైసీపీ పూర్తిగా చేతులెత్తేసినట్లే కనిపిస్తోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి

వీపీఆర్ బలాబలాలు

- కూటమి సహకారం, బలమైన కేడర్
- సేవా కార్యక్రమాలు, జిల్లాలో మంచి పేరు.
- ఎమ్మెల్యే అభ్యర్థుల సంపూర్ణ సహకారం.
- వైసీపీలో ఒక వర్గం టీడీపీలో చేరడం.
- ఆర్థికంగా బలంగా ఉండడం.

సాయిరెడ్డి బలాబలాలు

- కీలక నేతలు పార్టీకి దూరం కావడం.
- నాయకులందరితో కనెక్ట్ కాలేక పోవడం.
- రెడ్డి సామాజిక వర్గంలోనే వ్యతిరేకత.

సామాజిక వర్గాల వారీగా ఓటర్లు

ముస్లిం మైనారిటీలు	2.2లక్షలు
రెడ్లు	1.60లక్షలు
యాదవులు	75వేలు
కాపులు	1.50లక్షలు
కమ్మ	1.40లక్షలు
ఎస్సీ, ఎస్టీలు	2.50లక్షలు

సంఘం చెప్పిన మాట




భోగాపురపు వాయునందన శర్మ
రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు, రాష్ట్రీయ బ్రాహ్మణ్ సంఘటన్

కూటమితోనే బ్రాహ్మణ సంక్షేమం

రాష్ట్ర భవిష్యత్తు, ప్రజా సంక్షేమం, బ్రాహ్మణ వర్గాలకు న్యాయం జరుగుతుందన్న నమ్మకంతో ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి మద్దతు ఇస్తున్నాం. ప్రైవేటు దేవాలయాల్లో చాలీచాలని జీతాలతో అర్చకులు జీవనం సాగిస్తున్నారు. బాబు సూపర్‌సిక్స్ హామీలతో అర్చకులకు న్యాయం జరుగుతుందని, వారి జీవన ప్రమాణాల్లో మార్పులు చోటుచేసుకుంటాయని నమ్మకం ఉంది. నిరుద్యోగ బ్రాహ్మణులకు రూ.3 వేల నిరుద్యోగ భృతి కల్పించడం హర్షణీయం. దేవాలయాలకు ఎన్డీఏ కూటమి పూర్తి రక్షణ కల్పిస్తుందని, గతంలో జరిగిన ఘటనలకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు చేపడతారన్న నమ్మకం ఉంది.

- విజయనగరం



ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలంటే ప్రజలకు స్వతంత్రత, ఆత్మగౌరవం, ఏకత్వం ఉండాలి.

- మహాత్మా గాంధీ

ఉండిలో త్రిముఖ పోరు

- టీడీపీ కూటమి అభ్యర్థిగా రఘురామ
- వైసీపీ నుంచి పీవీఎల్ నరసింహరాజు
- టీడీపీ రెబెల్ శివకు జగన్ పరోక్ష మద్దతు

టీడీపీ కంచుకోట పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గంలో ఈసారి ముక్కోణ పోటీ నెలకొంది. ఎంపీ రఘురామకృష్ణరాజు టీడీపీ తరఫున బరిలో దిగడం ఆసక్తి రేపుతోంది. ముఖ్యమంత్రి జగన్ అవినీతి, అక్రమాలు, అరాచకాలపై నిత్యం గొంతెత్తుతూ ఆయన ఆగ్రహానికి గురై.. సీఐడీ కస్టడీలో చిత్రహింసలకు గురైన ఈయనపై సానుభూతి ఉంది. నాలుగేళ్లుగా ఢిల్లీ, హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. బీజేపీలో చేరి నరసాపురం నుంచి లోక్‌సభకు పోటీ చేస్తారని అందరూ అనుకున్నారు. అయితే కనిపించని ఒత్తిళ్లతో ఢిల్లీ పెద్దలు ఆయనకు టికెట్ ఇవ్వలేదు. టీడీపీ నాయకత్వం ప్రయత్నించినా వారు వినలేదు. దీంతో టీడీపీ ఆయనపై సానుభూతితో అసెంబ్లీ టికెట్ ఇవ్వాలనుకుంది. సిటింగ్ ఎమ్మెల్యే మంతెన రామరాజును ఒప్పించి ఉండి అభ్యర్థిగా నిలిపింది. జనసేన, బీజేపీ ఆయనకు అండగా ఉన్నాయి. వైసీపీ తరఫున పీవీఎల్ నరసింహరాజు నిలబడ్డారు. టీడీపీ టికెట్ ఆశించి విఫలమైన మాజీ ఎమ్మెల్యే వేటుకూరి శివరామరాజు.. ఇండియన్ ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీచేస్తున్నారు. తొలుత వైసీపీలో చేరదామనుకుని సీఎం జగన్‌ను కలిశారు. అయితే టీడీపీ ఓట్లను చీల్చితే రఘురామను దెబ్బతీయొచ్చని భావించిన వైసీపీ నాయకత్వం.. ఆయనను స్వతంత్రంగా పోటీచేయాలని సూచించారు.

దెబ్బతిన్న ఆక్వా..

ఈ నియోజకవర్గం ఆక్వా రంగానికి పెట్టింది పేరు. నాలుగు మండలాల్లోనూ ఆక్వా చెరువులు గణనీయంగా అభివృద్ధి చెందాయి. జగన్ ఏలుబడిలో ఆక్వా రంగం దెబ్బ తింది. మేత ధరలు పెరిగిపోయాయి. విద్యుత్ చార్జీలు తడిసి మోపెడయ్యాయి. పెట్టుబడి వ్యయం అధికమైంది. రొయ్య సాగు గిట్టుబాటు కావడం లేదు. రైతులు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయారు. మరోవైపు కాలువలు, డ్రెయిన్ల ప్రక్షాళనకు నోచుకోలేదు. ప్రజలకు సరైన మంచినీటి సౌకర్యం లేదు.

ఓట్ల చీలికతో ఎవరికి నష్టం..

ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా బరిలోకి దిగిన శివరామరాజు ఎవరి ఓట్లు చీలుస్తారనే విషయమై ఉత్కంఠ నెలకొంది. ఆయన రెండు పర్యాయాలు టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచారు. అందువల్ల టీడీపీ ఓట్లే చీలిపోతాయని వైసీపీ నేతలు అంటున్నారు. తెరచాటున అధికార పక్షం ఆయనకే మద్దతిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ రఘురామరాజును ఓడించడంపైనే కన్నేసింది. అధికార పార్టీ అభ్యర్థి నరసింహరాజు పెద్దగా ప్రచారం చేయడం లేదు. శివరామరాజుకు 30 వేల ఓట్లు వస్తాయని బెట్టింగులు సాగుతున్నాయి.

- భీమవరం, ఆంధ్రజ్యోతి

నియోజకవర్గ స్వరూపం.. (ఉండి, ఆకివీడు, పాలకోడేరు, కాళ్ల మండలాలు)	మొత్తం ఓటర్లు: 2,24,725, పురుషులు: 1,10,146 మహిళలు: 1,14,577... ట్రాన్స్‌జెండర్లు: 2
	కీలక సామాజిక వర్గాల ఓటర్లు
	కాపులు-46 వేలు, శెట్టిబలిజ: 28 వేలు, క్షత్రియ-24 వేలు, ఎస్సీలు-28 వేలు, తూర్పుకాపు-22 వేలు, యాదవ-9 వేలు, అగ్నికుల క్షత్రియ-6 వేలు, రజక-6 వేలు, ఆర్య వైశ్య-5 వేలు, ఇతర బీసీ కులాలు: 30 వేలు



రఘురామరాజు



నరసింహరాజు



శివరామరాజు

రఘురామరాజు బలాలు..

అరెస్టులు, టార్చర్‌తో ప్రజల్లో సానుభూతి.. వైసీపీ ఎంపీగా ఉండి జగన్‌ను ఢీకొట్టారన్న క్రేజ్.. పటిష్ఠమైన టీడీపీ ఓటుబ్యాంకు, సిటింగ్ ఎమ్మెల్యే రామరాజు మద్దతు..

బలహీనతలు..

ఆలస్యంగా టీడీపీ టికెట్ ఖరారు.. నాలుగేళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఢిల్లీలోనే ఉండడం.. పోటీలో ఉన్న శివరామరాజు ఓట్లు చీల్చే అవకాశం

నరసింహరాజు బలాలు..

సౌమ్యుడు.. ఆర్థికంగా సంపన్నుడు..

బలహీనతలు..

జనంలోకి రారన్న భావన.. టికెట్ ఇచ్చిన సొంత పార్టీయే అండగా ఉండకపోవడం.. శివరామరాజుకు దన్నుగా నిలవడం..

శివరామరాజు బలాలు

స్వచ్ఛంద సంస్థ ద్వారా చేసిన సేవలు, అందరితోనూ కలసిపోవడం. గతంలో 2 సార్లు టీడీపీ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి

బలహీనతలు..

నాలుగేళ్లుగా రాజకీయాలకు దూరం.. టీడీపీ టికెట్ ఇవ్వకపోవడంతో వైసీపీతో మంతనాలు.. టీడీపీ ఓట్లు చీల్చేందుకు, రఘురామరాజును ఓడించడానికి ఈయనకు వైసీపీ పరోక్షంగా మద్దతిస్తోందన్న ప్రచారం.. ఆర్థికంగా జగన్ అండ.

కీలకం

నగరి.. హోరాహోరీ!





మంత్రి రోజా బలాలు

సిట్టింగ్ ఎమ్మెల్యే.. పోల్‌మేనేజ్‌మెంట్.. ఆర్థిక బలం

బలహీనతలు

కుటుంబ పోరు, సొంత కేడర్ దూరం, సోదరుల అక్రమాలు, ఒంటెత్తు పోకడ, అభివృద్ధి లేకపోవడం

గాలి భానుప్రకాశ్ బలాలు

టీడీపీ కేడర్, కూటమి పార్టీల అండ, వివాదాలకు దూరంగా ఉండడం, తండ్రి వారసత్వం.. గతంలో చేసిన అభివృద్ధి

బలహీనతలు

ఆర్థిక ఇబ్బందులు..కలుపుగోలుతనం కొరవడటం

నగరి ఓటర్లు	
పురుషులు	98,000
మహిళలు	1,03,338
ట్రాన్స్‌జెండర్లు	83
మొత్తం	2,01,421

సామాజికవర్గాల వారీగా ఓట్లు	
రెడ్లు	20 వేలు
ఎస్సీలు	50 వేలు
మొదిలియార్	40 వేలు
కమ్మ	10 వేలు
ఇతరులు	20 వేలు

రోజా వర్సెస్ గాలి భాను

ఢీ అంటే ఢీ అనేలా పోరు

హ్యాట్రిక్ కోసం మంత్రి ఆరాటం

నగరి. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఓ మూలన విసిరేసినట్టుగా ఉండే నియోజకవర్గం. రాష్ట్ర విభజన తర్వాత జరిగిన రెండు ఎన్నికల్లోనూ వైసీపీ తరఫున పోటీ చేసిన ఆర్కే రోజా ఇక్కడ విజయం సాధించారు. టీడీపీ తరఫున పోటీ చేసిన మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు వారసుడు భానుప్రకాశ్ ఓడిపోయారు. తాజా ఎన్నికల్లోనూ వీరిద్దరే బరిలో ఉన్నారు. హ్యాట్రిక్ కొట్టాలని రోజా, ఈసారైనా గెలుపు గుర్రం ఎక్కాలని భానుప్రకాశ్ పట్టుదలతో ముందుకు సాగుతున్నారు.

మంత్రిగా విఫలం!

రెండుసార్లు నగరి ఎమ్మెల్యేగా ఉన్నా, రెండేళ్లకు పైగా మంత్రిగా ఉన్నా ఆర్కే రోజా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారనేది స్థానికంగా వినిపిస్తున్న మాట. పైపై మెరుగులకే రోజా ప్రాధాన్యం ఇచ్చారు తప్ప.. క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారు. ఎన్నికల షెడ్యూలుకు ఒకరోజు ముందు హడావిడిగా నగరి ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయించారు. ఏపీఐఐసీ ఛైర్‌పర్సన్‌గా, మంత్రిగా పదవులు పొందినా నగరికి మేలు చేయలేదని అంటున్నారు. గాలేరు-నగరి సుజల స్రవంతి ప్రాజెక్టు కింద ఇక్కడ నాలుగు భారీ రిజర్వాయర్లు నిర్మించాలి. టీడీపీ ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలంటూ నగరి నుంచి తిరుమలకు రోజా పాదయాత్ర చేశారు. మంత్రిగా పదవి చేపట్టాక.. ఈ ప్రాజెక్టు ఊసే మరిచిపోయారు. రెండోసారి గెలిచాక ఒంటెత్తు పోకడలతో బలమైన నేతలను దూరం చేసుకున్నారు. సొంత సామాజిక వర్గానికే పదవులు ఇచ్చుకున్నారు. దీంతో ఎన్నికలకు ముందు అసంతృప్త నేతలు తిరుగుబాటు చేశారు. రోజాకు టికెట్ ఇవ్వొద్దంటూ అధిష్ఠానంతో పోరాడారు. ఆమెకే టికెట్ ఇవ్వడంతో కొంతమంది టీడీపీలో చేరిపోయారు. మరికొంతమంది దూరంగా ఉంటున్నారు.

అన్నలదే పెత్తనం

మంత్రి రోజా అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఆమె అన్నలు ఇద్దరూ నియోజకవర్గంలో చెలరేగిపోయారు. రోజా తన భర్తకు, సోదరులకు మండలాలను పంచి ఇచ్చేశారని, దీంతో ఇసుక, గ్రావెల్, క్వారీల మైనింగ్‌ల ద్వారా భారీగా అక్రమార్జనకు పాల్పడ్డారని, ప్రభుత్వ భూములు కబ్జా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. మంత్రి నోటి దురుసు కారణంగా తరచూ వివాదాలు కొనితెచ్చుకుంటున్నారు. మంత్రిపై కూడా లెక్కలేనన్ని అవినీతి ఆరోపణలు వచ్చాయి. మరోవైపు పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పోచారెడ్డి రాకేశ్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి రెండోసారి పోటీ చేస్తున్నారు. ఆయన వైసీపీ ఓటు బ్యాంకుకు గండి కొట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పార్టీపై పట్టుతో గాలి

2019లో పరాజయం నేపథ్యంలో గడిచిన ఐదేళ్లలో పార్టీపై టీడీపీ యువనాయకుడు గాలి భానుప్రకాశ్ పట్టు పెంచుకున్నారు. దివంగత మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమ నాయుడు వారసుడిగా రంగంలోకి దిగిన ఆయన గతంలో తన తండ్రి చేసిన అభివృద్ధిని ప్రస్తావిస్తున్నారు. గత ఎన్నికల్లో ఓటమి జనంలో ఆయనపై సానుభూతి పెంచేలా చేసింది. గత ఐదేళ్లుగా నిరంతరం గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు, శ్రేణులకు అందుబాటులో ఉండడం కలిసి వస్తోంది. ఆర్భాటాలకు దూరంగా.. ప్రజలకు అందుబాటులో ఉంటారనే పేరు తెచ్చుకున్నారు. మిత్రపక్షాల్లో బీజేపీకి చెప్పుకోదగ్గ బలం లేకపోయినా జనసేన కేడర్ భానుకు అండగా నిలుస్తోంది.

-తిరుపతి-ఆంధ్రజ్యోతి

ఇంత నిర్లక్ష్యమా..?

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలు తలెత్తినా ఎస్పీలదే బాధ్యత. వారు అప్రమత్తంగా ఉండాలి. ఐదు జిల్లాల ఎస్పీలు లా అండ్ ఆర్డర్‌పై దృష్టిపెట్టడం లేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగ్గించాలి. కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటనలు చేయాలి' అని ఆదేశించింది. ముఖ్యంగా రాయలసీమలో రెండు జిల్లాల కలెక్టర్లు, ఉత్తరాంధ్రలో ఒకరు, గోదావరి జిల్లాల్లో ఇంకొక కలెక్టరు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని గుర్తించింది. వారు పక్షపాత ధోరణి తగ్గించుకుని, నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేసింది. రాష్ట్రంలో రాజకీయం బాగా వేడెక్కడంతో పకడ్బందీగా, రాజకీయ హింసకు తావు లేకుండా ఎన్నికలు నిర్వహించాలని ఈసీ నిర్ణయించింది. అందులో భాగంగా కలెక్టర్లు, ఎస్పీలపై పూర్తిస్థాయిలో నిఘా పెంచింది. రాయలసీమలోని మూడు జిల్లాలు, కోస్తా, ఉత్తరాంధ్రలో ఒక్కో జిల్లా ఎస్పీలపై నిఘా పెట్టింది. వీరు కొన్ని ఘటనల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని నిర్ధారించింది. గొడవలు, పరస్పర దాడులు, ఆందోళనలు జరిగిన తర్వాత మాత్రమే వీరు స్పందిస్తున్నారని తీవ్రంగా తప్పుబట్టింది. సంఘటనలు జరగకముందే స్పందించి వాటిని నివారించాలని ఆదేశించింది. ఆయా జిల్లాల్లో జరిగిన ఘటనలపై వివరణ కూడా కోరింది. మరోసారి ఇలాంటి సమస్యలు తలెత్తినా, నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవన్న హెచ్చరిక జారీచేసింది. ఇప్పటికే మూడు జిల్లాల కలెక్టర్లు, ఐదు జిల్లాల ఎస్పీలు, గుంటూరు రేంజ్ ఐజీ, అనంతపురం రేంజ్ డీఐజీ, నిఘా చీఫ్‌తో పాటు ఏకంగా డీజీపీపైనే వేటు వేసినా కొంత మంది అధికారుల్లో మార్పు రావడం లేదు. వీరిపై డేగకన్ను వేసిన ఈసీ.. వచ్చే నాలుగు రోజుల్లో కొందరిపై చర్యలు తీసుకునే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది

పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డిపై వేటు

- సదుం ఎస్ఐ మారుతినీ బదిలీచేసిన ఈసీ
- బీసీవై పార్టీ ఫిర్యాదుతో ఉత్తర్వులు
- రామచంద్ర యాదవ్‌పై దాడి పర్యవసానం



డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి ఎస్ఐ మారుతి

పుంగనూరు, మే 7: చిత్తూరు జిల్లా పలమనేరు డీఎస్పీ ఎస్‌హెచ్ మహేశ్వర్‌రెడ్డిపై కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) బదిలీ వేటు వేసింది. అలాగే సదుం ఎస్ఐ ఈ.మారుతినీ బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెల 29వ తేదీ మంత్రి పెద్దిరెడ్డి స్వగ్రామం సదుం మండలం ఎర్రాతివారిపల్లెలో బీసీవై పార్టీ అభ్యర్థి బోడే రామచంద్ర యాదవ్ ఎన్నికల ప్రచారానికి వెళ్లినప్పుడు వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డాయి. ఈ వ్యవహారంలో అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డి, పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, సదుం ఎస్ఐ ఈ.మారుతి ఏకపక్షంగా వ్యవహరించినట్లు రామచంద్ర యాదవ్ ఈ నెల 3వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) మీనాకు ఆధారాలతో ఫిర్యాదు చేశారు. దరిమిలా ఈసీ సోమవారం డీఐజీ అమ్మిరెడ్డిని బదిలీ చేసింది. మంగళవారం పలమనేరు డీఎస్పీ మహేశ్వర్‌రెడ్డి, సదుం ఎస్ఐ మారుతిలను బదిలీ చేస్తూ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఈ ఘటనలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న పుంగనూరు సీఐ బి.రాఘవరెడ్డిపైనా చర్యలు తీసుకోనున్నట్లు సమాచారం.

అంత అత్యవసరం ఏంటి?

- నిధులు మురిగిపోతాయన్న ప్రభుత్వ వాదన సహేతుకం కాదు
- ఎన్నికలయ్యే వరకు పథకాలు వద్దన్నాం
- హైకోర్టుకు నివేదించిన ఈసీ
- వివరాలను తమ ముందుంచాలన్న హైకోర్టు

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన, చేయూత పథకాల నిధులను ఎన్నికలయ్యే వరకు నిలుపుదల చేయాలని ప్రభుత్వానికి తెలిపినట్టు కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) హైకోర్టుకు వివరించింది. అయితే, వీటిని పంపిణీ చేయాలనుకుంటే దానికిగల అత్యవసర కారణాలను చెప్పాలని కోరింది. ఈ మేరకు తమకు వినతి పత్రం ఇస్తే పరిశీలించి తగిన ఉత్తర్వులు జారీ చేస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఈసీ తరఫున సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ హైకోర్టుకు నివేదించారు. మార్చి 31 నాటికే ఆర్థిక సంవత్సరం ముగుస్తుందని, సకాలంలో పంపిణీ చేయకుంటే ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు మురిగిపోతాయని రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న కారణం సహేతుకంగా లేదన్నారు. ఈ నెల 13న పోలింగ్ జరగనుందని, ఆ తర్వాత పథకాలకు సంబంధించిన నిధులను పంపిణీ చేయవచ్చునని తెలిపారు. ప్రభుత్వం సమర్పించే వినతిపై 24గంటల్లో తగిన నిర్ణయాన్ని వెల్లడిస్తామన్నారు. వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం.. అత్యవసరంగా ఎందుకు పంపిణీ చేయాలనుకుంటున్నారో కారణాలు పేర్కొంటూ కేంద్ర ఎన్నికల సంఘానికి తాజాగా వినతిపత్రం సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆదే సమయంలో ప్రభుత్వ వినతిపై నిర్ణయాన్ని వెల్లడించాలని ఈసీని కోరింది. ఆ వివరాలను కోర్టు ముందుంచాలని ఆదేశిస్తూ విచారణను గురువారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి. కృష్ణమోహన్ మంగళవారం ఆదేశాలిచ్చారు. ఎన్నికలు ముగిసేవరకు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన, చేయూత పథకాల నిధుల పంపిణీని ఆపాలంటూ ఈసీ ఇచ్చిన ఉత్తర్వులను పలువురు సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఇన్‌పుట్ సబ్సిడీ నిధులు పంపిణీ చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ అనంతపురం జిల్లాకు చెందిన ఎ. నారాయణ, గాజుల శ్రీనివాస్ పిటిషన్ వేశారు. అలాగే విద్యాదీవెన పథకం నిధులు విడుల చేసేలా ఆదేశాలు ఇవ్వాలంటూ గుంటూరు జిల్లా, అడవి తెక్కలపాడుకు చెందిన బంకా అరుణ్, పల్నాడుజిల్లా గుడిపాడుకు చెందిన పఠాన్ సూరజ్‌లు మరో వ్యాజ్యం దాఖలు చేశారు. చేయూత పథకం నిధులు విడుదల చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ గుంటూరు నగరంలోని భారత్ పేటకు చెందిన కె. శాంతకుమారి పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్ల అభ్యర్థన మేరకు వ్యాజ్యాలను న్యాయస్థానం లంచ్‌మోషన్ రూపంలో అత్యవసరంగా విచారణకు స్వీకరించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. పోలింగ్ అయ్యేవరకు నిధుల పంపిణీ ఆపాలని ఈసీ ఉత్తర్వులు ఇచ్చిందని, ఇలా చేస్తే రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. కోర్టు జోక్యం చేసుకుని తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. రాష్ట్రప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ ఎస్. శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. ఇన్‌పుట్ సబ్సిడీ, విద్యాదీవెన కొత్త పథకాలు కావని చెప్పారు. అత్యవసరంగా ఎందుకు పంపిణీ చేయాల్సి వస్తుందో కారణాలు పేర్కొం టూ స్క్రీనింగ్ కమిటీ ఈసీకి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. కొత్త పథకాలకే కోడ్ వర్తిస్తుందన్నారు. ఈసీ తరఫు సీనియర్ న్యాయవాది అవినాశ్ దేశాయ్ వాదనలు వినిపించారు.

పథకాలు ఆపమని చెప్పలేదు

- కొన్ని రోజుల తర్వాత ఇవ్వమన్నాం
- పోస్టల్ బ్యాలెట్ రేపటి వరకు పెంపు
- సీఈవో ముఖేశ్‌కుమార్ మీనా వెల్లడి

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇచ్చే పథకాలను ఆపేయమని ఎన్నికల సంఘం(ఈసీ) ఆదేశాలివ్వలేదని, ఐదు, పది రోజుల తర్వాత అమలు చేయాలని మాత్రమే చెప్పిందని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనా స్పష్టం చేశారు. అమరావతి సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈసీ ఎక్కడా పథకాలకు సొమ్ము ఇవ్వొద్దని చెప్పదని, వాయిదా వేసుకోమని మాత్రమే చెబుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి డీబీటీకి సంబంధించి 50 ప్రతిపాదనలు వచ్చాయని, వాటిలో కొన్ని వివరాలను ఈసీ కోరినట్టు పేర్కొన్నారు. కమిషన్‌కి వెళ్లిన వాటిలో కొన్ని ఆమోదం పొందాయని కొన్నింటిని పక్కన పెట్టిందని, మరికొన్నింటికి అదనపు సమాచారాన్ని కోరిందని వివరించారు. ఆసరా, చేయూత పథకాలకు సంబంధించిన సిఫారసులను ఈసీకి పంపిన తర్వాత వాటికి సంబంధించిన మరిన్ని వివరాలను పంపాలని కోరిందన్నారు. విద్యాదీవెన నిధులను పోలింగ్ ముగిసిన తర్వాత ఇవ్వమని చెప్పిందన్నారు. ఈ నెల 13న పోలింగ్ ముగిసిన తర్వాత ఈసీకి వినతులు పంపవచ్చన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు మంచి స్పందన

ఇప్పటి వరకు 3.03 లక్షల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకున్నారని మీనా తెలిపారు. మొత్తం 4.30 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఇప్పటి వరకు ఓటు హక్కు వినియోగించుకోని వారు బుధవారం వినియోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ గడువు జూన్ 3 వరకు పొడిగించడం కుదరదని చెప్పారు. అవసరమైతే పోస్టల్ బ్యాలెట్ వినియోగాన్ని గురువారం వరకు పొడిగిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగం విషయంలో ప్రలోభాలకు గురయ్యే ఉద్యోగులపై కఠినచర్యలు తీసుకోవడమే కాకుండా వారిని సస్పెండ్ కూడా చేస్తామని ముఖేశ్‌కుమార్ మీనా హెచ్చరించారు. ఒంగోలులో ఉద్యోగులకు కొందరు డిజిటల్ పేమెంట్స్ చేశారని, ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిప్పి పంపారని, ఈ ఘటనపై విచారణ చేపట్టినట్టు మీనా తెలిపారు.

ఇంకెన్నాళ్లీ ఫేక్ బతుకు?

టైటిల్ యాక్టుపై 'ఆంధ్రజ్యోతి' ప్రచురించని వార్తను తప్పుడు పేజినేషన్‌తో జనంలోకి..

- పోలింగ్‌కు ముందు అబద్ధాల ప్రచారం
- 'టైటిల్'పై ఎదురుగాలితో మరింతగా దిగజారుతున్న జగన్ నీలి మీడియా

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



'ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై ఈ వారంరోజులు జనాలను భయపెట్టండి...పెద్ద ఎత్తున దుష్ప్రచారం చేయండి..' అంటూ టీడీపీ నేతలను చంద్రబాబు ఆదేశించినట్టు 'ఆంధ్రజ్యోతి' పేరిట తప్పుడు పేజినేషన్‌తో జగన్ నీలి మీడియా జనంలోకి వదిలిన ఫేక్ వార్త ఇది.

విత్తనాల్లోనూ, పురుగు మందుల్లోనూ, ఎరువుల్లోనూ, ఆహార పదార్థాల్లోనూ కల్తీ చూస్తున్నాం. కానీ, జగన్ అధికారంలోకి వచ్చిన గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రజలను కల్తీ పత్రికా క్లిప్పింగులు సైతం ముంచెత్తుతున్నాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్టుపై సామాన్యుల నుంచి రైతులు, పెద్ద పదవులు చేసిన అధికారుల వరకు బెంబేలెత్తిపోతున్నారు. పోలింగ్‌కు ముందు టైటిల్ దెబ్బ ప్రభుత్వంపై బలంగా ఉండబోతున్నదన్న ఇంటెలిజెన్స్ విభాగం హెచ్చరికల నేపథ్యంలో జగన్ అండ్ కో 'ఫేక్' దారి పట్టారు. రోత పత్రికను ఎవరూ నమ్మరు కాబట్టి.. షరామామూలుగానే తమ దుష్ప్రచారానికి 'ఆంధ్రజ్యోతి'ని అడ్డుపెట్టుకున్నారు. ల్యాండ్ టైటిల్ యాక్టుపై మరింత దుమారం రేపాలని తన పార్టీ నేతలతో చంద్రబాబు అన్నట్టు, ఆ వార్తను 'ఆంధ్రజ్యోతి' ప్రచురించినట్టు తప్పుడు పేజీ నేషన్‌తో జనంలోకి వదిలారు. తనకు 'ఆంధ్రజ్యోతి' లేదు .. 'ఈనాడు' లేదు .. 'టీవీ 5' లేదు అని జగన్ చెబుతుంటారు. కానీ, అబద్ధాలను జనంలోకి వదలాలంటే మాత్రం ఈ సంస్థలనే అడ్డుపెట్టుకుంటూ ఉండటం గమనార్హం. తాము వండి వార్చిన అబద్ధాలను అవి ప్రచురించినట్టుగానో .. ప్రసారం చేసినట్టుగానో జనంలోకి వదలుతున్నారు. జగన్‌ను పులి తోనో .. సింహంతోనో ఆయన పార్టీ నేతలు పోలుస్తారు. ఎంతమంది వచ్చినా ఒంటరిగానే సమాధానం చెప్పేంత ధీరోదాత్తుడని పైకి ఎత్తేస్తుంటారు. కానీ, ఆయన నిజంగానే సింహం లాంటి వాడైతే చంద్రబాబు సమావేశం వార్త తన రోతపత్రికలో ఎందుకు ప్రచురించలేదు? అలాంటి క్లిప్పింగ్ ఎందుకు జనంలోకి వదలలేదు. ఎందుకంటే.. టైటిల్ యాక్టు విషయమై తన పార్టీ నేతలతో బాబు భేటీ కావడం అనేది ఒక అబద్ధం.. కానీ ఆ అబద్ధాన్నే నిజం చేయాలంటే క్రెడిబులిటీ ఉన్న మీడియాను అడ్డుపెట్టుకోవాలి. ఇప్పుడు జగన్ అండ్ కో చేస్తున్నది ఇదే. కానీ, ఈ కుట్రవార్తలను జనం నమ్మడంలేదు. వీటి వెనుక ఉన్న సృష్టికర్తలు ఎవరనేది వారు తేలిగ్గానే గ్రహించగలుగుతున్నారు. 'ఆంధ్రజ్యోతి' పేరిట జరుగుతున్న తప్పుడు దుష్ప్రచారాన్ని తిరస్కరిస్తున్నారు.

భూములతో బంతాట!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటున్నారు? 'మీ బిడ్డ... మీ బిడ్డ' అనే జగన్... 'మీ బిడ్డకు మీ భూములు ఇవ్వరా?" అని అడగాలనుకుంటున్నారా? ఇలా ఎన్నెన్నో ప్రశ్నలు.

ఒక్క చాన్స్‌తోనే ఇలా... మళ్లీ వస్తే ఎలా?

భూములు, స్థిరాస్తులకు సంబంధించి జగన్ తీసుకున్న అనేక వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు. అసలు హక్కుదారులకు హాని జరిగేలా... లిటిగెంట్లు, కబ్జాదారులకు మేలు చేసేలాగానే ఈ నిర్ణయాలున్నాయని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 'ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్' అమలుపై గెజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారు. వివాదాస్పదమైన ఈ చట్టంపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో విషయం అక్కడితో ఆగింది. ఇక... ఆస్తి ఒరిజనల్ పత్రాలు కాకుండా జిరాక్స్ ఇచ్చే ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలించారు. రాష్ట్రవ్యాప్తంగా అమలుకు రంగం సిద్ధంచేశారు. ఇక... రిజిస్ట్రేషన్ సమయంలో సాక్షులను తప్పించే దిశగా అధికారుల స్థాయిలో ఆదేశాలు సిద్ధమయ్యాయి. పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ ఫొటోలు పడుతూనే ఉన్నాయి. 'ఒక్క చాన్స్' ఇచ్చినందుకే పరిస్థితి ఇక్కడిదాకా తీసుకొచ్చారు. ఇక రెండో చాన్స్ ఇస్తే... ఈ వివాదాస్పద నిర్ణయాలన్నీ పూర్తిస్థాయిలో అమలుచేసి, జనం భూములు చుట్టేసి, బంతాట ఆడటం ఖాయమని సామాన్య రైతులు, న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిప్పుతో చెలగాటం...

రైతులకు భూమి కేవలం ఒక ఆస్తి కాదు! అది వారి భావోద్వేగం! అలాంటి భూములతోనే జగన్ ఆటాడుకుంటుండటం గమనార్హం. ఇప్పటిదాకా ప్రభుత్వ భూములను తెగనమ్మాలనుకున్నారు. అదివీలుకాకపోవడంతో బ్యాంకులకు తాకట్టుపెట్టి అప్పులు తెచ్చారు. సముద్రతీరం వెంట ఉన్న భూములకు సర్వే నంబర్లు ఇచ్చి మరీ వాటిని ప్రైవేటు కంపెనీలు, టూరిజం హబ్‌లకు ఇచ్చేశారు. ప్రభుత్వ శాఖల వద్ద ఉన్న భూములను బ్యాంకుల్లో తాకట్టుపెట్టారు. ప్రభుత్వ భూములు, ప్రభుత్వానికి వచ్చే ఆదాయంపై అప్పులు తీసుకొచ్చారు. ఇక మిగిలింది ప్రజల భూములు, ఆస్తులే. టైటిల్ చట్టం ద్వారా ప్రజల సాగు భూములు, ఆస్తులను కూడా తాకట్టుపెడతారా? అందుకే ప్రతీ భూమి పట్టాపై జగన్ తన పేరు, ఫొటో వేసుకున్నారా? రాష్ట్రంలో 1.35కోట్ల సర్వే నంబర్ల పరిధిలో 3,40,23,510.19 ఎకరాల భూమి ఉంది. ఇదంతా ప్రైవేటు భూమే. ఇక ప్రజల ఇంటిస్థలాలు, ఇతర ఆస్తులు అదనం. 3.40కోట్ల ఎకరాల భూమి విలువ కొన్ని రూ.లక్షల కోట్లు ఉంటుంది. ఆ విలువను అమాంతం పెంచేసి బ్యాంకుల దగ్గర తాకట్టుపెట్టి గంపగుత్తగా అప్పులు తెచ్చే ఆలోచన ఏమైనా జగన్‌కు ఉందా? లేకుంటే ఇన్ని చిత్రవిచిత్ర విన్యాసాలు ఎందుకు చేస్తున్నట్టు? ఈ అనుమానాలకు ఆస్కారం ఇచ్చింది కూడా ప్రభుత్వమే! భూముల రిజిస్ట్రేషన్ తర్వాత ఒరిజినల్స్ ప్రభుత్వం వద్దే ఉంచుకుంటామని కొత్త విధానం తీసుకొచ్చారు. ఇదో ఆందోళనకరమైన అంశం. ఇక, టైటిల్ చట్టం ద్వారా కార్పొరేట్ తరహాలో ల్యాండ్ అథారిటీని ఏర్పాటు చేస్తామని చట్టంలోనే పొందుపరిచారు. ఇక దీని పనల్లా పక్కా వ్యాపారం చేయడమే అని తెలుస్తోంది.

ఎవరి భూమిపై ఎవరి చిత్రాలు?

ఆంధ్రప్రదేశ్ భూమి హక్కులు, పట్టాదారు పాసుపుస్తక చట్టం-1971(ఆర్‌వోఆర్) ప్రకారం ఇచ్చే పాసుపుస్తకాలపై రైతు ఫొటో మాత్రమే ఉండాలి. అదికూడా తహసిల్దార్ సీల్‌తో ఉండాలి. కవర్‌పేజీ, చివరిపేజీ, లోపలి పేజీల్లో ఏ ఒక్కరి ఫొటో కూడా ఉండటానికి వీల్లేకుండా చాలా శాస్త్రీయంగా డిజైన్ చేశారు. కానీ, టైటిల్‌చట్టం కింద ఇచ్చే శాశ్వత భూ హక్కుపత్రాలపై జగన్ వంశవృక్షం కనిపించేలా డిజైన్ చేశారు. వైఎస్ఆర్ అంటే ఇద్దరి పేర్లు ఉన్నాయి. జగన్ తాత రాజారెడ్డిని వైఎస్ఆర్ అనే అంటారు. ఆయన తండ్రి రాజశేఖరరెడ్డిని కూడా వైఎస్ఆర్ అనే అంటారు. ఇలా భూ హక్కుపత్రంలో తొలుత వైఎస్ఆర్, ఆ తర్వాత జగనన్న అని పేరుపెట్టుకున్నారు. ఇలా వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, మరియు భూ రక్షపథకం అని పేరుపెట్టారు. ఇది సరిపోదనుకొని, హక్కు పత్రానికి జగనన్న భూ హక్కుపత్రంగా తన పేరు కనిపించేలా డిజైన్ చేశారు. దేశంలోనే కాదు.. ప్రపంచంలో ఏ దేశం, రాష్ట్రం కూడా ఇలాంటి పనిచేయలేదు.

ఎందుకీ ఆంక్షలు?

టైటిల్ చట్టం ప్రకారం భూ వివాదాలు వస్తే కోర్టులకు వెళ్లకూడదు. సివిల్ కోర్టులు జోక్యం చేసుకోకూడదని నిషేధం విధించారు. మరి బాధితులు ఎవరి వద్దకు వెళ్లాలి? వారికి సత్వర న్యాయం దక్కేదెలా? టైటిల్ చట్టంలో పేర్కొన్నట్లుగా ల్యాండ్ టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి, ల్యాండ్ టైటిల్ అప్పిలేట్ అధికారి వద్దకు వెళ్లమని ప్రభుత్వం చెబుతోంది. వారు ప్రభుత్వం నియవించే అధికారులే కదా! ఆర్డీవో, డీఆర్‌వో నియామకాల్లో ప్రభుత్వం చేస్తున్న నిర్వాకం ప్రజలకు తెలిసిపోయింది. అస్మదీయులు, సొంత మనుషులనే ఏరికోరి ఆర్డీవోలుగా నియమిస్తున్నారు. అనేకమంది ప్రభుత్వ పెద్దలు చెప్పినట్లే నడుచుకుంటున్నారు. అధికార నేతలు చెప్పారని ప్రభుత్వ, దేవదాయ, ఇనాం భూములను సైతం ప్రైవేటుకు రాసిచ్చారు. ఇటీవలే ఈ బాగోతాలు బయటపడ్డాయి. ఇక టైటిల్ రిజిస్ట్రేషన్ అధికారి గా మీరు నియమించే డిప్యూటీ కలెక్టరే ఉంటారు. టైటిల్ అప్పిలేట్ అధికారిగా మీరు నియవించే రిటైర్డ్ ఐఏఎస్ ఉంటారు. వారు ప్రభుత్వ మనుషులే కదా. వారు అధికార పార్టీ నేత లు చెప్పినట్లు వింటారు తప్ప రైతుల గోడు పట్టించుకుంటా రా? రైతుల వేదనను అర్థం చే సుకుంటారా? రైతులను సివిల్ కోర్టులకు వెళ్లనివ్వకుండా, మీరు నియమించే సొంత మనుషుల కాళ్లు పట్టుకోవాలని మీరు కోరుకుంటున్నారా? దీంతో మీరు ఏం సాధిద్దామనుకుంటున్నారు?

ఎవరు గెలిచినా మీదే గెలుపు

రాష్ట్ర స్థాయి కూపన్ నెం.3

పాఠకుని పూర్తి పేరు : ....

డోరు నెంబరు : .... వీధి పేరు : ....

గ్రామం/పట్టణం : .... మండలం : ....

జిల్లా : .... పోస్టల్ పిన్‌కోడ్ : .... ఫోన్ నెం. ....

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ఏ పార్టీకి / కూటమికి ఎన్ని సీట్లు వస్తాయి...
మీ అంచనాలను ఈ క్రింది గడిలో తెలియజేయగలరు.

మొత్తం సీట్లు	NDA కూటమి	YSRCP	కాంగ్రెస్	ఇతరులు

*షరతులు వర్తిస్తాయి

కూపన్ పూర్తి చేసి వెంటనే ఈ దిగువ అడ్రస్‌కు పోస్టు ద్వారా గానీ, పర్సనల్‌గా గానీ పంపే ఏర్పాటు చేయండి

పూర్తి వివరాలకు క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేయండి

ఆంధ్రజ్యోతి కార్యాలయం : సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద, గన్నవరం మండలం, కృష్ణాజిల్లా.-521107

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

రామరాజ్ యాంటీ బాక్టీరియర్ దోవతులను వాడండి

విద్యాధరపురం : భారతదేశం సంప్రదాయ దుస్తులకు పెట్టింది పేరని దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు అన్నారు. భవానీపురంలోని స్వాతిరోడ్డులో రామ్‌రాజ్ కాటన్ వస్త్ర సంస్థ నూతన బ్రాంచ్ షోరూంను ఇటీవల ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామరాజ్ కాటన్ ఉన్నతమైన ప్రామాణికాలతో వస్త్రాలను తయారు చేస్తూ ప్రజల ఆదరణను చూరగొందన్నారు. వివాహాది శుభకార్యాలకు ఈ వస్త్రాలను ఎక్కువగా ధరిస్తున్నారని, ఇందుకు కారణం మన్నిక, నాణ్యతని చెప్పారు. రామరాజ్ కాటన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కేఆర్ నాగరాజన్ అతిథులకు, ఆహూతులకు స్వాగతం పలుకుతూ తమ సంస్థ వస్త్రాల గురించి వివరించారు. నాణ్యతలో రాజీ పడకుండా దీటైన వస్త్రాలను తయారు చేస్తున్నామన్నారు. తాజాగా బాక్టీరియా వైరల్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షించుకోవడానికి కొత్తగా యాంటీ బాక్టీరియర్ దోవతులను ప్రవేశపెట్టామని, సున్నితమైన కాటన్‌తో తయారు చేస్తారన్నారు. తమ సంస్థకు చెందిన దోవతులు, చొక్కాలు, బనియన్లు దేశవ్యాప్తంగా విక్రయమవుతున్నాయన్నారు. మహిళలు, పురుషుల కోసం తయారు చేసిన వస్త్రాల కోసం ప్రత్యేక విభాగాల గురించి ఆయన సోదాహరణంగా వివరించారు. విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, పాపులర్ షూమార్ట్ మేనేజింగ్ పార్టనర్ చుక్కపల్లి విజయకుమార్ పాల్గొన్నారు.

దుర్గగుడి ఈవో రామారావు



షోరూంను ప్రారంభిస్తున్న ఈవో రామారావు

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంల పరిశీలన

కృష్ణలంక, మే 7: జిల్లాలోని 7నియోజకవర్గాలు, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవా, నిమ్రా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలోని కౌంటింగ్, స్ట్రాంగ్ రూంలను మంగళవారం కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్, మైలవరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి డాక్టర్ పి.సంపత్‌కుమార్, సెంట్రల్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి స్వప్నిల్‌తో కలిసి పరిశీలించారు. ఈనెల 13న పోలింగ్ అనంతరం ఈవీఎంలను నోవా, నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల భవనాలలో భద్రపరుస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు స్ట్రాంగ్ రూంల వద్ద భద్రత చర్యలు చేపట్టాలన్నారు. పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత ఏర్పాట్లపై చర్చించి సూచనలు జారీ చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. కౌంటింగ్ హాల్‌లో ఓట్ల లెక్కింపునకు అనువైన సౌకర్యాలను పరిశీలించి స్ట్రాంగ్ రూమ్‌ల పక్కనే ఓట్ల లెక్కింపు కేంద్రం ఉండేటట్టు చూడాలన్నారు. అనంతరం లెక్కింపు టేబుల్స్, పోలింగ్ ఏజెంట్లు వచ్చే మార్గం చుట్టుపక్కల శాంతి భద్రతా చర్యలను పరిశీలించారు.



భద్రతా ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న దుర్గగుడి కేశఖండనశాల సిబ్బంది

అధికారపార్టీ నేత కార్యక్రమానికి హాజరైన దుర్గగుడి క్షురకులు

వన్‌టౌన్, మే 7: విధులకు వచ్చినట్టే వచ్చి వెంటనే పనులు చేయకుండా దుర్గగుడి క్షురకులు సుమారు 20మంది అధికార పార్టీ కార్యక్రమానికి హాజరయ్యారు. సిట్టింగ్ ఎంపీ, వైసీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్ (నాని) ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కాలెండర్ ఆవిష్కరణలో వారంతా పాల్గొన్నారు. ఉదయం విధులకు వచ్చి హాజరు వేయించుకున్న అమలాపురపు పూర్ణచంద్రరావు, అవిటి రాంబాబు, కే కిషోర్, వై రాంబాబు, అవిటి ధనుంజయ్, సంతోష్ తదితర 20 మంది హాజరయ్యారు.



అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న జస్టిన్

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి: జస్టిన్

కృష్ణలంక, మే 7: జిల్లాలోని అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ గట్టి నిఘా పెట్టాలని విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ వ్యయ పరిశీలకులు వి.జస్టిన్ అన్నారు. మంగళవారం ఆయన నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలోని తెలంగాణ రాష్ట్రం ఖమ్మం సరిహద్దునున్న జొన్నలగడ్డ, చిల్లకల్లు పోలీస్ స్టేషన్ పరిధిలోని గండ్రాయి, వత్సవాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వత్సవాయి ఇంటర్ స్టేట్ బోర్డర్ చెక్‌పోస్టులను ఆకస్మికంగా పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద అధికారులు నమోదు చేస్తున్న రికార్డులు, వాహనాల తనిఖీ తదితర ప్రక్రియను పరిశీలించారు.



చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్న పోలీస్ అబ్జర్వర్ ప్రీతిందర్ సింగ్

జిల్లాలో పోలీస్ అబ్జర్వర్ సుడిగాలి పర్యటన

కృష్ణలంక, మే 7: పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు, ఆటోనగర్ చెక్‌పోస్టు, ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోని గుంటుపల్లి ఇంటర్ డిస్ట్రిక్ట్ చెక్‌పోస్టులను అబ్జర్వర్ ప్రీతిందర్ సింగ్ ఆకస్మిక తనిఖీ చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో శాంతిభద్రతల దృష్ట్యా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈనెల 13న పోలింగ్ జరుగనున్న నేపథ్యంలో డబ్బు, మద్యం అక్రమ రవాణా జరుగకుండా జిల్లాలోని అన్ని చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది గట్టి నిఘా ఉంచాలన్నారు. అంతర్‌రాష్ట్ర సరిహద్దులు జిల్లా సరిహద్దులు ఇరువైపులా వచ్చిపోయే వాహనాలను పూర్తిగా తనిఖీ చేసిన తరువాతే విడిచిపెట్టాలన్నారు. అధికమొత్తంలో నగదు, విలువైన వస్తువులు, ధ్రువీకరణ పత్రాలు లేకుండా రవాణా జరుగుతుంటే స్వాధీనం చేసుకొని ఉన్నతాధికారులకు అందచేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద రికార్డుల తనిఖీ చేశారు. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టుల వద్ద పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రీతిందర్‌సింగ్ ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

వన్‌టౌన్: మంగళవారం ఉదయం వన్‌టౌన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కేశపురం గ్రామానికి చెందిన తుంగని జానకి రామయ్య అతడి కుటుంబం ఆదివారం తిరుమలలో స్వామిని దర్శనం చేసుకున్నారు. అనంతరం కారులో మంగళవారం నగరానికి వచ్చారు. దుర్గమ్మను దర్శించుకునేందుకు వచ్చి కెనాల్‌రోడ్డులో కారు పార్కింగ్ చేశారు. అనంతరం వారంతా దుర్గగుడికి బయలుదేరారు. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్యాభర్తలు కలిసి వచ్చారు. కెనాల్‌రోడ్డులో రోడ్డు దాటుతుండగా సావిత్రమ్మ (57)ను టాటా ఏస్ వాహనం వచ్చి ఢీ కొనడంతో ఆమె కిం దపడగా తలకు తీవ్రగాయమైంది. 108లో ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయింది.

వైసీపీ ఎన్నికల సామగ్రి స్వాధీనం

పెనమలూరు, మే 7: అక్రమంగా నిల్వ చేసిన వైసీపీ ఎన్నికల సామగ్రిని ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్ స్వాధీనం చేసుకుంది. పెనమలూరు మండలం గంగూరులోని ఏవీఎం గార్డెన్స్‌లో వైసీపీకి చెందిన గిఫ్ట్ ఆర్టికల్స్, ఎన్నికల సామగ్రిని మంగళవారం రాత్రి అకస్మాత్తుగా దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. రూములను తనిఖీ చేసిన అధికారులు రెవెన్యూ సిబ్బంది సమక్షంలో పంచనామా నిర్వహించారు. ఇప్పటికే చాలా సామగ్రి పంపిణీ జరిగిపోయిందని భావిస్తున్నారు.



పంచనామా చేస్తున్న ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి: తాడి

విద్యాధరపురం, మే 7: ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తక్షణమే రద్దు చేయాలని మాజీ మేయర్ తాడి శకుంతల అన్నారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజల ఆస్తులను, పొలాలను దోచుకోవడానికి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చిన జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. జగన్‌రెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డికి ఉన్న ఆస్తుల పత్రాల జిరాక్సులను వారి దగ్గర పెట్టుకుని అసలైన వాటిని అప్పగిస్తారా అని ప్రశ్నించారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసేందుకు 2వ సంతకం చేయనున్నారన్నారు. బుధవారం ప్రధాని నరేంద్ర మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ర్యాలీని విజయవంతం చేసేందుకు కృషి చేస్తామన్నారు. నగరంలో మేయర్ ఎవరో చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. కొండప్రాంతంలో నీటి సమస్య, అక్కడ నివసించే 10 లక్షల మంది జనాభాకు పట్టాలివ్వాలన్న ఆలోచన లేదా అని ప్రశ్నించారు. వీఎంసీ బిల్డింగ్ ఎందుకు ఆగిపోయిందో చెప్పాలన్నారు. దాన్ని కూడా కబ్జా చేయాలని చూస్తున్నారా అని విమర్శించారు. ప్రజా సోషలిస్టు కూటమి చైర్మన్ జై ఆంధ్రా జై బాబు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ రోడ్‌షోకు 5వేల మందితో బందోబస్తు

● నగర పోలీస్ కమిషనర్ రామకృష్ణ

గుణదల, మే 7: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం సాయంత్రం బందర్ రోడ్డులో పాల్గొననున్న రోడ్‌షోకు 5వేల మందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు నగర పోలీస్ కమిషనర్ పి.హెచ్.డి. రామకృష్ణ తెలిపారు. బందోబస్తుకు గాను రాష్ట్రం నలుమూలల నుంచి సిబ్బందిని రప్పించినట్టు చెప్పారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు బందర్ రోడ్డులోని వ్యాస్ కాంప్లెక్స్ నుంచి రోడ్‌షో ప్రారంభమై బెంజిసర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. బందోబస్తు విధులు నిర్వహించనున్న వారికి మంగళవారం స్థానిక ఆంధ్ర లయోలలోని దేవయ్య ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశామన్నారు. తమకు కేటాయించిన ప్రదేశాల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. వీక్షకులు, ఆహ్వానితులు తమ కేటాయించిన మార్గాల్లో వెళ్లేలా సిబ్బంది చూసుకుంటారన్నారు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే కంట్రోల్ రూమ్‌కు సమాచారం వచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎక్కడా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆరుగురు ఐపీఎస్ అధికారులు, ఏడుగురు డీసీపీలు, 22మంది ఏడీసీపీలు, 50మంది ఏసీపీలు, 136మంది సీఐలు, 250మంది ఎస్‌ఐలు కలిపి మొత్తం 5వేల మంది లా అండ్ ఆర్డర్, ఏఆర్, ఏపీఎస్‌పీ పారామిలటరీ బలగాలతో కట్టు దిట్టమైన భద్రత, పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.



సమావేశంలో పాల్గొన్న పోలీసు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్న సీపీ రామకృష్ణ

ఎయిర్‌పోర్టు వద్ద కట్టుదిట్ట భద్రత

గన్నవరం: ప్రధాని నరేంద్ర మోదీ రాక సందర్భంగా విమానాశ్రయం చుట్టుపక్కల భారీ బందోబస్తు ఏర్పాట్లు చేశారు. అడుగడుగునా పోలీసు బలగాలు పహారా కాస్తున్నాయి. ఇప్పటికే కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు సూచనలు ఇచ్చారు. విమానాశ్రయానికి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. బుధవారం తిరుపతి నుంచి ప్రత్యేక విమానంలో ప్రధాని మోదీ సాయంత్రం 5.25గంటలకు ఇక్కడికి చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గాన విజయవాడ వెళతారు. అక్కడ రోడ్ షో చూసుకుని తిరిగి విమానాశయానికి చేరుకుని ప్రత్యేక విమానంలో ఢిల్లీ వెళ్లనున్నారు.

సీపీఎం నేత సీతారామ్ ఏచూరి రాక నేడు

సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారామ్ ఏచూరి బుధవారం గన్నవరం రానున్నారు. సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి కళ్లం వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గొల్లు కృష్ణ విజయాన్ని కాంక్షిస్తూ దావాజీగూడెం ఎస్వీఆర్ ఫంక్షన్ హాల్‌లో సభ నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు తెలిపారు. మిత్రపక్షాల కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తరలిరావాలని కోరారు.

క్రైస్తవుల పాలిట శాపం జగన్: ఈటే

విద్యాధరపురం: నా ఎస్సీ, నా ఎస్టీ బిడ్డలకు నేనున్నాను, నేను విన్నానంటూ క్రైస్తవులను జగన్ నమ్మించి మోసం చేశాడని టీడీపీ క్రిష్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాసు విమర్శించారు. గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రైస్తవులను జగన్ ఓటు బ్యాంకుగా మాత్రమే చూశాడన్నారు. గత ఎన్నికల్లో క్రైస్తవుల ఓట్ల కోసం బ్రదర్ అనిల్, విజయమ్మను పంపించి అధికారంలోకి వచ్చాడన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత 27 పథకాలను రద్దు చేశాడని విమర్శించారు. ఇప్పుడు విమలారెడ్డిని రంగంలోకి దింపాడన్నారు. ఆమె మాటలు నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. జెరూసలేంకు చంద్రబాబు 2,500 మందిని పంపిస్తే జగన్ ఒక్కరిని కూడా పంపించలేకపోయాడని విమర్శించారు. చంద్రబాబునే మరోసారి అధికారంలోకి తీసుకువస్తామని, టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎన్‌డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపిస్తామన్నారు. క్రిష్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఊర్ల మోహనరావు, సభ్యుడు శ్యాంసుందర్ పాల్గొన్నారు.

రేపు కేడీసీఏ బాలికలు, మహిళా క్రికెట్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు: నగరంలోని సిద్ధార్థ మెడికల్ కళాశాల గ్రౌండ్స్‌లో కేడీసీఏ అడహక్ కమిటీ ఆధ్వర్యంలో అన్ని గ్రూప్‌ల మహిళా క్రికెట్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 సెలక్షన్స్‌కు 2009 సెప్టెంబరు 1న తర్వాత జన్మించినవారు, అండర్-19 విభాగానికి 2005 సెప్టెంబరు 1న తర్వాత జన్మించిన వారు, అండర్-23 మహిళా జట్టుకు 2000 సెప్టెంబరు 1న తర్వాత జన్మించిన వారు ఈ ఎంపికలకు అర్హులన్నారు.

12న గ్రీన్ స్కూల్లో ఓపెన్, ఉమెన్ చెస్ చాంపియన్‌షిప్

ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గ్రీన్ స్కూల్లో ఈ నెల 12న కృష్ణాజిల్లా ఓపెన్, ఉమెన్ చెస్ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్.ఎం.ఫణికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో సత్తాచాటిన నలుగురు బాలికల్ని ఈ నెల 28,29న జిల్లాలో ఓపెన్ చెస్ స్టేట్ టోర్నీకి ఎంపిక చేస్తామన్నారు.

వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు: కలెక్టర్

కృష్ణలంక, మే 7: వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దే ఓటు వేసే అవకాశం కల్పించామని, 85ఏళ్లు నిండిన వయోవృద్ధులు, పోలింగ్ బూత్‌కి వచ్చి ఓటు వేయలేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు హోమ్ ఓటింగ్ విధానాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. పడమట పీ అండ్ టీ కాలనీలో నిర్వహించిన హోం ఓటింగ్ ప్రక్రియను మంగళవారం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బీహెచ్.భవానీశంకర్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 9,500 మంది 85ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులున్నట్టు గుర్తించామన్నారు. వీరికి ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం కల్పించేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరగా జిల్లాలో 1052 మంది హోం ఓటింగ్‌కు అంగీకారం తెలుపుతూ దరఖాస్తు చేసుకొన్నారన్నారు. జిల్లావ్యాప్తంగా 32 బృందాలు హోం ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తున్నాయని మంగళవారం 90 శాతం హోం ఓటింగ్ ప్రక్రియ పూర్తి చేయనున్నామని మిగిలిన 10 శాతం 9న పూర్తిచేసి నూరు శాతం పూర్తి చేయనున్నామన్నారు.



అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, మే 7: దుర్గగుడి ధర్మపథం వేదికపై మంగళవారం తెనాలికి చెందిన లక్ష్మీ కూచిపూడి నృత్య కళాకేంద్ర కళాకారిణులు నృత్యప్రదర్శన చేశారు. వారి అభినయం ఆహూతులను ఆకట్టుకుంది. లయబద్ధంగా, రాగ, తాళయుక్తంగా పద నర్తన సాగింది.

స్వామివారికి కానుకగా వెండితాపడ చెక్కబల్ల

దుర్గగుడిలోని మల్లేశ్వరాలయంలో వినియోగించడానికి 3.2 కిలోల బరువున్న వెండితాపడ చెక్కబల్లను నగరానికి చెందిన గుంటుపల్లి వెంకటరావు కుటుంబసభ్యులు మంగళవారం ఈవో కేఎస్ రామారావు ద్వారా దేవస్థానానికి కానుకగా అందజేశారు. అధికారులు దాత కుటుంబానికి అమ్మవారి దర్శనం కల్పించగా వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



కుంకుమ ప్యాకింగ్ పరిశీలన

అమ్మవారి దర్శనానంతరం భక్తులకు అందజేసే కుంకుమ ప్యాకింగ్‌ను ఈవో కేఎస్ రామారావు, ఏఈవో ఎన్ రమేష్‌బాబు మంగళవారం పరిశీలించారు. మహామండపం 6వ అంతస్తులో కుంకుమ ప్యాకింగ్‌ను ఏఏ ప్రమాణాల ప్రకారం ప్యాకింగ్ చేస్తున్నారు? వంటి విషయాలపై ఈవో ఆరా తీశారు. ఇంతకంటే మెరుగైన పద్ధతులేమైనా ఉన్నాయా అన్నదానిపైనా విచారణ చేశారు. ప్యాకింగ్ త్వరగా పూర్తిచేసేందుకున్న అవకాశాలను పరిశీలించాలన్నారు.

తూర్పులో రూ. 2వేల కోట్లతో అభివృద్ధి చేస్తే అసమర్థుడినా?

● కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గద్దె రామ్మోహన్

ధర్నాచౌక్, మే 7: రూ.2వేల కోట్లకు పైగా నిధులతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన నేను అసమర్థుడిలా కనిపిస్తున్నానా.. ఈ విమర్శలు నన్ను విమర్శించే వారి విజ్ఞతకే వదిలేస్తున్నానని ఎమ్మెల్యే, కూటమి అభ్యర్థి గద్దె రామ్మోహన్ తెలిపారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్'లో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రతిష్ట దిగజారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానిగా అమరావతి కావాలా? వద్దా? అనే అంశంపై ప్రజలు ఓట్లు వేయాలని కోరారు. తూర్పులో రూ. 600కోట్ల అభివృద్ధి పనులు జరిగాయని వైసీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ కూటమి గెలవబోతుందని జోస్యం చెప్పారు. కృష్ణలంక రిటైనింగ్ వాల్ ప్రారంభించింది టీడీపీ ప్రభుత్వ హయాంలోనేనని గుర్తుచేశారు. వైసీపీ నేతలు తామే దాన్ని నిర్మించామని గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. కొండ ప్రాంత పేదల సమస్యలను పరిష్కరిస్తామని, వారికి ఇళ్లపట్టాలు అందిస్తామన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి చందు జనార్దన్, ఉపాధ్యక్షుడు జయప్రకాష్, అర్బన్ అధ్యక్షుడు చావా రవి, ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కంచల జయరాజ్, దాసరి నాగరాజు, సీనియర్ జర్నలిస్టు ఎస్‌కే బాబు, సామ్నా రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ రమణారెడ్డి పాల్గొన్నారు.

పులివెందుల పోలీసులు పెట్టిన కేసు కొట్టేయండి

- హైకోర్టును ఆశ్రయించిన వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్
- వ్యాజ్యాలపై ముగిసిన వాదనలు...తీర్పు రిజర్వ్

అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): పులివెందుల పోలీసులు తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వివేకానందరెడ్డి కుమార్తె సునీత, అల్లుడు నర్రెడ్డి రాజశేఖరరెడ్డి, సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ దాఖలు చేసిన వ్యాజ్యాలపై మంగళవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. వివేకా హత్య కేసులో సీబీఐ దర్యాప్తు అధికారి ఎస్పీ రామ్‌సింగ్ కోరిన విధంగా సాక్ష్యం చెప్పాలనీ, లేకుంటే హత్య కేసులో ఇరికిస్తామని సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి దంపతులు ఒత్తిడి చేస్తున్నారని వివేకా పీఏ కృష్ణారెడ్డి పులివెందుల కోర్టును ఆశ్రయించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయడం లేదని ఆరోపించారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు....కేసు నమోదు చేసి జనవరి 4లోగా తుది నివేదిక ఇవ్వాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఎస్పీ రామ్‌సింగ్, సునీత, రాజశేఖరరెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని వీరు హైకోర్టును ఆశ్రయించారు. మంగళవారం ఈ వ్యాజ్యాలు విచారణకు రాగా, సునీత, నర్రెడ్డి రాజశేఖరరెడ్డి తరపు న్యాయవాది గూడపాటి వెంకటేశ్వరరావు వాదనలు వినిపించారు. "కృష్ణారెడ్డి ఫిర్యాదు చేసిన తరువాత పోలీసుల నుంచి నివేదిక కోరకుండానే పిటిషనర్లపై కేసునమోదు చేయాలని పులివెందుల మేజిస్ట్రేట్ యాంత్రికంగా ఆదేశాలిచ్చారు. ఉత్తర్వుల్లో ఎలాంటి కారణాలు పేర్కొనలేదు. నిబంధనల ప్రకారం పులివెందుల ఎస్‌హెచ్‌వో, ఎస్పీకి కృష్ణారెడ్డి ముందుగా ఫిర్యాదు చేయాలి. నేరుగా మేజిస్ట్రేట్‌కు ఫిర్యాదు చేయడం చట్టనిబంధనలకు విరుద్ధం" అని తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పులను ఆయన కోర్టు ముందు చదివి వినిపించారు. సీబీఐ దర్యాప్తునకు సహకరించాలని పిటిషనర్లు చెప్పారని కృష్ణారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారనీ, అంతకుమించి వారిపై ఎలాంటి ఆరోపణలు లేవని అన్నారు. మేజిస్ట్రేట్ ఉత్తర్వులు, తదనుగుణంగా పిటిషనర్లపై పులివెందుల పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయండని కోరారు. రామ్‌సింగ్ తరపున సీబీఐ ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. "విధి నిర్వహణలో భాగంగా తనముందు హాజరుకావాలని ఫిర్యాదుదారుడిని సీబీఐ ఎస్పీ కోరారు. దర్యాప్తును పక్కదారి పట్టించడంతో పాటు, దర్యాప్తు అధికారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే ఆయనపై ఫిర్యాదు చేశారు. ఆ అధికారిని ప్రాసిక్యూట్ చేసే ముందు ప్రభుత్వం నుంచి అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఆయనపై కేసు నమోదు చెల్లదు" అని వివరించారు. పోలీసుల తరపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.నాగిరెడ్డి స్పందించారు. "మేజిస్ట్రేట్ ఉత్తర్వుల కు అనుగుణంగా కేసు నమోదు చేయడంతోపాటు దర్యాప్తు పూర్తిచేసి పోలీసులు చార్జిషీట్ దాఖలుచేశారు. సాంకేతిక కారణాలతో మేజిస్ట్రేట్ దానిని తిరస్కరించారు. సీబీఐ ఎస్పీని ప్రాసిక్యూట్ చేసేందుకు ముందస్తు అనుమతి అవసరం లేదు. ఏ దశలోనైనా అనుమతి తీసుకోవచ్చు, దీనిపై సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయి" అని తెలిపారు. కృష్ణారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది ప్రద్యుమ్నకుమార్ వాదనలు వినిపించారు. "మేజిస్ట్రేట్ తన ఉత్తర్వుల్లో ఎలాంటి కారణాలు పేర్కొనాల్సిన అవసరం లేదు. ఫిర్యాదును పరిశీలించి కేసు నమోదుకు ఆదేశాలు ఇవ్వవచ్చు" అని తెలిపారు. వాదనలు ముగియడంతో న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

పోస్టల్ బ్యాలెట్ కాదు.. బుల్లెట్!

- పోలింగ్ దేని తలపించేలా క్యూ కట్టిన ఉద్యోగులు

గుంటూరు/అమరావతి, మే 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో మేధావివర్గంలో మహా చైతన్యం కనిపిస్తోంది. పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకునేందుకు ఉద్యోగులు ఉప్పెనలా కదిలొస్తున్నారు. కొంతమంది రిటర్నింగ్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తూ ప్రక్రియను తీవ్ర జాప్యం చేస్తున్నారు. మండుటెండలో క్యూలైన్లలో నిలబడలేక ఉద్యోగులు వెనుతిరిగిపోయే పరిస్థితి కల్పిస్తున్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి మంత్రి విడదల రజని వైసీపీ అభ్యర్థిగా బరిలో ఉండటంతో అక్కడి రిటర్నింగ్ అధికారిని లొంగదీసుకుని ఉద్యోగులను ముప్పతిప్పలు పెడుతున్నారు. ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేయకుండా తీవ్ర జాప్యం జరిగేలా చేస్తున్నారు. దీంతో మంగళవారం కూడా చాలామంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోలేకపోయారు. తాడికొండ నియోజకవర్గంలో ఓటింగ్ ప్రక్రియ 11గంటల వరకూ మొదలే కాలేదు.



గుంటూరులో ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద క్యూ కట్టిన ఉద్యోగులు

పోలింగ్ గడువు పెంచండి: బొప్పరాజు

ఉద్యోగులందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు కల్పించేందుకు పోలింగ్ గడువును పెంచాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు కోరారు. సాధారణ ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు వెయ్యి నుంచి 1,500 మందికి ఒక పోలింగ్ బూత్ ఉంటే, పోస్టల్ బ్యాలెట్‌కు మాత్రం ఫెసిలిటేషన్ కేంద్రాల్లో 10వేల మందికి పైబడి ఒకే కౌంటర్ పెట్టడం వల్ల గందరగోళం ఏర్పడుతోందని, పోలింగ్ కేంద్రాల్లో కౌంటర్లు పెంచాలని ఈసీకి బొప్పరాజు విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి భర్త హల్‌చల్

పెనుకొండ టౌన్, మే 7: శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. మంగళవారం పోలింగ్ జరుగుతున్న సమయంలో మంత్రి ఉష శ్రీచరణ్ భర్త చరణ్ రెడ్డి అక్కడికి వచ్చారు. పోలింగ్ కేంద్రం ఆవరణలోకి కారులో వెళుతుండగా టీడీపీ నాయకులు అడ్డగించారు. దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. టీడీపీ, బీజేపీ నాయకులకు వేలు చూపుతూ సీఐ యుగంధర్ బెదిరించారు. ఈలోగా ఉద్యోగులను ప్రలోభ పెట్టేందుకు చరణ్ రెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్లారు. దీనిపై కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి సవిత అభ్యంతరం తెలిపారు. ఆ తరువాత వైసీపీ నాయకుల ప్రలోభాలు కొనసాగాయి.



పెనుకొండలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రం వద్ద మంత్రి ఉషశ్రీ చరణ్, ఆమె భర్త చరణ్ రెడ్డి

ప్రకాశంలో ఉద్యోగి ఓటుకు 5వేలు!

(ఒంగోలు-ఆంధ్రజ్యోతి): ఒంగోలు అసెంబ్లీ నుంచి సీఎం సమీప బంధువు మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పోటీలో ఉన్నారు. రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి సొంత నియోజకవర్గమైన అద్దంకి బరిలో ఆయన అనుచరుడు హనిమిరెడ్డి ఉన్నారు. ఇక్కడ ఓటుకు రూ.5వేలు ఇస్తామన్నా ఉద్యోగుల నుంచి స్పందన లేదు. దీంతో సాధారణ ఓటర్లకు కూడా రూ.3వేల చొప్పున పంపిణీ ప్రారంభించారు. ఒంగోలు అసెంబ్లీలోనే వైసీపీ నేతలు రూ.వంద కోట్ల వరకు ఖర్చు చేయబోతున్నట్లు అంచనా. ఉద్యోగులకు ఓటుకు రూ.5వేలు ఇచ్చినందున సాధారణ ఓటర్లకు కూడా అంతే ఇవ్వాలని అద్దంకి నేతలు చెప్పడంతో వైసీపీ అభ్యర్థి డీలా పడినట్లు తెలిసింది.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం

- 'పేట' ఆర్వోకు షోకాజ్.... ఏఆర్వోపై సస్పెన్షన్ వేటు .. నేడు, రేపు రీ పోలింగ్

చిలకలూరిపేట, మే 7: పల్నాడు జిల్లా చిలకలూరిపేట అసెంబ్లీ నియోజకవర్గంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ సందర్భంగా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు రిటర్నింగ్ అధికారి బి. నారదమునికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, నాదెండ్ల తహసీల్దార్ డీవీబీ వరకుమార్‌ను సస్పెండ్ చేశామని చెప్పారు. నాదెండ్ల మండలం గణపవరంలోని కేబీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోనే ఈ నెల 8, 9 తేదీల్లో ఉదయం 10నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ల రీ పోలింగ్ జరుగుతుందని ప్రకటించారు. 5న పోలింగ్‌లో పాల్గొన్న ఉద్యోగులందరూ వచ్చి పోస్టల్ బ్యాలెట్‌ను మళ్లీ ఉపయోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

సీఎస్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి

» మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ డిమాండ్

న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఫించన్ల పంపిణీలో ఎన్నికల సంఘం ఆదేశాలను పలువురు ఉన్నతాధికారులు పెడచెవిన పెట్టడం వల్ల రాష్ట్రంలో 33 మంది చనిపోయారని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. ప్రభుత్వం అధికారికంగా ధృవీకరించనప్పటికీ సీఎం జగన్ కుటుంబానికి చెందిన దినపత్రిక పెన్షనర్లు మరణించినట్లు వార్తలు ప్రచురించిందని కేంద్ర మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఫించన్ల పంపిణీలో వైసీపీకి రాజకీయ ప్రయోజనాలు కలిగేలా ఉద్దేశ్యపూర్వకంగా వ్యవహరించిన చీఫ్ సెక్రటరీ జవహర్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరీ శశిభూషణ్ కుమార్, సెర్ప్ అధికారి మురళీధర్ రెడ్డిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని మానవ హక్కుల కమిషన్‌ను కోరారు. మరణించిన ఫించన్‌దారులకు తలా రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను చెల్లించేలా వైసీపీ ప్రభుత్వాన్ని ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

జగన్ కోరుకున్నట్లే ఓటమి ప్రాప్తిస్తుంది: వర్ల

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): 'ఇష్టానుసారంగా అధికారులను మార్చేస్తున్నారు. ఎపీలో ఎన్నికలు సక్రమంగా జరుగుతాయనే నమ్మకం రోజురోజుకీ సన్నగిల్లుతోంది' అన్న సీఎం జగన్.. పోలింగ్‌కు ముందే ఓటమిని అంగీకరించారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య ఎద్దేవా చేశారు. మంగళవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ అనుకున్నట్లే ఆయనకు ఓటమి ప్రాప్తిస్తుందని వర్ల వ్యాఖ్యానించారు.

సజ్జల భార్గవ్‌రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలి: టీడీపీ

తెలుగు మహిళా కార్యకర్తల ఫొటోలను మార్ఫింగ్ చేసి, సోషల్ మీడియాలో ప్రచారం చేయించిన సజ్జల భాస్కర్‌రెడ్డిని, దీని వెనుకున్న జగన్, సజ్జల రామకృష్ణారెడ్డి, రామ్‌గోపాల్‌వర్మపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు కోరారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనాను టీడీపీ నేతలు వర్ల రామయ్య, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, బుచ్చిరామ్‌ప్రసాద్ తదితరులు కలిసి, పలు అంశాలపై ఫిర్యాదులు చేశారు. టీడీపీకి ఓట్లెలా వేస్తారో చూస్తామంటూ బెదిరిస్తున్న గురజాల డీఎస్పీ, మాచర్ల, కారంపూడి సీఐ, ఎస్సైలను తక్షణమే ఎన్నికల విధుల నుంచి తప్పించాలని కోరారు.

ఏపీ అభివృద్ధికి మోదీ గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ

» ఎన్డీఏకి వేస్తే ఎవరి భూములు వారివే: పాతూరి నాగభూషణం

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): పొలాల్లో సర్వే రాళ్లు మొదట పాతించిన బ్రిటిషర్లు కూడా వాటిపై ఎక్కడా పేర్లు వేసుకోలేదని.. జగన్‌రెడ్డి వాటిపై పేర్లు, పాసు పుస్తకాలపై ఫొటోలు వేసుకుని భూ హక్కు చట్టంతో మొత్తానికే స్కెచ్ వేశారని బీజేపీ నాయకుడు పాతూరి నాగభూషణం అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి కేశవ్ కాంత్‌తో కలసి ఎన్డీఏ ఎన్నికల ప్రచారం కోసం వీడియా పాటను విడుదల చేశారు. 'మోదీ.. నరేంద్ర మోదీ.. నీ నామం దేశానికి రక్షణ కవచం.. నీ సేవ దేశానికి కీర్తి పతాకం..' అంటూ సాగే పాటలో పదేళ్ల దేశాభివృద్ధి, రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిందీ వివరిస్తూ.. రాష్ట్రాభివృద్ధికి 'మోదీ గ్యారెంటీ.. బాబు ష్యూరిటీ.. పవన్ సిన్సియారిటీ' అంటూ సాగే చరణాలు ఆకట్టుకున్నాయి. టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులకు ఓటేస్తే రాష్ట్రంలోని రైతులు ఎవరి పొలాలు వారే సాగు చేసుకుని పంట విక్రయించుకోవచ్చని, మళ్లీ వైసీపీ వస్తే ఆస్తి పత్రాలు జగన్ చేతిలో.. పొలాలు తాకట్టులో ఉంటాయని హెచ్చరించారు.

అవినీతి ఊబిలో వైసీపీ ప్రభుత్వం: సీపీ జోషి

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అవినీతిలో కూరుకు పోయిందని రాజస్థాన్ బీజేపీ అధ్యక్షుడు సీపీ జోషి అన్నారు. విజయవాడలోని బీజేపీ కార్యాలయంలో నేషనల్ లేబర్ బోర్డు ఛైర్మన్ వల్లూరు జయప్రకాశ్ నారాయణతో కలసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందని, దేశానికి మువ్వన్నెల జెండా ఇచ్చిన ప్రాంతం ఎన్డీఏ అభ్యర్థుల్ని ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. డబులింజన్ సర్కార్‌తోనే రాష్ట్రం పురోగతి సాధ్యమన్నారు.

మోదీ వ్యాఖ్యలతో జగన్ వెన్నులో వణుకు: బీజేపీ

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి) ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులపై వ్యాఖ్యానించడంతో జగన్‌రెడ్డి వెన్నులో వణుకు మొదలైందని బీజేపీ అధికార ప్రతినిధులు సుధీష్ రాంబొట్ల, యామినీ శర్మ, లంకా దినకర్, ఆర్డీ విల్సన్ వ్యాఖ్యానించారు. రైల్వే జోన్‌కు అవసరమైన, అనువైన భూమి ఇవ్వలేదని మోదీ వాస్తవాలు చెబితే.. రోడ్డు విస్తరణలో రైల్వే కోల్పోయిన స్థలానికి పరిహారంగా ఇచ్చిన దాంతో ముడి పెట్టడం వైసీపీకే చెల్లిందన్నారు.

ప్రత్యేక హోదాపై మోదీ గ్యారెంటీ ఏమైంది?: సీపీఐ

ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రధాని మోదీ 2014లో తిరుపతి వెంకన్న సాక్షిగా ఇచ్చిన హామీ ఏమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ప్రశ్నించారు. రాష్ట్రంలో జగన్ సర్కార్ అవినీతి, అరాచకం, మాఫియా, లిక్కర్, మైనింగ్, ఇసుక దోపిడీలకు పాల్పడుతుంటే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా ఎందుకు చోద్యం చూస్తూ కూర్చుందని నిలదీశారు.

అల్లూరికి చంద్రబాబు నివాళి

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. విప్లవ జ్యోతి అల్లూరి స్ఫూర్తిగా సామాన్యులపై జరిగే ప్రతి అణచివేతను ఎదిరించాల్సిన అవసరముందన్నారు. ఇన్నాళ్లు మనం చేసిన అలాంటి పోరాటాలు ఇప్పుడు ఎన్నికల రూపం దాల్చాయని, ఈ పోరులో ప్రజలను గెలిపించి, రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన అవసరం ఉందని ఎక్స్‌లో పేర్కొన్నారు.

అది ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ : మర్రెడ్డి

రాష్ట్రంలో ల్యాండ్, శ్యాండ్, వైన్, మైన్ అనేది ఏదీ వదలకుండా ప్రకృతి వనరులను దోచుకున్న జగన్ ప్రజల ఆస్తులను కొట్టేసేందుకు కన్నేశారని అందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పేరుతో ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తెచ్చారని తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ ప్రజలకు ఉరితాడుగా మారిందన్నారు. సర్వాధికారాలూ టీఆర్వోలకే ఎందుకు కల్పించారని ప్రశ్నించారు.

తీవ్ర వరద ముప్పులో గుంటూరు

న్యూఢిల్లీ, మే 7: భారత్‌లో భవిష్యత్‌లో వరద ముప్పు ఎక్కువగా పొంచి ఉన్న జిల్లాల టాప్-10 జాబితాలో గుంటూరు ఐదో స్థానంలో నిలిచింది. బిహార్‌లోని పట్నా అగ్రస్థానంలో ఉంది. ఐఐటీ-ఢిల్లీ, ఐఐటీ-రూర్కీ పరిశోధకులు అభివృద్ధి చేసిన జిల్లాస్థాయి వరద తీవ్రత సూచిక (డీఎఫ్ఎస్ఐ) ప్రకారం పట్నా జిల్లా అత్యంత ఘోరమైన వరద పరిస్థితులను ఎదుర్కోనుందని ఐఐటీ-ఢిల్లీ అసిస్టెంట్ ప్రొఫెసర్ మానవేంద్ర సహారియా అన్నారు.

ఇంటి స్థలమెక్కడయ్యా!

» మంత్రి అంబటిని చుట్టుముట్టిన మహిళలు

ముప్పాళ్ల, మే 7: 'మాకు స్థలం ఇచ్చినట్లు.. 2లక్షలు ఖర్చు చేసినట్లు.. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మీరిచ్చిన పుస్తకంలో ఉంది. మరి ఆ ఇంటి స్థలం ఎక్కడుందో చూపండి' అంటూ మంత్రి అంబటి రాంబాబును పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం బొల్లవరం ఎస్సీ కాలనీ మహిళలు నిలదీశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం బొల్లవరం వచ్చిన మంత్రిని కాలనీ మహిళలు చుట్టుముట్టారు. ఇంటి స్థలాల కోసం కేటాయించిన డబ్బులు ఎవరు తిన్నారంటూ ప్రశ్నించారు. వైసీపీకి చెందిన మాజీ సర్పంచ్ చింతపల్లి ఆశీర్వాదం కూడా మంత్రిని నిలదీశారు. దీంతో మంత్రి వారిపై కోపగించుకుంటూ మాజీ సర్పంచ్‌ని నెట్టుకుంటూ వెళ్లిపోయారు. దీంతో మహిళలు, యువకులు ఓట్ల కోసం వచ్చినప్పుడు చెబుతాం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి వెళ్లిపోయాక.. మాజీ సర్పంచ్ చింతపల్లి ఆశీర్వాదం, కాలనీ యువకులు, మహిళలతో వైసీపీ నాయకులు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం.



పల్నాడు జిల్లా బొల్లవరం ఎస్సీ కాలనీకి వచ్చిన మంత్రి అంబటి రాంబాబును నిలదీస్తున్న మహిళలు

త్వరలో కేజ్రీవాల్‌కు బెయిల్?



న్యూఢిల్లీ, మే 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ ఇచ్చే విషయాన్ని సుప్రీంకోర్టు సానుకూలంగా పరిశీలించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తే ఆయన ముఖ్యమంత్రిగా ఎలాంటి అధికార విధులూ నిర్వహించరాదని జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం వ్యాఖ్యానించింది. గురువారం (ఈ నెల 9న) కానీ వచ్చే వారం కానీ కేజ్రీవాల్ బెయిల్‌పై మలి విచారణ జరుపుతామని తెలిపింది. మరోవైపు, ఆయన కస్టడీని సీబీఐ, ఈడీ ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజా ఈ నెల 20 వరకు పొడిగించారు. తన బెయిల్ దరఖాస్తును హైకోర్టు తిరస్కరించడంతో కేజ్రీవాల్ సుప్రీంకోర్టు తలుపు తట్టిన విషయం తెలిసిందే. బెయిల్ ఇచ్చినంత మాత్రాన కేసు దర్యాప్తులో ప్రభావం ఉండదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. రిపబ్లిక్ టీవీ ఎడిటర్ అర్నాబ్ గోస్వామికి కూడా ఇలాంటి ఊరటే కల్పించామని జస్టిస్ దత్తా చెప్పారు. తాము రాజకీయ నాయకులకు ఎలాంటి మినహాయింపు ఇవ్వడం లేదని, ప్రతి వ్యక్తికీ ప్రత్యేక పరిస్థితులు ఉంటాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఎన్నికల వల్ల ఆ ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయా లేదా పరిశీలిస్తున్నామని తెలిపింది. తన అరెస్టుకు ఆధారాలు లేవని కేజ్రీవాల్ అంటున్నారని గుర్తుచేసింది. అందుకు తగ్గ సమాచారం తమకు ఇవ్వలేదని, కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా వచ్చిన ప్రకటనలన్నీ తమకు సమర్పించాలని ఈడీని కోరింది. తాము ఇచ్చేది మధ్యంతర బెయిల్ మాత్రమే కనుక ఒకవేళ ఆయన అరెస్టు తప్పని తర్వాత తేలితే సవరించుకుంటామని తెలిపింది. ఆయనను పూర్తిగా విడుదల చేయడం లేదని స్పష్టం చేసింది.

అంతకాలం ఎందుకు పట్టింది?

'మీరు రూ.100 కోట్ల మేరకు నేరం జరిగిందని తొలుత చెప్పారు. అది రెండు, మూడేళ్లలో రూ.1,100 కోట్లు ఎలా అయిందని సుప్రీంకోర్టు ఈడీని ప్రశ్నించింది. 2020 మే 9న తొలి అరెస్టు జరిగినప్పుడు కేజ్రీవాల్ అరెస్టు చేసేందుకు ఇంతకాలం ఎలా పట్టిందని అడిగింది. సెక్షన్ 19 ప్రకారం అరెస్టు చేసేందుకు తగిన ఆధారాలు ఉన్నాయా లేదా అని కూడా తాము చూడాల్సి ఉందని తెలిపింది. కేజ్రీవాల్ గురించి మీరు మొదట ఎప్పుడు తెలుసుకున్నారని కోర్టు అడిగే సరికి 2023 ఫిబ్రవరి 23న కవిత ఆడిటర్ బుచ్చిబాబు ప్రకటనలో కేజ్రీవాల్ పేరు బయటకొచ్చిందని, ఆయన రూ.100 కోట్లు డిమాండ్ చేశారనడానికి ఆధారాలు ఉన్నాయని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. అరెస్టయిన వ్యక్తి ఇచ్చే ప్రకటనకు విలువ ఉంటుందన్నారు. గోవా ఎన్నికల సందర్భంగా కేజ్రీవాల్ బస చేసిన సెవెన్ స్టార్ హోటల్ గ్రాండ్ హయత్ బిల్లును చారియట్ ఎంటర్‌ప్రైజెస్ చెల్లించిందన్నారు. దర్యాప్తు ప్రారంభమైనప్పుడు కేజ్రీవాల్ పాత్ర కనపడలేదని, ఆ తర్వాత క్రమంగా బయటపడిందని వాదించారు.

వాద ప్రతివాదనలు

కేజ్రీవాల్‌కు బెయిల్ ఇవ్వడం సరైంది కాదని ఈడీ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. రాజకీయ నాయకుడికీ, సామాన్యుడికీ వ్యత్యాసం ఉండరాదన్నారు. దాదాపు ఏడాదిన్నరగా ఈడీ దర్యాప్తు జరిపిన తర్వాతే కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిందని చెప్పారు. ఆయన రాజకీయ నేత అని, ఎన్నికల పేరుతో విడుదల చేయడం తప్పుడు సంకేతాలు పంపుతుందన్నారు. కేజ్రీవాల్ నేరాలు చేసే వ్యక్తి కాదని, ఆయన విదేశాలకు పారిపోయే అవకాశాలు లేవని ఆయన తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు.


ఇంత మోసం జరిగితే
వ్యవస్థలపై నమ్మకం ఉండదు

» ఓఎంఆర్ షీట్ల డాటా ప్రైవేటు సంస్థ వద్దా?

» వాటి భద్రత ప్రభుత్వ బాధ్యత కదా!

» బెంగాల్ సర్కారును గట్టిగా ప్రశ్నించిన సుప్రీంకోర్టు

» టీచరు పోస్టుల భర్తీపై విచారణ



న్యూఢిల్లీ, మే 7: ఉపాధ్యాయుల భర్తీ కుంభకోణంపై సుప్రీంకోర్టు మంగళవారం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నించింది. ఇలాంటి మోసాలు జరిగితే ప్రజలు వ్యవస్థలపై విశ్వాసాన్ని కోల్పోతారని వ్యాఖ్యానించింది. స్కూల్ సర్వీస్ కమిషన్ నియమించిన సుమారు 25వేల టీచరు పోస్టులను రద్దు చేస్తూ కలకత్తా హైకోర్టు తీర్పుపై దాఖలైన అప్పీలును ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ధర్మాసనం చేపట్టింది. జస్టిస్ చంద్రచూడ్ విచారణ ప్రారంభిస్తూ.. తొలి ప్రశ్న కింద 'ఎంపిక ప్రక్రియను సవాలు చేస్తూ కోర్టులో వ్యాజ్యం వేసిన సమయంలోనే అదనంగా సూపర్‌న్యూమరరీ పోస్టులను సృష్టించి, వెయిట్ లిస్ట్‌లో ఉన్న అభ్యర్థులతో ఎందుకు భర్తీ చేశారని ప్రశ్నించారు. అనంతరం భర్తీ ప్రక్రియలోని లోపాలను ఎత్తి చూపారు. పశ్చిమ బెంగాల్ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ ఏకంగా 25 వేల పోస్టుల భర్తీని రద్దు చేయడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తి దెబ్బతిందని చెప్పారు. స్కూల్ సర్వీసు కమిషన్ (ఎస్ఎస్‌సీ) తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదనలు వినిపిస్తూ ఉద్యోగాలను రద్దు చేసే అధికారం హైకోర్టుకు లేదని, ఇది సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని అన్నారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ ప్రశ్నలు సంధించారు. ఓఎంఆర్ షీట్లు, జవాబు పత్రాల స్కాన్డ్ కాపీలు ఉన్నాయా? ధ్వంసం చేశారా? అని అడిగారు. వాటిని ధ్వంసం చేసినట్టు న్యాయవాది సమాధానం ఇచ్చారు. వీటిని భద్ర పరచడం ఎస్ఎస్‌సీ బాధ్యత కదా? ఎందుకు పాటించలేదని మళ్లీ ప్రశ్నించారు. వాటి కాపీలు పేపర్లు దిద్దిన అవుట్ సోర్సింగ్ సంస్థ వద్ద ఉన్నాయని న్యాయవాది జావాబిచ్చారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ "జవాబు పత్రాలు ఎక్కడున్నాయి? అవుట్ సోర్సింగ్ సంస్థ వద్ద ఉన్నాయి. ఇంతకన్నా భద్రత ఉల్లంఘన ఇంకేమైనా ఉంటుందా? ఓఎంఆర్ షీట్ల స్కానింగ్ కోసం వారిని కిరాయికి తీసుకున్నారు. మొత్తం డాటాను వారికి ఇచ్చేశారు. ప్రజల డాటాను నిర్వహించాల్సిన బాధ్యత మీది. అసలు ఇలాంటి కీలకమైన పనులను చేపట్టే సంస్థను ఎంపిక చేసే ముందు ఎందుకు టెండర్లను పిలవలేదు? అయినా డాటా తమ వద్దనే ఉందంటూ సమాచార హక్కు కింద ఎస్ఎస్‌సీ తప్పుడు వివరాలు ఇచ్చింది" అని వ్యాఖ్యానించారు. ఇందుకు న్యాయవాది సమాధానం ఇస్తూ "అది నిజమే కావచ్చు. కానీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సరైనవేనా?" అని ప్రశ్నించారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ "ఇది ఒక పద్ధతి ప్రకారం జరిగిన మోసం. అసలే ప్రభుత్వ ఉద్యోగాలు చాలా తక్కువగా ఉన్నాయి. సామాజిక ఎదుగుదల కోసం వీటిపై ఆశపడుతున్నారు. భర్తీలోనే మోసాలు జరిగితే వ్యవస్థపై ప్రజలు విశ్వాసం కోల్పోతారు" అని అన్నారు. ఎస్ఎస్‌సీ తరఫున మరో సీనియర్ న్యాయవాది సంజయ్ హెగ్డే వాదనలు వినిపిస్తూ అందరూ అక్రమాలకు పడలేదని, అయినా వారి పోస్టులు రద్దయ్యాయని తెలిపారు. హైకోర్టు ఉత్తర్వులపై స్టే ఇవ్వడానికి నిరాకరిస్తూ తదుపరి విచారణను జులై నెలకు వాయిదా వేశారు.

బడుగులపై రౌడీ షీట్లు వద్దు

అమాయకులు, బడుగు వర్గాలవారిపై హిస్టరీ షీట్లు తెరవకూడదని సుప్రీంకోర్టు మంగళవారం అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. అన్యాయ, పక్షపాత, హానికర భావజాలంతో కొన్ని వర్గాల వారిపై రౌడీ షీట్లు తెరుస్తున్నారంటూ కొన్ని అధ్యయనాల్లో తేలడంతో దాన్ని ఆధారంగా చేసుకొని సుమోటోగా ఈ అంశంపై విచారణ చేపట్టింది. విచారణ జరిపిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కె.వి. విశ్వనాథన్‌ల ధర్మాసనం.. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనకబడిన వర్గాల వారు, ఎస్సీ, ఎస్టీలపై హిస్టరీ షీట్లు తెరవకూడదని తెలిపింది.

తప్పుడు ప్రకటనలకు సెలబ్రిటీలూ బాధ్యులే

న్యూఢిల్లీ, మే7: తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయమై సుప్రీంకోర్టు కఠిన వైఖరి తీసుకొంది. ప్రజలకు నష్టం జరగకుండా తొలుత ఈ ప్రకటనల్లో పాల్గొనే ప్రముఖులే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందని మంగళవారం స్పష్టం చేసింది. సంబంధిత వస్తువు/సేవపై పూర్తి అవగాహన ఉందని, అందుకే దాన్ని సిఫార్సు చేస్తున్నామంటూ స్వీయ ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుందని తెలిపింది. పతంజలి ఆయుర్వేద సంస్థ తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇచ్చిందంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ ఎ.అమానుల్లాల ధర్మాసనం..ప్రకటనల్లో పాల్గొనే సెలబ్రిటీలు, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లను ఉద్దేశించి ఈ సూచన చేసింది. ఒకవేళ ఆ వస్తువు/సేవ మోసపూరితమని తేలితే సంబంధిత సంస్థతో పాటు, ప్రకటనలో పాల్గొన్న ప్రముఖులు కూడా బాధ్యులవుతారని హెచ్చరించింది. 'తప్పుదోవ పట్టించే ప్రకటనల నిరోధక మార్గదర్శకాలు-2022'ను కచ్చితంగా పాటించాలని తెలిపింది. ప్రకటనను ప్రసారం చేసే ముందు అందులో నటించిన ప్రముఖుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకొని బ్రాడ్‌కాస్ట్ సేవా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని బ్రాడ్‌కాస్టర్లకు సూచించింది. ఇందుకోసం కేబుల్ టీవీ నెట్‌వర్క్ రూల్స్-1994, అడ్వర్టైజింగ్ కోడ్, ఇతరత్రా అమలు చేయాలని తెలిపింది. ప్రింట్ కోసం 4 వారాల్లో పోర్టల్‌ను రూపొందించాలంది. "ప్రకటనకర్తలకు ఇబ్బంది కలిగించడం మా ఉద్దేశం కాదు. బాధ్యత ఉండేలా చూడడం లక్ష్యం" అని ధర్మాసనం స్పష్టం చేసింది.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్
ముగ్గురు టెర్రరిస్టుల హతం

కుల్గాం, మే 7: జమ్మూకశ్మీర్ కుల్గాం జిల్లాలో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. ఈ ఎన్‌కౌంటర్‌లో లష్కర్ గ్రూపుకు సంబంధించిన 'ది రెసిస్టెంట్స్ ఫ్రంట్(టీఆర్ఎఫ్)' సంస్థకు చెందిన కీలక ఉగ్రవాది బసిత్‌దార్ మృతిచెందాడు. కుల్గాం రెడ్వాణీ ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికల గురించి సమాచారం అందడంతో భద్రతా బలగాలు సోమవారం అక్కడ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. మంగళవారం వరకు కొనసాగిన ఈ ఆపరేషన్ చివరకు ఎన్‌కౌంటర్‌కు దారి తీసింది. పలువురు పోలీసుల్ని చంపిన నేరాల్లో నిందితుడిగా ఉన్న బసిత్‌దార్‌పై 18 కేసులున్నాయి. అతనిపై 10 లక్షల రివార్డు కూడా ఉంది. కాగా, పలు అంశాల ఆధారంగా టెర్రరిస్టులను ఎ, ఎ ప్లస్, బీ, సీ కేటగిరిలుగా జమ్మూకశ్మీర్ పోలీసులు విభజించారు. ఆ ప్రకారం బసిత్‌దార్ 'ఎ' కేటగిరికి చెందినవాడు. కాగా, గత శనివారం భారత వైమానిక దళ కాన్వాయ్‌పై దాడి జరగడంతో భద్రతా బలగాలు పూంచ్, రాజౌరీ జిల్లాల్లో సెర్చ్ ఆపరేషన్ ముమ్మరం చేశాయి.

రూ.666 కోట్ల విలువైన ఆభరణాల కంటైనర్ బోల్తా

చెన్నై, మే 7 (ఆంధ్రజ్యోతి): కేరళ నుంచి తమిళనాడులోని సేలంకు రూ.666 కోట్ల విలువైన 810 కిలోల బంగారు ఆభరణాలతో బయలుదేరిన కంటైనర్ ఈరోడ్డు జిల్లా చిత్తోడ్ సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో కంటైనర్ డ్రైవర్‌తో పాటు సెక్యూరిటీ గార్డు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఓ ఆభరణాల సంస్థకు చెందిన బంగారు నగలను లోడ్ చేసుకున్న కంటైనర్ సోమవారం రాత్రి కేరళ సరిహద్దుల నుంచి సేలంకు బయలుదేరింది. పొద్దుపోయాక వాహనం చిత్తోడ్ సమత్తువ పురం వద్ద ప్రయాణిస్తుండగా, ఓ మలుపు తిరిగే ప్రయత్నంలో బోల్తాపడింది. సమాచారం అందుకున్న చిత్తోడ్ పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. గాయపడిన డ్రైవర్ శశికుమార్, సెక్యూరిటీ గార్డు బాల్‌రాజ్‌ను సమీపంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈలోపు సదరు ఆభరణాల సంస్థ మరొక కంటైనర్‌ను, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బందిని పంపించి, అక్కడి నుంచి నగలను సేలం తరలించింది. చిత్తోడ్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటు సంక్రాంత్రికి.. పాలోమంటూ

» ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్లే రైళ్లన్నీ కిటకిట

» 13న పోలింగ్.. వారం ముందే పయనం

» 8-12 మధ్య ఆన్‌లైన్ రిజర్వేషన్ 'నో రూమ్'

» ఏసీ క్లాస్‌లో వెయిటింగ్ లిస్ట్ చాంతాడు

» విశాఖ, తిరుపతి వందే భారత్‌లోనూ సీట్లు లేవ్

» బస్సులు, అద్దె కార్ల వైపు చూస్తున్న ప్రజలు

» రద్దీ, డిమాండ్ మేరకు ప్రత్యేక రైళ్లు: సీపీఆర్‌వో

హైదరాబాద్ సిటీ, మే 7(ఆంధ్రజ్యోతి): సహజంగా పెద్ద పండుగైన సంక్రాంతికి ఏపీ ప్రజలు హైదరాబాద్ నుంచి పొలోమంటూ బయల్దేరతారు.. కొన్ని నెలల ముందే రైలు టికెట్లు రిజర్వేషన్ చేసుకుంటారు. అది దొరకకుంటే తత్కాల్‌లో చివరి వరకు ప్రయత్నిస్తారు. వీలు కాకుంటే బస్సుల్లోనో, కార్లలోనో బయల్దేరుతారు. అదే పరిస్థితి ఇప్పుడు కనిపిస్తోంది. కారణం.. ఏపీ ఎన్నికలు. ఆ రాష్ట్రంలో ఓటున్న నగర వాసులు తమ హక్కును వినియోగించుకునేందుకు వారం రోజులు ముందుగానే వారి సొంతూళ్లకు వెళుతుండడం విశేషం. ఓవైపు విద్యా సంస్థలకు వేసవి సెలవులు కావడం, మరోవైపు ఎన్నికల తేదీ 13 (సోమవారం)కి ముందు రెండ్రోజులు (శని, ఆదివారాలు) సాధారణ సెలవులు రావడంతో ఉద్యోగులు, వ్యాపారులు, కూలీ పనులు చేసుకునేవారు సైతం ఊరి బాట పట్టారు. దీంతో సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ ప్రధాన స్టేషన్ల నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, తిరుపతి, కర్నూలు, కడప నగరాల వైపు వెళ్లే రైళ్లకు రిజర్వేషన్ దొరకడం లేదు. పోలింగ్‌కు ఐదు రోజుల ముందునుంచే దాదాపు అన్ని రైళ్లలో రిజర్వేషన్ నో రూమ్ స్టేటస్ కనిపిస్తుండడంతో, ఏపీ వాసులు ఇతర రవాణా మార్గాల (బస్సులు, అద్దె కార్లు) వైపు చూస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, చిత్తూరు, కడప వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన వారు మాత్రం రైలు ప్రయాణం వైపే మొగ్గు చూపుతున్నారు. కాగా, ప్రయాణానికి ఒకరోజు ముందుగా విడుదల చేసే తత్కాల్ టికెట్ల కోసం రిజర్వేషన్ కౌంటర్ల వద్ద రోజూ పడిగాపులు కాస్తున్నారు. తత్కాల్‌లోనూ దొరకనివారు అధికారులు ప్రత్యేక రైళ్లేమైనా ఏర్పాటు చేస్తారేమోనని ఆశలు పెట్టుకున్నారు. గుంటూరు, విజయవాడ మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే కోణార్క్, జన్మభూమి, ఈస్ట్ కోస్ట్, ఫలక్‌నుమా, గోదావరి, దురంతో, గరీబ్ రథ్, విశాఖ ఎక్స్‌ప్రెస్, గుంటూరు, తిరుపతి వైపు వెళ్లే కృష్ణా, శబరి, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లు, కాచిగూడ నుంచి కర్నూలు వైపు వెళ్లే వెంకటాద్రి, రామేశ్వరం.. తదితర ఎక్స్‌ప్రెస్‌ల స్లీపర్ క్లాస్, సెకండ క్లాస్ రిజర్వేషన్‌లో 100కు పైగా వెయిటింగ్ లిస్ట్ కనిపిస్తోంది. పోలింగ్ తేదీకి రెడు రోజుల ముందైతే రిగ్రెట్ (నో రూమ్) స్టేటస్ దర్శనమిస్తోంది. ఏసీ తరగతుల్లో సైతం కన్‌ఫర్మ్‌డ్ టికెట్లు దొరికే పరిస్థితి కనిపించడం లేదు. ఏపీలో ఓట్లున్న హైదరాబాద్ వాసులు సొంతూళ్లకు పెద్దఎత్తున తరలి వెళ్తుండడంతో రైల్వేశాఖ 'ఎలక్షన్ స్పెషల్ రైళ్లను'ఎ నడపాలని వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కాగా, ఈ విషయమై దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి రాకేశన్ వివరణ కోరగా, ప్రయాణికుల రద్దీ (డిమాండ్)ని ప్రతి రోజూ పర్యవేక్షిస్తున్నామని, బోగీల లభ్యతను బట్టి రద్దీ మార్గాల్లో వీలైనన్ని ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.

8 తర్వాతా 'పోస్టల్ బ్యాలట్' కల్పించాలి

» ఆ బాధ్యత ఈసీదే: ఏపీ జేఏసీ

విజయవాడ(వన్‌టౌన్), మే 7: ఉద్యోగులందరూ పూర్తిస్థాయిలో ఓటుహక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఈ నెల 8 తరువాత కూడా పోస్టల్ బ్యాలట్ సౌకర్యాన్ని కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి నాయకులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, వలిశెట్టి దామోదరరావు, కె.రమేష్‌కుమార్, టి.వి.ఫణిపేర్రాజు, వి.వి.మురళీకృష్ణనాయుడు మంగళవారం డిమాండ్ చేశారు. ఒక పోలింగ్ కేంద్రంలో ఒక ఈవీఎం ద్వారా వెయ్యి నుంచి 1500 మందికి మాత్రమే ఓటు సౌకర్యం ఉంటుందని, అలాంటిది ఫెసిలిటేషన్ సెంటర్లలో పదివేల ఓట్లకు పైబడి ఉండే పరిస్థితిలో ఒకే కౌంటర్ ఏర్పాటు చేయడం వల్ల గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఓటువేయలేని ఉద్యోగులను ఇంకొక రోజు రమ్మని అధికారులే వెనుకకు పంపిస్తున్నారన్నారు. అనకాపల్లి, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలు, గుంటూరు, నంద్యాల, కర్నూలు జిల్లాలలో, సత్యసాయి పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటింగ్ శాతం పెంచేలా తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. అనకాపల్లి జిల్లా, చిలకలూరిపేటలలో అధికారుల నిర్లక్ష్యంతో ఉద్యోగులు వేసిన పోస్టల్ బ్యాలట్‌లు చెల్లుబాటయ్యేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నో అవస్థలు, లోపాలు, గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో అందరూ తమ పోస్టల్ బ్యాలట్‌ను వినియోగించుకునేందుకు వీలుగా గడువు పెంచాలని అదనపు సీఈవో హరీంద్ర ప్రసాద్‌కు లేఖ సమర్పించారు.

కాస్త తగ్గిన విద్యుత్ డిమాండ్

అమరావతి, మే 7(ఆంధ్రజ్యోతి): మండువేసవిలో చల్లని వానతో విద్యుత్తు సంస్థకు బేజారు తగ్గింది. గడచిన వారం రోజులుగా 259 మిలియన్ యూనిట్ల వరకూ డిమాండ్ నమోదు కాగా, సోమవారం మాత్రం 255. 810 మిలియన్ యూనిట్ల డిమాండ్ ఏర్పడింది. ఈ డిమాండ్‌ను తట్టుకునేందుకు రూ.30.440 కోట్లతో 39.902 మిలియన్ యూనిట్లను విద్యుత్తు సంస్థలు కొనుగోలు చేశాయి.

చంద్రబాబు బెయిల్ రద్దు పిటిషన్ విచారణ వాయిదా

» వేసవి సెలవుల అనంతరమే విచారణ

న్యూఢిల్లీ, మే 7 (ఆంధ్రజ్యోతి): స్కిల్ కేసులో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు మంజూరు చేసిన బెయిల్‌ను రద్దు చేయాలని దాఖలైన పిటిషన్ విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. 10 వారాల తర్వాతే విచారణ చేపడతామని జస్టిస్ బేలా త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ధర్మాసనం స్పష్టం చేసింది. కోర్టు వేసవి సెలవుల తర్వాత వెంటనే చేపట్టాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. స్కిల్ కేసులో చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. 17ఏ అంశంపై ముగ్గురు జడ్జీల ధర్మాసనం నిర్ణయం తర్వాత బెయిల్ రద్దు అంశాన్ని పరిశీలిస్తామని జస్టిస్ బేలా త్రివేది అన్నారు. ఈ సందర్భంగా ఏపీ సీఐడీ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ముగ్గురు జడ్జీల ధర్మాసనం ఏర్పాటుపై ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం ముందు విన్నవిద్దామని అనుకుంటున్నట్లు తెలిపారు. అది మీ ఇష్టం అని జస్టిస్ త్రివేది స్పష్టం చేయగా.. వేసవి సెలవుల తర్వాత సీజేఐ ముందు మెన్షన్ చేస్తామని సీఐడీ న్యాయవాది తెలిపారు. 17ఏ అంశంతో సంబంధం లేకుండానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని చంద్రబాబు తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోర్టుకు తెలిపారు. కేసులో మెరిట్స్ ఆధారంగానే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిందని, దానికి 17ఏకి ఎందుకు లింక్ పెడుతున్నారని ఆయన ప్రశ్నించారు. వాదనలు విన్న ధర్మాసనం కేసు విచారణను 10 వారాల పాటు వాయిదా వేసింది. తదుపరి విచారణ కోర్టుకు వేసవి సెలవుల తర్వాతే జరుగనుంది.

రష్యా అధ్యక్షుడిగా పుతిన్ ఐదోసారి ప్రమాణం

» కార్యక్రమాన్ని బహిష్కరించిన పశ్చిమ దేశాలు..



మాస్కో, మే 7: రష్యా అధ్యక్షుడిగా పుతిన్ ఐదోసారి ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో మరో ఆరేళ్ల రష్యా అధ్యక్షుడిగా ఆయన కొనసాగనున్నారు. మార్చిలో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో పుతిన్ అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. దీంతో మంగళవారం ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుతం ఆయన వయసు 71 సంవత్సరాలు. రష్యా అధ్యక్షుడిగాగానీ, ప్రధానమంత్రిగా గానీ 1999వ సంవత్సరం నుంచి పుతిన్ అధికారంలో కొనసాగుతున్నారు. పుతిన్‌కు తగిన ప్రత్యర్థిగా భావించే అలెక్సీ నావెల్నీ ఈ ఎన్నికలకు నెల ముందే జైలులో అకస్మాత్తుగా ఆరోగ్యం క్షీణించి మరణించారు. యుద్ధాన్ని వ్యతిరేకించే ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లు సాంకేతిక కారణాలతో తిరస్కరణకు గురయ్యాయి. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధానికి పాల్పడుతున్న కారణంగా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని అమెరికా, బ్రిటన్, అనేక పశ్చిమదేశాలు బహిష్కరించాయి.

ప్రజ్వల్‌పై బ్లూకార్నర్ నోటీసు



బెంగళూరు, మే 7(ఆంధ్రజ్యోతి): జేడీఎస్ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ బ్లూ కార్నర్ నోటీసు జారీ చేసింది. 196 దేశాలతో పాటు, ఇంటర్‌పోల్‌కు సమాచారాన్ని ఇచ్చినట్లు తెలిపింది. ప్రజ్వల్ ఏ దేశంలోనైనా, విమానాశ్రయాలు, ఓడరేవుల్లో కనిపించినా సమాచారం ఇవ్వాలని ఇంటర్‌పోల్‌ను కోరామని పేర్కొంది. కాగా, ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యం బాధితురాలి కిడ్నాప్ కేసులో అరెస్టయిన జేడీఎస్ ఎమ్మెల్యే రేవణ్ణ బెయిల్ పిటిషన్‌పై విచారణ బుధవారానికి వాయిదా పడింది. మరోవైపు ప్రజ్వల్ లైంగిక దౌర్జన్యం వీడియోలను 2,500 పెన్‌డ్రైవ్‌లలో ఉంచి ఎన్నికల ముందు పంపిణీ చేశారని కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి ఆరోపించారు. మంగళవారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆ పెన్‌డ్రైవ్‌లను పోలీసు అధికారులే పంపిణీ చేశారని, వారిని బెదిరించి అలా పంపిణీ చేయించారని విమర్శించారు. ఈ కుట్ర వెనుక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఉన్నారని ఆక్షేపించారు. సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం లేదని, సీబీఐ లేదా సిటింగ్ న్యాయమూర్తి ద్వారా దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. కాగా, ప్రజ్వల్ రాసలీలల వ్యవహారంపై మోదీ మంగళవారం తొలిసారిగా స్పందించారు. ప్రజ్వల్ లాంటి వ్యక్తులపై సానుభూతి ఉండదని, ఇలాంటి చర్యలకు తాను వ్యతిరేకమని స్పష్టం చేశారు. ఇది శాంతిభద్రతల అంశం అయినందున రాష్ట్రప్రభుత్వమే చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రజ్వల్ దేశం నుంచి బయటికి వెళ్లేందుకు కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వమే అవకాశం కల్పించిందని, అతడు దేశం దాటి వెళ్లిన తర్వాతనే ఆ వీడియోలు బయటకు వచ్చాయని ఆరోపించారు. ఈ ప్రక్రియ అంతా అనుమానాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమానాశ్రయంలో నిఘా పెట్టాల్సిందని, కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇవ్వలేదని ప్రధాని స్పష్టం చేశారు.

రాహుల్‌కు నోటీసివ్వాలి: పదహారేళ్ల బాలికపై లైంగిక దాడి చేశారని ఇటీవల కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేసిన ఆరోపణలపై కుమారస్వామి మండిపడ్డారు. మైనర్ బాధితులు ఉన్న సమాచారమే ఇప్పటివరకు లేదని, ఏ ఆధారంతో రాహుల్ ఆ వ్యాఖ్యలు చేశారని ప్రశ్నించారు. రాహుల్ వ్యాఖ్యలను సిట్ తీవ్రంగా పరిగణించాలని, ఎందుకు నోటీసివ్వలేదని ప్రశ్నించారు.

పత్తి బస్తాలో రూ.40 లక్షలు

» నడింపాలెం చెక్‌పోస్టు వద్ద స్వాధీనం

» చోడవరంలో 5,833 గోవా మద్యం బాటిళ్ల పట్టివేత

ప్రత్తిపాడు, చోడవరం, మే 7: పత్తి లోడ్‌తో వెళ్తున్న లారీని తనిఖీ చేసి ఓ బస్తాలో ఉన్న 40 లక్షల నగదును గుంటూరు జిల్లా ప్రత్తిపాడు పోలీసులు స్వాధీన పరుచుకున్నారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరు నుంచి ఈ లారీ రాగా, చెక్‌పోస్టు వద్ద ఎస్ఎస్‌టీటీ ఆపి క్షుణ్ణంగా తనిఖీలు చేసి నగదును గుర్తించింది. అయితే ఈ నగదు ఆత్మకూరుకు చెందిన హరిరెడ్డి అనే వ్యక్తికి చెందినదిగా గుంటూరుకు చెందిన లారీ డ్రైవర్ నాగుమల్లి రమణయ్య పోలీసులకు తెలిపారు. హరిరెడ్డిని ఫోన్‌లో విచారించగా... తాను పత్తి బ్రోకర్‌గా పనిచేస్తున్నానని, సోమవారం లారీ పత్తికి సంబంధించిన నగదు తనకు వస్తున్నట్లు పోలీసులకు వివరించినట్లు తెలిసింది. అయితే, తగిన ఆధారాలు చూపి తీసుకెళ్లవచ్చంటూ ఆ నగదును ఐటీ అధికారులకు బదిలీ చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే, అనకాపల్లి జిల్లా చోడవరం మండలంలో 120 బాక్సుల గోవా మద్యం బాటిళ్లను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, స్థానిక పోలీసులు మంగళవారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సత్యంనాయుడు, సీఐ బి.శ్రీనివాసరావులతో కూడిన బృందం చోడవరం-విశాఖపట్నం మార్గంలోని దుడ్డుపాలెం జంక్షన్ సమీపంలో గల ఒక ఇటుకల బట్టీ వద్ద తనిఖీలు చేసి, ఓ గదిలో 120 బాక్సులలో ఉన్న 5,833 గోవా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దీనివిలువ రూ.7 లక్షలు ఉంటుందని సీఐ బి.శ్రీనివాసరావు తెలిపారు. పట్టుబడిన మద్యం అధికార పార్టీకి చెందినదిగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



పత్తి బస్తాలో దొరికిన 40 లక్షల నగదుతో అధికారులు

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● బుధవారం 8 మే 2024



తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీ- సంప్రదాయ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. శాస్త్రి (బీఏ), ఆచార్య (ఎంఏ), డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులకు సంస్కృత భాషలో పరిజ్ఞానం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం సౌకర్యాలతోపాటు వస్త్రాలు, నగదు ప్రోత్సాహకాలు అందిస్తారు.

శ్రీ వేంకటేశ్వర వేదిక్ యూనివర్సిటీలో ప్రోగ్రామ్‌లు

ప్రోగ్రామ్‌లు-అర్హత వివరాలు

శాస్త్రి(బీఏ): రుగ్వేదం, కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం(కాణ్వ/మాధ్యందిన), అధర్వణ వేదం (శౌనక), సామవేదం(రహస్యాంతం-కౌథుమ/రాణాయనీయ) విభాగాలు సహా వీటి భాష్యాలకు సంబంధిత వేదంలో మూలాంత అధ్యయనం(సంహిత+బ్రాహ్మణం+అరణ్యకం+ఉపనిషత్తులు) పూర్తిచేసి ఉండాలి.

- వైఖానసాగమ, పాంచరాత్రాగమ, శైవాగమ విభాగాలకు సంబంధిత ఆగమంలో బ్రహ్మోత్సవాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- అశ్వలాయన పౌరోహిత్యం, ఆపస్తంబ పౌరోహిత్యం, వైఖానస పౌరోహిత్యం, పారస్కర పౌరోహిత్యం విభాగాలకు సంబంధిత సూత్రంలో ఉపనయనాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- కల్పం(శ్రౌతం), మీమాంస కోర్సులకు ఏ వేదంలోనైనా మూలాంత అధ్యయనం చేసి ఉండాలి. మీమాంస కోర్సుకు సంస్కృతం ఒక సబ్జెక్టుగా ఇంటర్/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- అభ్యర్థి వయసు 18 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ఆచార్య(ఎంఏ): రుగ్వేద, కృష్ణయజుర్వేద, శుక్లయజుర్వేద(కణ్వ/మాధ్యందిన) విభాగాలకు సంబంధిత వేదంలో క్రమాంతం లేదా శాస్త్రి ప్రోగ్రామ్ ఉత్తీర్ణులై ఉండాలి.


- సామవేదం(కౌథుమ/రాణాయనీయ) విభాగానికి సామవేదంలో రహస్యాంత అధ్యయనం పూర్తి చేసి ఉండాలి.
- అధర్వణ వేదానికి సంబంధిత పద పదాంతం పూర్తిచేసి ఉండాలి.
- ఆగమం(వైఖానస/పాంచరాత్ర/శైవ) విభాగానికి శాస్త్రి కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత ఆగమంలో ప్రతిష్ఠాంతం అధ్యయనం చేసి ఉండాలి.
- పౌరోహిత్యం(అశ్వలాయన/ఆపస్తంబ/పారస్కర/వైఖానస) విభాగానికి శాస్త్రి కోర్సు లేదా సంబంధిత సూత్రంలో షోడశ సంస్కారాంతం పూర్తి చేసి ఉండాలి. వైఖానస పౌరోహిత్యానికి మాత్రం అష్టాదశ సంస్కారాంతం ఉత్తీర్ణులై ఉండాలి.
- రుగ్వేదం, కృష్ణ యజుర్వేదం, శుక్ల యజుర్వేదం (కాణ్వ/మాధ్యందిన), సామవేదం, అధర్వణ వేదం విభాగాల్లో వేదభాష్యం కోర్సుకు శాస్త్రి(బీఏ)/సంబంధిత వేదశాఖల మూలాంత అధ్యయనం పూర్తిచేసి ఉండాలి.
- కల్పం(శ్రౌతం), మీమాంస కోర్సులకు శాస్త్రి/తత్సమాన కోర్సు పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థి వయసు 20 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

అభిజ్ఞ కోర్సు: ఆగమ అభిజ్ఞ(వైఖానస/పాంచరాత్ర/శైవ), పౌరోహిత్య అభిజ(అశ్వలాయన/ఆపస్తంబ/పారస్కర/వైఖానస) విభాగాలకు సంబంధిత సూత్రంలో అహ్నిక విద్యాంత అధ్యయనం పూర్తి చేసి ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 15 ఏళ్లు ఉండాలి.

డిప్లొమా: టెంపుల్ మేనేజ్‌మెంట్, జ్యోతిషం, వాస్తు, మాన్యుస్క్రిప్టాలజీ విభాగాలకు గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం తప్పనిసరి. అభ్యర్థి వయసు కనీసం 20 ఏళ్లు ఉండాలి.

సర్టిఫికెట్ కోర్సులు: అతీంద్రియ విజ్ఞానం విభాగానికి డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 20 ఏళ్లు ఉండాలి.

- గృహరచనం ఆన్ పురాణిక్ లైన్స్, ఫండమెంటల్స్ ఆఫ్ ఇండియన్ ఫిలాసఫీ, ఇంట్రడక్షన్ టు ఆగమాస్, ఇంట్రడక్షన్ టు వేదిక్ సైన్సెస్, పురాణోక్త కర్మకాండ, పౌరాణిక శిక్షణ విభాగాలకు ఇంటర్ ఉత్తీర్ణతతోపాటు సంస్కృతంలో పరిజ్ఞానం ఉండాలి. అభ్యర్థి వయసు కనీసం 18 ఏళ్లు ఉండాలి.
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 30
- **ఫోన్ నెంబరు:** 0877-2264404
- **సెల్ నెంబరు:** 9701001777
- **వెబ్‌సైట్:** www.svvedicuniversity.ac.in



పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐఐఐటీపీ)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, స్పాన్సర్డ్, విశ్వేశ్వరాయ పీహెచ్‌డీ స్కీమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. నిబంధనల ప్రకారం ఫెలోషిప్ అందిస్తారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ-మెయిల్ ద్వారా అప్లయ్ చేసుకోవచ్చు.

పుణె ఐఐఐటీలో పీహెచ్‌డీ

విభాగాలు - స్పెషలైజేషన్‌లు

సీఎస్ఈ: డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా అనలిటిక్స్, డీప్ లెర్నింగ్, సాఫ్ట్ కంప్యూటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఇమేజ్ ప్రాసెసింగ్, డేటా మైనింగ్, ఫార్మల్ మెథడ్స్, బయోమెట్రిక్స్, ప్రైవసీ అండ్ సెక్యూరిటీ, ఐఓటీ, హ్యూమన్ కంప్యూటర్ ఇంటరాక్షన్, ఏఐ, మొబైల్ అండ్ వైర్‌లెస్ సెన్సర్ నెట్‌వర్క్స్.

ఈసీఈ: వీఎల్ఎస్ఐ, కమ్యూనికేషన్ సిస్టమ్స్ ఇంజినీరింగ్, ఆర్ఎఫ్ అండ్ మైక్రోవేవ్, ఐఓటీ.

అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్: డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, ఆల్జీబ్రా, ఆప్టిమైజేషన్, గ్రాఫ్ థియరీ, డిస్క్రీట్ మేథమెటిక్స్, లాటిస్ థియరీ, కంప్యూటేషనల్ మెకానిక్స్.

అర్హత వివరాలు: సీఎస్ఈ విభాగానికి కనీసం 65 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(సీఎస్ఈ/ఐటీ)/ఎంసీఏ లేదా 60 శాతం మార్కులతో (ఎంఈ/ఎంటెక్) (సీఎస్ఈ/ఐటీ) ఉత్తీర్ణులై ఉండాలి. ఈసీఈ విభాగానికి 65 శాతం మార్కులతో (బీఈ/బీటెక్)(ఈసీఈ/ఈఈ) లేదా 60 శాతం మార్కులతో (ఎంఈ/ఎంటెక్)(ఈసీఈ/ఈఈ) ఉత్తీర్ణులై ఉండాలి. అప్లయిడ్ మేథమెటిక్స్ అండ్ డేటా సైన్స్ విభాగానికి కనీసం 55 శాతం మార్కులతో పీజీ (మేథమెటిక్స్/ స్టాటిస్టిక్స్)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. విభాగాన్ని అనుసరించి గేట్ వ్యాలిడ్ స్కోర్ లేదా యూజీసీ నెట్ జేఆర్ఎఫ్/సీఎస్ఐఆర్ నెట్ జేఆర్ఎఫ్ లేదా డీఆర్‌డీఓ/ఏఐసీటీఈ ఫెలోషిప్ అర్హత ఉండాలి. స్పాన్సర్డ్ అభ్యర్థులకు పీజీతోపాటు ఏడాది అనుభవం లేదా గ్రాడ్యుయేషన్‌తో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి.

ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాత పరీక్షలో సంబంధిత విభాగం నుంచి గేట్/నెట్ సిలబస్ ప్రకారం ప్రశ్నలు అడుగుతారు. విభాగానికి నిర్దేశించిన సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.590; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.295
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** మే 25
- **ఈ-మెయిల్:** academics@iiitp.ac.in
- **వెబ్‌సైట్:** www.iiitp.ac.in

ఏబీవీ ఐఐఐటీఎంలో ఎంబీఏ



గ్వాలియర్‌లోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ (ఏబీవీ ఐఐఐటీఎం)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ&సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. మొదటి ఏడాదికి 55 క్రెడిట్లు, రెండో ఏడాదికి 54 క్రెడిట్లు చొప్పున ప్రోగ్రామ్ మొత్తానికి 109 క్రెడిట్లు నిర్దేశించారు. ప్రోగ్రామ్‌లో భాగంగా రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. ప్లేస్‌మెంట్స్ ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా ప్రథమ శ్రేణి మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు/రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తు కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డ్, ఫొటోలు, క్యాట్ స్కోర్ కార్డ్(2023) తోపాటు సంస్థకు చెందిన ఎండీపీ సెంటర్లో సెలెక్షన్ ప్రాసెస్‌కు హాజరు కావాలి. గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూ, రైటింగ్ కాంప్రహెన్షన్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 11
- **సెలెక్షన్ ప్రాసెస్:** మే 14
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** మే 17
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** మే 21
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం, గ్వాలియర్-474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in

ఐఐటీ మద్రాస్
వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఈ-మొబిలిటీలో ఎంటెక్

మద్రాస్ ఐఐటీ తాజాగా ఈ-మొబిలిటీలో ఎంటెక్ కోర్సును వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఆరంభించింది. వెబ్ ఎనేబుల్డ్ ఎంటెక్ ఇన్ ఈ-మొబిలిటీ(డబ్ల్యుఎంఈఎం)గా దీనిని పేర్కొంది. అటు ఇండస్ట్రీ, ఇటు అకడమిక్ ఇన్‌పుట్స్ కలిపి కోర్సును తీర్చిదిద్దారు. ఐఐటీకి చెందిన సెంటర్ ఫర్ ఔట్‌రీచ్ అండ్ డిజిటల్ ఎడ్యుకేషన్(కోడ్) ఈ కోర్సు డిజైనింగ్‌లో కీలకపాత్ర పోషించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ డిజైన్ కోర్సు సమన్వయకర్తగా వ్యవహరిస్తోంది. ఏడు అకడమిక్ టెర్మ్స్‌గా ఈ రెండేళ్ల కోర్సును మలిచారు. ఒక ఏడాదిలో కనీసం మూడు అకడమిక్ టెర్మ్స్ ఉండేలా చూస్తున్నారు. టెస్ట్ ఆన్ ఫండమెంటల్ మేథ్స్, ఫిజిక్స్ ప్రిన్సిపల్స్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక ఉంటుంది. ఈ నెల 26లోపు అర్హులు దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది సెప్టెంబర్లో క్లాసులు ఆరంభమవుతాయి.

వెబ్‌సైట్: https://code.iitm.ac.in
/assets/wbmt/Brochure.pdf.
https://code.iitm.ac.in/emobility.



SCHOLARSHIP ALERT

Sightsavers India Fellowship Program

Description: Sightsavers India Fellowship Program 2024 is an opportunity for young ophthalmologists offered by Sightsavers India. The program focuses on identifying and nurturing talented candidates through an innovative course that enhances their perspectives on rural eye health.
Eligibility: Open for students holding a postgraduate degree (MS) or diploma (DNB/DO) in Ophthalmology from a recognised institute/university in India. Applicants must possess a strong foundation in clinical ophthalmology and demonstrate a strong commitment to lifelong learning, adaptability, professional ethics, and emotional resilience.
Prizes & Rewards: A monthly stipend of up to 75,000 and other benefits
Last Date to Apply: 30-06-2024
Application mode: Online applications only
Short Url: www.b4s.in/aj/SIFS1

Omron Healthcare Scholarship

Description: OMRON Healthcare India invites applications from girl students studying in Classes 9 to 12 at any school across India.
Eligibility: Girl students studying in Classes 9 to 12 at any school across India are eligible to apply. Students must have received a minimum of 75% marks in their previous academic year. The annual family income of applicants should be less than INR 8,00,000.
Prizes & Rewards: One-time scholarship of INR 20,000
Last Date to Apply: 31-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/OMHS1



IET India Scholarship Award

Description: The Institution of Engineer ing and Technology (IET) is inviting app lications from undergraduate engineering students to sharpen their creativity, innovation, leadership, and excellence. The scholarship aims to recognise and nurture future engineering leaders in India.
Eligibility: Open for students studying in the 1st, 2nd, 3rd, or 4th year of a full-time regular undergraduate engineering program (in any field) at an AICTE/UGC-approved institution. The scholarship is also open for lateral entry students who join a B.Tech. program in the 2nd year. They must have cleared all regular credit courses in a single attempt. Applicants must have scored at least 60% in aggregate or an equivalent CGPA of at least six on a 10-point scale in the semesters cleared so far.
Prizes & Rewards: Scholarships worth INR 10,00,000
Last Date to Apply: 31-05-2024
Application mode: Online only
Short Url: www.b4s.in/aj/IET4

buddy4study.com

లిటిల్స్

నీకెవరు చెప్పారు?




అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలో ఒక రాక్షస కొండ ఉండేది. దాని పేరు రాక్షస కొండ అని పిలుచుకునేవాళ్లు. ఎందుకంటే అక్కడ మృగాలు సంచరించేవి. దారి దొంగలు ఉండేవాళ్లు. ఎక్కువగా హత్యలు జరిగేవి. దాని దగ్గర ఒక చిన్న ఊరు ఉంది. ఆ ఊరిలో రాములమ్మ అనే ఆమె కూరగాయల వ్యాపారం చేసేది. ప్రతి రోజూ దగ్గరలోని పెద్ద ఊరుకు నడిచి వెళ్లేది. ఆమె కష్టాలకు కొదువలేదు. అయినా ఓపిగ్గా వ్యాపారం చేసుకుంటూ బతికేది.

ఆమె కొండ దాటి వెళ్లి పది కిలోమీటర్ల దూరంలో ఉండే పెద్ద ఊరికి వెళ్లేది. ఏనాడూ ఆమె ఇబ్బంది పడలేదు. పైగా నూకలు ఉన్నన్నాళ్లు ఇక్కడ ఉంటామనే తత్వం ఆమెది. అందుకే ఆమె భయాన్ని లెక్కచేసేది కాదు. ఆ పెద్ద ఊరులో ఓ గుర్రపు రౌతు ఉండేవాడు. అతను పన్నులు వసూలు చేసే వ్యక్తి. అతనికి శిస్తు కట్టించటం తెలుసుకానీ.. ఇతరుల పట్ల అభిమానంగా ఉండటం రాదు. కరుకు మనిషి. పేరు శివాజీ. అతను గుర్రంమీద వెళ్తున్నప్పుడు దారిలో ఏమైనా విలువైన వస్తువులు కనపడితే.. రాజుగారి పేరు చెప్పి దర్జాగా తీసుకుని వెళ్లేవాడు. ఇసుమంతైనా సిగ్గు ఉండేది కాదు అతనికి.

ఒక రోజు కూరగాయలు అమ్ముకుని.. ఇంటి వంటకు సరిపడ వస్తువులను కొని సంచిలో సర్ది తన ఊరికి వెళ్తోంది రాములమ్మ. బరువు మోయలేకపోతోంది. కిందపడే పరిస్థితి. పైగా ఎండ. గుర్రం మీద వచ్చే రౌతును చూసి 'అయ్యా.. ఈ సంచిని తీసుకెళ్లండి. మా ఊరిలో ఫలానా కొలిమి దగ్గర ఉండే రామయ్య ఇంటి దగ్గర ఉంచండి. తీసుకుంటా' అన్నది. ఆ రౌతు కోపంగా చూసి.. 'ఇదేమైనా మీ నాయన సొమ్మా? ఈ గుర్రం నాది. పైగా రాజుగారి సేవకుడిని. రాజుగారి మనిషితో నువ్వు పని చేయించుకోవటం నేరం. అంటరాని దానవు' అంటూ తిట్టి గుర్రాన్ని పరిగెత్తించాడు. సాయం చేయకపోగా తిట్టిన ఆ రౌతును చూసి రాములమ్మ కోప్పడింది. బాధతో సంచిని మోస్తూ బయలుదేరింది.

అరకిలోమీటరు వెళ్లాక రౌతుకు ఒక అనుమానం వచ్చింది. కొంపదీసి సంచిలో విలువైన వస్తువులు ఉన్నాయా? అనుకున్నాడు. వెంటనే గుర్రాన్ని వెనక్కి తిప్పి ఆ ముసలామె దగ్గరకు వెళ్లాడు. 'ఈ సంచిని నువ్వు మోయలేవు. నాకు ఇవ్వు నేను తీసుకెళతా' అన్నాడు. 'నేను ఇప్పుడు ఇవ్వను' అన్నది రాములమ్మ. నేను తీసుకెళతా అన్నాడు ఆ రౌతు. కుదరదు అన్నది. 'ఇంతలో ఇవ్వకూడదు అని నీకెవ్వరు చెప్పారు?' అని అడిగాడు. 'ఇంతలో నీకెందుకు నా సంచి మీద అభిమానం కలిగింది. నీకెవ్వరు చెప్పారు?' అంటూ గట్టిగా అరిచింది. దగ్గరలో కొందరు ఊరి జనాలు కనపడ్డారు. దీంతో గుర్రాన్ని పరిగెత్తించాడు రౌతు.


సరైన నీడ ఏది?



8 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 301

		3		8				7
	8		6		3		9	
2				4				
		5	4					1
	7		3	6	5		2	
9					8	4		
				5				8
	5		7		4		1	
4				3		9		

సుడోకు - 300 సమాధానం

6	3	5	2	1	8	9	4	7
7	1	2	4	6	9	5	8	3
4	8	9	3	7	5	1	2	6
5	2	1	8	9	6	3	7	4
3	7	6	1	5	4	8	9	2
8	9	4	7	3	2	6	1	5
9	5	8	6	2	7	4	3	1
1	4	7	5	8	3	2	6	9
2	6	3	9	4	1	7	5	8

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.